


# మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 200: గురువారం 19 మార్చి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు32:- వెలరూ/ 9-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్

## ఇరాన్‌పై అమెరికా బాంబుల వర్షం

'బంకర్ బస్టర్'లతో భూగర్భ క్షిపణి కేంద్రాల ధ్వంసం

హర్మూజ్ జలసంధి సమీపంలో బీభత్సం.. ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులు



4

## ఇరాన్‌కు భారత్ ఆపన్నహస్తం

- అత్యవసర వైద్య సామాగ్రి పంపిణీ
- యుద్ధ సంక్షోభంలో మానవతా దృక్పథం..
- సాయం అందినట్లు ఇరాన్ ధ్రువీకరణ

4



## రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు



2

- త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు
- సిబ్బంది నియామకం పనులు పూర్తి
- రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి





## దివ్యాంగులకు ఏపీ సర్కార్ ఉగాది కానుక



12.75 లక్షల మందికి ఉచిత బస్సు ప్రయాణం..

ఐదు రకాల ఆర్టీసీ బస్సుల్లో వెసులుబాటు

దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించి, భోజనం చేసిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

### 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభం

**అమరావతి, మార్చి 18(మనసులో మాట):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగుల) గౌరవాన్ని పెంచుతూ కూటమి ప్రభుత్వం మరో చారిత్రాత్మక అడుగు వేసింది. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12.75 లక్షల మంది దివ్యాంగులకు లబ్ధి చేకూరనుంది. అమరావతిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లతో కలిసి సీఎం దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేసి, వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు.

మిగతా 2 లో



ఇలాంటి వాళ్లను పార్టీ ఎందుకు మోయాలి

తిరుపతి ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు

2

## పుట్టా మహేశ్ తీరు పార్టీకి మచ్చ

## శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు

అగ్నిగుండాల్లో నడిచిన కన్నడ భక్తులు

శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మూడోరోజు కన్నడ భక్తులు నిప్పు కణికలపై నడిచారు. ఈ భక్తులు ఉగాదికి కొన్ని రోజుల ముందు నుండే కఠినమైన దీక్ష చేపట్టి, పాదయాత్రగా శ్రీశైలం చేరుకున్నారు.



.. వివరాలు 2లో

## ఐదేళ్లలో జగన్ ఎందుకు వివేకా కేసు తవ్వలేదు

ఎందుకు దోషులను పట్టుకునే ప్రయత్నం చేయలేదు

కడప ఎంపి సీటు కోసమే వివేకా హత్యజరిగింది

పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఘాటు వ్యాఖ్యలు

**విశాఖపట్నం, మార్చి 18(మనసులో మాట):** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్ల పాలనలో జగన్ ఎందుకు ఈ కేసును తేల్చలేక పోయారని అన్నారు. దీనికి ఎందుకు న్యాయం చేయలేదని నిలదీసారు. బుధవారం విశాఖపట్నంలో షర్మిల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి.. వివేకా కుమార్తె

మిగతా 2 లో





## ప్రజాసేవలో పదవీ విరమణ లేదు

- రాజ్యసభ ఓ ఓపెన్ యూనివర్సిటీ
- సీనియర్ సభ్యుల సేవలు ఇతరులకు ఆదర్శం
- రిటైర్ అవుతున్న రాజ్యసభ సభ్యుల వీడ్కోలులో ప్రధాని మోడీ
- మాతో ప్రేమాయణం.. మోడీతో అనుబంధం
- దేవేగౌడపై ఖర్గే ఛతురోక్తులు

4

రాజ్యసభ పదవీ విరమణ చేస్తున్న సభ్యులను ఉద్దేశించి మోదీ బుధవారం వీడ్కోలు ప్రసంగం చేశారు. పార్లమెంటును ఒక 'ఓపెన్ యూనివర్సిటీ'గా అభివర్ణించిన ఆయన, ఇక్కడ లభించే జ్ఞానం అమూల్యమైనదని కొనియాడారు. పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్లు కాదని, రాజకీయాల్లో ఎప్పటికీ 'ఫుల్‌స్టాప్' ఉండదని ప్రధాని స్పష్టం చేశారు.



## మదనపల్లి ఫైల్స్ దహనం కేసు

2

పెద్ది పీఏ, అనుచరుడి అరెస్ట్

## అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

పలు జిల్లాల్లో పిడుగులతో వానలు

2

అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని విశాఖపట్నం వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఏపీలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. విశాఖపట్నం కేంద్రంగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుంచి దక్షిణ అంతర కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని తెలిపారు.



మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు

**త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు**

**సిబ్బంది నియామకం పనులు పూర్తి**

**రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి**



**న్యూఢిల్లీ, మార్చి 18(మనసులో మాట):** త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌పై ఆయన పార్లమెంట్‌లో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకాలు పూర్తయ్యాయని వెల్లడించారు. జోన్ ప్రధాన కార్యాలయ భవనం పునాది పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు లైన్‌కు రూ.2,047 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని వివరించారు. జోన్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు విఎంఆర్‌డిఎ భవనం 'ది డెక్' సిద్ధమైందని అన్నారు. త్వరలోనే అక్కడి నుంచే పాలన జరుగుతుందని చెప్పుకొచ్చారు. రైల్వేజోన్ కోసం జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకం పూర్తి చేస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 2009-2014 మధ్య సగటున రూ. 886 కోట్లు ఉంటే, 2025- 26లో ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో రూ.9,417 కోట్ల కేటాయింపులు జరిగాయని స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే రైల్వేట్రాక్ నిర్మాణ వేగం రెట్టింపు అయిందని వివరించారు. ప్రతి ఏటా సగటున 143 కిలోమీటర్ల మేర కొత్త ట్రాక్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఎర్రుపాలెం - అమరావతి - నంబూరు కొత్త రైల్వేలైన్ (57 కిలోమీటర్లు) కోసం రూ. 2047 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం భూసేకరణ పక్రియ ప్రారంభమైందన్నారు. ఏపీలో ప్రస్తుతం రూ. 70,232 కోట్ల విలువైన 39 రైల్వే ప్రాజెక్టులు (కొత్త లైన్లు, డబ్లింగ్) పనులు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. విజయవాడ - గూడూరు మూడవ రైల్వేలైన్, గుంతకల్ - గుంటూరు డబ్లింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

# పుట్టా మహేశ్ తీరు పార్టీకి మచ్చ

**అమరావతి, మార్చి 18 (మనసులో మాట):** మొయినాబాద్ డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌పై సీఎం చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టే ఇలాంటి వాళ్లను మోయాలా..? అంటూ ఈ సమావేశంలో ఆయన అసహనం వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పుట్టా మహేశ్ కుమార్ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. యువకుడు.. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారని అతడికి అవకాశమిచ్చామని వివరించారు. కానీ ఆయన ఈ విధంగా వ్యవహరించారన్నారు. అసలు ఆ పార్టీలకు వెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందంటూ ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో క్రమశిక్షణ ఉల్లంఘించిన వాళ్లు ఎంతటి పెద్ద వాళ్లైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకున్నానని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. క్రమశిక్షణ, విలువలు పాటించకుండా రాజకీయం చేయాలనుకోవడం కరెక్ట్ కాదని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. టీడీపీలో నాయకులంతా క్రమశిక్షణతో మెలగాల్సిందేనని.. ఎవరికీ వెసులుబాటు ఉండదని ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# మదనపల్లి ఫైల్స్ దహనం కేసు

**పెద్ది రామచంద్రారెడ్డి పీఏ, అనుచరుడి అరెస్ట్**

**తిరుపతి,మార్చి18(మనసులో మాట):** తిరుపతి జిల్లా మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏగా వ్యవహరించిన ముని తుకారాం, ప్రధాన అనుచరుడు మాధవరెడ్డిని సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. నాయకులతో కలిసి కాఫీ తాగేందుకు వచ్చిన ఇరువురిని చంద్రగిరి మండలం పనపాకం టోల్ ఎ÷-లాజా వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తిరుపతిలోని సీఐడీ కార్యాలయానికి తరలించారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో 2024 జులై 21న ÷ల్స్ తగులబెట్టారు. ఈ కేసులో ఏ3గా మాధవరెడ్డి, ఏ4గా ముని తుకారాం ఉన్నారు. ఈ ఇద్దరు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఇటీవల వారికి అక్కడ చుక్కెదురైంది. ఈ నేపథ్యంలో సీఐడీ పోలీసులు బుధవారం వారిని అరెస్ట్ చేశారు.

# చంద్రబాబు ఫోటోకు అగౌరవం

**కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వర్మ**



**కాకినాడ,మార్చి18(మనసులో మాట):** పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత శ్రీవత్సవాయి సత్యనారాయణ వర్మ తరచూ వార్తల్లో ఉంటారు.. కాకినాడ జిల్లా కలెక్టర్ ను కలిసి పిఠాపురంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోటోకు ప్రోటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు చేశారు.. సీఎం చంద్రబాబు నాయుడు ఫోటోను రెవెన్యూ స్టాంప్ సైజులో ఏర్పాటు చేసి అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని మండిపడ్డారు. అధికారులకు జ్ఞాపకశక్తి ఉండడం లేదని, సీఎం చంద్రబాబు ఫోటో ఏ సైజులో ఉండాలో వారికి ప్రోటోకాల్ తెలియడం లేదని కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు.. ఒక మెమో జారీ చేసి అధికారులకు ఆ విషయంపై క్లారిటీ ఇవ్వాలని కలెక్టర్ ను కోరారు.. సీఎం చంద్రబాబు ఫోటో లేకుండా కార్యక్రమాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని అన్నారు వర్మ.. గత వారంలో పిఠాపురంలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఫోటో చిన్నదిగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేసి వేదిక మీద నుంచి కిందకు దిగిపోయారు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ.

# మాజీమంత్రి ఇంట్లో చోరీ

**విజయవాడ, మార్చి 18(మనసులో మాట):** మాజీ మంత్రి కఠారి ఈశ్వర్ కుమార్ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళం పగులగొట్టి దుండగుడు చోరీకి తెగబడ్డాడు. కఠారి భార్య మధురిమ రెండు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లి బుధవారం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించారు. దీంతో ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. చోరీలో వంశపారంపర్యంగా వస్తున్న సుమారు 10 కిలోల వెండి వస్తువులు, పూజా సామాగ్రి అపహరణకు గురయ్యాయని తెలుస్తోంది. వెంటనే గుడివాడ వన్‌టౌన్ పోలీసులకు మధురిమ ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని క్లూస్ టీంకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన క్లూస్ టీం ఆధారాలు సేకరించే పనిలో ఉన్నారు. కఠారి ఈశ్వర్ కుమార్ వ్యాపారం రీత్యా హైదరాబాద్, బెంగళూరులో ఉంటున్నారు. చోరీపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# దివ్యాంగులకు ఏపీ సర్కార్ 'ఉగాది' కానుక

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఏపీఎస్ఆర్టీసీకి చెందిన ఐదు రకాల బస్సుల్లో దివ్యాంగులు ఎటువంటి ఛార్జీలు లేకుండా ఉచితంగా ప్రయాణించవచ్చని వెల్లడించారు. ఈ సౌకర్యం వల్ల ప్రతి దివ్యాంగుడికి నెలకు సుమారు రూ. 2 వేల వరకు ఆదా అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే మహిళల కోసం అమలు చేస్తున్న 'స్త్రీ శక్తి' పథకం ద్వారా 52 కోట్ల ఉచిత ప్రయాణాలు జరిగాయని, అదే స్ఫూర్తితో దివ్యాంగుల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతంలో తాము చేపట్టిన 'చేయూత' కార్యక్రమాన్ని గుర్తుచేస్తూ, దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి ట్రైసైకిళ్లు, టూ వీలర్లను అందించామని సీఎం చెప్పారు. దివ్యాంగుల పెన్షన్‌ను



రూ. 500 నుంచి రూ. 6 వేలకు పెంచామని, తీవ్ర అనారోగ్యంతో ఉన్న వారికి రూ. 10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ. 15 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో పెన్షన్ల కోసమే ఏడాదికి రూ. 33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ఆయన తెలిపారు.

**మందకృష్ణ మాదిగకు ప్రత్యేక అభినందనలు**

దివ్యాంగుల సమస్యలపై నిరంతరం పోరాడే మందకృష్ణ మాదిగ, గోనుగుంట్ల కోటేశ్వరరావులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. దివ్యాంగ శక్తి పథకం ప్రారంభంతో ఈ ఏడాది ఉగాది పండుగను విభిన్న ప్రతిభావంతులు మరింత ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ, రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం నిరుపేదల సంక్షేమం కోసమేనని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# అనుకున్న సమయానికి పోలవరం పూర్తి

**గత పాలకులు తీరుతో ప్రాజెక్టులో జాప్యం**

**నిర్వాసితులతో సీఎం చంద్రబాబు సమావేశం**

**నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కు అందచేత**



**అమరావతి, మార్చి 18(మనసులో మాట):** పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అనుకున సమయానికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గత ప్రభుత్వం వల్ల ఆలస్యం జరిగిందని అన్నారు. సకాలంలో పూర్తి చేసి గోదావరి జలాలను అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఈ సందర్భంగా ముంపు గ్రామాల నిర్వాసితులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సమావేశం నిర్వహించారు. పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును సీఎం అందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి జీవనాడి అని, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. గత పాలకులు నిర్వాసితులను పట్టించుకోకుండా, వరదల్లో ప్రజలు మునిగిపోతున్నా నిర్లక్ష్యంగా వదిలేశారని సీఎం విమర్శించారు. ప్రాజెక్టు కోసం తమ ఇళ్లు, భూములను త్యాగం చేశారని సీఎం తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా రూ.226.6 కోట్లను నిర్వాసితుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో సంక్రాంతి సందర్భంగా మొదటి విడతగా రూ.800 కోట్లు, దీపావళి సమయంలో రెండో విడతగా రూ.916 కోట్లు చెల్లించినట్లు గుర్తుచేశారు. 21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు మొత్తం రూ.1,943.53 కోట్లు చెల్లించామని వివరించారు. మూడోసారి గోదావరి పుష్కరాల నిర్వహణకు ముందే ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ పూర్తికి మరో రూ.5 వేల కోట్లు అవసరమని, ఒక వంతెన కూడా నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలం పోలవరం ప్రాజెక్ట్ అని సీఎం పేర్కొన్నారు. నిర్వాసితులకు పారదర్శకంగా చెల్లింపులు జరుపుతున్నామని చెప్పారు. దళారులను నమ్మవద్దని సూచించారు. ప్రాజెక్ట్ ప్రారంభానికంటే ముందే నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. పోలవరం నిర్వాసితుల పట్ల కూటమి ప్రభుత్వానికి కమిట్‌మెంట్ ఉందని.. నిర్వాసిత యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కూడా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రాజెక్ట్ రెండు దశలుగా నిర్మాణం జరుగుతోందన్నారు సీఎం. తొలి దశలో 38,068 మంది నిర్వాసితులు ఉన్నారని తెలిపారు. ప్రతి నిర్వాసితుడికి ఇంటి నిర్మాణానికి రూ.3.5 లక్షలు ఇస్తున్నామని, ఇంటి జాగా కోసం రూ.2 లక్షలకు పెంచినట్లు వివరించారు. కేంద్ర ప్రాజెక్ట్ అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనులు చేపడుతోందని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతిన్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రూ.440 కోట్ల వ్యయంతో కట్టిన డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని.. ఇప్పుడు మళ్లీ రూ.వెయ్యి కోట్లతో నిర్మాణం చేపట్టామన్నారు. 6 -7 ఏళ్ల పాటు ప్రాజెక్ట్ ఆలస్యమై పోయిందని.. ప్రాజెక్టు ఏమైనా పర్వాలేదనే అహంకార ధోరణితో గత పాలకులు వ్యవహరించారని మండిపడ్డారు. వారం రోజుల్లో డయాఫ్రం వాల్ పూర్తవుతుందని, ప్రాజెక్ట్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# శ్రీశైలంలో వైభవంగా ఉగాది మహోత్సవాలు

**అగ్నిగుండాల్లో నడిచిన కన్నడ భక్తులు**



**నంద్యాల, మార్చి 18(మనసులో మాట):** శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మూడోరోజు కన్నడ భక్తులు నిప్పు కణికలపై నడిచారు. ఈ భక్తులు ఉగాదికి కొన్ని రోజుల ముందు నుండే కఠినమైన దీక్ష చేపట్టి, పాదయాత్రగా శ్రీశైలం చేకున్నారు. అగ్నిగుండంపై నడవడం వల్ల తమ పాపాలు తొలగిపోతాయని, స్వామివారి అనుగ్రహం లభిస్తుందని వారి నమ్మకం. వీరశైవ సంప్రదాయంలో శివుడిని 'వీరభద్రుడి' రూపంలో ఆరాధిస్తారు. దక్ష యజ్ఞాన్ని ధ్వంసం చేసిన వీరభద్రుని ఆవేశానికి ప్రతీకగా భక్తులు ఈ విన్యాసాలు చేస్తారు. ఇందులో భాగంగా భక్తులు తమ శరీరాన్ని కష్టపెట్టుకుంటూ భక్తిని ప్రదర్శిస్తారు. మార్చి 16 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు 20 వరకు జరగనున్నాయి. మొదటి రోజు ధ్వజారోహణం, భృంగి వాహన సేవ, రెండవ రోజు కైలాస వాహన సేవ, మూడో రోజు రావణ వాహన సేవ, నాలుగవ రోజు (ఉగాది)న రథోత్సవం, నంది వాహన సేవ, పంచాంగ శ్రవణం, ఐదవ రోజు ధ్వజావరోహణం, పూర్ణాహుతి, పుష్ప పల్లకి సేవ జరగనుంది. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ఇప్పటికే కన్నడ, మహారాష్ట్ర భక్తులకు పాదయాత్ర మార్గంలో.. క్షేత్రంలో పలుచోట్ల చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు తాగు నీటికి ఎలాంగి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నారు.

# అల్పపీడన ప్రభావంతో ఏపిలో భారీ వర్షాలు

**విశాఖపట్నం, మార్చి 18(మనసులో మాట):** అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని విశాఖపట్నం వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఏపీలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. విశాఖపట్నం కేంద్రంగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుంచి దక్షిణ అంతర కర్ణాటక మీదుగా తమిళనాడు వరకు అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని తెలిపారు. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఆగ్నేయ, నైరుతి దిశల నుంచి గాలులు బలంగా వీస్తాయని చెప్పుకొచ్చారు. దీని ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని తెలిపారు. రాబోయే మూడు రోజుల పాటు వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. అధికారులకు పలు కీలక సూచనలు చేసింది. ఈ వర్షాల ప్రభావం ముఖ్యంగా అమలాపురం, తణుకు, రాజోలు, భీమవరం, గుడివాడ, గన్నవరం, మచిలీపట్నం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా, కృష్ణా జిల్లా, నంద్యాల పరిసర ప్రాంతాలు, ఏలూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడా ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నూజివీడు ప్రాంతంలో ఇప్పటికే ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షాలు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపించనున్నాయి. ఏలూరు జిల్లా, పరిసర ప్రాంతాల్లో సుమారు 35,000 హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉంది. ప్రస్తుతం ఈదురుగాలుల కారణంగా మామిడి పూత రాలిపోతోంది. మామిడి పిందెలు నేలపై పడిపోతున్నాయని, దీనివల్ల పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ అధికారులు ప్రజలకు కొన్ని సూచనలు జారీ చేశారు. ఉరుములు, మెరుపుల సమయంలో బయటకు వెళ్లవద్దని తెలిపారు. చెట్ల కింద నిలబడవద్దని సూచించారు. ప్రయాణాల సమయంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

# ఐదేళ్లలో జగన్ ఎందుకు వివేకా కేసు తవ్వలేదు

మొదటి పేజీ తరువాయి

సునీత మీద చేసిన వ్యాఖ్యలకు తాను చాలా బాధపడ్డానని అన్నారు. వివేకాకు గుండెపోటు వచ్చిందని సునీతనే చెప్పారని.. అవినాశ్‌రెడ్డి మాట్లాడటం చాలా దారుణమని అన్నారు. అవినాశ్‌రెడ్డికి పలుకుబడి, డబ్బు ఉందని, ఎన్ని తప్పులు చేసిన తప్పించుకోవచ్చని అనుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. సోషల్ మీడియాను చేతిలో పెట్టుకుని వ్యక్తిత్వ హననం చేయాలనుకుంటున్నారని ధ్వజమెత్తారు. వివేకానంద గుండెపోటుతో చనిపోయారని సాక్షి మీడియాలోనే మొదటగా ప్రచారం చేశారని షర్మిల ప్రస్తావించారు. స్థానికంగా ఉన్న అవినాశ్‌రెడ్డి, సాక్షి యజమాని భారతిరెడ్డి ఎందుకు గుండెపోటని ప్రచారం చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ హత్య ముమ్మాటికీ కడప ఎంపీ టిక్కెట్టు విషయంలోనే జరిగిందని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై వివేకానంద స్వయంగా తనతో చర్చించారని తెలిపారు. అవినాశ్‌రెడ్డికి టిక్కెట్టు ఇస్తే, వివేకానంద సపోర్ట్ చేశారని గుర్తుచేశారు. ఎప్పటికైనా వివేకానంద బతికి ఉంటే, తనకు ఇబ్బంది అవుతుందనే



కారణంతోనే అవినాశ్‌రెడ్డి ఈ హత్య చేశారని ఆరోపించారు. వివేకా హత్య కేసులో మొదటగా సీబీఐ విచారణ కావాలని జగన్ అన్నారని, ఆ తర్వాత వద్దని కూడా ఆయనే చెప్పారని తెలిపారు. వివేకా కేసును సిట్ అధికారులతో విచారణ చేయిస్తే సరిపోతుందని జగన్ చెప్పారని అన్నారు. ఈ కేసులో సీబీఐ అన్ని ఆధారాలను సేకరించిందని, ప్రధానంగా అవినాశ్‌రెడ్డి పేరును ప్రస్తావించిందని తెలిపారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ఎందుకు ఒక్క ఆధారం కూడా బయటపెట్టలేక పోయారని ప్రశ్నల వర్షం కురిపించారు. సునీతారెడ్డి చంద్రబాబు కోసం పనిచేస్తున్నారని చెబుతూ.. అవినాశ్‌రెడ్డిని కాపాడుకోవాలని జగన్ ప్రయత్నిస్తున్నారని షర్మిల అన్నారు. సునీతకు ప్రాణహాని ఉందని, అయినా ఆమె పోరాటం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తన తండ్రి హత్య వెనుక ఉన్న నిజాన్ని బయటకు తీసుకురావాలని సునీత పోరాటం చేస్తున్నారని అన్నారు. 'జగన్ అన్నకు కూసింతైనా కనికరం లేదా..? ఇలాంటి అన్న ఉంటే శత్రువులు అనవసరం.. అన్నా అనే పదానికే ఆయనో కళంకం. జగన్ మోహన్‌రెడ్డి బాధితులపట్ల కాకుండా నిందితులపట్ల నిలబడ్డారనే విషయం వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తెలిస్తే ఎంతగానో బాధపడేవారు. వివేకా హత్య కేసులో న్యాయం కోసమే చంద్రబాబును కలిశారని.. నిరంతరం పోరాటం సాగిస్తున్నారని.. కానీ న్యాయం మాత్రం జరగట్లేదని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు.



# గుజరాత్ అసెంబ్లీకి బాంబు బెదిరింపులు

**గాంధీనగర్, మార్చి 18 :**గుజరాత్ అసెంబ్లీకి బుధవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ మెయిల్ ద్వారా బెదిరింపులు రావడంతో అసెంబ్లీ ఆవరణలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. బాంబు స్క్వాడ్‌లతో తనిఖీలు చేయించగా.. ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రవి తేజ వాసంశెట్టి మీడియాతో మాట్లాడుతూ.. 'ఈరోజు ఉదయం గుజరాత్ అసెంబ్లీ కాంప్లెక్స్‌కి ఈమెయిల్ బాంబు బెదిరింపులు వచ్చాయి. వెంటనే బాంబు నిర్వీర్యం చేసే దళాలు తనిఖీ చేశాయి. అయితే ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేదు. ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుంది' అని ఆయన అన్నారు.

# జేఎన్‌యూలో ప్రదర్శనపై ఫిర్యాదులా ?

**అధికారుల తీరుపై విద్యార్థి సంఘాల ఆందోళన**

**న్యూఢిల్లీ, మార్చి 18:** విద్యార్థులు బెయిల్ షరతులను ఉల్లంఘించారంటూ జెఎన్‌యు యాజమాన్యం ఢిల్లీ పోలీసులకు లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఈ నెల 9న లేఖ రాసినట్లు తెలుస్తోంది. యాజమాన్యం లేఖను ఖండిస్తూ జెఎన్‌యుఎస్‌యు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జెఎన్‌యు వైస్ ఛాన్సలర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ ఆదేశాల మేరకు యాజమాన్యం లేఖ రాసిందని ప్రకటనలో పేర్కొంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన శాంతియుత ప్రదర్శనను 'బెయిల్ నిబంధనల ఉల్లంఘన'కు ఉదాహరణగా ఆమె చూపారని తెలిపింది. జెఎన్‌యుకు మొదటి మహిళా విసిగా నియమితులైన ఆమె.. మహిళా దినోత్సవానికి మద్దతుగా చేపట్టిన ప్రదర్శనను నేరంగా చిత్రీకరించడం ఆందోళన కలిగిస్తోందని ప్రకటించింది. తాము శాంతియుతంగా ఆందోళన చేపట్టామని జెఎన్‌యుఎస్‌యు నేతలు పేర్కొన్నారు. నిరసన తెలిపే హక్కుకు ఆంక్షలు భంగం కలిగించకూడదని బెయిల్ ఉత్తర్వుల్లో చివరి వాక్యం పేర్కొందని జెఎన్‌యుఎస్‌యు సంయుక్త కార్యదర్శి, అరెస్టయిన 14మంది విద్యార్థుల్లో ఒకరైన డానిష్ అలీ పేర్కొన్నారు. యూనివర్శిటీ యాజమాన్యం లేఖలో పేర్కొన్న నిరసనలు శాంతియుతంగా జరిగాయని అన్నారు. నిరసనలు చట్టబద్ధమైనవని, బెయిల్ ఉత్తర్వు ద్వారా ప్రాథమిక హక్కును అణచివేయలేరని విద్యార్థుల తరపున హాజరైన న్యాయవాది మాణిక్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 27న విద్యార్థులు చేపట్టిన లాంగ్‌మార్చ్‌పై విరుచుకుపడిన ఖాకీలు జెఎన్‌యుఎస్‌యు అధ్యక్షురాలు అదితి మిశ్రా సహా 14మంది విద్యార్థులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం మార్చి 1న బెయిల్‌పై విడుదలయ్యారు.

# ఏఎస్ఐ అనుమానాస్పద మృతి

**విజయవాడ,మార్చి18:** కృష్ణా జిల్లా యనమలకుదురులో ఏఎస్ఐ అనుమానాస్పదంగా మృతి చెందారు. పడమట పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ గా చేస్తున్న వీరవల్లి గోపి వెంకట దుర్గాప్రసాద్ (54) ఒక కేసు విషయంలో 15 రోజుల క్రితం సస్పెన్షన్ కు గురైన్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైనన్నారు. ఈ క్రమంలో యనమలకుదురు కరకట్ట శివారు ఒక పాకలో శవమై తేలారు. ఘటన స్థలానికి చేరుకున్న పెనమలూరు పోలీసులు హత్య లేక ఆత్మహత్య అన్న కోణంలో విచారణ చేస్తున్నారు.

# కోచింగ్ సెంటర్‌లో కుమారుడి అనుమానాస్పద మృతి

**న్యాయం చేయాలంటూ మహిళ ఆత్మహత్యకు యత్నం**

**మార్కాపురం,మార్చి18:**మార్కాపురం జిల్లా కనిగిరిలో ఉద్రిక్తత నెలకొంది. సింగరాయకొండలోని నవోదయ కోచింగ్ సెంటర్‌లో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన తన కుమారుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తౌషిక్ తల్లి కనిగిరిలో మూడంతస్తుల భవనం పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నాని కి పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మహిళ ప్రమాదవశాత్తు కిందపడినా ప్రాణాపాయం కలగకుండా భవనం కింద వల ఏర్పాటు చేసి అప్రమత్తంగా చర్యలు చేపట్టారు. అనంతరం అధికారులు ఆమెను నచ్చజెప్పి, చాకచక్యంగా కిందికి దించారు. దీంతో అక్కడి ప్రజలు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా తౌషిక్ మృతిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# పిడుగుపాటుకు ఒకరు మృతి



**అమరావతి,మార్చి18 :** ఎపిలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. పలుచోట్ల పిడుగులు పడ్డాయి. అమరావతిలో భారీ వర్షం కురిసింది. తుళ్లూరులోని మేరీ మాత హై స్కూల్‌కు సమీపంలో పిడుగుపడి ఓ విద్యార్థి తండ్రి మృతిచెందారు. కృష్ణాజిల్లాలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరులో వర్షం పడింది. విజయవాడలో ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. ఏలూరు జిల్లాలోని నూజివీడులో ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. ఓ ఇంటిపై పిడుగు పడింది. దీంతో ఇంటి టెర్రస్ పైన పిట్టగోడ పాక్షికంగా ధ్వంసమైంది. పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కోనసీమ, సత్యసాయి, నంద్యాల జిల్లాల్లో పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద నిలబడవద్దని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ చెప్పారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి.. సర్.. సీవై చింతామణి

**(పాత్రికేయుల దిక్సూచి.. సర్ సీవై చింతామణి జయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం)**



**(సీనియర్ జర్నలిస్ట్ ఎం.విజయభాస్కర్)**

అక్షర యఅక్షర యజ్ఞం.. వేల కాంతికిరణాలుగా ప్రసరించి సామాజిక, రాజకీయ రుగ్మతలని ప్రశ్నిస్తూ.. పయనమైంది. ఒక వ్యక్తి బహుముఖ ప్రజ్ఞాపాటవాలతో బయలుదేరి ప్రధానిమంత్రికి సైతం చెమటలు పట్టించింది. ఒక గొంతు తడారిన జీవితాలకు ఊటబావిగా నిలిచింది. ఇలా తెలుగుజాతి కీర్తిప్రతిష్టలకు పతాకశీర్షికన నిలిపింది. స్వాతంత్ర్య సముపార్జన కోసం రాజకీయ చైతన్యకోసం ధీరుడుగా నిలిచిన ఎక్కుపెట్టిన కలంగా మారి పోప్ ఆఫ్ ఇండియన్ జర్నలిజం'గా నేలనాలుగు చెరగులా పాత్రికేయం అంటే ఇదే నన్న గురుతుగా నిలిచింది ఆ గొంతుపేరే యజ్ఞేశ్వర చింతామణి. జ్ఞం.... వేల కాంతికిరణాలుగా ప్రసరించి సామాజిక, రాజకీయ రుగ్మతలని ప్రశ్నిస్తూ.. పయనమైంది. ఒక వ్యక్తి బహుముఖ ప్రజ్ఞాపాటవాలతో బయలుదేరి ప్రధానిమంత్రికి సైతం చెమటలు పట్టించింది. ఒక గొంతు తడారిన జీవితాలకు ఊటబావిగా నిలిచింది. ఇలా తెలుగుజాతి కీర్తిప్రతిష్టలకు పతాకశీర్షికన నిలిపింది. స్వాతంత్ర్య సముపార్జన కోసం రాజకీయ చైతన్యకోసం ధీరుడుగా నిలిచిన ఎక్కుపెట్టిన కలంగా మారి పోప్ ఆఫ్ ఇండియన్ జర్నలిజం'గా నేలనాలుగు చెరగులా పాత్రికేయం అంటే ఇదే నన్న గురుతుగా నిలిచింది ఆ గొంతుపేరే యజ్ఞేశ్వర చింతామణి.

చింతామణి 1880, ఏప్రిల్ 10న విజయనగరంలో జన్మించారు. ఈయన తండ్రి చిర్రావూరు రామసోమయాజులు, వేదపండితుడు, విజయనగరం సంస్థానంలో మహారాజా విజయరామ గజపతిరాజుకు రాజగురువు. యజ్ఞేశ్వర చింతామణికి 10 యేటనే వివాహమైనది. చింతామణి అనారోగ్యం వల్ల, మాతృవియోగం వల్ల ఎఫ్.ఏ పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేకపోవడంతో ఈయనను చికిత్సకై విశాఖపట్నానికి పంపించారు. . బ్రిటిషు పాలనాకాలంలో ఇరవయ్యో శతాబ్దపు తొలి మూడు దశాబ్దాలలో జాతీయ స్థాయిలో ఇంగ్లీషు పత్రికా రంగంలో కలం యోధుడిగా వెలిగిన తెలుగు బిడ్డ అక్షరపట్టుమని పద్దెనిమిదేళ్ళు నిండకుండానే ఓ పత్రికకు సంపాదకుడైన ప్రతిభాశాలి. దేశభక్తి, జాతీయతా వాదం పుష్కలంగా ఉన్న ఆయన విజయనగరం ఆస్థానంలో రాజపురోహితులైన తాతలు, తండ్రుల లానే పురోహితులు అవుతారని అందరూ అనుకున్నారు. అయితే, యువరాజా సూచనతో, విజయ నగరం మహారాజా కాలేజ్‌లో ఇంగ్లీషు చదువు చదువు కోగలిగారు. సురేం ద్రనాథ్ బెనర్జీ వంటి వారు ఆదర్శప్రాయు లైన చింతామణి విశాఖలో స్థానిక రాజకీయ వ్యక్తులతో తిరగటం ప్రారంభించారు. ఈయ న విశ్వవిద్యాలయాల నుండి పట్టాలు పొంద లేకపోయారు గానీ అసమానమైన ఆంగ్ల భాషా పాండిత్యాన్ని సంపాదించారు. ఆ వైదుష్యం అంతా స్వయంకృషి వల్లలభిం చిందే. ఉపన్యాస శక్తిని పెంపొందించుకో దలచి అనేక సభలకు పోయి ఉపన్యాసా లను ఇచ్చేవారు. వీరి ఉపన్యాసాలు విని శ్రోతలు ముగ్ధులయ్యేవారు. వీరికి పత్రికా రచనపై ఎక్కువ ఆసక్తి ఉండేది.

నిజమైన తెలుగు హార్స్: ప్రారంభ దశలో "తెలుగు హార్స్" అనే పత్రికకు సంపాదకుడిగా ఉన్నారు. ఈయన వ్రాసే వ్యాసాలు 'వైజాగ్ స్పెక్టేటర' పత్రికలో అచ్చు అవటం ప్రారంభమైంది. ఆ పత్రికను 300 రూపాయలకు కొని, తనతో పాటు వైజాగ్ స్పెక్టేటర్ పత్రికను విజయనగరానికి తీసుకొనివచ్చారు. విజయనగరం నుండి వెలువడటం ప్రారంభించిన తర్వాత ఆ వారపత్రికకు "ఇండియన్ హెరాల్డ" అని నామకరణం చేశారు. ఆ తర్వాత ఈ విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ చింతామణీ "నేను కేవలం సంపాదకుడినే కాదు, ఫోర్మెన్, ప్రూఫ్ రీడర్, విలేఖరి, ఉపసంపాదకుడు, యజమాని అన్నీ నేనే" అని వివరించారు. పత్రిక బాగా ప్రాచుర్యం పొందినా ఆర్థిక ఇబ్బందుల వల్ల రెండు సంవత్సరాలలో దాన్ని మూసివేయవలసి వచ్చింది. ఆ తర్వాత కొంతకాలానికే 18 యేళ్ల వయసులోనే వైజాగ్ స్పెక్టేటర్ పత్రికకు సంపాదకత్వం వహించే అవకాశం లభించింది. ,కొంతకాలం యునైటెడ్ ఇండియా అనే వారపత్రికలోను, ఆ తర్వాత జి. సుబ్రమణ్యం అయ్యర్ సంపాద కత్వంలో వెలువడుతున్న "మద్రాస్ స్టాండర్డ" దినపత్రికలో ఒక సంవత్సరం పాటు పనిచేశారు. 1903లో నాగేంద్రనాథ్ గుప్తా ప్రారం భించిన "ఇండియన్ పీపుల" పత్రికకు సంపాదకత్వం వహించడానికి అలహాబాదు చేరుకున్నారు. పత్రికా నిర్వహణలో దేశ హితానికే పెద్ద పీట వేస్తూ, వ్యక్తిగత స్నేహాన్నీ, వ్యక్తుల పట్ల తనకున్న గౌరవాన్నీ కూడా పక్కనపెట్టి పనిచేయడం జర్నలిస్టుగాచింతామణిలోని విశిష్టత. కొత్తగా జర్నలిజమ్ వృత్తిలోకి వచ్చినవారిని ప్రోత్సహించడం, తప్పు చేసినప్పుడు మందలించినా, జూనియర్ల ప్రతిభను బాహాటంగా ప్రశంసించడం ఆయనలోని గొప్పదనం. తనకింది స్థాయిఉద్యోగులను సైతం 'నాజర్నలిసు□టసహచరుడు' అని పరిచయం చేయడం, ప్రస్తావించడం చింతామణి లోని సంస్కారం. 1909 అకోబరులో మదన్ మోహ న్ మాలవ్యా, తేజ్ బహద్దర్ సప్రూ వంటి మితవాద కాంగ్రెస్ నాయకులు 'లీడర' అనే ఆంగ్ల దినపత్రికను ప్రారంభించారు. 'ఇండియన్ పీపుల' పత్రిక 'లీడర' పత్రికలో కలిసిపోయింది. వీరు లీడర్ పత్రిక సంపాదకత్వ బాధ్యతను స్వీకరించారు.

చురుకైన రాజకీయ నేతగా.... కాంగ్రెస్ వాదిగా మొదలైన ఆయ న ఆనకగాంధీ గారి సహాయనిరా కరణ, శాసనోల్లంఘన ఉద్య మాలతో విభేదించి, మితవాదిగా వేరే దారి చూసు కున్నారు. అయినప్పటికీ గాంధీ, నెహ్రూతో సహా నాటి నేతలంతా చింతామణిని అభిమానించే వారు, గౌరవించే వారు. అలాగే, 1927 – '36 మధ్య ఆయన ఇటు 'లీడర'కు చీఫ్ ఎడిటర్‌గా ఉంటూనే, మరోపక్క యు.పి. లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ప్రతిపక్ష నేతగా ప్రత్యర్థుల వాదనల్ని చెండాడేవారు. దశాబ్దాల తరబడి ఉత్తరాదిన ఉన్నా, ఆయనకు హిందీ రాదంటే ఆశ్చర్యం. 1900 సంవత్సరం చివరలో లాహోరులో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు ప్రయాణ ఖర్చులకు డబ్బు లేకపోతే అప్పు చేసి మరీ హాజరయ్యారు. అప్పుడు వీరి వయసు 20 సంవత్సరాలు కూడా నిండలేదు. ఈ సమావేశాలలో ఈయన అనేక విషయాల పై గంభీరమైన ఉపన్యాసాలు చేశారు. సురేంద్రనాథ్ బెనర్జీ, భూపేంద్రనాథ్ బోస్ వంటి కాంగ్రెస్ నాయకులు ఎందరో ఇతడిని శ్లాఘించారు. 'హిందూ'పత్రిక ఇతని ఉపన్యాసాలను ప్రశంసించింది. 1916లోనూ తిరిగి 1927లోనూ ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా ఎన్నికైనారు. 1921–23 మధ్య అప్పటి యునైటెడ్ ప్రావిన్సెస్ (నేటి ఉత్తర ప్రదేశ్) కు విద్య, పరిశ్రమల శాఖల మంత్రిగా పనిచేశారు. 1930–31లో లండన్‌లో జరిగిన మొదటి రౌండ్ టేబుల్ సమావేశంనకు ప్రతినిధిగా హాజరైనారు. బ్రిటీషు ప్రభుత్వం ఈయనకు 1939లో 'సర' బిరుదునిచ్చి సత్కరించింది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ (ఎల్.ఎల్.డి) ప్రదానం చేసింది. అలహాబాద్ విశ్వవిద్యాలయం డి.లిట్. గౌరవ పట్టాను ప్రదానంచేసి గౌరవించింది.'సర' బిరుదాన్నిచ్చి, ఆయనను కొనేయగలమని అప్పటి బ్రిటిషు ప్రభుత్వం అనుకుంది. మిత్రుల బలవంతం మీద ఆ సత్కారాన్ని అంగీకరించిన చింతామణి మాత్రం తన విలువలను వదులుకోలేదు. అక్షరాన్ని కొనడం అసాధ్యమని నిరూపించారు. అరడజను అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నా, ఆయన రోజూ దాదాపు 18 నుంచి 20 గంటలు పని చేసేవారు. చనిపోయే ముందు చివరి రెండేళ్ళ అనారోగ్యం ఎక్కువై బాధపడ్డ చింతామణి అంత అనారోగ్యంలోనూ ఏనాడూ పని చేయడం ఆపలేదు. చనిపోయే రోజు (1941 జూలై 1) కూడా సంపాదకీయం స్వయంగా ఆయన రాసినదే! ఆంధ్రుల ప్రతిభను, రాజకీయ పరిజ్ఞానాన్ని భారతదేశమంతటా చాటిన చింతామణి 1941, జూలై 1న తన 62వ ఏట అస్తమించారు.

# గ్యాసా.. గుదిబండా..!

**(ఈ కొరత..అదెంత కలత)**



పెట్రోల్ బ్యారెల్‌కు
200 డాలర్లు చెల్లించడానికి
సిద్ధంగా ఉండండి..

ఇది గాలి కబురు కాదు..
ప్రపంచానికి అందిన హెచ్చరిక..

యుద్ధం మొదలై పన్నెండు రోజులు పూర్తయిన వేళ..
ప్రపంచం భవిష్యత్తు..
మానవాళి మనుగడ గురించి
సర్వత్రా ఆందోళన చెందుతుండగా..
ఈ సమరం మూడో ప్రపంచ
యుద్ధానికి ఎక్కడ దారి తీస్తుందోనని ఎక్కడికక్కడ
ఆందోళన వ్యక్తమవుతూ
జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్న ఎన్నో పరిస్థితులు
ఇప్పటికే చాలా చోట్ల కనిపిస్తున్నాయి..

ఏ క్షణంలో ఎటు నుంచి ఎలాంటి ముప్పు
ముంచుకొస్తుందోననే ఆందోళన నడుమ..

అదిగో దేశంలో
ముంచుకొచ్చింది
గ్యాస్ కొరత..!

ఆంధ్రలో.. తెలంగాణలో..
తమిళనాడులో.. కేరళలో..
ఆ మాటకొస్తే దేశ రాజధాని ఢిల్లీలో కూడా వంట
గ్యాస్ సంక్షోభం పరాకాష్టకు చేరింది.
ప్రభుత్వాలేమో తగినంత గ్యాస్ నిల్వలు ఉన్నాయని..
కొరత లేదని చెబుతూ ఉండగా వాస్తవాలు కావు.

ఎక్కడికక్కడ గ్యాస్ ఏజెన్సీల టోల్ ఫ్రీ నంబర్లు
ఎప్పటికప్పుడు మూగనోము పట్టేస్తున్నాయి..
వాట్సాప్ బుకింగులు కూడా
కొన్ని సందర్భాల్లో మొరాయిస్తున్నాయి..
ఈ పరిస్థితి ప్రజల్లో ఆందోళనను మరింతగా
పెంచుతోంది.అటు గ్యాస్ ఏజెన్సీల వద్ద చూస్తే
జనం తండోపతండాలుగా కనిపిస్తున్నారు.నిజానికి
వారిలో చాలా మందికి గ్యాస్ అయిపోయి ఉండదు.
కానీ భయం..అయిపోతే ఎలాగని..

ఈ పరిస్థితి ఇక్కడితో ఆగితే పరవాలేదు..ఉన్నకొద్దీ
పెరిగే ఆందోళనే..ఇప్పుడు గ్యాస్..
ఇంకొన్ని రోజులు పోతే..పెట్రోల్..
ఆ తర్వాత నిత్యావసరాలు..

ఇప్పటికే ప్రభుత్వం గ్యాస్ బండ ధర పెంచేసింది..
బ్లాక్ మార్కెటర్లు అప్పుడే జూలు విదిలిస్తున్నారు.
సందట్లో సడేమియాలా కొన్ని ఏజెన్సీలు కృత్రిమ కొరత
సృష్టిస్తున్నాయి..హోటల్ రంగం..ముఖ్యంగా చిన్న
వ్యాపారులు కుదేలైపోతున్నారు.

గ్యాస్ మాత్రమే కాదు..నిత్యావసరాల విషయంలో
కూడా కృత్రిమ కొరత అప్పుడే మొదలైనట్టు
కనిపిస్తోంది.ఇక పెట్రోల్ కొరత కూడా మొదలైతే..
ఇక జనజీవనం నరకమే..!

సురేష్..
9948546286.. 7995666286..

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




## సంపాదకీయం

# కాల గమనం ప్రకృతి పలకరింపు

## 'పరాభవ' ఉగాదికి స్వాగతం!

కాలం ఒక అప్రతిహత ప్రవాహం. అది ఎక్కడ మొదలైందో, ఎక్కడ ముగుస్తుందో ఎవరికీ ఎరుక లేదు. కానీ, ఆ అనంత కాల గమనాన్ని అంచనా వేస్తూ, ప్రకృతి మార్పులకు అనుగుణంగా మనిషి తన జీవన యానాన్ని క్రమబద్ధీకరించుకున్నాడు. ఆ క్రమంలోనే ఉద్భవించిన అద్భుత పర్వదినం 'ఉగాది'. చైత్ర శుద్ధ పాడ్యమి సూర్యోదయ వేళ బ్రహ్మదేవుడు సృష్టికి అంకురార్పణ చేశాడని పురాణాలు చెబుతుంటే, వసంత లక్ష్మి పచ్చని తోరణాలతో ప్రకృతికి స్వాగతం పలుకుతుంది. ఈ ఏడాది మార్చి 19న అడుగుపెడుతున్న 'శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది' మన సంప్రదాయాలకు, నైతిక విలువలకు మరోసారి అద్దం పడుతోంది.

### ప్రకృతితో మమేకమైన పండుగ

తెలుగువారి పండుగలన్నీ ప్రకృతితో పెనవేసుకున్నవే. ఉగాది నాటికి వాతావరణంలో వచ్చే మార్పులు మానవ జీవనశైలిని ప్రభావితం చేస్తాయి. మామిడి చిగుళ్లు, కోయిలమ్మ కుహూరావాలు, వేప పూత పరిమళాలు.. ఇవన్నీ కొత్త ఆశలకు సంకేతాలు. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, దేశవ్యాప్తంగా వివిధ పేర్లతో–మహారాష్ట్రలో గుడిపాడ్వా, పంజాబ్‌లో వైశాఖీ, తమిళనాడులో పుత్తాండు, కేరళలో విషు–ఈ నూతన సంవత్సరాదిని జరుపుకోవడం మన భారతీయ సంస్కృతిలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటి చెబుతోంది. శాలివాహన చక్రవర్తి పట్టాభిషేకం నుంచి శ్రీరామ చంద్రుని విజయ పరంపర వరకు ఎన్నో చారిత్రక, పౌరాణిక ఘట్టాలు ఈ తిథితో ముడిపడి ఉన్నాయి.

### షడ్రుచుల సందేశం: జీవిత తత్వం

ఉగాది అంటే కేవలం పిండివంటలు, కొత్త బట్టల సంబరం మాత్రమే కాదు; అది ఆత్మపరిశీలనకు ఒక వేదిక. ఉగాది పచ్చడిలోని షడ్రుచులు–తీపి, చేదు, పులుపు, ఉప్పు, కారం, వొగరు–జీవితంలోని సుఖదుఃఖాలను, జయపజయాలను సమానంగా స్వీకరించాలనే గొప్ప తాత్వికతను బోధిస్తాయి. జీవితం ఎప్పుడూ ఒకే రుచితో సాగదు. కష్టాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా, సుఖాలు వచ్చినప్పుడు పొంగిపోకుండా ఉండాలన్నదే ఈ పచ్చడి ఇచ్చే సందేశం. అలాగే పంచాంగ శ్రవణం ద్వారా రాబోయే కాలంలోని ఆదాయ వ్యయాలను, రాజపూజ్య అవమానాలను తెలుసుకోవడం వెనుక ఉన్న ఉద్దేశం.. భవిష్యత్తు సవాళ్లకు సిద్ధపడటం మరియు విజ్ఞతతో వ్యవహరించడమే.

### సామాజిక బాధ్యత - నేటి ఆవశ్యకత

ప్రస్తుత యాంత్రిక జీవనంలో పడి మన మూలాలను మర్చిపోతున్న తరుణంలో, ఉగాది వంటి పండుగలు మనల్ని మన సంస్కృతి వైపు మళ్లిస్తాయి. కాలం ఎవరి కోసమూ ఆగదు, కానీ ఆ కాలంతో పాటు మనం ఎలా మారుతున్నాం, సమాజానికి ఎంత మేలు చేస్తున్నాం అనేదే ముఖ్యం. 'పరాభవ' అంటే గర్వం నశించడం అని కూడా ఒక అర్థం ఉంది. అహంకారాన్ని వీడి, ప్రకృతిని ప్రేమిస్తూ, తోటి మానవుల పట్ల ఆత్మీయతతో మెలగడమే ఈ పండుగ ఇచ్చే నిజమైన లక్ష్యం.

ప్రకృతి వైపరీత్యాలు, సామాజిక విద్వేషాలు నశించి, వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించడమే ఈ నూతన సంవత్సర సంకల్పం కావాలి. ఈ పరాభవ నామ సంవత్సరం ప్రతి తెలుగు లోగిలిలో ఆయురారోగ్యాలను, సిరిసంపదలను నింపాలని, యువతకు కొత్త ఉపాధి మార్గాలు దొరకాలని కోరుకుంటూ.. లోకమంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆశిద్దాం. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు!






డాక్టర్ కంచర్ల అచ్యుత రావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక

# ఇరాన్‌పై అమెరికా బాంబుల వర్షం

## 'బంకర్ బస్టర్'లతో భూగర్భ క్షిపణి కేంద్రాల ధ్వంసం

- హర్మూజ్ జలసంధి సమీపంలో బీభత్సం
- ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు
- భగ్గుమంటున్న చమురు ధరలు




**వాషింగ్టన్/టెహ్రాన్, మార్చి 18:** మధ్యప్రాచ్యంలో యుద్ధ జ్వాలలు అదుపు తప్పి ఎగిసిపడుతున్నాయి. ఇరాన్ లక్ష్యంగా అమెరికా బలగాలు బుధవారం తెల్లవారుజామున అత్యంత శక్తిమంతమైన వైమానిక దాడులకు దిగాయి. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధి తీరప్రాంతంలో ఉన్న ఇరాన్ భూగర్భ క్షిపణి స్థావరాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. సుమారు 2,268 కిలోల బరువుండే 'బంకర్ బస్టర్' బాంబులను ప్రయోగించి, కాంక్రీట్ కట్టడాలను ఛేదించుకుంటూ వెళ్లి లోపల ఉన్న నౌకా విధ్వంసక క్షిపణులను అమెరికా ధ్వంసం చేసింది. అంతర్జాతీయ నౌకాయానానికి ముప్పు పొంచి ఉందన్న నిఘా వర్గాల సమాచారంతోనే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారికంగా ప్రకటించింది.

### ట్రంప్ ఆగ్రహం.. మిత్రదేశాల ముఖం చాటు:

ఈ యుద్ధంలో మిత్రదేశాల నుంచి ఆశించిన మద్దతు లభించకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఫ్రాన్స్ వంటి దేశాలు ప్రత్యక్ష పోరాటానికి విముఖత చూపడాన్ని ఆయన తప్పుబట్టారు. "మాకు ఎవరి సహాయం అవసరం లేదు, ఒంటరిగానే ఇరాన్‌ను ఎదుర్కోగలం" అని ట్రంప్ స్పష్టం చేయడం గమనార్హం. కాగా, ఈ ఘర్షణల నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాలో 20 శాతం వాటా కలిగిన జలసంధి మార్గం దాదాపు మూతపడటంతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి.

### ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులు

అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ తన క్షిపణులను ఇజ్రాయెల్ వైపు మళ్లించింది. ఇజ్రాయెల్‌లోని రామత్ గన్ నగరంపై జరిగిన క్షిపణి దాడిలో ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు, ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను యూఏఈ, కువైట్, బహ్రెయిన్ దేశాలు తమ రక్షణ వ్యవస్థలతో అడ్డుకుంటున్నాయి. అమెరికా తన దాడులను ఇరాన్ అణు ప్లాంట్ల సమీపంలోని క్షిపణి కేంద్రాలపైకి మళ్లించడంతో, ఇరాన్ తన అణు కార్యకలాపాలను మరింత వేగవంతం చేసే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇది మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.



# ఇరాన్‌కు భారత్ ఆపన్నహస్తం

- అత్యవసర వైద్య సామాగ్రి పంపిణీ
- యుద్ధ సంక్షోభంలో మానవతా దృక్పథం..
- సాయం అందినట్లు ఇరాన్ ధ్రువీకరణ




**న్యూఢిల్లీ/టెహ్రాన్, మార్చి 18:** అమెరికా–ఇజ్రాయెల్ దాడులతో అతలాకుతలమవుతున్న ఇరాన్‌ను ఆదుకునేందుకు భారత్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చింది. యుద్ధం కారణంగా మందుల కొరతతో అల్లాడుతున్న ఇరాన్ పౌరుల కోసం భారత్ పంపిన తొలి విడత అత్యవసర వైద్య సామాగ్రి బుధవారం ఆ దేశానికి చేరింది. ఈ సహాయాన్ని 'ఇరానియన్ రెడ్ క్రెసెంట్ సొసైటీ' ప్రతినిధులు అందుకున్నట్లు ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించింది. క్లిష్ట సమయంలో అండగా నిలిచిన భారత ప్రభుత్వానికి, ప్రజలకు ఇరాన్ తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.

### మందుల కొరత.. స్పందించిన విదేశాంగ శాఖ:

ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ లక్ష్యంగా జరుగుతున్న దాడుల వల్ల అక్కడ తీవ్ర మానవతా సంక్షోభం నెలకొంది. వేలాది మంది పౌరులు గాయపడటం, ఆసుపత్రుల్లో ప్రాణ రక్షణ మందులకు తీవ్ర కొరత ఏర్పడటంతో భారత్ తక్షణమే స్పందించింది. భారత విదేశాంగ శాఖ కొద్దిరోజుల క్రితమే ప్రకటించిన విధంగా, ఇరాన్ అధికారులతో జరిపిన చర్చలు ఫలించి ఈ సాయం గమ్యస్థానానికి చేరింది.

"భారత ప్రజలు పంపిన ఈ ఆపన్నహస్తం ఇరానియన్ రెడ్ క్రెసెంట్ సొసైటీకి చేరింది. దయార్ద్ర హృదయులైన భారతీయులకు ధన్యవాదాలు" అని న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం సోషల్ మీడియా వేదికగా పేర్కొంది.

### మిత్ర దేశాల సాయం.. భారతీయుల తరలింపు

భారత్‌తో పాటు చైనా, రష్యా, అజర్‌బైజాన్ వంటి దేశాలు కూడా ఇరాన్‌కు మానవతా సాయాన్ని అందిస్తున్నాయి. మరోవైపు, యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకుపోయిన భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. విదేశాంగ శాఖ నిరంతరం అక్కడి పరిస్థితులను సమీక్షిస్తూ, భారతీయుల భద్రతకు పెద్దపీట వేస్తోంది. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు ఎలా ఉన్నప్పటికీ, మానవతా ప్రాతిపదికన సహాయం అందించడంలో భారత్ తనదైన శైలిని చాటుకుంటోంది.

# ప్రజాసేవలో పదవీ విరమణ లేదు

- రాజ్యసభ ఓ ఓ పెన్ యూనివర్సిటీ
- సీనియర్ సభ్యుల సేవలు ఇతరులకు ఆదర్శం
- రిటైర్ అవుతున్న రాజ్యసభ సభ్యుల వీడ్కోలులో ప్రధాని మోడీ
- మాతో ప్రేమాయణం..మోడీతో అనుబంధం
- దేవేగౌడపై ఖర్గే ఛతురోక్తులు



**న్యూఢిల్లీ, మార్చి 18(మనసులో మాట):** రాజ్యసభ పదవీ విరమణ చేస్తున్న సభ్యులను ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం వీడ్కోలు ప్రసంగం చేశారు. పార్లమెంటును ఒక 'ఓపెన్ యూనివర్సిటీ'గా అభివర్ణించిన ఆయన, ఇక్కడ లభించే జ్ఞానం అమూల్యమైనదని కొనియాడారు. పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదని, రాజకీయాల్లో ఎప్పటికీ 'ఫుల్‌స్టాప్' ఉండదని ప్రధాని స్పష్టం చేశారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో, వారి అనుభవాలు దేశ నిర్మాణానికి ఎంతగానో తోడ్పడతాయని ఆయన ఆకాంక్షించారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున్ ఖర్గే, శరద్ పవార్ వంటి దిగ్గజ నేతలు తమ జీవితంలో సగానికి పైగా పార్లమెంటుకే అంకితం చేశారని ప్రధాని ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వీరి నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని సూచించారు. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మృదుస్వభావి అని, కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే 'ఎవర్‌గ్రీన్' నేత అని ప్రధాని అభివర్ణించారు. ఉభయ సభల ప్రాముఖ్యతను వివరిస్తూ.. ఏదైనా చట్టం ఆమోదం పొందే ముందు 'రెండో అభిప్రాయం' తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తుందని మోదీ పేర్కొన్నారు.

### సభలో ఖర్గే చలోక్తులు.. నవ్వుల పువ్వులు

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తన ప్రసంగంతో సభలో నవ్వులు పూయించారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడను ఉద్దేశించి మాట్లాడుతూ.. "ఆయన 54 ఏళ్లుగా నాకు తెలుసు. మేమిద్దరం కలిసి పనిచేశాం. కానీ ఏమైందో తెలియదు కానీ, ఆయన మాతో ప్రేమ సాగించి.. చివరకు మోదీని పెళ్లి చేసుకున్నారు" అంటూ చమత్కరించారు. ఈ వ్యాఖ్యలతో ప్రధాని మోదీ సహా సభలోని సభ్యులంతా ఒక్కసారిగా నవ్వుల్లో మునిగిపోయారు. కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేపై కూడా ఖర్గే ఛలోక్తులు విసిరారు. అథవాలే ఎప్పుడూ తన కవితల్లో ప్రధాని మోదీని పొగుడుతుంటారని, ఆయనకు మరే ఇతర కవితలు తెలియవేమో అని ఎద్దేవా చేశారు. శరద్ పవార్, తిరుచ్చి శివ వంటి నేతలతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ఖర్గే.. దేశ సేవ చేయాలనే తపన ఉన్నవారు ప్రజా జీవితంలో ఎన్నడూ అలసిపోరని కొనియాడారు. పార్టీ విభేదాలకు అతీతంగా సాగిన ఈ వీడ్కోలు సమావేశం రాజ్యసభ గౌరవాన్ని చాటిచెప్పింది.

# భారత్ వైపు రష్యా చమురు ట్యాంకర్

### అలాంటి సమాచరం లేదన్న కేంద్రం

**న్యూఢిల్లీ,మార్చి18:** చైనాకు చేరుకోవాల్సిన రష్యా చమురు ట్యాంకర్ 'అక్వా టైటాన్' దిశ మార్చుకుని భారత్ వైపు వెళ్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. దక్షిణ చైనా సముద్ర జలాల్లో అది దిశ మార్చుకుందని సమాచారం. అయితే ఆ ట్యాంకర్‌కు సంబంధించి తమ వద్ద ఎలాంటి సమాచారమూ లేదని కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా వెల్లడించారు. జనవరి నెల చివరి వారంలో బాల్టిక్ సీ పోర్ట్‌లో ఈ ట్యాంకర్‌లోకి చమురు లోడ్ అయిందని, ఇది చైనాలోని రిజావో పోర్ట్‌కు చేరుకోవాల్సి ఉందని సమాచారం. అయితే దక్షిణ చైనా సముద్రంలో దిశ మార్చుకున్న ఈ ట్యాంకర్ మార్చి 21వ తేదీ నాటికి కర్ణాటకలోని న్యూ మంగుళూరు పోర్ట్‌కు చేరుకో బోతోందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అంతర్జాతీయ ఇంధన సంక్షోభం నేపథ్యంలో రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ గణనీయంగా పెంచింది. ఈ నేపథ్యంలోనే చైనాకు వెళ్లాల్సిన ఇంధన ట్యాంకర్ భారత్ వైపు మళ్లిందని మీడియాలో కథనాలు వచ్చాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు సడలించిన సంగతి తెలిసిందే. దీంతో జపాన్, దక్షిణ కొరియా వంటి పలు దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారీగా పెంచాయి. భారత్ కూడా రష్యా నుంచి చమురు దిగుమతులను పెంచింది. ఆమెరికా ఆంక్షలు సడలించిన తర్వాత రష్యా నుంచి భారత్ రిఫైనరీలు 30 మిలియన్ల బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసినట్టు సమాచారం.



# ఢిల్లీ అగ్నిప్రమాదంలో 9మంది మృతి

### నాలుగు అంతస్థుల భవనం అగ్నికి ఆహుతి

**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని పాలెంలో అగ్నిప్రమాదం జరిగిన ఘటనలో 9 మంది మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. రామ్ చౌక్ మార్కెట్‌లో ఉన్న 4 అంతస్తుల భవనంలో ఉదయం 7 గంటలకు అగ్నిప్రమాదం చోటు చేసుకున్నది. ఆ సమయంలో చాలా మంది నిద్రలో ఉన్నట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారిని ప్రవేశ్, కమాల్, ఆశు, లాడో, హిమాన్షి, దీపికతో పాటు ముగ్గురు మైనర్ బాలికలు ఉన్నారు. అనిల్, సచిన్‌తో పాటు మరో రెండు ఏళ్ల అమ్మాయి గాయపడ్డారు. ఢిల్లీ అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. బిల్డింగ్ ఓనర్‌ను రాజేంద్ర కశ్యప్‌గా గుర్తించారు. కుటుంబసభ్యులు బిల్డింగ్‌లోని రెండో, మూడో ఫ్లోర్లలో నివసిస్తున్నారు. మరణించిన ప్రతి మృతుని కుటుంబానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం రూ. 2 లక్షల చొప్పున ఎక్స్–గ్రేషియా ప్రకటించారు. ఈ దురదృష్టకర సంఘటనపై ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి నుండి గాయపడిన వారికి రూ. 50,000 ఎక్స్–గ్రేషియాను ప్రధాని ప్రకటించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం



## అనకాపల్లి లో ఘనంగా

# దివ్యాంగ శక్తి ఉచిత బస్సు పథకం ప్రారంభం

- దివ్యాంగులకు 6000 రూపాయలు పెన్షన్ ఇస్తున్న ఘనత కూటమి దే
- త్వరలోనే దివ్యాంగుల స్వయం ఉపాధికి కార్పొరేషన్ రుణాలు
- జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర





**అనకాపల్లి ప్రతినిధి, మార్చి 18 (మనసులో మాట) :** దివ్యాంగుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని కూటమి ప్రభుత్వం చాటుకుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనకాపల్లి ఆర్టీసీ డిపోలో బుధవారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ సీఎం రమేష్, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తో కలిసి దివ్యాంగ శక్తి ఉచిత బస్సు పథకాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులతో కలిసి బస్సు లో వారు ప్రయాణించారు. ఈ సందర్బంగా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ దివ్యాంగులంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఎంతో అభిమానమన్నారు. గతంలో దివ్యాంగులకు పెన్షన్ 500 రూపాయలు ఉంటే దాన్ని 3000 రూపాయలు చేసిన ఘనత చంద్రబాబునాయుడుదే. అదే వైసీపీ ప్రభుత్వ హయాంలో సాధారణ పెన్షన్ మాదిరిగానే అమలు చేశారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చాక ఏకంగా 6000 రూపాయలకు పెంచమన్నారు. మహిళలకు ఇస్తున్నట్లు గానే దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని దివ్యాంగ దినోత్సవం రోజున ప్రతిపాదించగా రెండు నెలల్లోనే అమలు చేసి దివ్యాంగుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని చాటుకున్నారు. సహాయకులకు కూడా 50 శాతం రాయితీ కల్పించడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఉన్న అవకాశాలను మెరుగుపరచు కోవాలని సూచించారు.గతంలో ట్రై సైకిల్స్ అందించాం. ఇప్పుడు బ్యాటరీతో కూడిన ట్రై సైకిల్స్ అందిస్తున్నా మన్నారు.అంతేకాకుండా స్వయం ఉపాధి రుణాలు అందించి ఆర్థిక పురోగతికి తోడ్పాటు అందిస్తాం అన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నాం. సుమారు 64 లక్షల మందికి ఇంటి వద్దనే పెన్షన్లు ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే. ఉచిత గ్యాస్,ఉచిత బస్సు అమలు చేస్తున్నా మన్నారు. రాష్టంలో అనేక సంక్షేమ పథకాలతో పాటుగా అభివృద్ధి చేస్తున్నా మన్నారు. గతంలో రోడ్లపై ప్రయాణమంటే భయపడే పరిస్థితి నుంచి గుంతలు లేని రోడ్లను సాకారం చేసి చూపించమన్నారు. అనకాపల్లి జిల్లాను అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చబోతున్నామన్నారు. సుమారు 1.50 లక్షల కోట్ల పెట్టుబడితో అర్సెల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తున్నామని. ఆంధ్రుల హక్కు నినాదంతో పోరాడి సాధించు కున్న విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేయాలని జగన్ రెడ్డి ప్రయత్నిస్తే, కూటమి ప్రభుత్వంలో విశాఖ ఉక్కు కోసం కేంద్రం నుండి వేల కోట్ల నిధులు తీసుకొచ్చి అస్తిత్వాన్ని కాపాడుకున్నా మన్నారు. అదే స్ఫూర్తితో అర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచుతామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ దివ్యాంగ శక్తి ఉచిత బస్సు పథకం ద్వారా దివ్యాంగులు రాష్ట్రంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఉచితంగా ఐదు రకాల బస్సు సర్వీసులో ప్రయాణించవచ్చునని, దేశంలోనే ప్రప్రదంగా ఆంధ్ర రాష్ట్రంలో ప్రవేశపెట్టడం జరిగిందని కలెక్టర్ పేర్కొ న్నారు. అనకాపల్లి ఆర్టీసీ డిపో నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు బస్సులో దివ్యాంగులతో కలిసి ప్రయాణం చేసి వారి కష్టసుఖాల ను అడిగి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో దివ్యాంగులతో కలిసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర తదితరులు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి వి. ప్రవీణా, ఏపీయుఎఫ్ఐడిసి ఛైర్మెన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మెన్ బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మెన్ మళ్ళ సురేంద్ర, రాష్ట్ర ఆర్ అండ్ బి కార్పొరేషన్ ఛైర్మెన్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ ఛైర్మెన్ పి.వి.జి కుమార్, డి.సి.ఎం.ఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, ఆర్టీసీ సిబ్బంది, పెద్ద ఎత్తున దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలకు పెద్దపీట : గణబాబు




**మల్కాపురం , మార్చి 18 (మనసులో మాట) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలను అందిస్తూ దీనిలో భాగంగానే దివ్యాంగులకు "దివ్యాంగ శక్తి" అనే పథకాన్ని లాంచన ప్రాయంగా బుధవారం రాష్ట్ర రాజధాని అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. దీనిలో భాగంగానే విశాఖ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, గణబాబు గాజువాక ఆర్టీసీ డిపో వద్ద దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు శరీరంలో అంగవైకల్యం ఉన్న, వారి మనసుకు మాత్రం ఎటువంటి అంగవైకల్యం లేదని అని వివరిస్తూ వారి మనసు స్వచ్ఛమైన దని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అర్హులైన వారందరూ అందుకుంటున్నారని, ప్రస్తుతం దివ్యాంగులకు బస్సు సౌకర్యం పూర్తిగా ఉచితంగా కల్పిస్తూ ఈ దివ్యాంగ శక్తి అనే పథకాన్ని ప్రారంభించడం తో రాష్ట్రంలో దివ్యాంగులందరూ ఎంతో సంతోషిస్తున్నారని ఆయన అన్నారు. అనంతరం దివ్యాంగులతో కలిసి బస్సులో కొంతసేపు ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ తో పాటు పలువురు జనసేన , బిజెపి తెలుగుదేశం, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### చాపరాయి జలవిహారిలో ఉపాధిని కల్పించండి

**డుంబ్రిగుడ , మార్చి 18 (మనసులో మాట) :** పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారిలో స్థానికులకు ఉపాధిని కల్పించాలని చాపరాయి జలవిహారి అభివృద్ధి సొసైటీ కోశాధికారి అరుణ్ రాజ్ డిమాండ్ చేశారు. పోతంగి పంచాయతీ ద్వారా చాపరాయి జలవిహారికి స్థానికుల ద్వారా నిర్వాహణ కొనసాగేదన్నారు 2023లో ఎకో టూరిజం ద్వారా ఐటీడీఏ చొరవ తీసుకుని అభివృద్ధి చేసిందన్నారు. 10 మంది నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి కల్పించేందుకు సర్పంచ్ నేతృత్వాన పంచాయతీ పాలకవర్గం తీర్మానించిందన్నారు. 10మందితో రిజిస్ట్రేషన్ చేయించడం జరిగిందన్నారు. వీరిలో అప్పట్లో 5గురికి ఉపాధి కల్పించి మిగిలిన వారికి మొండి చూపడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సర్పంచ్, మాజీ ఎంపీపీ పాడేరు ఐటీడీఏ అధికారుల ద్వారా తీర్మాణంలో లేని వ్యక్తులను తీసుకోవడం విచాకర మన్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ పీవో స్పందించి చాపరాయి జలవిహారిలో ఉపాధి కల్పించే విధంగాచొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత

- "దివ్యాంగ శక్తి" పథకాన్ని ప్రారంభించిన

**రాష్ట్ర ఎంఎస్ఎంఇ సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 18 :** రాష్ట్రంలోని దివ్యాంగుల సంక్షేమం మరియు వారి సామాజిక, ఆర్థిక ఎదుగుదల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రవేశపెట్టిందని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక ఆర్.టి.సి. డిపో ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో "దివ్యాంగ శక్తి" పథకాన్ని రాష్ట్ర ఎం. ఎస్.ఎం.ఇ., సెర్ప్, ఎన్.ఆర్.ఐ. సాధికారత శాఖ మంత్రి కొండ పల్లి శ్రీనివాస్ ప్రారంభించి, బస్సులో ప్రయాణిం చారు. ఈ కార్యక్రమం లో మంత్రి కొండపల్లి శ్రీని వాస్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రారం భించి, దివ్యాంగులతో కలిసి బస్సు లో ప్రయాణిం చడం వారి పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శ నమని పేర్కొన్నారు. దివ్యాంగుల కోసం గతంలో ఉన్న రాయితీలను పెంచుతూ, ఇప్పుడు ఐదు రకాల బస్సుల్లో (పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ మరియు సిటీ బస్సుల్లో) 100% ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఇది మొత్తం బస్సు సర్వీసుల్లో సుమారు 77% వరకు ఉంటుందన్నారు. అంతేకాకుండా ఏసీ మరియు ప్రీమియం బస్సుల్లో ప్రయాణించే దివ్యాంగులకు 50% రాయితీ కొనసాగుతుందని తెలిపారు. దివ్యాంగుల సహాయార్థం వచ్చే వారికి కూడా నిబంధనల మేరకు అన్ని రకాల బస్సుల్లో 50% రాయితీ కల్పిస్తున్నట్లు ప్రకటించారు. దివ్యాంగుల ఆర్థిక భరోసా కోసం పెన్షన్ మొత్తాన్ని కూడా ప్రభుత్వం గణనీయంగా పెంచిందని మూడువేల రూపాయలు గల పెన్షన్ ఆరు వేల రూపాయలకు పెంచడం జరిగిందని తెలిపారు. క్రీడల్లో రాణించే దివ్యాంగుల కోసం ప్రత్యేక పాలసీని తీసుకొచ్చి, వారిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. జిల్లాలో సుమారు 30,000 మంది దివ్యాంగులు ఉండగా, ప్రస్తుతం 1,200 మంది మాత్రమే బస్సు పాస్‌లు కలిగి ఉన్నారని, మిగిలిన వారందరూ సదరం సర్టిఫికేట్ మరియు ఆధార్ కార్డు ద్వారా ఆర్టీసీ కాంప్లెక్స్‌లలో పాస్‌లు పొందాలని సూచించారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' పథకం ఎంత విజయవం తమైందో, అదే స్ఫూర్తితో 'దివ్యాంగ శక్తి' కూడా దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. బస్సులలో దివ్యాంగులకు కేటాయించిన సీట్లు వారికి అందుబాటులో ఉండేలా సిబ్బంది, ప్రజలు సహకారాన్ని అందించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ మాట్లాడుతూ దివ్యాంగులకు పరిస్థితుల రీత్యా వారి లక్ష్యాలను చేరుకొనుటకు అదనపు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే వారి సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, వారి అభివృద్ధికి ప్రోత్సాహాన్ని అందిస్తుందని, ప్రతి ఒక్కరూ వాటిని వినియోగించుకోవాలని కోరారు. ప్రస్తుతం 50% అంగవైకల్యం కలవారికి మాత్రమే బస్సు పాసు సౌకర్యం వర్తిస్తుందని, దానిని 40 శాతానికి తగ్గించడం ద్వారా ఎక్కువ మందికి ఈ పథకాన్ని వినియోగించుకునే అవకాశం వచ్చింది అన్నారు. స్థానిక శాసనసభ్యురాలు అదితి విజయలక్ష్మి గజపతి రాజు మాట్లాడుతూ దివ్యాంగులకు దేశంలోనే అత్యధిక మొత్తం పెన్షన్ అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించడమే కాకుండా వారికి విద్యా ఉపాధి రంగాల్లో అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా దివ్యాంగ శక్తి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారన్నారు. అవసరమైన వారికి బస్సు పాసులు అందించే ఉద్దేశంతో మూడు రోజులపాటు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని దివ్యాంగులు అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లా ప్రజా రవాణా అధికారిణి జి.వరలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 1200 మంది దివ్యాంగులు బస్సు పాసులు కలిగి ఉన్నారని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం 40 శాతం వైకల్యం కలిగిన వారికి కూడా కల్పిస్తున్నందున మరింత ఎక్కువ మందికి ఈ పథకం ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు అందరూ బస్సు పాసులు పొందాలని, బస్సు పాసు మూడు సంవత్సరాల గడువుతో అందజేయడం జరుగుతుందని తెలిపారు. బస్సులలో దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో వారు కూర్చొనేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.అనంతరం దివ్యాంగులకు బస్సు పాసులు అందించారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం పట్ల దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ పి.యశస్వి, జిల్లా పరిషత్ సీఈవో బి. వి. సత్యనారాయణ, దివ్యాంగుల సంక్షేమ అధికారి వెంకటేశ్వరరావు , మెప్మా పిడి చిట్టి రాజు, డిపో మేనేజర్ శ్రీనివాస్, డిప్యూటీ సిటి ఎం సత్యనారాయణ, ఇతర అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

- జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మెన్ సిఎం రమేష్, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర కార్పొరేషన్‌ల ఛైర్మెన్ లు పీలా గోవింద సత్యనారాయణ, మళ్ళ సురేంద్ర, బత్తుల తాతయ్యబాబు తదితరులు అమ్మవారికి ప్రత్యేకపూజలు

**అనకావల్లి ప్రతినిధి , మార్చి 18 (మనసులో మాట) :** ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య పర్వదినాన అమ్మవారి దర్శనానికి బుధవారం ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. దేవాలయ ప్రాంగణమంతా భక్తజనంతో కిక్కిరిచింది. అలాగే పలువురు ప్రముఖులు అమ్మవారి ని దర్శించుకొని పూజలు జరిపారు. అనకాపల్లి జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు , అనకాపల్లి ఎంపీ,రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్, ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ తదితరులు అమ్మవారి దర్శనార్థమై విచ్చేసి పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా వీరందరిని మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, దేవస్థాన ఛైర్మెన్ పీలా నాగశ్రీను తదితరులు మంగళ వాయిద్యాల నడుమ పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ నూకాంబిక అమ్మవారి కి వారు పట్టు వస్త్రాలు సమర్పించి, పూజలు జరిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మెన్ బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మెన్ మళ్ళ సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్, డిసిఎంఎస్ ఛైర్మెన్ కోట్నీ బాలాజీ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి దాడి రత్నాకర్, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, దేవస్థాన చైర్మన్ పీలా నాగ శ్రీను, అమ్మవారి ఆలయ మాజీ ఛైర్మెన్ బి.ఎస్.ఎం.కె జోగినాయుడు, ధర్మకర్తలు, కార్యనిర్వాహణ అధికారి వై శ్రీధర్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



తాకాశివీధి స్వయం భూ శ్రీ నూకాంబిక అమ్మవారి ని దర్శించుకున్న మంత్రి శ్రీనివాసరావు

తాకాశివీధి నూకాంబిక అమ్మవారిని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ముందుగా మంత్రి శ్రీనివాసరావు కు స్వాగతం పలికి, ఆలయ కమిటీ వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తాకాశి రాజేష్ , ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ తాకాశి కిషోర్ , తాకాశి కన్నబాబు (చిన్ని) , రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, తాకాశి వీధి పెద్దలు తాకాశి సత్యం దొర, తాకాశి నాగేశ్వరరావు, తాకాశి విశ్వేశ్వరరావు, అదట రమణబాబు, తాటి రామకృష్ణ, శ్రీరామదాసు గోవిందరావు, పలకా చంటి, కారుకొండ కన్నారావు, ఉత్సవ కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.




# గ్రామాలలో వైభవంగా శ్రీ నూకాంబిక జాతర మహోత్సవాలు

- ఉత్సాహభరితంగా ఎడ్ల బళ్ళు, గుర్రపు పరుగు పందాలు
- అలరించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు, కూటమి శ్రేణులు



**దేవరాపల్లి , మార్చి 18 (మనసులో మాట) :** మండలంలోని పలు గ్రామాలలో శ్రీ నూకాంబికా అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి.బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులు నూకాంబిక అమ్మవారికి పసుపు కుంకాలు సమర్పించి తమ మొక్కులను చెల్లించు కున్నారు.మండలంలోని దేవరాపల్లి, కాశీపురం, ఏ. కొత్తపల్లి, గరిశింగి, ఎం. అలమండ, మామిడిపల్లి, నాగయ్య పేట తదితర గ్రామాలలో కొత్తమావాస్య జాతర ఉత్సవాలు నిర్వహించారు. పల్లెల్లో భక్తులు అమ్మవారి ఆలయాలకు పోటెత్తడంతో ఆలయాల వద్ద కొత్త అమావాస్య సందడి నెలకొంది. ఉగాది ముందు రోజు అమ్మవారిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని పల్లెల్లో ప్రజలకు ప్రగాఢ విశ్వాసం. ఈ ఉత్సవాల్లో భాగంగా కాశీపురంలో జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందాలు, ఎం. అలమండలో జిల్లా స్థాయి గుర్రపు పరుగు పందాలు ఉత్సాహభరితంగా నిర్వహించారు.ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు భారీ నగదు బహుమతులను అందజేశారు. ఎం.అలమండలో శ్రీ నూకంబిక అమ్మవారిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, టిడిపి సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు, రైవాడ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పోతల పాత్రు నాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు పెద్దాడ వెంకట రమణ, పిఏసిఎస్ అధ్యక్షులు గొర్లె గోవింద, కిలపర్తి చిక్కిసోమిరెడ్డి గోవింద, కొమర బాబురావు, అవుగడ్డ కోటిపల్లి నాయుడు,అల్లు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# నర్సీపట్నం నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

**నర్సీపట్నం , మార్చి 18 (మనసులో మాట) :** వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ నర్సీపట్నంలోని శ్రీ నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, చింతకాయల రాజేష్‌లు సాదరంగా ఆహ్వానం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు ప్రణవ్ గోపాల్‌ను అమ్మవారి శేషవస్త్రంతో ఆశీర్వదించారు. దర్శనానంతరం చింతకాయల విజయ్, రాజేష్‌లు వీఎంఆర్‌డీఏ చైర్మన్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోరుప్రోలు శ్రీనివాస్, కమిటీ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.






## మార్చి 22న బాడీ బిల్డర్స్ పోటీలు

- జిల్లా అధ్యక్షులు రెడ్డి శంకర్రావు పిలుపు

**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 18 :** డ్రగ్స్,గంజాయి కి యువత బలై పోతున్నదని కావున డ్రగ్స్ గంజాయి వద్దు..ఆరోగ్యమే ముద్దు అని మిస్టర్ విజయనగరం 2026 ను నిర్వహిస్తున్నామని.దీనికిఅతిధిగా ఆహ్వానిశీ చెందుకు జిల్లా క్రీడా ప్రాదికార సంస్థఅధికారి వద్దకి వెళ్లిన సందర్భంగా విజయనగరం జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి శంకరరావు,కార్యదర్శి కోరాడశ్రీనివాసరావులు రాజీవ్ క్రీడా మైదానంలో మాట్లాడుతూ మార్చి 22 న ఉమ్మడి విజయనగరం జిల్లా బాడీ బిల్డర్స్ పోటీలు నిర్వహిస్తున్నామని ఇందులో బాడీ బిల్డర్స్ పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. విజయనగరం గురజాడ కళా భారతి లో ఈ పోటీలు జరుగుతున్నాయని తెలిపారు . 55కేజీలు నుండి 75 కేజీలు ల్లో 6 కేటగిరీలు వారీగా నిర్వహించడం .వారందరికీ సర్టిఫికెట్,ప్రైజ్ ఇవ్వడం జరిగుతుందని అన్నారు. ప్రముఖులు చేతులు మీదుగా మిస్టర్ విజయనగరం ప్రైజ్ ఇవ్వడం జరుగుతుంది అన్నారు. రాత్రి భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తామని అన్నారు. యువత ని డ్రగ్స్, గంజాయి మత్తు పదర్ధాలు కి దూరంగాఉంచేందుకు బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఈ పోటీలు నిర్వహించడం జరుపు తున్నాం అని అన్నారు. రోజు,రోజుకి మహిళలుపైన, మైనర్లు పైన పొక్సో కెసులు పెరుగు తున్నాయని అందుకు డ్రగ్స్,గంజాయి మత్తు ఒక కారణం అని అన్నారు, యువత ఆరోగ్యంకోసం ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుంది కావున ఈ పోటీలు ల్లో ఉమ్మడి విజయ నగరం జిల్లాలో యువకులు,బాడీ బిల్డర్స్ పాల్గునాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ సెక్రటరీ సన్నిబాబు, సురేష్ పాల్గున్నారు.

## రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



**పాడేరు టౌన్ , ( క్రైమ్ ) మార్చి 18 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. అరకు లోయ ఐటీఐ ఎదురుగా ఉన్న రైల్వే ట్రాక్ పై సుమారు 30 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రైలు ఢీకొట్టడం వల్ల మృతి చెందినట్లుగా స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం పర్యటనను విజయవంతం చేయండి



**కోటవురట్ల , మార్చి 18 (మనసులో మాట) :** నక్కపల్లి మండలంలో ఈనెల 23న జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఈ మేరకు బుధవారం కోటవురట్ల మండలం జల్లూరులో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు లింగన్నాయుడు ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి కరపత్రాలు అందజేసి భారీ స్థాయిలో సీఎం బహిరంగ సభ కార్యక్రమానికి తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతం అభివృద్ధికి దోహదపడే ఆర్సెలాల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్టీల్ ప్లాంట్ ద్వారా వేలాదిమంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. అలాగే నియోజకవర్గం ఊహించని స్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ మండలం నుంచి 2,500 మందిని తరలించేందుకు 40 వ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## కొయ్యూరులో పదవ తరగతి పరీక్షా కేంద్రాల ఆకస్మిక తనిఖీ : సిఐ,ఎస్ఐ కట్టుదిట్టమైన నిఘా



**కొయ్యూరు , మార్చి 18 (మనసులో మాట) :** పదో తరగతి పరీక్షలు అత్యంత పారదర్శకంగా, క్రమబద్ధంగా జరిగేలా చూడటంలో భాగంగా కొయ్యూరు సి.ఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కిషోర్ వర్మ బుధవారం మండలంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. కొయ్యూరు మండలం లోని ఏపీటీడబ్ల్యుఆర్ గురుకుల పాఠశాల,సీఏహెచ్ స్కూల్, గవర్నమెంట్ హై స్కూల్ పరీక్షా కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థులను కచ్చితమైన తనిఖీలు చేసిన అనంతరం మాత్రమే లోపలికి అనుమతించారు. పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గుమిగూడకుండా కఠిన నియంత్రణలు అమలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున, అనవసరంగా గుమికూడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు హెచ్చరించారు. పరీక్షల్లో చీటింగ్, మాల్ ప్రాక్టీస్ లేదా ఎటువంటి అక్రమ చర్యలకు పాల్పడినా సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సి.ఐ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ప్రస్తుతం పరీక్షలు పోలీసుల కఠిన పర్యవేక్షణలో ప్రశాంతంగా జరుగుతున్నాయని, ఎక్కడా ఎటువంటి అవకతవకలు గమనించలేదని అధికారులు వెల్లడించారు.

## కూటమి ప్రభుత్వంలోనే రైతన్నలకు న్యాయం

రైతన్న మీ కోసం వారోత్సవాల్లో కార్యక్రమంలో:పిఏసిఎస్ చైర్మన్ నరంజి ప్రసాద్ రావు



**పెదబయలు , మార్చి 18 (మనసులో మాట) :** పెదబయలు మండలం లక్ష్మీపేట పంచాయతీ లక్ష్మీపేట గ్రామంలో రైతన్న సేవ మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పి ఏ సి ఎస్ చైర్మన్ నరంజి ప్రసాద్ రావు పాల్గొని మాట్లాడుతూ రైతన్నలకు అండగా నిలిచింది కూటమి ప్రభుత్వం మాత్రమేనని ఈనెల 13వ తేదీన రైతుల ఖాతాలోకి మూడో విడత అన్నదాత సుఖీభవ,22వ విడత పిఎంకె కిసాన్ సాయం విడుదల చేసిన ఘనత కూటమి ప్రభుత్వనిద్దన్నారు. రైతులకు జరిగిన మేలును వివరించారు.అలాగే రైతులు తెలియజేసిన సమస్యలను వింటూ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , పీఎం. నరేంద్ర మోడీ రైతులకు ఏడాదికి 20వేల రూపాయలు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పిన మాటకు చెప్పినట్టుగా మూడు విడతల్లో అందజేశామన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్న రైతన్నల కోసం ఇచ్చిన మాటకు కట్టుబడి ఆర్థిక సహకారం అందించినట్లు పేర్కొన్నారు. రెండు విడతల్లో రూ.14000 మూడోదఫాలో రూ. 6000 మొత్తం రూ.20,000 రైతన్నల ఖాతాలో జమ చేశామన్నారు. ఎవరికైనా సాంకేతిక సమస్యల కారణంగా వారి ఖాతాలో డబ్బులు జమ కాకపోతే రెండు మూడు రోజుల్లో వారికి కూడా జమ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. గిరిజన రైతులకు కూటమి ప్రభుత్వం ఎప్పుడుఅండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ వల్లంగి కాశీప్రసాద్, సచివాలయా అగ్రికల్చర్ రవి గోపాల్, వెటర్నరీ పరమేశ్వరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలుతో వైభవంగా శ్రీనూకాంబికా అమ్మవారి జాతర



**ఎన్.రాయవరం , మార్చి 18 (మనసులో మాట) :** ఎస్. రాయవరం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కొత్త అమావాస్య సందర్భంగా శ్రీనూకాంబికా అమ్మవారి జాతర ను వైభవంగా నిర్వహించారు. జాతరలోభాగంగా మంగళవారంరాత్రి జాగారణోత్సవం నిర్వహించారు.అమ్మవారి ఘటాలనుఊరేగింపు నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయాలు వద్ద భక్తులుబారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులుచెల్లించుకున్నారు. జాతర సందర్భంగా భారీఎత్తున బాణాసంచా వెలిగించారు. తిమ్మాపురం



గ్రామంలో ఆలయం వద్ద ఉచిత అన్నసమారాధన నిర్వహించారు. చిన్నగుమ్మాలూరు, తిమ్మాపురం గ్రామాల్లో అమ్మవారికి ప్రీతిపాత్రమైన పెద్ద ఊయ్యాలాలను ఏర్పాటుచేసారు. వారంరోజులుపాటు ఈ ఊయ్యాలను ఉంచి యువకులు అటలుఆడటం అనవాయితీగా వస్తుంది .జాతరలో భాగంగా పలు సంస్కృతిక కార్యక్రమా లు ఏర్పాటు చేసారు.దార్లపూడి, పెద్దగుమ్మాలూరు గుడివాడ, ఎస్. రాయవరం, కోరుప్రోలు గెడ్డపాలెం, ధర్మవరం, పెట్టుగోళ్ళపల్లి, లింగరాజుపాలెం తదితరగ్రామాల్లో శ్రీనూకాంబికా అమ్మవారిజాతరను అత్యంత భక్తిశ్రద్ధలుతో నిర్వహించారు.

## ప్రతి రైతు ఆర్ధికంగా ఎదగడమే ప్రభుత్వ ధ్యేయం

- రైతులకు పంచ సూత్రాలను వివరించి సమస్యలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి



**పార్వతీపురం , మార్చి 18 (మనసులో మాట) :** వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తూ, ప్రతి రైతు ఆర్థికంగా ఎదిగేలా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభు త్వం 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కలెక్టర్ తెలిపారు. రైతు సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. బుధవారం జియ్యమ్మవలస మండలం తల్లాడమ్మ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిం చిన రైతన్నా మీకోసం వారోత్సవాల కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వ్యవసాయంలో స్థిరమైన అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం రూపొందించిన 'పంచ సూత్రాల' ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. సాగునీటిని పొదుపుగా, సమర్థవంతంగా వినియోగించుకోవాలని అన్నారు. బహిరంగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా లాభదాయకమైన పంటలను ఎంచుకోవడం, వ్యవసాయంలో నూతన యంత్రాలు,డ్రోన్ టెక్నాలజీ వంటి సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. పండించిన పంటను ప్రాసెసింగ్ చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని, రైతులు స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహించడం కూడా ఇందులో భాగమేనని అన్నారు. ప్రభుత్వం ప్రతి రైతుకు అండగా ఉంటుందని, రైతులకు సాంకేతిక ను చేరువ చేస్తూ ఇప్పటికే డ్రోన్ పరికరాలను సైతం సబ్సిడీపై అందించడం జరిగిందన్నారు. జిల్లాలో భూగర్భ జలాలను పెంపొందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలోని రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అందించామని, అర్హత కలిగి పొందని రైతుల సాంకేతిక సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. రైతులు స్మార్ట్ ఫోన్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని, తద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతఅందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ఆకాంక్షించారు.జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గమ్మలక్ష్మీపురం సబ్ డివిజన్ పరిధిలోని రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విత్తనం నుండి విక్రయం వరకు ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలోరైతులు పాల్గొన్నారు.అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి సూచనలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

## విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రిలో అభివృద్ధి చెందిన నూతన న్యూరోసర్జరీ పరికరం పై పరిశోధనకు గుర్తింపు



**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 18 :** ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, ప్రభుత్వ వైద్య కళాశాల, విజయనగరం, న్యూరో సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రెడ్డి శంకరరావు, ఎంబిబిఎస్ విద్యార్థి వి. డానీ మార్చి 16, 2026న జిటామ్ ఫౌండర్స్ సమ్మిట్‌లో ప్రధాన పరిశోధకులుగా, సహ-పరిశోధకులుగా పాల్గొన్నారు. వారు "సర్జన్-లెడ్ నోవెల్ క్రానియోటోమ్ అడాప్టర్ టు కన్వర్ట్ సర్టిఫైడ్ ఇంటి/డెంటల్ డ్రిల్ సిస్టమ్ ఇంటూ ఎ న్యూరోసర్జరీ డ్రిల్ సిస్టమ్" అనే వినూత్న పరిశోధనను సమర్పించారు. ఈ పరిశోధన వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సరసమైన న్యూరోసర్జికల్ పరికరాలను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించింది. ఈ సమ్మిట్‌లో వారి పరిశోధనకు అనేక గుర్తింపులు లభించాయి.పిచ్ డెక్ ప్రెజెంటేషన్‌లో ఓవరాల్ రన్నర్-అప్ అవార్డు, 35,000 నగదు బహుమతి ఈవెంట్‌లో ప్రదర్శించబడిన టాప్ 8 వెంచర్‌లలో ఒకటిగా ఎంపిక ఈ విజయం వైద్య పరిశోధనల్లో కళాశాల అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది. పరిశోధన అభివృద్ధికి, సంస్థ ప్రతిష్టకు దోహదపడినందుకు వి. డానీ సమ్మిట్‌లో పాల్గొనడానికి కళాశాల అధికారులు డా. బి. దేవి మాధవి. ప్రిన్సిపాల్ జి. ఎం. సి... డా. ఏ. పద్మజ. సూపర్నెంట్, జి. జి. హ్చ్, వైస్ ప్రిన్సిపాల్. కళాశాల సిబ్బంది అభినందించారు.

## ఆపరేషన్ వజ్రప్రహార్..కొయ్యూరులో పోలీసుల కట్టుదిట్టమైన తనిఖీలు



**కొయ్యూరు , మార్చి 18 (మనసులో మాట) :** మండలంలో పోలీసులు ఆపరేషన్ వజ్రప్రహార్‌ను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని కన్నవరం, అన్నవరం గ్రామాలలో ఈరోజు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌ను కట్టుదిట్టంగా నిర్వహించారు.ఈ తనిఖీలలో కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు,మంప ఎస్ఐ శ్రీనివాస్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొని గ్రామంలోని ప్రతి ఇంటిని, ప్రతి మూలను సూక్ష్మంగా పరిశీలించారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్రంగా చెక్ చేయడం జరిగింది. అదనంగా గ్రామంలోని వాహనాల రికార్డులను



పరిశీలించి, ఎన్యూమరేషన్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.ఈ ఆపరేషన్ సందర్భంగా ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించబడలేదు. అయినప్పటికీ, అక్రమ కార్యకలాపాలపై పోలీసులు ఎప్పటికప్పుడు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**పోలీసుల కఠిన హెచ్చరిక:**

గంజాయి సాగు, నిల్వ, రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి పనుల్లో పాల్గొనే వారిని ఏ పరిస్థితుల్లోనూ విడిచిపెట్టబోమని తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ పరిసరాల్లో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు.

## రావణా పల్లి గ్రామంలో త్రాగునీటి బోరు మంజూరు

**గొలుగొండ , మార్చి 18 (మనసులో మాట) :** గొలుగొండ మండలం రావణా పల్లి గ్రామంలో మెట్ట దగ్గర నర్సీపట్నం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదేశాల మేరకు గొలుగొండ ఎంపీపీ గజ్జలపుమణికుమారి మండల పరిషత్ నిధులతో లక్ష రూపాయలు గ్రాంట్ బోర్వెల్ కు మంజూరు చేశారు. గతంలోఎమ్మెల్యే గణేష్ గడపగడపకు కార్యక్రమంలో మాటిచ్చిన ప్రకారం మాట నిలబెట్టుకున్నారు. ఈ ఎండాకాలంలో నీటి ఎద్దడి దృష్టిలో పెట్టుకొని ఈ బోరు మంజూరు చేసినందుకు గ్రామ ప్రజలందరూ మాజీ ఎమ్మెల్యే గణేష్ మండల ఎంపీపీ గజ్జలపు మణికుమారి కి గ్రామస్తులు అందరూ కృతజ్ఞతలుతెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు నర్సీపట్నం నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులు కొల్లు సత్యనారాయణ చోద్యం మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు కి లపర్తి పెద్దిరాజు గ్రామ వైసిపి నాయకులు కొల్లు రాము కొల్లు అప్పలనాయుడు కొల్లు గంగు నాయుడు కొల్లులోవరాజు కొల్లు బైరాగి కొల్లు చిన్న తాతాలు నాయకులందరూ కలిసి కొబ్బరికాయలు కొట్టి బోరుకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు.

## మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించిన విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అతిథి విజయలక్ష్మి గజపతిరాజు






**విజయనగరం , మార్చి 18 (మనసులో మాట) :** విజయనగరం పట్టణం తోటపాలెంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఈరోజు శాసన సభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న ఆహారంను రుచి చూసారు, విద్యార్థులతో మాట్లాడి భోజన వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు శుచిగా, శుభ్రంగా వంటలు చేయాలని, అదేవిధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ విద్యార్థుల ఆరోగ్యానికి రక్షణగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

## దారి కోసం ఒకరు...ధ్వంసం అవుతాయని మరొకరు

**చింతపల్లి , మార్చి 18 (మనసులో మాట) ప్రతినిధి :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లంబసింగి పంచాయతీ పరిధిలోని జలగలగడ్డ - కొర్రుబయలు గ్రామాల మధ్య నెలకొన్న రహదారి వివాదం చిలికి చిలికి గాలివానలా మారింది. గత కొన్ని రోజులుగా ఈ రెండు గ్రామాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం, ఇరు వర్గాలు ఘర్షణకు దిగడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం పాడేరు ఆర్డీవో లోకేశ్వరరావు, చింతపల్లి అదనపు ఎస్పీ నవజ్యోతి మిశ్రా తమ బృందంతో కలిసి వివాదాస్పద ప్రాంతాన్ని సందర్శించారు. జలగలగడ్డ గ్రామానికి రహదారి నిర్మించాలన్న ప్రతిపాదనపై కొర్రుబయలు గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపడితే తమ జీవనాధారమైన కాఫీ, మిరియాల తోటలు పూర్తిగా ధ్వంసమవుతాయని ఆ గ్రామానికి చెందిన మేడ కుమారి, టోల్లల లక్ష్మి, కాకర దేవి, చింత లక్ష్మి, చుక్క సింహాచలం, పిట్టా రత్నకుమారి తదితర రైతు కుటుంబాలు అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశాయి. గత 50 ఏళ్లుగా తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఈ తోటలే తమకు ఆధారమని, రోడ్డు కోసం తమ పొట్ట కొట్టవద్దని వారు వేడుకున్నారు. మరోవైపు, తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాల్సిందేనని జలగలగడ్డ గ్రామస్థులు పట్టుబడుతున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 3వ తేదీన ఇరు వర్గాల మధ్య తోపులాట, పరస్పర దాడులు జరగడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పర్యటన చేసిన ఆర్డీవో లోకేశ్వరరావు మాట్లాడుతూ.. జలగలగడ్డ గ్రామస్థుల అవసరాలను, కొర్రుబయలు రైతుల ఆవేదనను ప్రత్యక్షంగా పరిశీలించామని తెలిపారు. జలగలగడ్డ నుంచి రూథర్‌ఫోర్డ్ గెస్ట్ హౌస్ వైపు వెళ్లేందుకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను కూడా సాంకేతిక బృందంతో కలిసి పరిశీలించామన్నారు. రోడ్డు వల్ల ఎంతమేర పంట నష్టం జరుగుతుందో అంచనా వేసి, సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు. అదనపు ఎస్పీ నవజ్యోతి మిశ్రా మాట్లాడుతూ.. ఘర్షణలకు సంబంధించి ఇప్పటికే కేసులు నమోదు చేశామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఇరు గ్రామాల ప్రజలు సహనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## మామిడి రైతులకు ఉద్యాన శాఖ భరోసా - సస్యరక్షణ చర్యలు

**- గ్రామ స్థాయిలో అవగహన కార్యక్రమాలు**
**- జిల్లా ఉద్యాన అధికారి కె.చిట్టిబాబు**

**విజయనగరం , మార్చి 18 (మనసులో మాట) :** విజయనగరం జిల్లాలో మామిడి రైతులను ఆదుకునేందుకు, పంట దిగుబడిని పెంచేందుకు ఉద్యాన శాఖ నిరంతరం శ్రమిస్తోందని జిల్లా ఉద్యాన అధికారి కె.చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుత పంట స్థితిగతులు తెలుపుతు జిల్లాలో సుమారు 31,060 హెక్టార్లలో మామిడి సాగు అవుతుండగా, అందులో 28,500 హెక్టార్లు కాపు దశలో ఉన్నాయిని తెలిపారు. డిసెంబర్ నెలలో కురిసిన అకాల వర్షాలు, ప్రస్తుతం పగలు అధిక ఉష్ణోగ్రతలు మరియు రాత్రిపూట పొగమంచు వంటి ప్రతికూల వాతావరణం వల్ల మొదటి దఫా పూతకు కొంత నష్టం వాటిల్లిందని తెలిపారు. దీనివల్ల తామర పురుగులు, తేనె మంచు పురుగులు మరియు బూడిద తెగులు ఉధృతి పెరిగిందని తెలిపారు. రైతులకు క్షేత్రస్థాయి అవగాహన కల్పిస్తూ సీజన్ ప్రారంభం నుండి ఉద్యాన అధికారులు మరియు రైతు సేవా కేంద్ర సిబ్బంది ద్వారా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు..

రైతులు నాణ్యమైన దిగుబడి సాధించేందుకు ఫ్రూట్ కవర్స్, పసుపు మరియు నీలం జిగురు అట్టలు (ఎకరానికి 35-50), మరియు పండు ఈగ నివారణకు మిథైల్ యూజినాల్ ఎర బుట్టలను వాడాలని సూచిస్తున్నామని తెలిపారు. పంట భీమా సౌకర్యం గురించి తెలుపుతూ రబీ 2024-25 కింద వాతావరణ ఆధారిత భీమా పథకంలో జిల్లా వ్యాప్తంగా 6,358 ఎకరాలలో మామిడి రైతులు, 378 ఎకరాలలో జీడిమామిడి రైతులు స్వచ్ఛందంగా నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ దరఖాస్తులు ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. తక్షణ సస్యరక్షణ సూచనలు తెలుపుతూ ప్రస్తుత కాపును కాపాడుకోవడానికి రైతులు తగు చర్యలు చేపట్టాలని, తోటలకు తగినంత నీటి తడులు (ఆరుతడి) అందించాలని, పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.

తామర పురుగుల నివారణకు థయోమిథాక్సాం (0.3 గ్రా/లీ) లేదా వేప నూనె (5 మి.లీ/లీ) లేదా అజాడిరక్టిన్ 10000 (1 మి.లీ/లీ) వాడాలని, మామిడి పంటకు సంబంధించి ఎలాంటి సాంకేతిక సలహాలకైనా రైతులు వెంటనే తమ సమీపంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని లేదా ఉద్యాన అధికారులను సంప్రదించాలని జిల్లా ఉద్యాన అధికారి కె. చిట్టిబాబు కోరారు.

## సమాచార హక్కు చట్టంపై డాక్టర్ ఏ.కృష్ణ ప్రసాద్ వివరణ




**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 18 :** జిల్లా న్యాయఆధికార సంస్థ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఏ కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరైనారు .సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలనను బలోపేతం చేయడానికి భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ్యమైన చట్టం సమాచార హక్కు చట్టం - 2005. ఈ చట్టం ద్వారా ప్రతి భారత పౌరుడు ప్రభుత్వ శాఖలు, సంస్థల వద్ద ఉన్న సమాచారాన్ని కోరుకునే హక్కును పొందారు. బుధవారం జిల్లా న్యాయ ఆధికార సంస్థ నిర్వహించిన సదస్సులో పలువురు ప్రముఖులు మాట్లాడారు. ఈ చట్టం ప్రకారం, పౌరులు తమకు అవసరమైన సమాచారాన్ని లిఖిత పూర్వకంగా లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. సంబంధిత అధికారులు 30 రోజుల లోపు సమాచారం అందించాల్సిన బాధ్యత కలిగి ఉంటారు. అత్యవసరమైన విషయాల్లో 48 గంటల్లో సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది.చట్టంలోని ముఖ్య లక్షణాలు గమనించాలని తెలిపారు. ప్రభుత్వ పనితీరులో పారదర్శకతను పెంపొందించడం,అవినీతి నియంత్రణకు తోడ్పడడం,ప్రజలకు హక్కులపై అవగాహన కల్పించడం,ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం,అయితే, దేశ భద్రత, వ్యక్తిగత గోప్యత వంటి కొన్ని అంశాలకు సంబంధించిన సమాచారం ఈ చట్టం పరిధిలోకి రాదు.ఈ సందర్భంగా అందరూ చట్టం గురించి అవగాహన పెంపొందించుకొని, తమ హక్కులను, బాధ్యతలను తెలుసుకొని, వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, సమర్థవంతంగా అందించడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుంది. అనంతరం డిఆర్డిఏ సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కే సావిత్రి, మేనేజర్ ఎల్ పద్మ, జిల్లావ్యాప్తంగా ఉన్న అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు పాల్గొన్నారు.

## ఈ నెల 24న జిల్లా స్థాయి క్రీడా పోటీలు

**- మహిళలకు అవకాశం**
**- గెలిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతాం**
**- జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి డా॥కె. శ్రీధర్ రావు**



**పార్వతీపురం , మార్చి 18 (మనసులో మాట) :** ఈనెల 24న జిల్లా క్రీడా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి డా॥కె. శ్రీధర్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టర్ డా॥ఎన్. ప్రభాకర రెడ్డి ఆదేశాల మేరకు, శాప్ లీగ్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో జరిగే పోటీలకు జిల్లాలోని క్రీడాకారులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల మైదానంలో 24వ తేదీ ఉదయం 9 గంటలకు ఈ పోటీలను ప్రారంభిస్తామన్నారు. క్రీడా పోటీల వివరాలు మరియు వేదిక అథ్లెటిక్స్ (మాస్టర్స్) పరుగు పందెం పోటీ 100,200,800, 1500, లాంగ్ జంప్, షాట్ ఫుట్, డిస్కస్, హై జంప్, జావెలిన్ మరియు 4ఐ100 రిలే వేదిక మార్చి 24, శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాల, హైవే రోడ్డు, పార్వతీపురం మన్యం జిల్లా. వయసు 35 నుండి 45 సంవత్సరాల పైబడిన పురుషులు మరియు మహిళలు అర్హులని వివరించారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొనాలనుకునే మహిళలు మరియు పురుషులు పార్వతీపురం, మన్యం జిల్లా నివాసులై ఉండాలని పేర్కొన్నారు. క్రీడాకారుల వయస్సు కేటగిరి మేరకు సంబంధిత ఈవెంట్స్ పాల్గొనుటకు అవకాశం ఉందన్నారు. మహిళలు మరియు పురుషులకు వేర్వేరుగా క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ పోటీల్లో గెలిచిన క్రీడాకారులను ఈనెల 30, 31 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ అథ్లెటిక్స్ (మాస్టర్స్) క్రీడా పోటీలకు జిల్లా తరపున పంపిస్తామని పేర్కొన్నారు. పై క్రీడా పోటీలలో పాల్గొనదలచిన మహిళలు మరియు పురుషులు శాప్ వెబ్ సైట్ https://sports.ap.gov.in/#/registration/saap-league-registration లో తమ పేర్లు నమోదు చేసుకుని, షెడ్యూలు ప్రకారం జిల్లా స్థాయి పోటీల లో పాల్గొనాలని ఆయన అన్నారు.పూర్తి వివరములకు మొబైల్ నెం 73964 23490 ను సంప్రదించాలని ఆయన ఆ ప్రకారంలో తెలిపారు.

## ఘనంగా మండలంలో నూకాంబిక పండగ



**కె కోటపాడు , మార్చి 18 (మనసులో మాట) :** కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాలజిల్లుతున్న నూకాలమ్మ ఉత్సవం మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా జరిగాయి. కొత్త అమావాస్య సందర్భంగా బుధవారం మండల లో గుండు పాలెం, చౌడువాడ, సింగం ధర పాలెం, దాలివలస, అలాగే మండల కేంద్రం కోటపాడు మూడు రోడ్ల కోడలిలో గల నూకాంబిక అమ్మవారి గుడిలో ఉదయం 5 గంటల నుండి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి. పసుపు చందనంతో కూడిన అమ్మవారి రూపాన్ని తయారుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు కూటమి నాయకులు మాజీ సర్పంచ్ డోకల లక్ష్మీనరసింహ మూర్తి, సరగడం సన్యాసి నాయుడు, రెడ్డి అప్పారావు, గోపి నాగేషు, పైలా అమ్మాజీ, ఉమామహేశ్వరరావు, ఇంజరపు బ్రహ్మాజీ, మరియు గ్రామ ప్రజలు వందలాదిగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకొని ఉత్సవ కమిటీ సభ్యులు మేడిశెట్టి నానాజీ, వైలెట్ త్రినాథ్, పొన్నగంటి సూరిబాబు , శ్రీను జయరాం తదితరులు ఆధ్వర్యంలో ఉత్సవం ఘనంగా జరిగాయి. దీనిని పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర



**పార్వతీపురం , మార్చి 18 (మనసులో మాట) :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా సూపర్ సిక్స్ కింద ప్రకటించిన దివ్యాంగ శక్తి పథకాన్ని పార్వతీపురంలో ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర బుధవారం ప్రారంభించారు. దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర వారితో ఆప్యాయంగా మాట్లాడి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా అందుతున్న సాయం సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వం కూటమి ప్రభుత్వం దివ్యాంగుల కోసం అనేక కార్యక్రమాల అమలు చేస్తోందని తెలిపారు. వీటిలో భాగంగా 3000 పెన్షన్ మొత్తాన్ని 6000 కు, 5000 పెన్షన్ మొత్తాన్ని పదివేలకు, 10000 పెన్షన్ మొత్తాన్ని 15 వేలకు పెంచి దేశంలో ఎక్కడా లేనివిధంగా దివ్యాంగులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వెల్లడించారు. అలాగే ఉద్యోగ, విద్యా అవకాశాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పిస్తున్న ఘనత చంద్రబాబు ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. దివ్యాంగుల కోసం విశాఖలో త్వరలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ రానందని తెలియజేశారు.దివ్యాంగుల కోసం ప్రభుత్వం త్వరలో బ్యాక్లాగ్ పోస్టులు భర్తీకి చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. విద్యా ఉద్యోగ క్రీడల పరంగా దివ్యాంగులు మరింత ఉన్నత స్థితికి చేరుకునేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే బస్సులో కండక్టర్ అవతారం ఎత్తి ట్విన్ మిషన్తో ఉచిత టిక్కెట్లు కట్ చేసి దివ్యాంగులకు అందజేశారు. దివ్యాంగులంతా థాంక్యూ సీఎం సార్, ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు, జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయ్ చంద్ర దివ్యాంగులకు భోజనాలు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, అరకు పార్లమెంటరీ అధ్యక్షురాలు తేజోవతి, టిడిపి నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే సర్వాంగ సుందరంగా పీహెచ్సీ

**- జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి**
**- వైద్యారోగ్య కేంద్రాలు ప్రజలకు దేవాలయాల్లాంటివి**
**- ఆర్.ఆర్.బి పురం పి.హెచ్.సి అభివృద్ధి అభినందనీయం**
**- నీతి ఆయోగ్ మేగజైన్‌లో మన జిల్లా అభివృద్ధి నమూనాలు ప్రచురితం**



**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 18 :** ప్రభుత్వ నిధులపైనే కాకుండా ప్రజల భాగస్వామ్యం, స్థానిక నాయకుల సహకారంతో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (పి.హెచ్.సి) కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడమే 'పి.హెచ్.సి ముస్తాబు' కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అన్నారు. బుధవారం జీయ్యమ్మవలస మండలం ఆర్.ఆర్.బి పురం పి.హెచ్.సి ప్రాంగణంలో జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లతో 'ముస్తాబు' మరియు జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోనే తొలి ముస్తాబు పీహెచ్‌సీగా ఆర్.ఆర్.బి పురం నిలిచిందని జిల్లా కలెక్టర్ కొనియాడారు. పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి అంటే కేవలం వైద్య సేవలు అందించడమే కాదని, ప్రాంగణం ఆహ్లాదంగా, ప్రశాంతంగా ఉండేలా వాతావరణం కనిపించాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన వైద్యులు సుస్మిత, దిలీప్ లను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈనేపథ్యంలో ఆవరణ వెనుక భాగంలో పలు రకాల మొక్కలు, చుట్టూ కంచె, కుర్చీలు ఏర్పాటుతో ఆసుపత్రి ఆవరణ ఉద్యానవనాన్ని తలపిస్తోందని కితాబిచ్చారు. మొట్టమొదటిసారిగా ముస్తాబైన ఈ పీహెచ్‌సీని స్ఫూర్తిగా తీసుకుని, జిల్లాలోని మిగిలిన అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా ఇదే రీతిలో ముస్తాబు కావాలని పిలుపునిచ్చారు. వైద్యారోగ్య కేంద్రాలు ప్రజలకు దేవాలయాల్లాంటివని అన్నారు. సొంత నిధులతో అభివృద్ధి: పి.హెచ్.సి అభివృద్ధికి కేవలం ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా, స్థానిక దాతలు, నాయకుల భాగస్వామ్యంతో మొక్కల పెంపకం, మౌలిక వసతుల కల్పన వంటి పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి పి.హెచ్.సి పరిధిలోని పాఠశాల విద్యార్థులను నెలకు ఒకసారి ఆసుపత్రికి ఆహ్వానించి, అక్కడ లభించే ఉచిత వైద్య సేవలు, పరీక్షల గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రత, వైద్య సేవల నాణ్యతపై ప్రత్యేక చెక్‌లిస్ట్ రూపొందించామని, దాని ప్రకారం అన్ని పారామీటర్లు ఖచ్చితంగా అమలు కావాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది ఎంతో ఓపికతో, మర్యాదగా వ్యవహరించాలని, వారి నమ్మకాన్ని చూరగొనాలని తెలిపారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలను నాటారు. స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. ముస్తాబుతో మారిన పీహెచ్‌సీల రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం చేపట్టిన 'ముస్తాబు' కార్యక్రమంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయని కొనియాడారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రులంటే ఉన్న అపోహలను తొలగిస్తూ, నేడు కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా వసతులు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కేవలం భవనాలకు రంగులు వేయడమే కాకుండా, రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణం, పరిశుభ్రత, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో పచ్చదనం, స్వచ్ఛమైన గాలి రోగులకు త్వరితగతిన కోలుకునేలా మానసిక ధైర్యాన్ని ఇస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో ప్రవేశపెట్టిన 'గ్రామ ముస్తాబు', 'ఫ్యామిలీ ముస్తాబు' స్ఫూర్తితో ఇప్పుడు పీహెచ్‌సీలు కూడా ఆధునీకరించబడ్డాయని తెలిపారు. ఆసుపత్రిని ఇంత చక్కగా తీర్చిదిద్దిన మెడికల్ ఆఫీసర్లకు, సిబ్బందికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు ఈ మెరుగైన వైద్య సేవలను వినియోగించుకోవాలని, ప్రతి పీహెచ్‌సీ ఇదే విధంగా అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ప్రాజెక్ట్ ఆఫీసర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,కలెక్టర్ నేతృత్వంలో జిల్లాలో అమలవుతున్న నాలుగు కీలక అభివృద్ధి నమూనాలు జాతీయ స్థాయిలో నీతి ఆయోగ్ మేగజైన్‌లో ప్రచురితం కావడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. 'ముస్తాబు' కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తూ, సుస్థిరమైన ఫలితాలు సాధించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. భాస్కరరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండల రావు, వైద్యశాఖ అధికారులు కె.వి.ఎస్ పద్మావతి, కె.విజయపార్వతి, వై. విజయమోహన్, టి.జగన్మోహన రావు,ఎం.వినోద్ కుమార్,శివ కుమార్,సూర్యకౌశిక్, పిహెచ్సీ వైద్యాధికారులు కె.సుష్మిత, జె.దిలీప్ కుమార్, ఏపిఎన్జీఓ జిల్లా ప్రెసిడెంట్ జి.వి.వి. కిషోర్, పిహెచ్సీ డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కంచి కామకోటి 65వ పీఠాధిపతి పుణ్య తిథి మహోత్సవం

**- కంచి మహాస్వామి ఆరాధనతో పులకించిన నగరం**
**- బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ముందస్తు ఉగాది వేడుకలు పంచాంగ శ్రవణం**
**- ధర్మపథమే సమాజానికి రక్ష: ఎల్వీ సుబ్రహ్మణ్యం**
**- మార్చి 22న విజయవాడలో ఉగాది పురస్కారాల ప్రదానం: రాష్ట్ర అధ్యక్షులు కోనూరు సతీష్ శర్మ**







**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 18 :** చారిత్రక విజయనగరం మరోమారు ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లే వేదికైంది. విద్యల నగరంగా, సంస్కృతీ సంప్రదాయాల నిలయంగా గుర్తింపు పొందిన మన నగరం గర్వించదగ్గ మహనీయులు, కంచి కామకోటి 65వ పీఠాధిపతి అయిన జగద్గురు శ్రీ సుదర్శన మహా దేవేంద్ర సరస్వతి మహాస్వామివారి పుణ్య తిథి మహోత్సవం బుధవారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య మిన్నంటింది. స్థానిక శంకరమఠం వేదికగా ఉదయం నుండే వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల కోలాహలం మధ్య నగరం ఒక ఆధ్యాత్మిక పండుగను తలపించింది. ఇది కేవలం ఒక ఆరాధన కార్యక్రమంగానే కాకుండా, ఆధునిక సమాజానికి సద్గురువుల మార్గదర్శనం ఎంత అవసరమో చాటిచెప్పే దిక్సూచిగా నిలిచింది.ఆధ్యాత్మిక సారథిగా టీవీ శ్రీనివాస్ అకుంఠిత దీక్షఈ మహత్తర కార్యక్రమాన్ని ఒక విజయవంతమైన ఆధ్యాత్మిక యజ్ఞంలా నడిపించడంలో విజయనగరం బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య అధ్యక్షులు టీవీ శ్రీనివాస్ పాత్ర అగ్రగామి. పవిత్రమైన ఈ వేడుకను నగరం గర్వించదగ్గ స్థాయికి తీసుకెళ్లాలనే సంకల్పంతో ఆయన అహర్నిశలు శ్రమించారు. ప్రతి భక్తుడికి స్వామివారి కృపాకటాక్షాలు అందేలా, ఏర్పాట్లలో ఎక్కడా లోటు రాకుండా ఆయన చూపిన పర్యవేక్షణ అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది.ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షిస్తూ, ఆధ్యాత్మికతతో పాటు కళాత్మకతను మేళవించి భక్తులకు ఒక మధుర అనుభూతిని అందించిన టీవీ శ్రీనివాస్ సంకల్పం ప్రశంసనీయం.ఆయన నేతృత్వంలో జరిగిన ఈ ఏర్పాట్లు వేడుకకు నూతన శోభను చేకూర్చాయి.ధర్మపథంలో నడవడమే సమాజానికి రక్ష: ఎల్వీ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, టీటీడీ మాజీ ఈఓ ఎల్వీ సుబ్రహ్మణ్యం తన ప్రసంగంతో భక్తుల్లో ఆలోచనా దృక్పథాన్ని రగిలించారు. సద్గురువుల బాట: విజయనగరంతో తనకున్న పూర్వీకుల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, ప్రతి సాధకునికి గురువు మార్గదర్శి అని పేర్కొన్నారు. 'పరాభవ' నామ సంవత్సర విశేషాలను వివరిస్తూ.. వేద విద్యను అభ్యసించి ఉన్నతమైన ఆలోచనలతో సద్గతి పొందడమే మానవ జన్మ సార్థకత అని వివరించారు.తిరుమల లడ్డు అంశంపై ఆవేదన: ప్రస్తుత కాలంలో పశ్చాత్తాపం అనే భావన కనుమరుగవ్వడం శోచనీయమన్నారు. ముఖ్యంగా తిరుమల శ్రీవారి ప్రసాదం విషయంలో జరిగిన పొరపాట్లపై క్షమించమని భగవంతుడిని వేడుకుని ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదని, అటువంటి సదాలోచన లేకపోవడం పట్ల విచారం వ్యక్తం చేస్తూ, అధర్మ మార్గంలో నడిచే వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. జన్మలోనే శిక్ష: గత 30-40 ఏళ్లలో శ్రీ శివానందమూర్తి వంటి గొప్ప యోగి లేరని, వారి హెచ్చరికల ప్రకారం చేసిన పాప కర్మల ఫలితం ఈ జన్మలోనే అనుభవించక తప్పదని, ప్రతి ఒక్కరూ ధర్మబద్ధమైన జీవితం గడపాలని పిలుపునిచ్చారు. పాత జ్ఞాపకాలు - సేవా స్ఫూర్తి: ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విజయనగరంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గతంలో తాను ఇక్కడ గిరిజన సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన సమయంలో ముట్నూరి సీతారాం మూర్తి, కందాల సాయిబాబు అందించిన సహకారం మరువలేనిదని, వారి సేవలను ఈ సందర్భంగా కొనియా డారు. తోటివారికి ప్రేరణగా నిలవాలని ఆయన ఆకాంక్షిం చారు. ఘన సన్మాలు - అభినందనలు: బ్రాహ్మణ సంక్షేమానికి మరియు సామాజికాభివృద్ధికి కృషి చేస్తున్న పలువురు ప్రముఖులను ఈ కార్యక్రమంలో మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథుల సన్మానం. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యంను, సీనియర్ నాయకులు బీపీఆర్ శాస్త్రిని సమాఖ్య తరపున శాలువాలు కప్పి, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. కె.జే. శర్మకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ముఖ్య అతిథి విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా జ్ఞాపికను అందజేసి అభినందించారు,

**సేవా పథంలో బ్రాహ్మణ సమాఖ్య - ఉగాది పురస్కారాల ప్రకటన: కోనూరు సతీష్:**

రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘముల సమాఖ్య అధ్యక్షులు కోనూరు సతీష్ మాట్లాడుతూ..సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తినిస్తున్నాయని చెప్పారు. ఎల్వీ సుబ్రహ్మణ్యం వంటి మహోన్నత వ్యక్తితో వేదికను పంచుకోవడం అదృష్టమన్నారు. గత డిసెంబర్ 13న కంచి స్వామి చేతుల మీదుగా ప్రారంభమైన మెగా జాబ్ మేళా ద్వారా 1000 మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహిస్తున్న టీవీ శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే మార్చి 22 ఆదివారం నాడు విజయవాడలో జరిగే రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో వివిధ రంగాల ప్రముఖులకు 'ఉగాది పురస్కారాలు' అందజేయనున్నట్లు వెల్లడించారు. ముందస్తు ఉగాది సంబరాలు - కళా వైభవం: సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ, ఈసారి ఉగాది వేడుకలను మహాస్వామి పుణ్య తిథి రోజే నిర్వహించాలని టీవీ శ్రీనివాస్ బృందం నిర్ణయించింది. కట్టమూరి చంద్రశేఖరమ్ నూతన సంవత్సర ఫలితాలను వివరించారు.సాంస్కృతిక వేడుకలు: పార్వతీ పరమేశ్వరుల నృత్య రూపకం, చిన్నారుల నృత్య ప్రదర్శనలు, వేద పాఠశాల విద్యార్థుల వేద ప్రవచనాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షులు డాక్టర్ డివి శ్రీకాంత్, ఇనగంటి రాకేష్, అర్చక పురోహిత సంఘం జిల్లా నాయకులు భమిడిపాటి రామ్ కుమార్ శర్మ, బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు భరద్వాజ చక్రవర్తి, గంగరాజు, రాకేష్ శర్మ, వేణు, రవి మండా మరియు పెద్ద సంఖ్యలో పుర ప్రజలు పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక

## అభివృద్ధి లేని 'నగరం'..తీరని పన్నుల భారం..!

**- నేటి నుంచి నెల్లిమర్ల నగర పంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలన**



**నెల్లిమర్ల , మార్చి 18 (మనసులో మాట) :** నెల్లిమర్ల నగర పంచాయతీ పేరుకే 'నగరం' కానీ, సౌకర్యాల్లో మాత్రం నేటికీ వెనుకబడిన గ్రామంగానే మిగిలిపోయింది. రాజకీయ ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయాలు సామాన్యుల పాలిట శాపంగా మారాయనడానికి నెల్లిమర్ల ఒక నిదర్శనం. ఈనెల 17తో పాలకవర్గ పదవీ కాలం ముగిసి, మళ్లీ ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లింది.

**రాజకీయ నిర్ణయం.. ఉపాధికి విఘాతం**

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నెల్లిమర్ల, జరజాపుపేట గ్రామాలను కలిపి నగర పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఎటువంటి మౌలిక వసతులు అభివృద్ధి చేయకుండానే హోదా మార్చడం వల్ల ప్రజలకు ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా జరిగింది.

**ఉపాధి హామీ పథకం దూరం:**

నగర పంచాయతీగా మారడంతో గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దయింది. దీనివల్ల రెండు గ్రామాల్లోని వేలాది మంది పేద కూలీలు తమ ఉపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారు.

**పన్నుల భారం:**

గ్రామ పంచాయతీలో ఉన్నప్పుడు తక్కువగా ఉన్న ఆస్తి పన్నులు, నీటి పన్నులు పట్టణ హోదా రాగానే మున్సిపల్ చట్టాల ప్రకారం భారీగా పెరిగాయి. కానీ ఆ స్థాయిలో సౌకర్యాలు మాత్రం అందలేదు.

**న్యాయ పోరాటం - జరజాపుపేట ఆవేదన**

తమ గ్రామాన్ని పంచాయతీగానే ఉంచాలని, పట్టణ హోదా వద్దని జరజాపుపేట ప్రజలు మొదటి నుంచి పోరాడుతూనే ఉన్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో సుదీర్ఘ కాలం పాటు ఎన్నికలు జరగలేదు. దీంతో నిధుల కేటాయింపులో తీవ్ర జాప్యం జరిగి, మౌలిక వసతులు పూర్తిగా కుంటుపడ్డాయి. ఏళ్ల తరబడి ప్రత్యేక అధికారుల పాలనలోనే నెల్లిమర్ల నగరపంచాయతీ కాలం గడిపింది.

**పాలకవర్గ వైఫల్యం:**

2021 మార్చిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికలు జరిగి పాలకవర్గం కొలువుదీరింది. ఐదేళ్ల విరామం తర్వాత ప్రజాప్రతినిధులు వచ్చారు కాబట్టి మార్పు ఉంటుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది.

**అస్తవ్యస్తమైన డ్రైనేజీలు:**

పట్టణంలో మురుగు నీరు పారే దారి లేక రోడ్లపైనే ప్రవహిస్తోంది. వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. అంతర్గత రహదారులు గుంతలమయంగా మారాయి. మరమ్మతులకు నోచుకోక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో చీకటి రాజ్యమేలుతోంది. నిర్వహణ సరిగ్గా లేక చాలా వీధి దీపాలు వెలగడం లేదు. వైసీపీ హయాంలో కూడా చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు జరగలేదని ఆరోపణలు ఉన్నాయి. పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. చెత్త సేకరణ పద్ధతులు సరిగ్గా లేకపోవడంతో పట్టణమంతా దుర్వాసనతో నిండిపోతోంది.

**మళ్లీ అధికారుల పాలనలోకి..**

ఈనెల 17తో ఎన్నికైన పాలకవర్గం పదవీ కాలం ముగిసింది. 18 నుంచి తిరిగి ప్రత్యేక అధికారుల పాలన అమలులోకి వచ్చింది. ప్రజాప్రతినిధులు ఉన్నప్పుడే పనులు జరగలేదని, ఇక అధికారుల పాలనలో సామాన్యుల సమస్యలను ఎవరు పట్టించు కుంటారనే ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. నెల్లిమర్ల నగర పంచాయతీకి కేవలం పేరు మారితే సరిపోదు, ప్రజల జీవన ప్రమాణాలు మారాలి. మళ్లీ మొదలైన అధికారుల పాలనలోనైనా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయో లేదో వేచి చూడాలి.

## మునగపాక శ్రీ పరదేశమ్మను దర్శించుకున్న కర్రి సాయికృష్ణ

**- అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ**



**మునగపాక , మార్చి 18 (మనసులో మాట) :** యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం, మునగపాకలో వెలసి ఉన్న శ్రీ పరదేశమ్మ అమ్మవారి పండుగ మహోత్సవాల సందర్భంగా, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు గవర, కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు తో కలిసి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం రాష్ట్ర ప్రజలందరూ ఆయురా రోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ అధ్యక్షుడు విల్లూరి నర్సింగరావు, క్లస్టర్ ఇంచార్జ్ కాండ్రేగుల శంకర్, మల్ల వరాహ నరసింగరావు, మల్ల శేషు, దాడి శ్రీను తదితర తంపరమూలసంఘసభ్యులు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## కూటమి సర్కార్ మొద్దునిద్ర

**( కష్టంలో అన్నదాత..ఖుషీలో ప్రభుత్వ అధినేత )**

**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 18 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అధోగతి పాలవుతుంటే చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని, ఈ ప్రభుత్వం ద్వారా ఏ రంగం వారికి కూడా అవసరమైన సాయం అందడం లేదని వైసీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు..ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) అన్నారు.దేశానికి వెన్నెముక వంటి రైతు ప్రయోజనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి అన్నదాత జీవితాన్ని తెలుగుదేశం ప్రభుత్వం అతలాకుతలం చేసిందని బుధవారం నాడు ఆయన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో చిన్న శ్రీను దుయ్యబట్టారు. గత ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా అసలు వ్యవసాయానికి ఏమాత్రం అనుకూలం కానీ పరిస్థితులను తెలుగుదేశం ప్రభుత్వం సృష్టించిందని ఆయన ఆరోపించారు .గత రెండు సంవత్సరాల్లో రైతులకు సుమారు 40 వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా విడతలుగా అన్నదాత సుఖీభవ పేరిట కేవలం 14 వేల రూపాయలు మాత్రమే ఇచ్చి తెలుగుదేశం ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఆయన విమర్శించారు. కొనుక్కుందాం అంటే యూరియా గానీ మందులు గాని దొరక్క అన్నదాత నానా అగచాట్లకు గురవుతుంటే తెలుగుదేశం నాయకులు తాము రైతులను ఉద్ధరిఉన్నట్టు గొప్పలు పోతున్నారని ఆయన తూర్పారపట్టారు .చెప్పింది ఒకటి చేసేది ఒకటిగా ఉన్న ఈ ప్రభుత్వానికి అన్నదాతకు సాయం చేయాలన్న చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. వాస్తవ పరిస్థితులు ఇలా ఉంటే కూటమికి చెందిన ఎమ్మెల్యేలు,మంత్రులు రైతులకు తాము చాలా చేసినట్లు ప్రజల దగ్గర గొప్పలు పోతున్నారని ఆయన అన్నారు దమ్ముంటే రైతు సమస్యలపై చర్చలకు కూటమి ఎమ్మెల్యేలు గానీ మంత్రులు గాని రాగలరా వస్తే వాస్తవ పరిస్థితులను చూపించి వారికి గుణపాఠం చెప్పడానికి వైసిపి సిద్ధంగా ఉందని ఆయన సవాల్ విసిరారు. 2019- 24 మధ్యకాలంలో ఈ రాష్ట్రంలో కరోనా పరిస్థితి వచ్చినప్పుడు గానీ తదనంతరం గాని రైతులకు ఎటువంటి సమస్య లేకుండా తమ నాయకుడు నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని చర్యలు తీసుకున్నారని,ఆ చర్యలకు కొనసాగింపు లేకపోగా రైతు సాయాన్ని పూర్తిగా నీరుగార్చిన ఘనత ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన ధ్వజమెత్తారు. ఇకపోతే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించే ధైర్యం కూటమికి లేదని చిన్న శ్రీను అన్నారు. అందుకే ఎన్నికలను వాయిదా వేయించి మరి కొంతకాలం వబ్బం గడుపుకోవాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే తమ వ్యతిరేక ఓటు ద్వారా కూటమి రెండేళ్ల పాలనపై తీర్పు ఇవ్వడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీకి గత స్థానిక ఎన్నికల వలె బ్రహ్మరథం పట్టడానికి ఈ రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు .ఎన్నికలలో వ్యతిరేక ఫలితాలు వస్తాయని గ్రహించిన చంద్రబాబు నాయుడు ఏదో ఒక మిషతో ఎన్నికలను వాయిదా వేయడానికి ప్రయత్నిస్తారని,ఇది ఆయనకు వెన్నతో పెట్టిన విద్యని చిన్న శ్రీను విమర్శించారు. ప్రస్తుతం పదవీకాలం ముగిసిన వైసీపీ ఆధ్వర్యంలోని అన్ని పాలకవర్గాలకు చిన్న శ్రీను ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం నిధుల కొరతను సృష్టించినా.. ఇతరత్రా ఎన్ని అవరోధాలు కల్పించినా ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిన మున్సిపల్ కార్పొరేషన్ మేయర్లకు ,డిప్యూటీ మేయర్లకు ,పాలకవర్గ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు .ఎన్నికలు ఇప్పటికిప్పుడు జరిపినా వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందని చెబుతూ అధికార పార్టీకి ఆ సత్తా ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికలు ఎప్పుడైనా గాని సిద్ధంగా ఉండాలని ఆయన వైసీపీ శ్రేణులకు పిలుపునిస్తూ ఎప్పుడు జరిగినా విజయం తమ పార్టీ దేనిని విశ్వాసం వ్యక్తం చేశారు .విజయనగరం జిల్లాలో మొక్కజొన్న ప్రధాన పంటగా ఉందని ఉమ్మడి ఉమ్మడి జిల్లాలో లక్ష హెక్టార్లలో మొక్కజొన్న పండించిన ప్రభుత్వం నుంచి కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారుల మోసాలకు గురవుతున్నారని ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని జొన్న రైతులను గిట్టుబాటు ధరతో ఆదుకునే ప్రయత్నం చేయాలని ఆయన డిమాండ్ చేశారు .రైతులను ఆదుకోవాలని చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఏమాత్రం ఉన్న తక్షణం మొక్కజొన్న కొనుగోలుకు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**- సామాజిక సేవలో ఆదివాసి గిరిజన సంఘం ముందంజ : రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర**

**హుకుంపేట , మార్చి 18 (మనసులో మాట) :** మండలంలోని బూర్జ పంచాయతీ పరిధిలోని మజ్జివలస గ్రామంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహి ంచగా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పీపుల్స్ హెల్త్ సొసైటీ సౌజన్యంతో మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో ఈ శిబిరాన్ని ఆదివాసి గిరిజన సంఘం, ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యమాలతో పాటు సామాజిక సేవలో కూడా సంఘం ముందంజలో ఉంటుందని తెలిపారు. ఆదివాసుల సమస్యల





పరిష్కారానికి పోరాటం చేస్తూనే వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

వైద్య శిబిరంలో డాక్టర్ భాగ్యరాజు, డాక్టర్ రిషి ఆధ్వర్యంలో వైద్య బృందం కంటి పరీక్షలు, బీపీ, షుగర్, కేన్సర్, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించారు. బూర్జ పంచాయతీతో పాటు పరిసర గ్రామాల నుంచి వచ్చిన అనేక మంది రోగులు పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు పొందారు. రోగులు భారీ సంఖ్యలో హాజరై సేవలు పొందడంతో శిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎపిడెమిక్ సీజన్ దృష్ట్యా అల్లూరి జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను కొనసాగిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు వి. లక్ష్మణరావు, టి. కృష్ణరావు, పి. సోమన్న, బాలకృష్ణ, ఎంపీటీసీ మజ్జి హరి, వార్డు సభ్యుడు పరశురామ్ తదితరులు పాల్గొన్నారు

## విజయనగరం జిల్లాలో గ్యాస్ కొరత లేదు

**- గృహ గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందవద్దు : జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మురళీనాథ్**

**విజయనగరం , మార్చి 18 (మనసులో మాట) :** విజయనగరం జిల్లాలో కొన్ని మండలలలో గ్యాస్ సిలిండర్ల కొరత తీవ్రంగా ఉందని, బుకింగ్ చేసిన 45 రోజులైనా సిలిండర్లు అందడం లేదని వచ్చిన వార్తలను జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మురళీనాథ్ ఒక ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ క్షేత్రస్థాయి విచారణ గజపతినగరంలోని గ్యాస్ ఏజెన్సీలపై తహసీల్దార్ ద్వారా విచారణ జరిపించగా, సరఫరాలో ఎటువంటి జాప్యం లేదని తేలిందని తెలిపారు.

గజపతినగరంలో నిరంతర వంట గ్యాస్ సరఫరా జరుగుతుందని, మండలంలోని రెండు గ్యాస్ ఏజెన్సీలు కలిపి రోజుకు సుమారు 900 సిలిండర్లను డోర్ డెలివరీ చేస్తున్నాయని తెలిపారు. గృహ గ్యాస్ వినియోగదారులకు OTP వచ్చిన వెంటనే గ్యాస్ పంపిణీ జరుగుతోందన్నారు. నిఘా మరియు చర్యలులో భాగంగా గ్యాస్ అక్రమ మళ్లింపు జరగకుండా రెవెన్యూ, సివిల్ సప్లైస్ మరియు విజిలెన్స్ అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తున్నారని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే 6ఏూ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. బుకింగ్ నిబంధనలు ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులు, పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల గడువు ముగిసిన తర్వాత మాత్రమే తదుపరి బుకింగ్ చేసుకోవాలని గ్యాస్ ఏజెన్సీలు స్పష్టం చేశాయని ఆయన తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న గ్యాస్ కొరత వార్తలు పూర్తిగా అవాస్తమని, గృహ అవసరాలకు మరియు విద్యా సంస్థలకు గ్యాస్ సరఫరా సాధారణంగానే కొనసాగుతోందని, ప్రజలు ఎటువంటి వదంతులను నమ్మవద్దని జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మురళీనాథ్ ప్రకటన ద్వారా కోరారు. .

## రామభద్రపురంలో దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన విప్

**- పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులో ఉచితం**



**పార్వతీపురం , మార్చి 18 (మనసులో మాట) :** జీయ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురంలో దివ్యాంగ శక్తి పథకాన్ని కురుపాం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మరియు జిల్లా కలెక్టర్ డా.ఎన్. ప్రభాకర రెడ్డి బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం బస్సులో కూర్చొని దివ్యాంగులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అనేక అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. జిల్లాలో నేటి నుండి దివ్యాంగ శక్తి పథకం ద్వారా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. 40 శాతం కన్నా ఎక్కువ వికలాంగత కలిగిన వ్యక్తులు, బస్సులో ప్రయాణించేటప్పుడు ప్రభుత్వం జారీ చేసిన పీహెచ్ సి, వికలాంగుల ధృవీకరణ పత్రం (సదరన్) తప్పనిసరిగా ఉండాలన్నారు. వికలాంగుడితో పాటు వచ్చే ఒక సహాయకుడికి 50 శాతం వరకు టికెట్ లో రాయితీ ఉంటుందన్నారు. దివ్యాంగులు బస్సు ఎక్కినప్పుడు పీహెచ్ సి పాస్, వికలాంగుల కార్డ్ చూపించి జీరో ధర టికెట్ పొందవచ్చని చెప్పారు. జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఈ పథకాన్ని ప్రారంభించుకున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు పీహెచ్ సి పాస్ ఉన్న దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యవంతమైన ప్రయాణాన్ని ఏర్పాటు ఉందని అన్నారు. అలాగే స్త్రీ శక్తి పథకం కింద నడిచే ఆర్టిసి బస్సులలో కూడా దివ్యాంగులకు ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంటుందని వివరించారు. నాన్ స్టాప్ , ఇంటర్ స్టేట్ మరియు అల్ట్రా డీలక్స్ బస్సుల్లో టిక్కెట్ పై 50 శాతం వరకూ రాయితీ ఇవ్వడం జరుగుతుందను అన్నారు. జిల్లాలో 164 బస్సులు ఉచిత ప్రయాణానికి సిద్ధంగా ఉండగా, అందులో 138 పల్లెవెలుగు, 18 అల్ట్రా పల్లెవెలుగు, 29 ఎక్స్ ప్రెస్ బస్సులు దివ్యాంగుల ఉచిత ప్రయాణానికి కేటాయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. భాస్కరరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, ఆర్.ఆర్.బి పురం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు

## నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ కు భూమి పూజ తగదు

**- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం**

**అనకాపల్లి , మార్చి 18 (మనసులో మాట) :** నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ కు భూమి పూజ చేయడానికి ఏర్పాట్లు చేయడం సరికాదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం అన్నారు. అనకాపల్లి లో సిపిఎం జిల్లా కార్యాలయంలో బుధవారం సిపిఎం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్ లో భాగంగా నక్కపల్లి మండలంలో రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, అమలాపురం, డిఎల్.పురం ఐదు పంచాయతీల పరిధిలో 11 గ్రామాల నుండి 5,500 ఎకరాల భూమి రైతుల నుండి బలవంతంగా ప్రభుత్వం సేకరించిందని గుర్తు చేశారు. అందులో 2,100 ఎకరాల భూమిని ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. అయితే నిర్వాసితులైన రైతులు, కూలీలు, వృత్తిదారులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇవ్వాల్సిన పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు ఇప్పటివరకు పూర్తిగా అమలు చేయలేదన్నారు.



నిర్వాసిత కాలనీలో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా ఆగమేఘాలమీద ప్రస్తుతం నివశిస్తున్న ఇళ్ళు నేలమట్టం చేసి నిర్వాసితులను నడిరోడ్డుపై నెట్టివేయడం సరైనదా అని ప్రశ్నిస్తున్నారు. రైతులు, నిర్వాసితులకు పూర్తిస్థాయి ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని, ఆర్. కార్డులు ఇవ్వాలని, పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని, కంపెనీ నిర్మాణ దశలో నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని కోరారు. జిరాయితీ భూములతో సమానంగా డి-ఫారం సాగు భూములకు కూడా పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలన్నారు. వివాహమైన ఆడపిల్లలకు, 18 సంవత్స రాలు నిండిన ప్రతి యువతీ, యువకులకు భూసేకరణ సందర్భంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. ఇళ్లు కోల్పోయి నిర్వాసితులైన ప్రతి కుటుంబాలకు ప్రస్తుతం ఇచ్చిన ప్యాకేజీ రూ.8,98,000 అంగీకారం కాదని, పెరిగిన ఇంటి నిర్మాణ సామాగ్రి ధరలకు అనుగుణంగా 25 లక్షల రూపాయలు ప్యాకేజీ పెంచి ఇవ్వాలని కోరారు. నిర్వాసితుల కాలనీలో విద్యా, వైద్యం, విద్యుత్, నీటి సౌకర్యంతో పాటు 25 రకాల మౌలిక సదుపాయాలు పూర్తిగా కల్పించే వరకు బలవంతంగా ఖాళీ చేయించకూడదని స్పష్టం చేశారు. భూములు కోల్పోయిన నిర్వాసిత గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని, వెంటనే స్కిల్ డవలప్మెంట్ సెంటర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకుండా, నిర్వాసితుల హక్కులను అమలు చేయకుండా ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంటు భూమి పూజ నిర్వహించడం అన్యాయం, చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. వెంటనే నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. అప్పలరాజు, డి. వెంకన్న, ఆర్ శంకరరావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 15వ ఆర్థిక సంఘం పంచాయతీ నిధులతో లబ్బంగి గ్రామానికి సిసి రహదారి

**- సర్పంచ్ శాంతి కుమారి ఆదేశాలతో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీటీసీ నాగమణి, మాజీ సర్పంచ్ రఘునాథ్**

**చింతపల్లి , మార్చి 18 (మనసులో మాట) ప్రతినిధి :** చింతపల్లి :- 15వ ఆర్థిక సంఘం పంచాయతీ నిధులతో లంబసింగి పంచాయతీ పరిధిలోని లబ్బంగి గ్రామంలో నిర్మించ బోతున్న150 మీటర్ల సిసి రహదారి నిర్మాణాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని లంబసింగి ఎంపీటీసీ సభ్యురాలు రావుల నాగమణి, మాజీ సర్పంచ్ కొర్రా రఘునాథ్ లు అన్నారు. స్థానిక సర్పంచ్ శాంతికుమారి ఆదేశాల మేరకు ఆ రహదారి నిర్మాణ పనులకు మంగళవారం వారు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రహదారి సమస్య పరిష్కారానికి కృషి చేసే క్రమంలో భాగంగా 15వ ఆర్థిక సంఘం పంచాయతీ నిధులతో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ పనులను



త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని గుత్తేదారులకు వారు సూచించారు. అదే క్రమంలో ఈ సిసి రహదారి నిర్మాణాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిసా కమిటీ మండల కన్వీనర్ సరమండ వెంకట నాగరాజు, మాజీ ఎంపీటీసీ లు దేపూరు గిరిబాబు, రామ్మూర్తి, వార్డు మెంబర్ జనసేన మండల ఉపాధ్యక్షుడు చిన్ని రాజబాబు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, వైసిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మునగపాక వేప చెట్టుపై వెలసిన నూకాంబికను దర్శించుకుంటున్న భక్తులు

**మునగపాక , మార్చి 18 (మనసులో మాట) :** మండల కేంద్రం మునగపాక మల్ల వారి కల్లాల్లో వేప చెట్టుపై వెలసిన శ్రీ నూకంబిక అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్ల రామ జగన్నాథం ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలకుండా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. వేకుజం నుండే భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఉగాది రోజు కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవడానికి తరలి వస్తారని కమిటీ చైర్మన్ రామ్ జగన్నాథం



మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## నేడే ఎల్లారమ్మ జాతర



**అచ్యుతాపురం , మార్చి 18 (మనసులో మాట)** : ప్రఖ్యాత ఎల్లారమ్మ తల్లి జాతర అనకాపల్లి జిల్లా కొండకర్ల అందాలపల్లి గ్రామంలో వైభవంగా ఉగాది రోజున ప్రతి ఏటా జరుగుతుంది. ఈ జాతరకు జిల్లా నలుమూల నుండి కాక పక్క రాష్ట్రాల నుండి వలస వెళ్లినవారు కొత్త అమావాస్య మరుసటి రోజున ఇక్కడకు వచ్చి ముక్కులు తీర్చుకుంటారు పురగిరి క్షత్రియ వంశమునకు చెందిన ఎల్లా రామ భర్తతో పాటు సతీసహగమనం చేసింది గత నాలుగు వందల సంవత్సరాల క్రితం ఈ ఎల్లమ్మ భర్తతో పాటు సతీసహగమనం చేయడంతో ఎల్లమ్మ ఎల్లరమ్మగా ఈ జిల్లా ప్రాంత ప్రజలు ఆమెకు పసుపు కుంకుమ వస్త్రలతో భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు ఉగాది రోజున ఎల్లమ్మ పుట్ట వద్ద మహిళలు పురుషులు ప్రత్యేకంగా పూజిస్తారు ఉగాది రోజు ఉదయం నుండి పూజిస్తారు సాయంత్రం విద్యుత్ దీపాలు గ్రామాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు భజనలు తాడిపెద్ద సేవలు జానపద నృత్యాలు డాన్స్ బేబీ డాన్స్ లు బుర్రకథలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు బండ్ల వేషాలు ఏర్పాట్లు గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు చేశారు ప్రజలకు ఎటువంటి అవంబరణీయ సంఘటనలు జరగకుండా అచ్యుతాపురం పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు గ్రామమంతా పండుగ శోభతో కలకలలాడుతుంది ఈ మధ్య ఎల్లమ్మకు ఆలయం నిర్మించారు ఈ రెండు రోజులలో ప్రజలు వచ్చి అమ్మను దర్శించుకొని ముక్కులు తీర్చుకుంటారు ఈ ఎల్లారమ్మ ముక్కులు తీర్చే కల్పవల్లిగా ఆదరిస్తారు మొక్కులు తీరాక మరుసటి సంవత్సరం వచ్చి గరగలు తో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

## పెరటి కోళ్ల పెంపకం గిరిజనులకు లాభదాయకం



**రోలుగుంట , మార్చి 18 (మనసులో మాట)** : అనకాపల్లి జిల్లాలో ఎంపిక చేసిన గిరిజన గ్రామాల్లో పెరటి కోళ్ల యూనిట్ లు ను గిరిజనులకు పాడేరు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉచితంగా అందిస్తుంది. ఈ కార్యక్రమం ను 'హైఫర్ ' అనే ఒక స్వచ్ఛంద సంస్థ ,స్థానిక పంచాయతీ, పశు సంవర్ధక శాఖల సహకారంతో నిర్వహిస్తుంది. అందులో భాగంగా ఆసక్తి గల గిరిజన లబ్ధిదారులకు శరభవరంలో 'సీఫా ' అనే సంస్థ, పశు సంవర్ధక అధికారులు సహాయంతో శిక్షణా కార్యక్రమం నిర్వహించింది. పెరటి కోళ్ల యూనిట్ ద్వారా అందే ప్రయోజనాలును ఈ కార్యక్రమం లో దరఖాస్తుదారులు అందరికీ 'సీఫా సంస్థ ప్రతినిధి రామలక్ష్మి నిర్వహించారు. కార్యక్రమంనకు అధ్యక్షత వహించిన సర్పంచ్ పంచాద చంద్ర మాట్లాడుతూ మైదాన ప్రాంత గిరిజన లబ్ధిదారులకు పాడేరు ఐటిడిఎ నుండి కోళ్ల అందించడం ఆనందించాల్సిన విషయం అని ప్రభుత్వానికి, పాడేరు పి. ఓ.కి ధన్యవాదాలు తెలుపుతూ యూనిట్ లు త్వరితగతిన లబ్ధిదారులకు పంపిణీ చేయవలసిందిగా అధికారులను కోరారు. అనంతరం రైతులనుద్దేశించి మాట్లాడుతూ కోళ్ల పెంపకం సులభమైన ఆదాయర్జన విధానం అని అందరూ సమర్ధంగా వినియోగించుకొని కుటుంబాలు ఆర్థికంగా అభివృధి చెందాలని ఆకాంక్షించారు. తదుపరి కోళ్ల పెంపకంలో పోషణ, యాజమాన్య పద్ధతుల గురించి పశు వైద్యాధికారి డా. నూకేశ్వరరావు తెలియచేశారు. అనంతరం కోళ్ల కు వేయాల్సిన టీకాలు గురించి, పరాన్నజీవుల మందుల వాడకం , యాంటీ బయోటిక్ మందుల వాడకం గూర్చి బుచ్చంపేట పశు వైద్యాధికారి డా. దమయంతి తెలిపారు. స్థానిక పశుసంవర్ధక సహాయకులు సాయికృష్ణ , సిబ్బంది రాజేశ్వరి,రాజు, దివ్య ,శివ పెద్దలు నూకరాజు,45 మంది గిరిజన రైతులు పాల్గొన్నారు.

## జివిఎంసి 84 వ వార్డు కార్పొరేటర్ చినతల్లి నీలబాబు కు సత్కారం



**అనకాపల్లి ప్రతినిధి , మార్చి 18 (మనసులో మాట)** : జీవీఎంసీ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం 84 వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి నీలబాబు ను ఘనంగా సత్కరించారు. కౌన్సిల్ ఐదు సంవత్సరాల పదవీ కాలం ముగిసిన సందర్భంగా కార్పొరేటర్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 84 వ వార్డు కార్పొరేటర్ చినతల్లి నీలబాబు కు మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి ప్రధాన కమిషనర్ కేతన్ కార్గే సమక్షంలో శాసనసభ్యులు వంశీకృష్ణ యాదవ్ శాలువాతో చిన్న తల్లి నీలబాబు దంపతులను సత్కరించి మెమోంటోను అందజేశారు. ఈ కారక్రమంలో కార్పొరేటర్లు, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

## అవంతి ఇంజనీరింగ్ కళాశాల రజతోత్సవ వేడుకల్లో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం , మార్చి 18 (మనసులో మాట)** : మాకవరపాలెం మండలంలోని తామరం వద్ద గల అవంతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా హాజరై, నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2001 డిసెంబర్ 4న కేవలం 16 లక్షల రూపాయలతో 32 ఎకరాల స్థలంలో ప్రారంభమైన ఈ కళాశాల, నేడు వృక్షంలా ఎదిగి వేలాది మందికి విద్యాదానం చేస్తుండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నాడు తోట గోపాలకృష్ణ ద్వారా తనకు పరిచయమైన అవంతి శ్రీనివాసరావు, ఈ ప్రాంతంలో ఇంజనీరింగ్ కళాశాల స్థాపిస్తానని చెప్పినప్పుడు తాను పూర్తి సహాయ సహకారాలు అందించానని ఆయన గుర్తుచేసుకున్నారు. అప్పట్లో ఎకరా 50 వేలు ఉన్న భూమి విలువ నేడు 2 కోట్లకు చేరిందన్నారు. ఈ 25 ఏళ్ల ప్రయాణంలో 10,500 మంది విద్యార్థులు ఇక్కడ ఇంజనీరింగ్ పూర్తి చేయగా, వారిలో ఏకంగా 8,300 మంది ఉద్యోగాలు సాధించడం గర్వకారణమన్నారు. ప్రస్తుతం కళాశాలలో 2,491 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, 86 శాతం ఉత్తీర్ణత నమోదు కావడం అధ్యాపకుల అంకితభావానికి నిదర్శనమని స్పీకర్ కొనియాడారు. కళాశాలలో పనిచేస్తున్న 160 మంది టీచింగ్, 200 మంది నాన్-టీచింగ్ స్టాఫ్‌లో అత్యధికులు (వరుసగా 140, 190 మంది), అలాగే 25 బస్సుల డ్రైవర్లు, క్లీనర్లు సైతం స్థానికులే కావడం వల్ల ఈ ప్రాంత వాసులకు ప్రత్యక్షంగా, ఆటో డ్రైవర్ల




వంటి వారికి పరోక్షంగా ఎంతో ఉపాధి లభిస్తోందని ఆయన ప్రశంసించారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా నక్కపల్లి వద్ద ప్రారంభం కానున్న భారీ స్టీల్ ప్లాంట్ ద్వారా యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు రానున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధునిక కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందుతోందని, విద్యార్థులు దానిని సద్వినియోగం చేసుకోవాలే తప్ప డీప్‌ఫేక్‌ల వంటి వాటితో దుర్వినియోగం చేయకూడదని ఆయన హితవు పలికారు. ఈ వేడుకలో కళాశాల చైర్మన్ అవంతి శ్రీనివాసరావు, వైస్ ఛాన్సలర్ సుబ్బారావు, శ్రావణి షిప్పింగ్ సర్వీసెస్ అధినేత సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



## ఈపీఎఫ్ కనీస పింఛను రూ.9 వేలు ఇవ్వాలి

**- నెల్లిమర్ల జూట్ మిల్లు రిటైర్డ్ కార్మికుల గర్జన**

**నెల్లిమర్ల , మార్చి 18 (మనసులో మాట)** : తమ జీవితాంతం రెక్కలు ముక్కలు చేసుకుని దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచిన కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని నెల్లిమర్ల జూట్ మిల్లు రిటైర్డ్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నెల్లిమర్ల జ్యూట్ మిల్ వద్ద ఈపీఎఫ్ కనీస పింఛనును రూ. 9,000లకు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ కార్మికులు నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమంలో ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘం నాయకులు మొయిద పాపారావు, కిల్లంపల్లి రామారావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు గడుస్తున్నా, లక్షలాది మంది పెన్షనర్ల జీవితాలతో ముడిపడి ఉన్న కనీస పింఛను అంశంపై నోరు మెదపకపోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 80 లక్షల మంది ఈపీఎఫ్ పింఛనుదారులు ఉన్నారు. కేంద్ర ఈపీఎఫ్ ట్రస్ట్ వద్ద కార్మికులకు చెందిన సుమారు 10 లక్షల కోట్ల రూపాయల కార్పస్ ఫండ్ నిరుపయోగంగా ఉందని, ఈ నిధులు ఉన్నప్పటికీ పెన్షన్




పెంచకపోవడం అన్యాయమన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ గతంలోనే కనీస పింఛనును రూ. 7,500లకు పెంచాలని కేంద్ర కార్మిక శాఖకు సిఫార్సు చేసింది. ఆ సిఫార్సులను బుట్టదాఖలు చేయకుండా తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. "దేశంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎన్నిసార్లు గెలిస్తే అన్నిసార్లు పెన్షన్లు పొందుతున్నారు. కానీ, జీవితాంతం కష్టపడి తమ పింఛను కోసం నిధులు కేటాయించిన కార్మికులకు మాత్రం మొండిచేయి చూపుతున్నారని విమర్శించారు. కార్మికుల సొమ్మును కేంద్ర ప్రభుత్వం షేర్ మార్కెట్‌లో పెట్టి వ్యాపారం చేస్తోందని, ఇది ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. "ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ మాకు పెట్టే బిక్ష కాదు.. అది మా హక్కు!" అని కార్మిక నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొయిద తవిటి నాయుడు, పతివాడ సత్యం, ఆదినారాయణ మరియు పెద్ద సంఖ్యలో రిటైర్డ్ కార్మికులు పాల్గొన్నారు.

## మహిళలల భద్రత పరిరక్షణకే పోలీసు వ్యవస్థ : సబ్ ఇన్స్పెక్టర్ సురేష్

**డుంబ్రిగుడ , మార్చి 18 (మనసులో మాట)** : సమాజంలో మహిళల భద్రత, బాల, బాలికల పరిరక్షణకే పోలీసు వ్యవస్థ కట్టుబడి ఉందని ఎస్సై సురేష్ అన్నారు మండలంలోని నందివలన గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలికలు, మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, సేటు నో డ్రగ్స్ పై విద్యార్థినిలతో అవగాహన కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల స్థాయిలోనే క్రమశిక్షణ మెలిగి ఉన్నత చదువులకు ఆస్కారం చేసుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆయన



ఆకాంక్షించారు ఆ పాఠశాల యాజమాన్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఈ నెల 23న చలో విజయవాడ

### ఐఎఫ్టియు ఆధ్వర్యంలో డిసిఎల్ ఆఫీసు వద్ద ధర్నా

**కంచరపాలెం , మార్చి 18 (మనసులో మాట)** : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఈ నెల 23న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్ టియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం .వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం విజయనగరం డి సి ఎల్ ఆఫీసు వద్ద ఐఎఫ్ టియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ధర్నాకు ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు రొంగలి అప్పలరాజు అధ్యక్షత వహించగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐ యఫ్ టి యు జాతీయ కమిటీ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. 2014 లో అధికారం కొచ్చిన బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం కష్టజీవులపై కక్షగట్టి కార్మిక హక్కులను కాలు రాస్తుందని దుయ్య బట్టారు. సంఘటిత రంగంలో పనిచేసే కార్మికులను దెబ్బతీసే విధంగా లేబర్ కోడ్లు ఉన్నాయన్నారు. జూట్ రంగంలో పనిచేసే కార్మికులకు వేతనాల కుదింపు, ఇ యస్ ఐ, పి యఫ్, బోనస్, గ్రాడ్యుటీ, పెన్షన్ ల వర్తింపులో అనేక మార్పులు చేసి కార్మికులకు నష్టం




కలిగించి, యాజమాన్యాలకు లాభాలు చేకూర్చుతాయన్నారు. జ్యూట్ పరిశ్రమను జాతీయ పరిశ్రమగా, పర్యావరణ హితమైన పరిశ్రమగా గురించాలని, నార పండించే రైతులకు ప్రోత్సాహకాలు ఇచ్చి, పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి గీత మాట్లాడుతూ నెల్లిమర్ల జ్యూట్ మిల్లు కార్మికులకు పేరుకుపోయిన పి యఫ్, ఇ యస్ ఐ బకాయిలు చెల్లించే విధంగా ప్రభుత్వ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటో మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అరుణోదయ రాష్ట్ర నాయకులు బి. రామకృష్ణ, ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కాళ్ళ అప్పల సూరి, నెల్లిమర్ల జూట్ మిల్ కార్మిక సంఘం అధ్యక్షుడు నామాల తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి యం. అప్పలనాయుడు, ఇఫ్టూ జిల్లా కమిటి సభ్యుడు, అరబిందో ఫార్మా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సూర్యనారాయణ రాజు, తదితరులు ప్రసంగించారు.

## నర్సీపట్నంలో 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం , మార్చి 18 (మనసులో మాట)** : దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించే "దివ్యాంగ శక్తి" పథకాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. గత ఏడాది డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీని కేవలం మూడు నెలల్లోనే నెరవేర్చిందని, ఇది కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని కొనియాడారు. ఈ 'దివ్యాంగ శక్తి' పథకం ద్వారా 40 శాతం లేదా అంతకన్నా ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులందరికీ నేటి నుంచి ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం వర్తిస్తుందని ఆయన వివరించారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో నడిచే సిటీ ఆర్డినరీ బస్సులలో కూడా ఈ ఉచిత ప్రయాణం వర్తిస్తుందని తెలిపారు. అయితే నాన్-స్టాప్, సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, మరియు అంతర్రాష్ట్ర బస్సు






సర్వీసులలో మాత్రం ఇప్పటి వరకు ఉన్న 50 శాతం రాయితీ యధాతథంగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో సుమారు 11 లక్షల మంది దివ్యాం గులు ఉండగా, ప్రస్తుతం కేవలం 2 లక్షల మంది మాత్రమే ఆర్టీసీ పాస్ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారని, ఈ కొత్త ఉచిత ప్రయాణ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్పీకర్ కోరారు. ఉచిత రవాణా సదుపాయంతో పాటు దివ్యాంగుల కోసం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తోందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల 65 వేల 817 మంది దివ్యాంగులకు ప్రతి నెలా రూ. 6,000 చొప్పున పింఛను అందిస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం నెలకు రూ. 469 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. అంతేకాకుండా, ఉద్యోగాల్లో దివ్యాంగులకు ఉన్న 4 శాతం రిజర్వేషన్‌ను కూడా కూటమి ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డివిజన్ మేనేజర్ దీరజ్ , మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, టిడిపి పట్టణ కార్యదర్శి లాలం మురళీకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆదిలక్ష్మి, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ సూర్యచంద్ర, టిడిపి నాయకులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు..

## దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

**- నెల్లిమర్లలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి**

**నెల్లిమర్ల , మార్చి 18 (మనసులో మాట)** : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దివ్యాంగుల అభ్యున్నతికి, వారి ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తోందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి స్పష్టం చేశారు. బుధవారం నెల్లిమర్ల పట్టణంలోని రామతీర్థం జంక్షన్ వద్ద దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని ఆమె లాంఛనంగా ప్రారంభించారు. దివ్యాంగులు సమాజంలో ఎవరిపైనా ఆధారపడకుండా, గౌరవంగా జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే దివ్యాంగుల పింఛన్‌ను రూ. 2వేలు నుండి రూ. 6వేలు కు (రెండు రెట్లు) పెంచి, వారి ఆర్థిక భరోసాను ప్రభుత్వం చాటుకుందని ఆమె గుర్తు చేశారు. నిరుపేద దివ్యాంగులు వైద్యం, విద్య లేదా ఇతర





పనుల నిమిత్తం ప్రయాణించేటప్పుడు ఎదురయ్యే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ ఉచిత బస్సు ప్రయాణ పథకం ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. "దివ్యాంగుల కళ్లల్లో ఆనందం చూడటమే మా ప్రభుత్వ ఉద్దేశమన్నారు. వారి అవసరాలను గుర్తించి, అండగా నిలవడంలో నెల్లిమర్ల నియోజకవర్గం ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ రాజు, తహశీల్దార్ కె శ్రీకాంత్, మాజీ చైర్ పర్సన్ బంగారు సరోజిని, జనసేన నెల్లిమర్ల నగరపంచాయతీ అధ్యక్షులు రవ్వా నాని, యువజన విభాగం అధ్యక్షులు అప్పికొండ రవికుమార్, జనసేన నాయకులు చనమల్లు వెంకటరమణ, గంటా సత్యనారాయణ, అంబళ్ల అప్పలనాయుడు, యడ్ల గోవిందరావు, కరిమజ్జి గోవిందరావు, పతివాడ అచ్చింనాయుడు పాల్గొన్నారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన గ్యాస్ ధరలను రద్దు చేయాలి : ఏఐటియుసి డిమాండ్

**కంచరపాలెం , మార్చి 18 (మనసులో మాట)** : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన ఎల్ పి జి కమర్షియల్ గ్యాస్ ధరలను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి వామన మూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఇసుకతోట జంక్షన్ వద్ద అసంఘటిత కార్మికులు ధర్నా చేపట్టారు. నిరసనలో ఆయన మాట్లాడుతూ పేద, చిల్లర, చిన్న వ్యాపారులకు టీ, టిఫిన్ షాపులుకు హోటళ్లకు కమర్షియల్ గ్యాస్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్యాస్ ధర పెరగడంతో సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ జరుపుతున్న యుద్ధం ఆపకపోతే మన దేశంలో రానున్న రోజుల్లో డీజిల్, పెట్రోలు, వంటనూనె , నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెరిగి ప్రజలు కొనుగోలు శక్తి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు ప్రభుత్వ అధికారులు గృహ అవసర గ్యాస్ కొరతలేదని చెబుతున్నప్పుడు స్థానిక గ్యాస్ ఏజెన్సీల వద్ద రోజుల తరబడి ప్రజలు గ్యాస్ కోసం ఎందుకు పడిగాపులు




పడుతున్నారని ప్రశ్నించారు. జిల్లాలో గ్యాస్ ఏజెన్సీల అక్రమ నిలవలపై జిల్లా కలెక్టర్, పౌర సరఫరాల శాఖ అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. ప్రజా ప్రతినిధులు ఎల్పిజి కమర్షియల్ గ్యాస్ కొరతను నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఇరాన్ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ ఏకపక్షంగా చేస్తున్న యుద్ధాలను వెంటనే నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రావికృష్ణ, మక్కా రమణ, ఓ గోపి, గెడ్డం రాము, బి అప్పల రెడ్డి, నాగ సూరి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## మునగపాక శ్రీ నూకాలమ్మను దర్శించుకున్న బొడ్డేడ ప్రసాద్

**మునగపాక , మార్చి 18 (మనసులో మాట)** : అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం మునగపాక గ్రామంలో వెలసిన ఉన్న శ్రీ నూకాంబిక అమ్మవారిని కొత్త అమావాస్య సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నల్ల రామ జగన్నాథం, వైసీపీ నేతలు ఆడారి రమణబాబు, పెంటకోట జగన్నాథరావు, ఆడారి గోపి, ఆడారి



లక్ష్మణరావు పలువురు పెద్దలు పాల్గొన్నారుమరియు గ్రామ పెద్దలు,ముఖ్య నాయకులు, ఆలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

## బుచ్చింపేట గ్రామం నుంచి నవోదయలో చరిత్ర సృష్టించిన అభినవ్ శ్రీ



**రోలుగుంట , మార్చి 18 (మనసు లో మాట) :** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం బుచ్చింపేట గ్రామానికి చెందిన రెడ్డి అభినవ్ శ్రీ శ్రీ వివేకానందపబ్లిక్ స్కూల్ లో ఐదవతరగతూ చదువుతూ నవోదయ ప్రవేశ పరీక్షల్లో 92.5 శాతం మార్కులతో ఆరో తరగతికి ఉత్తీర్ణత సాధించాడు. గ్రామంనుంచి నవోదయ విద్యాలయానికి ఎంపికైన మొట్టమొదటి విద్యార్థిగా అతనివిజయం చరిత్రాత్మకం. ఈ గొప్ప సాఫల్యంపై స్కూల్ ప్రిన్సిపల్ అనిమిరెడ్డి లక్ష్మి, యాజమాన్యం,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రెడ్డి కృష్ణంరాజు (మాస్టర్)హేమలత (ప్రైవేట్ టీచర్) హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు, ప్రజలు, యువత కూడా అభినవ్ను అభినందిస్తూ మెరుగైన భవిష్యత్తుకు ఆశలు వ్యక్తం చేశారు. ఈ విజయం గ్రామీణ విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని అందరూ భావిస్తున్నారు.

## విద్యుత్ సౌకర్యం పునరుద్ధరణ



**డుంబ్రిగుడ , మార్చి 18 (మనసులో మాట) :** మండలంలో కంద్రం పంచాయితీ జాంకర గూడ గ్రామం నుంచి కురిడి పంచాయితీ గిడ్డిగూడ వరకు విద్యుత్ వైర్లను కొత్తగా ఏర్పాటుచేసి విద్యుత్ సౌకర్యంను పునరుద్ధరించినట్లు స్థానిక ఖంద్రం పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు కే హరి తెలిపారు. మంగళవారం జాకరగూడలో సందర్శించి కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రెండు గ్రామాలకు గత 15 ఏళ్ల క్రితం విద్యుత్ సౌకర్యం కల్పించిన విద్యుత్ వైర్లను కొంతమంది దుండగులు దొంగిలించారన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ , ఐటిడీపీఓకు విద్యుత్ వైర్లను అమర్చి పునరుద్ధరించాలని ఫిర్యాదు చేయడంతోస్పందించిన అధికారులు విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్తులు పాల్గొన్నారు.

## వృద్ధురాలు హత్య ఘటనలో నిందితునికి జీవిత ఖైదు



**కంచరపాలెం , మార్చి 18 (మనసులో మాట) :** వృద్ధురాలిని హత్య చేసి బంగారం, నగదు దోచుకెళ్ళిన ఘటనలో నిందితునికి న్యాయస్థానం మంగళవారం సాయంత్రం జీవిత ఖైదుతో పాటు రూ.35,000లు జరిమానా విధించింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ద్వారకా పోలీసు స్టేషన్ పరిధిలో 2015 సంవత్సరం 9వ నెల 11వ తేదీన రాత్రి సమయంలో వృద్ధురాలి నివాసంలో దుండగులు అక్రమంగా ప్రవేశించి, ఇంట్లో ఉన్న వృద్ధమహిళను దారుణంగా హత్య చేసి, అనంతరం ఆమె వద్ద ఉన్న ఒకటిన్నర తులాల బంగారు గొలుసు, బంగారు కమ్మలు, రూ. 10,000 నగదు దోచుకెళ్లారు. మరుసటి రోజు ఉదయం మృతురాలి కోడలు ద్వారక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా నిందితుల వేలి ముద్రల ఆధారంగా ఏ 1 జి రామ రాజు (25), ఏ 2 గా ఏ. రామ దాసు(22) లను గుర్తించారు. అయితే ఈ కేసులో ఏ2 దాసు ఇప్పటికే మరణించాడు. ఏ1 జి రామరాజును విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో విశాఖపట్నం ఫోర్త్ అడిషనల్ జిల్లా జడ్జ్, మహిళా కోర్టు జడ్జి వి. శ్రీనివాసరావు ముద్దాయి రామరాజుకు కఠిన కారాగార జీవిత ఖైదు, రూ.35,000 లు జరిమానా చెల్లించాలని తీర్పు వెలువరించారు.

## శృంగవరపుకోటలో ఘనంగా శ్రీ నూకంబిక అమ్మవారి జాతర మహోత్సవం

**శృంగవరపుకోట , మార్చి 18 (మనసులో మాట) :** స్థానిక శృంగవరపుకోట పట్టణంలో శ్రీ నూకంబిక అమ్మవారి జాతర మహోత్సవం వేడుకలు బుధవారం నాడు ఘనంగా జరిగాయి.. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త శ్రీ మల్ల గణేష్ గారు మాట్లాడుతూ శృంగవరపుకోట లో నేటికి 20 సంవత్సరాలుగా అమ్మవారి జాతర జరుపుతున్నామని ఇది 20వ వార్షికోత్సవం అని తెలిపారు... ఈరోజు శృంగవరపుకోట స్థానిక ప్రజలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ధూప దీప నైవేద్యాలు మరియు చీరసారె లతో అమ్మవారిని దర్శించుకున్నారు.... ప్రతి సంవత్సరం శ్రీ నూకాంబిక అమ్మ వారికి ఈ పర్వదినాన పండగ వేడుకలు ఘనంగా జరుగుతాయి..

ఉగాది పండగ గురించి మనసు లో మాట పత్రికలో ప్రత్యేక కథనం

# ఉగాది (యుగాది) తెలుగువారి నూతన సంవత్సర పండగ



**గూడెం / సీలేరు , మార్చి 18 (మనసులో మాట) :** ఉగాది (యుగాది) తెలుగువారి నూతన సంవత్సర పండగ చైత్ర శుద్ధ పాడ్యమి నాడు, బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించాడని, వసంత రుతువు ఆరంభమవుతుందని నమ్మకం. షడ్రుచుల (తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు) ఉగాది పచ్చడితో జీవితంలోని సంతోష, దుఃఖాలను సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని, కొత్త ఆశలను ఈ పండుగ తెస్తుంది.

**ఉగాది కథ - విశిష్టత:**

సృష్టి ఆరంభం: పురాణాల ప్రకారం, బ్రహ్మదేవుడు చైత్ర మాస శుక్లపక్ష పాడ్యమి రోజున ఈ సృష్టికి శ్రీకారం చుట్టాడు. అందుకే ఈ రోజును 'యుగంఆది' (ఉగాది) అని పిలుస్తారు, అంటే కొత్త యుగం లేదా సంవత్సరానికి ఆరంభం. శ్రీరాముడి పట్టాభిషేకం: సీతా రామాంజనేయులు వనవాసం ముగించుకుని అయోధ్యకు తిరుగు ప్రయాణమై రాముడు రాజ్యాభిషేకం చేసుకున్న రోజు కూడా ఉగాది పండుగ రోజే అని చెబుతారు, ఇది ధర్మం గెలిచిన శుభ దినం. వేదాల రక్షణ: మత్స్య పురాణం ప్రకారం, మహావిష్ణువు మత్స్యావతారంలో సోమకాసురుడిని వధించి వేదాలను రక్షించింది, సృష్టిని పునరుద్ధరించింది కూడా ఈ చైత్ర శుద్ధ పాడ్యమి నాడే. ఉగాది ఆచారాలు:

**ఉగాది పచ్చడి:** వేపపువ్వు (చేదు), మామిడికాయ (వగరు), బెల్లం (తీపి), చింతపండు (పులుపు), కారం, ఉప్పు కలపి చేసే ఈ పచ్చడి... జీవితంలోని కష్టసుఖాలు, అనుభూతుల సమ్మేళనానికి సంకేతం.

**వచ్చడి -తోరణాలు:** ఇంటిని శుభ్రం చేసి, మామిడి ఆకులు, వేప పూల తోరణాలు కడతారు. ఇది ఇంటికి శోభ, ఆరోగ్యాన్ని ఇస్తుంది.

**వంచాంగ శ్రవణం:** ఈ రోజున కొత్త వంచాంగం వినడం ద్వారా రాబోయే సంవత్సరం, కాలం, ముహూర్తాలు, గ్రహణాల గురించి తెలుసుకుంటారు. కొత్త బట్టలు & శుభకార్యాలు: కొత్త బట్టలు ధరించి, దేవుణ్ణి పూజించి, కొత్త పనులను ఈ రోజున ప్రారంభిస్తారు. ఉగాది అంటే పాత కష్టాలను మర్చిపోయి, కొత్త ఆశలతో, సంతోషంతో కొత్త జీవితాన్ని ప్రారంభించే ఒక పవిత్రమైన పండుగ.

## విశాఖ పోలీసుల సేవలను కొనియాడిన తెలంగాణ పోలీసులు



**కంచరపాలెం , మార్చి 18 (మనసులో మాట) :** తెలంగాణ రాష్ట్రంలో ఓ యువతి అదృశ్యమైన ఘటనను విశాఖ టూటౌన్ పోలీసులు చేదించారు. దీంతో విశాఖ పోలీసుల సేవలను తెలంగాణ పోలీసులు కొనియాడారు. వివరాల్లోకి వెళితే నిర్మల్ జిల్లా, ఖానాపూర్ అంబేద్కర్ కాలనీలోని నివాసముంటున్న చిట్యాల శ్రావణి (26) ఫిబ్రవరి 14న షాపింగ్ కు వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు చుట్టు ప్రక్కల గాలించిన ఫలితం లేకపోవడంతో ఖానాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. శ్రావణి విశాఖ జిల్లాలో ఉన్నట్టు అనుమానపడ్డ పోలీసులు మూడు రోజుల క్రితం ఇక్కడకు చేరుకున్నప్పటికీ ఏ ప్రాంతంలోని ఉందో తెలియలేదు. ఈ నేపథ్యంలో టూటౌన్ సీఐ వీవీసీఎం ఆధ్వర్యంలో పోలీసులు మానవ, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా డాబాగార్డెన్స్ లోని ఉన్నట్టు గుర్తించారు. మంగళవారం సీఐ సూచనల మేరకు తెలంగాణ పోలీసులు, టూటౌన్ కానిస్టేబుల్ నారాయణరావు రెండు బృందాలుగా ఏర్పడి శ్రావణి ఆచూకీ కనుగోన్నారు. అనంతరం సీఐ ఎర్రం నాయుడు కౌన్సిలింగ్ లో శ్రావణి ఓ యువకుడిని ప్రేమ వివాహం చేసుకొని ఇక్కడకు స్థిరపడడానికి వచ్చినట్టు తెలుసుకున్నారు. పిల్లల పెళ్లిళ్ల విషయంలో తల్లిదండ్రులు వారి అభిప్రాయాలకు, ఇష్టాలకు ప్రాధాన్యత ఇస్తూ, వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించాలని సీఐ సూచించారు. ఈ సందర్భంగా సిపి శంఖబ్రత బాగ్చి, డీసీపీ విజయ్ మణికంఠ, ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి సీఐ, కానిస్టేబుల్ లను అభినందించారు. కుమార్తెను అప్పగించిన పోలీసులకు యువతి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## అర్బన్ లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలాలు ఇవ్వాలి..ఈ నెల 24న జరిగే ధర్నా పోస్టర్ ఆవిష్కరణ : సిపిఐ



**కంచరపాలెం , మార్చి 18 (మనసులో మాట) :** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు అర్బన్ లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలాలు ఇల్లు నిర్మాణం కోసం ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహ్మాన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పోస్టల్ రిలీజ్ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, అప్పటిదాకా అద్దె ఇంటిలో ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం అద్దె చెల్లించాలని కోరారు. జిల్లాలో ఉన్న టిడ్కో ఇల్లుకు మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందజేసి ఇల్లుకు బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేద ప్రజలకు వృద్ధప్య పెన్షన్, కొత్త రేషన్ కార్డులు, వితంతు పెన్షన్లు, వికలాంగుల పెన్షన్లు, మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే ఇంటి అద్దెలు, కరెంటు చార్జీలు, నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి బ్రతుకు జీవనం గడవక నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఈనెల 24న రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అన్ని సచివాలయం ముందు నిరసన కార్యక్రమాలు జరపనున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిలు కసిరెడ్డి. సత్యనారాయణ, పాత్రిపల్లి. చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు మరుపల్లి పైడ్రాజు సీఎన్ క్షేత్రపాలు ఆర్. శ్రీనివాసరావు ఎన్. నాగభూషణ్ రావు, ఏ.దేవుడమ్మ సిహెచ్. కాసుబాబు,జే.అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం కార్యక్రమంలో టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి



**చింతపల్లి , మార్చి 18 (మనసులో మాట) ప్రతినిధి :** కూటమి ప్రభుత్వం రైతన్నకు అండగా నిలుస్తుందని అందుకే ఇచ్చిన మాట ప్రకారం వారికి ఆర్థిక సహకారం అందించిందని పాడేరు మాజీ శాసన సభ్యురాలు, టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. మండలంలోని చౌడు పల్లి పంచాయతీ చవటపాడు గ్రామంలో "రైతన్నా మీకోసం" వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ మూడో విడత పిఎం కిసాన్ 22వ విడత ఆర్థిక సాయం అందిన రైతుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 18 నెలల కాలంలో 20వేల రూపాయలు వారి ఖాతాలోకి జమ చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ గిరిజన రైతుల కోసం ప్రభుత్వం ఏ మాదిరిగా పని చేస్తుందనే అంశంపై వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అన్నారు. రైతుల కోసం నిరంతరం ఆలోచన చేస్తూ ఉంటారని పేర్కొన్నారు. గిరిజన ప్రాంత రైతులు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతో ప్రపంచవ్యాప్తంగా అరకు కాఫీ ని ప్రమోట్ చేస్తున్నారన్నారు. అరకు కాఫీకి డిమాండ్ పెరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. దీంతో పాటు అన్ని వ్యవసాయ ఉత్పత్తుల్లో సేంద్రీయ పద్ధతుల్లో పండించే గిరిజన ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ పెరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు బొర్ర విజయ రాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పెదిరెడ్ల బేతాళుడు, సేవ ఈశరమ్మ, అరకు పార్లమెంటు సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గోసరెడ్డి సోమేశ్వరరావు, చౌడుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు మధు, టీఎన్ఎస్ఎఫ్ లోకేష్, నాగమ నాయుడు, టిడిపి సీనియర్ నాయకుడు గొల్లోరి మంగు, మండల వ్యవసాయ అధికారి మధుసూదన్, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియమకాల చట్టం చేయాలి : ఆదివాసీ జెఏసీ



**గూడెం / సీలేరు , మార్చి 18 (మనసులో మాట) :** షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యో నియమకాల చట్టం చేయాలని ఏప్రిల్ 3 న పాడేరులో జరిగే ఆదివాసీ సత్య గ్రహ యాత్ర భారీ ర్యాలీని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి అల్లూరి సీతరామరాజు జిల్లా చైర్మన్ రామరావుదొర పిలుపునిచ్చారు. మండలంలోని దొడ్డవరం గ్రామం నుంచి ఆదివాసి సత్యాగ్రహ యాత్రను ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో రామరావు దొర మాట్లాడుతూ సత్య గ్రహయాత్ర ఈ రోజుతో 128వ రోజుకు చేరుకుందని, రాష్ట్రంలో అనేక గ్రామాలను పర్యటిస్తూ, షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకల చట్టం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం చేయడం కోసం ఆదివాసి ప్రాంత ఉద్యోగాలన్నీ స్థానిక ఆదివాసీలకే కల్పించేలా చట్టం చేస్తామని పలు సందర్భాల్లో ఆదివాసి ప్రాంతాల పర్యటన లో హామీ ఇచ్చి ఇప్పుడు మరిచిపోయారన్నారు. 2025 ఆగస్టు 9 న పాడేరు లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చినప్పుడు ఈ చట్టం చేస్తామని ఆదివాసి జేఏసీ కి, ఆదివాసులకు హామీ ఇచ్చారన్నారు. షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చేసేంతవరకు ఆదివాసులందరూ ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఈ చట్టం చేయడం ఆదివాసులకు చారిత్రక అవసరమే కాదు కూటమి ప్రభుత్వం యొక్క గురుతర బాధ్యత కూడా అని రామారావు దొర అన్నారు. అలాగే ఏజెన్సీ చట్టాలు రాజ్యాంగ పరిధులు పరిగణలోకి తీసుకొని షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం కూర్పు లో స్టేట్ కేడర్ పోస్టులలో 30శాతం, జోనల్ కేడర్ పోస్టుల లో 50శాతం, లోకల్ కేడర్ పోస్టులన్నిటిని స్థానిక ఆదివాసీలతో భర్తీ చేసే విధంగా సమగ్రమైన చట్టం చేయాలని పలుదఫాలుగా ప్రభుత్వం తో జరిపిన చర్చలలో ఆదివాసి జేఏసీ స్పష్టం చేసింది, ఇప్పటికైనా షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చేయకపోతే, గౌరవ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా మరో మారు ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరగనుందని ఆదివాసి జేఏసీ హెచ్చరిస్తుంది. కావున కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకుంటే , షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం చేయకపోతే ఆదివాసి జేఏసీ ఉద్యమాలు తీవ్రతరం చేసి ప్రభుత్వనికి డిమాండ్ చేస్తామని హెచ్చరించారు. ఆదివాసీ జెఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు మాట్లాడుతూ జిఓ నెంబర్ 3 రద్దు చేయడంతో ఆదివాసీలకు తీవ్ర నష్టం జరిగిందని, గిరిజన సలహా మండలి (టిఎసి)ద్వారా షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ చట్టాలైనా భూబదాలయింపు నిషేధ చట్టం,పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం, ఎస్సి,ఎస్టీ అట్రాసిటీ చట్టాలను సక్రమంగా అమలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ నాయకులు నర్సి పాపారావు, మాకాడ బూరుగులయ్య, సురబోయిన అశోక్ లాల్, వంజరి శంకురమ్మ, జేఏసీ మీడియా ప్రతినిధి మరియు గిరిజన విద్యార్థి సంఘం డివిజన్ అధ్యక్షుడు మణుగూరు బాబుజీ, పార్థసారథి, స్వామి ,మడపల వెంకటేష్, కాకూరి లక్ష్మణ్, జలుమూరి శ్రీను,సాగిన కొండమ్మ మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంప, గంగవరం, రేవళ్ళు, కొయ్యూరు, చింతలపాలెం, రాజేంద్రపాలెం తో పాటు వివిధ గ్రామాలకు ఆదివాసి సత్యాగ్రహ యాత్ర రథం వెళ్లి ఏప్రిల్ 3 వ తారీకున పాడేరులో జరిగే ర్యాలీ విజయవంతం చేయాలని ప్రచారం చేసారు.

## గంజాయి అక్రమ రవాణా మరియు నిల్వలపై ప్రత్యేక దృష్టి

- గంజాయి వంటి మాదక ద్రవ్యాల నిర్మూలన పై అవగాహన కార్యక్రమం
- జికే విధి సీఐ, ఎస్సై, కొయ్యూరు సీఐ,ఎస్ఐ,మంప ఎస్ఐల ఆధ్వర్యంలో



**గూడెం/ సీలేరు , మార్చి 18 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి చింతపల్లి డివిజన్ అదనపు ఎస్పి ఆదేశాలు మేరకు జి కే వీది సిఐ సుధాకర్, ఎస్సై సురేష్ బాబు, కొయ్యూరు సీఐ కొయ్యూరు ఎస్సై.మంప ఎస్సై, సమీక్షంలో ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగంగా ఈ రోజు అల్లూరి సీతారామరాజు జిల్లా, కొయ్యూరు మండలం, బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని కన్నవరం మరియు అన్నవరం గ్రామాలలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ కట్టుదిట్టంగా నిర్వహించ బడింది. ఈ ఆపరేషన్ లో లా పోలీస్ సిబ్బంది పాల్గొని గ్రామంలోని ప్రతి ఇంటిని, ప్రతి మూలను సూక్ష్మంగా తనిఖీ చేశారు. గంజాయి అక్రమ రవాణా మరియు నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్రంగా చెక్ చేయడం జరిగింది. అదేవిధంగా గ్రామంలో వాహనాల రికార్డులను పరిశీలించి, ఎన్యూమరేషన్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించబడలేదు. అయినప్పటికీ, అక్రమ కార్యకలాపాలపై పోలీసులు ఎప్పటి కప్పుడు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరిస్తున్నారు. గంజాయి సాగు, నిల్వ, రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలా పాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయి. ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలలో పాల్గొంటే వారిని ఏ పరిస్థితుల్లోనూ విడిచిపెట్టబోమని స్పష్టం చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, తమ పరిసరాల్లో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. పోలీసులు ప్రజల భద్రత కోసం నిరంతరం అప్రమత్తంగా ఉన్నారు.అని తెలిపారు

## స్టీల్ ప్లాంటు శంఖుస్థాపన కు రావాలంటూ తెలుగు మహిళలు ప్రచారం



**ఎన్. రాయవరం , మార్చి 18 (మనసులో మాట) :** ఈ నెల 23 వ తెదీన నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు కానున్న స్టీల్ ప్లాంటు శంఖుస్థాపన కార్యక్రమం లో పాల్గొనాలనికోరుతూ బుధవారం ఎన్. రాయవరం గ్రామంలో స్థానిక తెలుగుమహిళలు కరపత్రాలు తోఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, రాష్ట్ర, కేంద్రమంత్రులు, ప్రముఖులు పాల్గొనే ఈకార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తూ కరపత్రాలు పంపిణీచేసారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో ఈప్రాంతంఅభివృద్ది చెందటంతోపాటు ఉపాధిఅవకాశాలు మెరుగుపడ్తాయని, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సహకారంతో ఈప్రోజెక్ట్ ఏర్పాటు జరుగుతుందంటూ గ్రామస్తులుకు వివరించారు. ఈ కార్యక్రమంలో కొమ్మిరెడ్డినాగలక్ష్మి, దుబాసిజ్యోతి తదితరులుపాల్గొన్నారు.

## ఆటో - బైక్ ఢీ వృద్ధురాలు మృతి, మరో యువకునికి తీవ్ర గాయాలు



**రావికమతం , మార్చి 18 (మనసులో మాట) :** ఆటో, బైక్ ఢీ కొన్న ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందగా మరో యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. మండలం లో కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకున్న ప్రమాదంలో . రోలుగుంట మండలం బలిజి పాలెం గ్రామానికి కంట్రెడ్డి దేముళ్ళమ్మ (65) మృతి చెందగా, రావికమతం మండలం వమ్మవరం గ్రామానికి చెందిన పందురు ప్రశాంత్ కు తీవ్ర గాయాలయ్యాయి.

కొత్తకోట నుంచి రోలుగుంట మండలం బలిసిపాలెం వెళుతున్న ఆటో ఎదురుగా రావికమతం మండలం వమ్మవరం నుంచి వస్తున్న బైక్ కొత్తకోట సమీపంలో ఢీకొన్నాయి. ఈ ఘటన లో ఆటో లో ఉన్న దేముళ్ళమ్మ కు తీవ్ర గాయం కాగా, ప్రశాంత్ కు ముఖం పై తీవ్ర గాయాలు అయ్యాయి. ఇద్దర్ని కొత్తకోట పిహెచ్సీ తరలించి ప్రథమ శికిత్స అందించారు. అనంతరం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి కి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడం తో దేవుళ్ళమ్మ మృతి చెందింది. ప్రశాంత్ ను మెరుగైన శికిత్స నిమిత్తం విశాఖ కెజిహెచ్ కు తరలించారు. సమాచారం అందుకున్న కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతి రాలు దేముళ్ళమ్మ కు నలుగురు కుమార్తెలు ఉన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు
గురువారం 19 మార్చి 2026


# ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా పొగాకు రైతుల సమస్యను..



## కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పియూష్ గోయల్ దృష్టికి తీసుకువెళ్ళిన ఎంపీ పురంధరేశ్వరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఫ్లూ-క్యూర్డ్ వెర్జీనియా (ఎఫ్సీవీ) పొగాకు రైతుల సమస్యలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, గౌరవ కేంద్ర వాణిజ్య- పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ దృష్టికి రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి తీసుకువెళ్ళారు. రూల్ 31డీ కింద జీఎస్టీ విలువ నిర్ణయంపై స్పష్టత, అలాగే పొగాకు ఉత్పత్తులపై పన్నుల పునరావృత ప్రభావాన్ని నివారించాలని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. దేశీయ సిగరెట్ పరిశ్రమపై మాత్రమే కాకుండా, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలోని ఫ్లూ-క్యూర్డ్ వెర్జీనియా (ఎఫ్సీవీ) పొగాకు రైతులపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతోందని ఎంపీ కేంద్ర మంత్రులకు వివరించారు. ఇటీవల పన్ను విధానంలో జరిగిన మార్పుల నేపథ్యంలో, పొగాకు ఉత్పత్తులపై రిటైల్ సేల్ ప్రైస్ (ఆర్ఎస్పీ) ఆధారిత పన్ను విధానం అమలులోకి వచ్చిందని, ఇందులో తయారీదారులు రిటైల్ ప్యాకేజీలపై ముద్రించిన ధర ఆధారంగా (రూల్ 31డీ ప్రకారం రాయితీతో) జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ విధానంలో లావాదేవీ విలువ కంటే ప్రకటించిన రిటైల్ ధరనే పన్ను విలువగా పరిగణిస్తున్నారని చెప్పారు. ఈ విధానంలో ఎలాంటి సర్దుబాటు వ్యవస్థ లేకపోతే, డిస్ట్రిబ్యూటర్లు, రిటైలర్లకు లభించే ట్రేడ్ మార్జిన్లపై మొదటి దశలోనే జీఎస్టీ విధించబడుతూ పన్నుల పునరావృత ప్రభావం ఏర్పడే అవకాశం ఉందన్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం సీజీఎస్టీ రూల్స్‌లో రూల్ 31డీ ను ప్రవేశపెట్టి, జీఎస్టీ భాగంపై రాయితీ కల్పించిందన్నారు.

అయితే, రూల్ 31డీ ప్రకారం కేవలం జీఎస్టీ భాగానికే రాయితీ ఇవ్వబడుతుంది.. కానీ ప్రస్తుతం రిటైల్ ధరలో భాగమైన సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ మరియు నేషనల్ కాలమిటీ కంటింజెంట్ డ్యూటీ అంశాలను పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. ఈ కారణంగా ఇప్పటికే ఎక్సైజ్ ఎన్సీసీడీ కలిగిన విలువపై మళ్లీ జీఎస్టీ విధించబడుతూ "పన్నుపై పన్ను" పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు. సీజీఎస్టీ చట్టం, 2017లోని సెక్షన్ 15(1) ప్రకారం, జీఎస్టీ చట్టాల కింద విధించిన పన్నులు విలువ నిర్ణయంలో నుంచి తప్పించబడాలని, ఇది పన్నుల పునరావృతాన్ని తొలగించడం అనే జీఎస్టీ ప్రధాన లక్ష్యానికి అనుగుణంగా ఉంటుందని కేంద్ర మంత్రులకు ఎంపీ తెలిపారు. ప్రస్తుత విధానం ఈ ప్రాథమిక సూత్రానికి విరుద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. ఈ సమస్యకు విస్తృత ఆర్థిక ప్రభావాలు కూడా ఉన్నాయని, పన్నుల పొరల ప్రభావంతో చట్టబద్ధంగా తయారు చేసే సిగరెట్ల రిటైల్ ధరలు గణనీయంగా పెరిగాయని, ఇదే సమయంలో భారతదేశం ప్రపంచంలోని అక్రమ సిగరెట్ మార్కెట్‌లో సుమారు 26 శాతం వాటాను కలిగి ఉందన్నారు. అక్రమ సిగరెట్లు అన్ని పన్నులను తప్పించుకుని చట్టబద్ధ ఉత్పత్తులతో పోలిస్తే సుమారు 75 శాతం తక్కువ ధరలకు లభిస్తున్నాయన్నారు. దీని వల్ల వినియోగదారులు అక్రమ ఉత్పత్తుల వైపు మళ్లే ప్రమాదం ఉంది, ఇది ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించడమే కాకుండా చట్టబద్ధ రంగాన్ని బలహీనపరుస్తోందని తెలిపారు. చట్టబద్ధ సిగరెట్ మార్కెట్ తగ్గిపోవడం వల్ల దేశీయంగా ఉత్పత్తి అయ్యే ఎఫ్సీవీ పొగాకు కొనుగోలు కూడా తగ్గిపోతుందని, ఇది నేరుగా పొగాకు రైతులపై ప్రభావం చూపుతుందని కేంద్ర మంత్రులకు ఇచ్చిన వినతి పత్రాలలో ఎంపీ పురంధరేశ్వరి తెలిపారు. ఇటీవలి కర్ణాటక పొగాకు వేలాల్లో కొన్ని గ్రేడ్‌ల ధరలు కిలోకు సుమారు రూ.40 వరకు పడిపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు.

ఇంకా అంతర్జాతీయ స్థాయిలో షిప్పింగ్ మార్గాల్లో అంతరాయాలు, లాజిస్టిక్స్ ఖర్చుల పెరుగుదల వంటి సమస్యలు ఎగుమతుల పోటీ సామర్థ్యాన్ని తగ్గిస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో జింబాబ్వే, బ్రెజిల్ వంటి దేశాలకు అంతర్జాతీయ కొనుగోలుదారులు మళ్లే అవకాశం ఉందన్నారు. దేశీయ పన్ను ఒత్తిడి, అంతర్జాతీయ మార్కెట్ సవాళ్ల కలయిక ఎఫ్సీవీ పొగాకు రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోందని, ఈ రంగం లక్షలాది గ్రామీణ కుటుంబాల జీవనాధారంగా ఉందని..అకాగే దీని స్థిరత్వం చట్టబద్ధ సిగరెట్ పరిశ్రమపై ఆధారపడి ఉందని ఎంపీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రూల్ 31డీ, సంబంధిత విలువ నిర్ణయ విధానాలను పునఃపరిశీలించి, పన్నుల పునరావృత ప్రభావాన్ని పూర్తిగా తొలగించేలా అవసరమైన స్పష్టత లేదా సవరణలు చేయవలసిందిగా ఎంపీ పురంధరేశ్వరి కోరారు. ఈ చర్య జీఎస్టీ యొక్క విలువ ఆధారిత పన్ను లక్ష్యాన్ని బలపరచడమే కాకుండా, ప్రభుత్వ ఆదాయాన్ని రక్షించడం, అక్రమ వ్యాపారాన్ని నియంత్రించడం, పొగాకు రైతుల జీవనోపాధిని కాపాడడం వంటి ప్రయోజనాలను అందిస్తుందన్నారు. ఈ విషయాన్ని సమగ్రంగా పరిశీలించాలని ఎంపీ పురంధరేశ్వరి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ ని కోరారు.





## జగన్ ను కలిసిన మాజీ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి

**మండపేట (మనసులో మాట ) మార్చి 18..** మాజీ ముఖ్య మంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని మండపేట పురపాలక సంఘం మాజీ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి బుధవారం కలిశారు. తాడేపల్లి లోని జగన్ నివాసం లో ఆమె ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె భర్త పతీవాడ రమణ, ఓం జ్యువెలరీ అధినేత కొమ్ము రాంబాబు లతో కలిసి జగన్ తో భేటీ అయ్యారు. మంగళ వారం తో చైర్ పర్సన్ పదవి కాలం ముగిసింది. ఈ నేపథ్యంలో అధినేత జగన్ ను కలవడం ప్రాధాన్యత ను సంతరించుకుంది. ఈ సందర్భంగా మండపేట నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి ఆయన అడిగి తెలుసుకున్నారు. తనకు అవకాశం ఇచ్చినందుకు జగన్ కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి కంచుకోట గా ఉన్న మండపేట మున్సిపాల్టీ లో తాము పోటీ చేసి గెలుపొందినట్లు వివరించారు. జగన్ వలనే తను చైర్ పర్సన్ అయ్యాయని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జగన్ వారితో మాట్లాడుతూ పార్టీ అవకాశాలు ఇస్తుందని పేర్కొన్నారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన ను అడ్డుకొని ప్రజల పక్షాన పనిచేయాలని చెప్పారు. తన ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని జగన్ అన్నారని రాణి స్థానిక మీడియా కు తెలిపారు.

## భారత సైన్యంలో అగ్ని వీర్ రిక్రూట్మెంట్

- ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోండి...
- కాకినాడ జిల్లా కలెక్టర్ సన్మోహన్ సగిలి



**కాకినాడ (మనసులో మాట) మార్చి 18..** భారత సైన్యంలో అగ్నివీర్ రిక్రూట్మెంట్ కు సంబంధించి 10వ తరగతి ఉత్తీర్ణత చెందిన వారు అగ్నివీర్ సాధారణ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్ మరియు 8వ తరగతి చెందిన వారికి అగ్నివీర్ ట్రేడ్ మెన్ ఉద్యోగాలలో ప్రవేశానికి నోటిఫికేషన్ జారీ అయ్యిందని ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత నోటిఫికేషన్ లో పేర్కొన్న విధంగా ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి 2026 ఏప్రిల్ 1వ తేదీ లోపు www.joinindianarmy.nic.in వెబ్సైట్ లో అర్హులైన అభ్యర్థులు ఆన్లైన్ సెలెక్షన్ టెస్ట్ కు హాజరు కావచ్చున్నారు. ఈ రిక్రూట్మెంట్ కు సంబంధించి రెండు దశలు నిర్వహించబడతాయని మొదటి దశలో 2026 జూన్ 1 నుంచి 2026 జూన్ 15 వరకు రాష్ట్రంలో ఆయా ప్రాంతాల్లో ఆన్లైన్ కంప్యూటర్ ఆధారిత వ్రాత పరీక్ష నిర్వహిస్తారన్నారు. రెండవ దశలో మొదటి దశలో ఎంపికైన అభ్యర్థులకు ఆయా తేదీలలో రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు.

## శ్యామలాంబ ఆలయానికి ఆదిరెడ్డి కుటుంబం రూ.లక్ష విరాళం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** స్థానిక గీత అప్సర థియేటర్ సమీపంలోని శ్రీ శ్రీ శ్రీ శ్యామలాంబ దేవి దేవస్థానానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు లక్ష రూపాయల విరాళాన్ని బుధవారం సాయంత్రం ఆలయ చైర్మన్ కడియాల వీరభద్రరావుకు అందజేశారు. శ్రీశ్రీశ్రీ శ్యామలాంబా దేవి ఉగాది మహోత్సవాలలో భాగంగా బుధవారం కొత్త అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలిత ఆదిరెడ్డి కుటుంబానికి ఆలయ అర్చకులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని దంపతులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి ఆదిరెడ్డి కుటుంబం విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు, కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కొయ్యల రమణ, ఆలయ కార్యనిర్వాహణాధికారి జే వెంకటేశ్వరరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కడియాల వీరభద్రరావు, ధర్మకర్తల మండలి సభ్యులు అల్లాడ వెంకట అప్పారావు, బోను ఈశ్వరి, మల్లపు రెడ్డి వరలక్ష్మి , కురగంటి త్రినాథ్, కెల్లా జయలక్ష్మి, తాడివలస వెంకటలక్ష్మి, అండలూరి చంద్రశేఖర్, తొర్లపాటి శాలిని, కారుమూరి సురేష్, ఎక్స్ అఫీషియో మెంబర్ మాదిరెడ్డి పద్మావతి హాజరయ్యారు.

## దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

### - రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

-హుకుంపేట నుంచి కడియం వరకు తిరిగి రాజమండ్రి ఎంపీడీఓ కార్యాలయం వరకు బస్సులో ప్రయాణం చేసిన ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం 'దివ్యాంగ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభం





**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని దివ్యాంగులు అన్ని రంగాలలోనూ రాణించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆకాంక్షించారు. బుధవారం స్థానిక రూరల్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద 'దివ్యాంగ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 11 లక్షల మందికి మేలు చేకూరుతుందన్నారు.

దివ్యాంగులకు ఆర్థిక భద్రత, స్వావలంబన, గౌరవప్రదమైన జీవనం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పింఛన్లు, సహాయక పరికరాలు, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సేవలను విస్తృతంగా అందిస్తోందన్నారు. గత ప్రభుత్వాల కంటే మిన్నగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3 వేల నుండి రూ.6 వేలకు పెంచిందని గుర్తు చేశారు. దివ్యాంగులు ఎదుర్కొనే అడ్డంకులను తొలగించి, వారికి అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. హుకుంపేట నుండి కడియం వరకు, అక్కడి నుండి తిరిగి రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీఓ కార్యాలయం వరకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి దివ్యాంగులతో కలసి బస్సులో ప్రయాణించి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రయాణ సందర్భంగా దివ్యాంగులతో సన్నిహితంగా మమేకమై ప్రభుత్వ పథకాల అమలుపై ప్రత్యక్షంగా వివరాలు తెలుసుకుంటూ, వారికి అందుతున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దివ్యాంగులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి సాయిరాం, ఎంపీడీఓ కేవస్ ఆర్మ్ స్ట్రాంగ్, ఎంఆర్ఓ కే శ్రీనివాస్, కడియం ఎంపీడీఓ రమేష్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ ఎం ప్రసాద్, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జి పద్మావతి, కుమ్మరి శాలి డైరెక్టర్ పందూరి అప్పారావు, ఏఎంసీ మార్ని వాసుదేవరావు, వెలుగుబంటి రఘురామ్, పిన్నమరెడ్డి ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి

### - కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** "దివ్యాంగ శక్తి" పథకం కింద దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని స్థానిక హైటెక్ బస్టాండ్ వద్ద జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంబాల చెరువు నుండి జిల్లా కలెక్టరేట్ వరకు రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి , కలెక్టర్ కీర్తి చేకూరి లు దివ్యాంగులతో కలసి బస్సులో ప్రయాణించి వారికి ఉత్సాహం నింపారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరులు దివ్యాంగులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. అధికారులు దివ్యాంగులతో ఆత్మీయంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ.. దివ్యాంగుల ప్రయాణాన్ని సులభతరం చేస్తూ వారిలో ఆత్మ విశ్వాసం నింపేలా ప్రభుత్వం 'దివ్యాంగ శక్తి' పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా దివ్యాంగులు ఐదు రకాల ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. వీటిలో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయన్నారు. జిల్లాలో మొత్తం 21 కేటగిరీల్లో వైకల్యం ఉన్న దాదాపు 40 వేల మంది దివ్యాంగులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరు తుందన్నారు. విద్య, వైద్యం, స్వయం ఉపాధి, ఉద్యోగావకాశాలు తదితర అన్ని రంగాల్లో దివ్యాంగులు ఆత్మనిర్భరులుగా ఎదగడానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమాలు వారిలో నమ్మకం, ఉత్సాహం, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలనే ధైర్యాన్ని పెంపొందిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి గతంలో ప్రకటించిన 7 పథకాలలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణాన్ని "దివ్యాంగ శక్తి" ద్వారా అమలు చేస్తున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం మానవీయ దృక్పథంతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, డీఆర్ఓ టీ సీతారామమూర్తి, జిల్లా ప్రజా రవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి, ఏఓ మహమ్మద్ అలీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఇకపై ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం




**తణుకు (మనసులో మాట)మార్చి 18..** రాష్ట్రంలో రవాణా సంస్థ ఆధ్వర్యంలో "దివ్యాంగ శక్తి పథకం" ప్రారంభం కాగా, ఈ కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులతో తణుకు నియోజకవర్గ శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ తణుకు పట్టణంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంక్షేమంతో పాటు సౌకర్యవంతమైన రవాణా సేవలు అందజేయడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని, ఇచ్చిన మాట ప్రకారం హామీ నెరవేర్చినట్లు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే రాధాకృష్ణ క్యాంపు కార్యాలయం నందు దివ్యాంగులకు ఆహారం ఏర్పాటు చేసి వారందరికీ వడ్డించడంతో వారు ఆనందం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మండలాల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగశక్తి ని ప్రారంభించిన మంత్రి కందుల



**నిడదవోలు (మనసులో మాట) మార్చి 18..** దివ్యాంగుల ప్రయాణాన్ని సులభతరం చేస్తూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "దివ్యాంగ శక్తి" ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని నిడదవోలు పట్టణంలోని 'ఐ లవ్ నిడదవోలు' సెంటర్ వద్ద మంత్రి కందుల దుర్గేష్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల మాట్లాడుతూ, ఏపీ డి ఏ చట్టం 2016 ప్రకారం గుర్తింపు పొందిన 21 రకాల దివ్యాంగుల్లో 40% లేదా అంతకంటే ఎక్కువ వికలాంగత్వం ఉన్న వారికి ఈ పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం క్రింది ఏ పిఎస్ ఆర్టీసీ సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అందుబాటులో ఉంటుందని మంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా దివ్యాంగులు స్వతంత్రంగా ప్రయాణిస్తూ, తమ రోజువారీ కార్యకలాపాలను మరింత సులభంగా నిర్వహించుకోగలుగుతారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. నిడదవోలు గణపతి సెంటర్ నుండి శమిశ్రగూడెం ఎంపీడీవో కార్యాలయం వరకు బస్సులో ప్రయాణించి అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన



# ఉగాది పర్వదిన శుభాకాంక్షలు: ఎస్పీ

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, మీడియా మిత్రులకు, సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు నూతన తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలను తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్ తెలియజేశారు. ఈ శ్రీ పరాభవ నామ సంవత్సరం మనందరి జీవితాలలో కొత్త కాంతులు వెల్లివిరియాలని, నిత్య వసంతాలు పూయాలని, అందరి ఆశలు, ఆశయాలు నెరవేరాలని ఆ భగవంతున్ని కోరుకుంటూ... ఉగాది శుభాకాంక్షలు తెలిపారు జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్.

### జిల్లా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో

# శ్రీ పరాభవ నామ ఉగాది తెలుగు సంవత్సరాది వేడుకలు..

- నేడు సూర్యకళ మందిరంలో ఉగాది వేడుకలు
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ (మనసులో మాట) మార్చి 18..** కాకినాడ జిల్లా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ ఉగాది తెలుగు సంవత్సరాది వేడుకలను ఈ నెల 19వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు స్థానిక సూర్యకళా మందిరం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహిస్తున్నామని మండలి చైర్మన్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలు సాంప్రదాయ రీతిలో శుభ మంగళ నాదస్వరంతో ప్రారంభమై, వేదపఠనం, మహదాశీర్వచనం, పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలతో జరుగుతాయన్నారు. అలాగే రాష్ట్రప్రభుత్వ ఆదేశాల కనుగుణంగా దేవాదాయ శాఖ ఆద్వర్యంలో పండిత సత్కార కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఈ కార్యక్రమానికి అతిధులుగా హాజరై జిల్లా ప్రజలకు శుభకాంక్షలు తెలిపి, కవులు, పండితులు, కళాకారులను సత్కరిస్తారని ఆయన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తెలుగు ప్రజల సంస్కృతి సాంప్రదాయాల వైభవాన్ని చాటూతూ జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ ఉగాది వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# దర్శ అమావాస్య ప్రవక్త శ్రీ లక్ష్మీ కుబేర సుదర్శన హోమం

- దేశంలోనే తొలి సారిగా వాహనంతో కూడుకున్న మహాలక్ష్మి హోమం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** పంచ పర్వములలో మహా పర్వమైనటువంటి అమావాస్య రోజున శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం ప్రాంగణంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద బుధవారం దర్శ (అమావాస్య) ప్రయుక్త శ్రీ లక్ష్మీ కుబేర సుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భారత దేశంలో మొట్ట మొదటి సారిగా వాహనంతో కూడుకున్న మహాలక్ష్మి హోమం జరగడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బోడెం నాగ సత్య రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో పండిత పురోహితుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. దర్శ (అమావాస్య) రోజున చేసే శ్రీ లక్ష్మీ కుబేర సుదర్శన హోమం చాలా పవిత్రమైనదని, ఈ హోమం వలన శాంతి, దోష నివారణతో పాటు ధన సంపద కూడా కలుగుతుందని రవికుమార్ శర్మ తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు, ఉమా మార్కండేయ లలితా మండలి మహిళలు పాల్గొన్నారు.

### విభిన్న ప్రతిభావంతులలో

# ఆత్మస్థైర్యం నింపేలా సంక్షేమం అమలు

- 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత : ఎమ్మెల్సీ సోము వీర్రాజు






**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** విభిన్న ప్రతిభావంతులలో ఆత్మస్థైర్యం నింపేలా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలసి బుధవారం జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు విభిన్న ప్రతిభావంతులతో కలసి బస్సులో ప్రయాణించి, వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు కూటమి ప్రభుత్వం ఉగాది కానుకగా ఈ 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా దివ్యాంగులతో పాటు వారి వెంట వచ్చే సహాయకులకు ఆర్టీసీ బస్సుల్లో గుర్తించిన కేటగిరీలలో 50 శాతం టికెట్ రాయితీ కల్పించినట్లు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల సాధికారతకు అవసరమైన శారీరక, వైద్య, ఆర్థిక తదితర రంగాల్లో సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన దివ్యాంగులకు రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉపాధి రుణాలు, సబ్సిడీపై త్రిచక్ర వాహనాలు తదితర సహాయాలను అందిస్తూ సమాజంలో వారిపై ఉన్న అవరోధాలను తొలగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. అర్హులైన వారందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని, అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, గౌరవానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా వారి జీవితాల్లో భరోసా నింపుతోందని తెలిపారు. దివ్యాంగులను దయతో చూసే విధానం మారాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులలో అపారమైన శక్తి సామర్థ్యాలు, అంతులేని ఆత్మస్థైర్యం ఉంటాయన్నారు. తగిన అవకాశాలు కల్పిస్తే వారు అద్భుత విజయాలు సాధించగలరని అన్నారు.

అనంతరం తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే నివాసంలో దివ్యాంగులకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న మేలుకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ (ఆర్‌ఎంసీ) ఎస్ వెంకటరమణ, సెక్రటరీ (ఆర్ఎంసి) శైలజవల్లి, ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ (రాజమహేంద్రవరం) కే మాధవ్, పీఆర్వో బీఎస్ కుమార్, ఎస్ఎంవీవీ రావు, కూటమి నాయకులు కుడుపూడి సత్తిబాబు, మజ్జి రాంబాబు, అత్తి సత్యనారాయణ, కాశీ నవీన్ కుమార్, నక్కా చిట్టిబాబు, వర్రే శ్రీనివాసరావు, పక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్రలో రామ్మూర్తి నాయుడు 74 వ జయంతి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** స్వర్ణాంధ్ర సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు జయంతి వేడుకను స్వర్ణాంధ్ర వృద్ధుల మధ్య ఘనంగా నిర్వహించారు. రామ్మూర్తి నాయుడు చిత్ర పటానికి స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ నిర్వాహకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు వృద్ధులతో కలసి పూలమాలను వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ 1998లో స్వర్ణాంధ్ర సేవా సంస్థను ప్రారంభించినప్పుడు రామ్మూర్తి నాయుడును వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఎన్నుకున్నామని చెప్పారు. తదుపరి స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్మాణ, నిర్వహణలో రామ్మూర్తి నాయుడు పాత్ర కీలకమైనదని రాంబాబు కొనియాడారు. తూర్పు గోదావరి జిల్లాలో అనేక సేవా సంస్థలకు రామ్మూర్తి నాయుడు విరాళాలు అందించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ సేవా కార్యక్రమాలలో రామ్మూర్తి నాయుడు పలుమార్లు పాల్గొని ప్రోత్సాహం అందించారన్నారు. సౌమ్యుడు, సేవా తత్పరుడు, స్నేహపాత్రుడైన రామ్మూర్తి నాయుడు జ్ఞాపకార్థం ఆయన చిత్ర పటాన్ని వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు ప్రత్యేక అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర మేనేజర్ వై హరికృష్ణ, సిబ్బంది పీ రాజేష్, జీ మీరాకుమారి, సింధు దివ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యా బుద్ధులు నేర్పిన విద్యా సంస్థని ఎన్నడూ మరువ కూడదు

-ఘనంగా సీఎస్డీ సిద్ధి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్, ఫేర్వెల్ వేడుకలు




**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** విద్యా బుద్ధులు నేర్పిన విద్యా సంస్థని ఎప్పుడూ మరువకూడదని సీఎస్డీ సిద్ధి డిగ్రీ కళాశాల చైర్మన్ డాక్టర్ రుద్ర అన్నారు. హుకుంపేటలోని సీఎస్డీ సిద్ధి డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్- ఫేర్వెల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు స్వాగతం పలికి వేడుకలకు శ్రీకారం చుట్టారు. దీంతో కళాశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్, ప్రిన్సిపల్ శ్రీనివాసుడు డీవీఎస్ ప్రారంభోపన్యాసం చేశారు. సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ ధనలక్ష్మి పర్యవేక్షణలో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తు కోసం విలువల ఆధారిత జీవన విధానాన్ని అనుసరించాలని డాక్టర్ రుద్ర ఆకాంక్షించారు. ఇలాంటి వేడుకలు విద్యార్థుల మధ్య స్నేహాన్ని, ఐక్యతను మరింత బలపరుస్తాయని ఆయన తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# దివ్యాంగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

-రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

-కోరుకొండలో 'దివ్యాంగ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభం





**కోరుకొండ (రాజమహేంద్రవరం), మార్చి 18:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజలకు అద్భుతమైన పరిపాలన అందుతోందని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఎన్నికల ముందు దివ్యాంగులకు పెద్దపీట వేస్తామని ఇచ్చిన హామీ మేరకు 'దివ్యాంగ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం కోరుకొండ బస్టాండు వద్ద 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించిన అనంతరం దివ్యాంగులతో కలసి గాడాల గ్రామంలోని తన స్వగృహానికి చేరుకుని సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.3 వేలు ఉన్న పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచడంతో పాటు పూర్తి దివ్యాంగత్వం ఉన్న వారికి రూ.15 వేలు పెన్షన్ అందజేస్తున్నామని వివరించారు. దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసం పెంపొందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

మహిళలు జ్ఞానంలో, పనితనంలో ముందుండి కూడా సామాజిక పరిస్థితుల వల్ల వెనుకబడుతున్నారని, వారికి అన్ని విధాలా ప్రోత్సాహం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు, ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. దివ్యాంగులు ప్రయాణాల్లో ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 40 శాతం పైగా దివ్యాంగత్వం ఉన్న వారికి ఉచిత బస్సు సౌకర్యం, తీవ్ర దివ్యాంగులకు సహాయకులుగా ఉన్న వారికి 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. బలహీన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, నిస్సహాయులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అన్నారు. మహిళలు రోజు వారీ పనులు, వైద్య సేవలు, కుటీర పరిశ్రమలు నిర్వహించుకునేందుకు ఆర్థిక భారం లేకుండా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త ఎదగాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. దివ్యాంగులు, మహిళలు అనేక రంగాల్లో ప్రతిభ చాటుతున్నారని, మిగిలిన వారిలో కూడా ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. గాడాల గ్రామంలోని ఎమ్మెల్యే స్వగృహంలో దివ్యాంగులతో కలిసి సహపంక్తి భోజనం నిర్వహించి, వారిని సత్కరించి, తిరిగి కోరుకొండ బస్టాండ్‌కు చేర్చి సురక్షితంగా వారి గమ్యస్థానాలకు పంపించినట్లు ఎస్‌డీసీ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో కే భాస్కర్ రెడ్డి, ఎంపీడీఓ, తహసీల్దార్, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# "నారీ శక్తి స్వచ్ఛత" నిర్వహించిన రైల్వే బోర్డు మెంబర్స్

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** రాజమహేంద్రవరం మెయిన్ రైల్వే స్టేషన్ అడ్వైజరీ కమిటీ బోర్డు సభ్యులు, రైల్వే సిబ్బంది అధ్వర్యంలో రైల్వే స్టేషన్ లలో పారిశుద్ధ్య నిర్వహణలో విశేష సేవలు చేస్తున్న మహిళలను గౌరవిస్తూ దుస్సాలువాలతో సత్కరించి వారి విలువైన సేవలను కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం, ఉగాది పర్వదినాలను పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా వారికి చీరలు, పండ్లు, మిఠాయిలు అందజేసి గౌరవించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల అంకితభావం, సేవలను ప్రశంసిస్తూ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. సమాజాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచడంలో వారి పాత్ర అత్యంత ప్రశంసనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, కాలెపు సత్య సాయిరాం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పాలడుగు శ్రీవిద్య, మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్, తగరం సురేష్, క్షత్రియ బాల సుబ్రహ్మణ్యంసింగ్, కురగంటి సతీష్, పీవీ సుబ్రహ్మణ్యం, బండి సత్యప్రసాద్, భోజి హరి రామ్, చింతపల్లి సతీష్, పైబోయిన సురేంద్ర, పరశురాం, అడపా వరప్రసాద్, కేవీ కుమారి, రత్నారెడ్డి, ముప్పల మహేష్, రైల్వే సిబ్బంది చంద్రమౌళి, చిదంబరం, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవులపై జరుగుతున్న దాడులు అరికట్టాలి




**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** క్రైస్తవులపై దాడులను అరికట్టాలని కోరుతూ బుధవారం తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ కి క్రిస్టియన్ కోఆర్డినేషన్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా శాఖ ప్రెసిడెంట్ ఆర్థర్ ప్రసాద్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, మత మార్పిడి నిరోధక చట్టాలను రద్దు చేయాలని, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని వినతి పత్రంలో కోరారు. ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ వినతి పత్రాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగం సుబ్బారావు, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, గడ్డం నెల్సన్ బాబు, ఏలేటి రాజారావు, కుసుమ సాయి బాబా, కే సాల్మన్ రాజు, సాకా డేవిడ్ రాజు, దాసరి భూషణ్ రావు, రాచపల్లి శ్యాం సుధాకర్, దిరిబున చిరంజీవి, కటకం బాబ్జి, కే రాజకుమారి, అద్దంకి యోనాడి, సంజీవరావు పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ పొందండి

- కమిషనర్ రాహుల్ మీనా





**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** మార్చి చివరి నాటికి ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో.. ఇంటి పన్ను, ఖాళీ స్థలము పన్ను, నీటి ఛార్జీలు వెంటనే చెల్లించాలని కమిషనర్ రాహుల్ మీనా కోరారు. బుధవారం రెవెన్యూ అధికారులతో కలసి నగరంలో పన్ను బకాయిదారుల నివాసాలకు వెళ్లి వారితో మాట్లాడారు. నెలాఖరులోపు ఆస్తి పన్ను బకాయిలు చెల్లించినట్లయితే.. 50 శాతం వడ్డీ రాయితీ పొందవచ్చని ఈ సందర్భంగా తెలిపారు. బకాయిలు ఉన్న వారికి నీటి కనెక్షన్, విద్యుత్తు కనెక్షన్, ఇతర కార్పొరేషన్ సేవలు నిలిపివేయడం జరుగుతుందని వెల్లడించారు. అలాగే మొండి బకాయిలను వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో ఆస్తి జప్తు చేయడం జరుగుతుందన్నారు. కనుక సకాలంలో పన్నులు చెల్లించి ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వచ్చే నెల నుంచి పన్ను బకాయిలపై పూర్తి వడ్డీ పడుతుందని, కాబట్టి బకాయిదారులు వెంటనే పూర్తి పన్ను చెల్లించాలని సూచించారు. చెల్లింపుదారులకు సౌకర్యంగా ఉండేందుకు సెలవు దినాల్లోనూ నగదు కౌంటర్లు తెరిచి ఉంచుతామని అన్నారు. అలాగే ప్రజలకు అవగాహన కల్పించి, పన్నులు సమయానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 50 శాతం వడ్డీ రాయితీపై విస్తృత ప్రచారం కల్పించాలని వార్డు పరిపాలనా కార్యదర్శులకు సూచించారు. ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా డిజిటల్ నోటీసులు పంపించి బకాయిల వివరాలు తెలియజేయాలన్నారు. అనంతరం పన్ను చెల్లింపు కౌంటర్లను సందర్శించారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ, ఇతర రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వ కట్టుబడి ఉంది

**- ఆర్టీసీ బస్సులో దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దాట్ల**





ముమ్మిడివరం( మనసులో మాట) మార్చి 18. దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వ కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. బుధవారం ముమ్మిడివరం నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో ఏపీఎస్ఆర్టీసీ బస్సులో "దివ్యాంగ శక్తి " పథకాన్ని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దివ్యాంగులకు సౌకర్యవంతమైన జీవన విధానం కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దూరదృష్టితో ఈ అద్భుతమైన పథకాన్ని రూపకల్పన చేశారని తెలిపారు. దివ్యాంగులు సమాజంలో గౌరవంగా జీవించేందుకు, వారికి అవసరమైన సదుపాయాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. దివ్యాంగుల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ వారికి అండగా నిలుస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా వేలాది మంది దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, వివిధ రాయితీలు కల్పించడం ద్వారా వారి దైనందిన జీవితంలో సౌలభ్యం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్ పర్సన్ ఓగూరి భాగ్యశ్రీ, కూటమి సీనియర్ నాయకులు నాగిడి నాగేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, గొల్ల కోటి దొరబాబు, తాడి నరసింహారావు, అనాతవరం సర్పంచ్ నిమ్మితి చిరంజీవి, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు అర్ధాని శ్రీను, మెండి కమల, ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి. రవి వర్మ, రవాణాశాఖ అధికారులు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# మహిళలకు ఆత్మ విశ్వాసమే ఆయుధం

**- జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జి.ఆనంది**




**కాకినాడ( మనసులో మాట) మార్చి 18..** మహిళలు ఆత్మ విశ్వాసాన్ని ఆయుధంగా చేసుకుని తమ కుటుంబాలను సుసంపన్నం చేస్కోవాలని కాకినాడ 3 వ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి జి. ఆనంది మహిళలకు పిలుపునిచ్చారు. ఎంతో అధునాతనమయిన అవకాశాలు ఉన్న నేటి సమాజంలో ప్రతి మహిళ లోను ఏదో ఒక విద్య దాగి ఉంటుందని దానిని వెలికి తీయడానికి సరైన మార్గ దర్శకత్వం అందించడానికి రెడ్ క్రాస్ వంటి సంస్థ ముందుకు రావడం ఎంతో గర్వకారణం అని తెలియచేసారు . పిల్లల్ని సరైన మార్గంలో తీర్చి దిద్దడంలో గృహిణుల పాత్ర ఎంతో ముఖ్యమయినది అని దాని కొరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవలసినదిగా సూచించారు. రెడ్ క్రాస్ మహిళా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో మహిళల స్వయం ఉపాధి కొరకు నిర్వహించిన ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ మరియు యోగా శిక్షకుల శిక్షణా కార్యక్రమాలలో పాల్గొన్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలను అంద చేసే కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆనంది మాట్లాడుతూ మహిళల పురోభివృద్ధి కొరకు రెడ్ క్రాస్ నిర్వహిస్తున్నటువంటి శిక్షణా కార్యక్రమాలు ప్రశంసనీయమని, ఇటువంటి వినూత్నమయిన శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నటువంటి చైర్మన్ పై డి రామారావును అభినందిస్తూ ఈ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలియ చేసారు. ఈ సందర్భముగా రామారావు మాట్లాడుతూ మహిళలలో ఆత్మ విశ్వాసం పెంపొందించడమే రెడ్ క్లాస్ ముఖ్య ఉద్దేశం అని భవిష్యత్తులో నిర్వహించబోయే శిక్షణా కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి కే శివ కుమార్, కార్యవర్గ సభ్యురాలు .భానుమతి, స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షకులు అరవింద్, యోగా శిక్షకురాలు ఇందిర మహిళా సభ్యులు మెట్టా రాధ,పి.పద్మజా వాణి సుశ్రీ, వై. రజని కుమారి,మీనాక్షి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# కాండ్రకోట నూకాలమ్మ జాతర మహోత్సవాలు




**పెద్దాపురం (మనసులో మాట)మార్చి 18;** రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మండలం కాండ్రకోటలో నూకాలమ్మ తల్లి మహా జాతర మహోత్సవాలు మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో ముమ్మన రాంబాబు రెడ్డి ఆధ్వర్యంలో, చైర్మన్ వల్ల సత్యనారాయణ సారుధ్యంలో చేపట్టిన ఉత్సవాలను తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ ప్రారంభించారు. మార్చి 17 నుండి మే మూడో తేదీ వరకు అమ్మవారి జాతర మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఈవో రాంబాబు రెడ్డి తెలిపారు. అమ్మవారి ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి కాండ్రకోట గ్రామంలో ఉన్న తోటల్లో నివాసాలను ఏర్పాటు చేసుకొని అమ్మవారికి కోళ్లు, మేకలు, పటిక బెల్లం, అరటి గెలలు కొబ్బరికాయలతో మొక్కలు చెల్లిస్తారు. ప్రారంభ వేడుకలకు జిల్లా నలుమూలల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. పెద్దాపురం ఎస్సై మౌనిక ఆధ్వర్యంలో భారీ భద్రత ఏర్పాటు చేపట్టారు. భక్త జన వర ప్రధానిగా ప్రసిద్ధి చెందిన నూకాలమ్మ తల్లిని దర్శించి ధరించాలని ఈవో రాంబాబు రెడ్డి, ఆలయ ప్రతినిధి మోహన్ తదితరులు కోరారు

## ఆహ్లాదభరిత వాతావరణంలో ముగిసిన

# జిల్లా పోలీసు వార్షిక క్రీడా పోటీలు

**- ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జిల్లా ఎస్పీ బిందు మాధవ్**






**కాకినాడ (మనసులో మాట) మార్చి 18..** కాకినాడ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక క్రీడా పోటీలు (యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ) ఆహ్లాదభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా పోలీసు అధికారి బిందు మాధవ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది శారీరక దృఢత్వం మరియు మానసిక స్థైర్యం పెంపొందించు కోవడానికి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడూ చురుకుగా ఉండేందుకు ఇటువంటి క్రీడా పోటీలు ఉపకరిస్తాయని తెలిపారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ పోలీసు సిబ్బందిలో జట్టు భావన, క్రమశిక్షణ ఆరోగ్య పరిరక్షణను పెంపొందించడంలో ఈ క్రీడా పోటీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన సిబ్బందిని అభినందించి, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో వివిధ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు మరియు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



## కోదండ రాముడి కళ్యాణానికి తరలి రండి

**- జిల్లా అధికారులకు ధర్మకర్త వినతి**



**పెదపూడి (మనసులో మాట) మార్చ్ 18;** ఆంధ్రప్రదేశ్లో అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన పెదపూడి మండలం గొల్లల మామిడాడ కోదండ రామచంద్రమూర్తి దివ్య కళ్యాణ వేడుకలకు తరలి రావాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఎస్ ఎస్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ కు ఆలయ ధర్మకర్త ద్వారంపూడి శ్రీ రామ మురళీకృష్ణ శ్రీనివాస్ రెడ్డి స్వామి వారి కళ్యాణ పత్రికలను అందిస్తూ, ఆహ్వానించారు. ప్రతి ఏటా చైత్ర శుద్ధ నవమికి సీతారామచంద్రమూర్తి దివ్య కళ్యాణం మంచి ముత్యాలు తలంబ్రాలుగా కర్పూర దివిటీల మధ్య లక్షలాది మంది భక్తుల సమక్షంలో నిర్వహిస్తారు. ఆకాశాన్ని తాకే గోపురాలతో అపర భద్రాద్రిగా గొల్లల మామిడాడ క్షేత్రం ప్రసిద్ధి చెందింది. జిల్లా కలెక్టర్ ఎస్ఎస్ మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ కు మురళి స్వామి వారి కళ్యాణ పత్రికలను అందించారు. కళ్యాణ ఏర్పాట్లను కూడా వివరించారు. ప్రతి ఏటా జిల్లా కలెక్టర్ దంపతులు స్వామివారి కల్యాణానికి పట్టు వస్త్రాలను తలంబ్రాలను అందిస్తారు. స్వామి వారి కళ్యాణానికి భారీ భద్రత కనిపిస్తామని బిందు మాధవ్ హామీ ఇచ్చినట్లు ఆలయ ధర్మకర్త మురళి తెలిపారు.

## ఇమామ్ ల గౌరవ వేతనాలు విడుదల పట్ల హర్షం....



**మండపేట (మనసులో మాట ) మార్చి 18..** ఇమామ్, మౌజన్లకు రంజాన్ సందర్భంగా ప్రభుత్వం గౌరవవేతనలు విడుదల చేయడం పట్ల మండపేట టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు షేక్ కరీం మెకానిక్ హర్షం వ్యక్తం చేశారు. మండపేట టిడిపి కార్యాలయంలో ఏర్పాట్లు మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఇమామ్ మౌజన్ల గౌరవ వేతనం నిమిత్తం రూ.45 కోట్లు విడుదల చేశారన్నారు.గత ఆరు నెలల బకాయిలను రంజాన్ సందర్భంగా ఒకేసారి క్లియర్ చేసిన కూటమి ప్రభుత్వం కు కృతజ్ఞతలు తెలిపారు. ఇఫ్తార్ విందులో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన కొన్ని గంటల్లోనే నిధుల విడుదలకు ఆదేశాలు వచ్చాయన్నారు. ఇమామ్‌లు, మౌజన్‌ల.ఖాతాల్లోకి నేరుగా నగదు జమ అవుతుందన్నారు. ఇమామ్‌లకు ఆరు నెలల వేతనం కింద రూ.30 కోట్ల చెల్లింపులు చేస్తారన్నారు మౌజన్లకు ఆరు నెలల వేతనం కింద రూ.15 కోట్లు జమ చేస్తారని పేర్కొన్నారు.ఈ సమావేశంలో టీడీపీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు సలీం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

**- జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి**



**కాకినాడ (మనసులో మాట) మార్చి 18..** శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరాది పురస్కరించుకొని జిల్లా ప్రజలందరికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.కొత్త సంవత్సరం అందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక శ్రేయస్సును తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా ధర్మం, భక్తి, మరియు సానుకూల ఆలోచనలతో ఈ కొత్త సంవత్సరాన్ని ప్రారంభించి, విజయవంతమైన జీవితం వైపు అడుగులు వేయాలని, జిల్లా ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ ఆకాంక్షించారు.



## సామర్లకోట రైల్వే స్టేషన్లో

# డిఆర్ఎం ఆకస్మిక తనిఖీలు



సామర్లకోట (మనసులో మాట) మార్చి 18; కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్లో రైల్వే శాఖ డిఆర్ఎం మోహిత్ సోనాకియ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అమృత భారత్ స్టేషన్ పథకంలో భాగంగా సామర్లకోటలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను పూర్తి నాణ్యత ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను గుత్తేదారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని మోహిత్ హెచ్చరించారు. తొలుత రైల్వే స్టేషన్ ప్రాంగణంలో మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో డిఆర్ఎం సోనాకియాకు ఘన స్వాగతం పలికారు. స్టేషన్ ప్రాంగణంలో చేపట్టిన ఈ విధంగా పనులను మోహిత్ పరిశీలించారు. పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమృత భారత స్టేషన్ అభివృద్ధి పథకం ద్వారా అందిస్తున్న నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేస్తూ సమగ్ర అభివృద్ధి సాధించాలని డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా ఆదేశించారు. రైల్వే అధికారులు, రైల్వే పోలీసులు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

# నారా లోకేష్ యోజన ఫౌండేషన్ కార్యక్రమాలు అభినందనీయం

**- సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ**



**కాకినాడ (మనసులో మాట) మార్చి 18..** నారా లోకేష్ యువజన ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మాజీ మంత్రి సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. నారా లోకేష్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పొట్లూరు పద్మావతి మరియు వాసవి కాలనీ పంచముఖ ఆంజనేయ స్వామి పురోహితులు లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ద్వారా చేస్తున్న కార్యక్రమాలు ఆయన అడిగి తెలుసు కున్నారు. వాసవి కాలనీ పంచముఖ ఆంజనేయ స్వామి గుడి పునరుద్ధరణకు తనవంతు సహాయం చేస్తానని అన్నారు అదేవిధంగా పొట్లూరు సత్యవతి మాట్లాడుతూ కన్నా లక్ష్మీనారాయణ వెంటనే స్పందించి పురోహితులకు అండగా ఉంటానని అన్నారన్నారు. ఫౌండేషన్ సభ్యులు పురోహితులు భవ్యశ్రీ పాల్గొన్నారు.

# ఈనెల 19న శ్రీ పరాభవ నామవత్సర ఉగాది కవి సమ్మేళనం



**భీమవరం, మనసులో మాట మార్చి 18 :** ఈనెల 19న భీమవరం శ్రీమహిషాసుర మర్ధిని భీమేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీరామరాజ భూషణ సాహిత్య పరిషత్ ఆధ్వర్యవమున శ్రీ పరాభవ నామవత్సర ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు నడింపల్లి వెంకట్రామరాజు, రాయప్రోలు భగవాన్, భట్టిప్రోలు శ్రీనివాసరావు, బొండా రాంబాబు తెలిపారు. ఉగాది రోజు సాయంత్రం 6.30 గంటలకు కవి కువలయ శీతకరులు బ్రహ్మశ్రీ కందుకూరి రామకృష్ణ సూర్యనారాయణ, రసరాజు, ఇందుకూరి వెంకట లక్ష్మీపతిరాజు, డా జి రామకృష్ణంరాజు, బ్రహ్మశ్రీ కడిమిళ్ళ వరప్రసాద్ గురు సహస్రావధాని, డా కోరుకొండ సుజాత దేవి, చిలకమర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి, సరికొండ నరసింహరాజు లచే కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉగాది కవి సమ్మేళనానికి డా ముదునూరి గోపాల కృష్ణంరాజు, విశ్రాంతి ఐటి డైరెక్టర్ వెలమకన్ని రాజేంద్ర కుమార్ (హైదరాబాద్), మేళం జగదీశ్వరి, డా వేగేశ్న ప్రవీణ కుమారి, డా భూపతిరాజు ఐశ్వర్య, డా కట్రెడ్డి మౌనిక తదితరులు ముఖ్యపాత్రధారులు అవుతున్నారని పేరిచర్ల లక్షణ వర్మ తెలిపారు.

# శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకలు నిర్వహణకు ఏర్పాట్లు

**- డీఆర్వో టీ సీతారామ మూర్తి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** తెలుగు నూతన శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి టీ సీతారామమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం కార్యక్రమాలు మంగళ నాదస్వరంతో ప్రారంభమై ప్రార్థనా గీతాలతో కొనసాగుతాయన్నారు. అనంతరం అతిథులచే జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలకు శ్రీకారం, వేద పఠనం, మహదాశీర్వచనం కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించగా, పంచాంగ శ్రవణ కార్యక్రమం పండితుల బృందం చేత నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉగాది పర్వదిన సాంస్కృతిక వేడుకల్లో భాగంగా వసంత కవితాగానం, కవి సమ్మేళనం, ప్రముఖ కవులు పాల్గొని సాంప్రదాయ సాహిత్య సౌందర్యాన్ని ప్రతిబింబించే కవితలను వినిపిస్తారన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా వినాయక కీర్తన నృత్యం సంగీత నృత్య పాఠశాల విద్యార్థులచే ప్రదర్శించనుండగా, ఆంధ్ర నాట్యం కళారూపాన్ని కళాకారుల బృందం ఆవిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమం ముగింపులో వేద పండితులు, పంచాంగకర్తలు, కవులు, కళాకారులను అతిథులచే సత్కరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలకు, ఆహూతులకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేసి వందన సమర్పణ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, గౌరవ ప్రజాప్రతినిధులు హాజరవుతారని డీఆర్వో టీ సీతారామమూర్తి తెలియజేశారు.



## ఉండి ఏఎస్ఐ డి.వి.శ్రీనివాస్ రావు 2026 ఉగాది పురస్కారానికి ఎంపిక

**ఉండి, (మనసులో మాట) మార్చి 18 :** ఉండి నియోజకవర్గం ప్రధాన కేంద్రమైన ఉండి పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న డి వి శ్రీనివాస్ రావు,కి 2026 సంవత్సరం గాను ఉగాది పురస్కార సేవ పథకం లభించింది శ్రీనివాసరావు వృత్తిపరంగా ఎంత అంకితభావంతో పనిచేస్తారని పోలీస్ స్టేషన్ కు వివిధ సమస్యలతో అనేక మంది వస్తారని ముఖ్యంగా వయోవృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ఫ్రెండ్లీ పోలీస్ గా ఉండి పోలీస్ స్టేషన్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.గత 37 సంవత్సరములు నుంచి డిపార్ట్మెంట్ కు వివిధ రంగాల్లో పలు సేవలు చేశారని,తన సేవలను గుర్తించి 2026 ఉగాది పురస్కారం ప్రభుత్వం ప్రకటించిందని స్టేషన్ అధికారి తెలియజేశారు. అనంతరం ఏఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ తనకు ఉగాది పురస్కారం ప్రకటించడం చాలా సంతోషంగా ఉందని, జిల్లా ఉన్నతాధికారులు చేతుల మీదుగా ఉగాది రోజున పురస్కారం తీసుకోబోతున్నందుకు సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణుడైన పాపంపేట విద్యార్థి



**మనసులో మాట రంపచోడవరం మార్చి 18..** అడ్డతీగల మండలం పాపంపేట గ్రామానికి చెందిన బట్టు లోహిత్ బాలు రెడ్డి పాపంపేట ఎంపీపీ పాఠశాలలో ఐదవ తరగతి చదువుచున్నాడు, బాలు రెడ్డి తల్లిదండ్రులైన వీర వెంకటరమణ గంగాభవాని, వీరు సాధారణ వ్యవసాయ కూలీ కుటుంబం నకు చెందినవారు. ఇటీవల జరిగిన జవహర్ నవోదయ విద్యాలయం ఆరో తరగతి లోకి ప్రవేశానికి రాసిన పరీక్షలలో 81 మార్కులతో ఉత్తీర్ణుడై కోతులగుట్ట, ఎటపాక మండలం నవోదయ విద్యాలయం నకు సెలెక్ట్ అవ్వడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చీడి బాలరాజు ఉపాధ్యాయులు కె.లక్షణ స్వామి వి.హేమిన బట్టు బట్టు లోహిత్ బాలు రెడ్డికి అభినందనలు తెలియజేస్తూ ఉపాధ్యాయుల కృషి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఈ విజయానికి కారణం అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు తెలిపారు. అలాగే మండల విద్యాశాఖ అధికారి పి శ్రీనివాసరావు బట్టు లోహిత్ బాల్రెడ్డికి అభినందనలు తెలియజేస్తూ ఉపాధ్యాయులను అభినందించారు.

## గరికపాటి మాష్టారికి ఘన నివాళి



**కాకినాడ (మనసులో మాట) మార్చి 18..** గరికపాటి సూర్యనారాయణ (గరికపాటి మాస్టారు ) హఠాన్మరణానికి (95) గురికావటము దిగ్భ్రాంతి కలిగించిందని ఏపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యవర్గ సభ్యులు బుధవారం విచారం వ్యక్తం చేశారు. పెన్షనర్స్అసోసియేషన్లో 95 సంవత్సరముల వయసు గల సూపర్ సీనియర్ పెన్షనర్ అని అధ్యక్షుడు కె.పద్మనాభం అన్నారు. గత సంవత్సరశీ పెన్షనర్స్ భవనములో పంచాంగ శ్రవణ కార్యక్రమం జరుగగా, కార్యక్రమములో వారి అమృత వాక్కులు మనస్సులలో గుర్తుండిపోయినవని పేర్కొన్నారు. 95 సంవత్సరముల వయస్సులో ఎన్నడూ ఎటువంటి అనారోగ్య మునకు గురి కాకుండా తోటి పెన్షనర్లుని నవ్విస్తూ ఉండేవారు. ఈనెల 6న వారికి అనారోగ్యానికి గురై 17వ తేదీన మరణించారని అన్నారు. పద్మనాభం అధ్యక్షులు, కార్యదర్శి నూకరాజు, వైస్ ప్రెసిడెంట్ భాస్కరరావు వారి ఇంటికి పలకరించుటకు
వెళ్ళినపుడు,వారు పంచాంగ శ్రవణ కార్యక్రమమునకు రాలేమోనని పద్మనాభం చేతులు పట్టుకొని అన్నమాటలు అందరి హృదయములో గుర్తు ఉండిపోయినవన్నారు. ఆయన అన్నట్లుగానే జరగబోయే పంచాంగ శ్రవణ కార్యక్రమునకు రావడానికి అవకాశం లేకుండానే భగవంతుడు ఆయనను ఊర్ధ్వలోకమునకు పిలుచుకున్నారని, వీరి హటాన్మరణము సందర్భంగా 19న జరుప తలపెట్టిన పంచాంగ శ్రవణ కార్యక్రమము పెన్షనర్స్ భవనములో జరుపుటలేదని అధ్యక్షులు పద్మనాభం తెలియజేశారు.

# దివ్యాంగుల శక్తి ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గిడ్డి





**అమలాపురం (మనసులోమాట) మార్చి 18:** దివ్యాంగులకు భరోసాగా కూటమి ప్రభుత్వం దివ్యాంగుల శక్తి పథకాన్ని ప్రవేశ పెట్టడం వల్ల వారికి ఎంతో మేలు జరుగుతుందని పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం పీగన్నవరంలో దివ్యాంగుల శక్తి పథకంలో భాగంగా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని ప్రారంభించారు
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం దివ్యాంగుల అభివృద్ధి వారి అవసరాలను పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల గౌరవాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటోందన్నారు. గత ప్రభుత్వంలో 4వేలు పెన్షన్‌ను ఇచ్చేవారని కూటమి ప్రభుత్వం లో రూ. 6000లకు పెంచారని అలగే వారికి ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా వారికి ఎంతో ఉపశమనం కలిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించారు. సందర్భంగా వారికి భోజన సదుపాయం కల్పించి, ఎమ్మెల్యే స్వయంగా వడ్డిస్తూ వారితో కూర్చుని వారి కష్టసుఖాలు తెలుసుకుని భోజనం చేశారు. ఈ చర్యతో దివ్యాంగుల పట్ల ఆయన చూపిన ఆప్యాయత పట్ల వారి ప్రశంసలను ఎమ్మెల్యే పొందారు. అదేవిధంగా కార్యక్రమానంతరం ాచీ+జ వారు అందించిన రెండు వాటర్ ట్యాంకులను ఎమ్మెల్యే ప్రారంభించారు. దివ్యాంగుల సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని దివ్యాంగుల కు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, జనసైనికులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడి గుడ్లలో నాసిరకం - పిల్లల ఆరోగ్యం ప్రమాదంలో



**కాకినాడ (మనసులో మాట) మార్చి 18..** కాకినాడ జిల్లా లోని అనేక గ్రామం లోని ఆంగన్‌వాడి కేంద్రాల్లో పిల్లలకు పంపిణీ చేస్తున్న గుడ్లలో నాసిరకం గుడ్లు ఎక్కువగా వస్తున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు, కిషోర్ బాలికల ఆరోగ్యం కోసం పోషకాహారం గా ప్రభుత్వం అందిస్తున్న గుడ్లలో చాలా వరకు పాడైపోయినవి లేదా పగిలిపోయినవి వస్తున్నాయని వారు చెబుతున్నారు.
కొన్ని సందర్భాల్లో గుడ్లు పూర్తిగా పాడైపోయి దుర్వాసన వస్తోందని, అలాంటి గుడ్లును చిన్న పిల్లలకు ఇవ్వడం ద్వారా వారికీ ఆరోగ్యానికి బదులు హానికరమైన అనారోగ్యం ప్రభుత్వం అంట కట్టుతుందని ఆరోపణలు జిల్లా అంతటా తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం పై అధికారులు వెంటనే స్పందించి సరైన నాణ్యత ఉన్న గుడ్లు సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.
ఆంగన్‌వాడి ద్వారా పిల్లలకు అందించే పోషకాహారం నాణ్యంగా ఉండాలి. అందుకు సంబంధిత అధికారులు గుడ్ల నాణ్యతపై కఠినంగా తనిఖీలు చేసి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
ఇది ఇలా ఉండగా అంగన్వాడీ కేంద్రాలకు మధ్యాహ్నం భోజన పథకానికి పాఠశాల లకు అందించే కోడి గ్రుడ్ల నుంచి అన్ని సరుకులు, కూరగాయలు అన్ని కూడా సెకండ్ హేండ్ సరుకులు మాత్రమే సరఫరా చేస్తుంటారు. ఎందుచేతనంటే హాస్టల్ వార్డెన్ నుంచి జిల్లా అధికార్ల వరకు లను... అందివ్వాలి. టెండర్ పిలుస్తే ఎవరైతే తక్కువ రేట్ల తో టెండర్ వేస్తే అవ్యక్తి మాత్రమే ఆ టెండర్లు దక్కించు కొంటారు. ఇక్కడ వరకు బాగానే ఉంది. మరి అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పావుష్టిక ఆహారం పేరుతో పెట్టేది మొదటి తరగతి కేటగిరి లోనిది పెట్టితే ఆ కాంట్రాక్టర్ ఇల్లు,వాకిలి, పెళ్ళాం, ఆఖరికి బిడ్డలన్ని కూడా అమ్ముకొని దివాళా తీసి ఐ పి నోటీసు ఇచ్చి చేతులు ముడుచుకొని ములుగుతూ రహస్యం గా ఎవ్వరికీ కనబడకుండా ఉండాలి. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా ఉన్నత విద్యా శాఖాధికారి, ఐ. సి. డి. ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, క్వాలిటీ కంట్రోల్ అధికారి ఇలా చెప్పుకుంటూ పోతే అందరూ మం మా హే నం బ ఖా వు లే . . . వారందరూ పరిశీలించి పరీక్షించి ఆ కమిటీ నిర్ధారించి కాంటాక్ట్ కు ఆ సరుకులు నిమిత్తం కాంట్రాక్ట్ ఇస్తారు. మరి తక్కువ రేట్లతో కూడికరించిన మెనోని ఇచ్చిన కాంట్రాక్టర్కు అన్ని నెంబర్ వన్ సరుకులతో ఆహారం ఇస్తే ఆయన నెత్తి మీద టవల్ కప్పుకోవాల్సిందే. ఈ విషయాలన్నీ రహస్యమేమీ కాదు అందరికీ ఓపెన్ సెక్రెట్. ఏదైనా సంఘటన జరిగితే వెంటనే అధికారులను ప్రభుత్వాన్ని పాలిస్తున్న రాజకీయ నాయకులు సస్పెండ్ చేయడానికి పూస్టింగ్ చేయడం వంటి దుర్మార్గపు చర్యలు చేపడతారు. రేటు ఎంతైనా పర్వాలేదు నెంబర్ వన్ క్వాలిటీ విద్యార్థులకు గర్భవతులకు బాలింతలకు కిషోర్ బాలికలకు అందిస్తే వారి ఆరోగ్యాన్ని గురించి ప్రపంచంలో ఏ ఒక్కడు కూడా వేలెత్తి చూపించలేడు. అన్ని తెలిసింది ప్రభుత్వాన్ని ప్రభుత్వం ఉన్నతాధికారులే వెనకాల గోతులు తీస్తుంటే చక్కని పోషకాహారం గలిగిన నెంబర్ వన్ క్వాలిటీని కాంట్రాక్టర్ ఎందుకు పిల్లలకు సరఫరా చేయడు. ప్యూన్ నుండి పొలిటికల్ లీడర్ వరకు మాకేంటి మాకేంటి అంటూ చేతులు నలుపుకుంటూ ఉంటే పాపం కాంట్రాక్టర్ నాసిరకం లేదా కుళ్ళిన లేదా చెత్త మీద పడేసే వాడిని ఆయా కేంద్రాలకు లేదా ఆయా హాస్టళ్లకు సరఫరా చేస్తూ ఉంటారు కాంట్రాక్టర్లు. ఇంతకీ గుల్లినా లేదా చెత్త క్వాలిటీ సరఫరా చేసి వాటిని వండి వడ్డిస్తున్న కుక్కర్ దా లోపం... లేక కింది స్థాయి నుండి పై స్థాయి వరకు మిగుతున్న ప్రభుత్వ ఉన్నతాధికారులదా లేక ఆ ప్రభుత్వానికి ప్రతినిత్యం వహిస్తున్న రాజకీయ నాయకుల నేరం...? వ్యవస్థని భ్రష్టు పట్టిస్తున్న బ్యూరోక్రెట్స్ దే నేరం అని చెప్పాలి. వారిపైనే ముందుగా కఠిన చర్యలు తీసుకోవాలి. లక్షలకు లక్షలు నెలనెలా జీతాలు తీసుకుంటూ అం తే కా క ం డా అంకిన కాడికి దో చ ు క ు ం ట ూ బ్యాంకు నిలవలు స్థిర సరాస్తులు కూడ గడుతున్న వారిని ప్రభుత్వాన్ని నడుపుతున్న రాజకీయ పెద్దలు క్షుణ్ణంగా శిశు మరణాలు కిషోర్ బాలిక మరణాలు బాలింతలు చూలింతలు మరణాలు గణనీయంగా అరికట్టవచ్చని అభిప్రాయం పరిశీలకులు వెల్లడిస్తున్నారు.
ఇప్పటికైనా ప్రజలను రూలింగ్ చేస్తున్న నాయకులు పార్టీలు, సమాలోచనలను చేసి నాణ్యతమైన చర్యలకు పూనుకోవలసిన పరిస్థితి ఎంతైనా ఉంది. ఒక రోడ్డు నిర్మిస్తే కల్తీ, ఒక ప్రాజెక్టు నిర్మాణం చేస్తే కల్తీ, పేదలకు భోజనాన్ని అందిస్తే కల్తీ, దేవాలయాల్లో ప్రసాదం అందిస్తే కల్తీ, అంగన్వాడీలో పౌష్టికాహారం పేరుతో ఇచ్చే పౌష్టిక ఆహారం కల్తీ, ఆఖరికి కొబ్బరి బొండంలో నీళ్లు కూడా కల్తీ. వీటిని అరికట్టాలంటే ముందుగా రాజకీయ నాయకుల్లో నీతి నిజాయితీ ధైర్యం గుండె బలం కండబలం ఉండాలి. నేటి సమాజంలో అలా ఉందామన్న ఆ సమాజం ఉండనీయదు. వారిపై అక్రమ కేసులు లేక జైలు కు పంపడమో లేక ఆర్థికంగా మానసికంగా వారిని ఇబ్బందులు గురి చేయడమో జరుగుతూ ఉంటాయి. ముందుగా మారవలసింది రాజకీయ వ్యవస్థ అనంతరం మారవలసింది సభ్య సమాజం. వీటితోపాటు ప్రభుత్వం ఉన్నతాధికారులు, క్రింది స్థాయి అధికారులు. వీరితోపాటు ప్రజల్లో కూడా చైతన్యం రావాలి అప్పుడే నాణ్యమైన ఆహారం లభిస్తుంది నాణ్యమైన వస్తువులు లభిస్తాయి. అంతవరకు ఈ సమాజం పరిస్థితి అంతే....!

### 24 న మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద

# ధర్నాలు విజయవంతం చేయాలి

### - సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు



**తణుకు (మనసులో మాట)మార్చి 18..** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ళస్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేటాయించి పేదల సొంతింటి కల నెరవేర్చాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 24న మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. బుధవారం తణుకు సీపీఐ కార్యాలయం నందు ఇళ్ళ స్థలాలు కోరుతూ ఈనెల 24 సీపీఐ ధర్నాల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా భీమారావు మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర ఇచ్చిన ఇళ్ళస్థలాలు ఎంతమాత్రం సరిపోవని తమ ప్రభుత్వం వచ్చాక జగనన్న నివేశనా స్థలాలు పొందిన వారికి కూడా వారి అంగీకారం మేరకు రెండు, మూడు సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇస్తామన్న కూటమి నాయకుల వాగ్దానం అమలు చేయాలని భీమారావు డిమాండ్ చేశారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సీపీఐ తణుకు ఏరియా కార్యదర్శి సికిలే పుష్పకుమారి మాట్లాడుతూ టిడ్కో గృహాల నిర్మాణ పనులు పూర్తి చేసి రోడ్లు, త్రాగునీరు, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. సీపీఐ నాయకులు గుబ్బల వెంకటేశ్వరరావు,బండి సత్యనారాయణ,బొద్దాని కృష్ణ కిషోర్, కొంబత్తుల రవికుమార్,నూనె రాధాకృష్ణ పాల్గొన్నారు.

# ఘనంగా అమ్మవారి జాతర



**కపిలేశ్వరపురం (మనసులో మాట) మార్చి 18..** కోరిన కోరికలు తీర్చే గ్రామ దేవతలు గా పేర్గాంచిన కపిలేశ్వరపురం శ్రీ నూకాంబికా అమ్మవారి జాతర, తీర్థం కార్యక్రమాలు బుధవారం రాత్రి తో ఘనంగా ముగిసాయి. అలాగే అంగర గ్రామంలో కొలువైన శ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగాయి . ఈ సందర్భంగా ఆలయ కమిటీ ల ఆధ్వర్యంలో అమ్మవార్లను భారీ గజమాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పరిసర గ్రామాలనుండీ వేలాది భక్తులు గ్రామాలకు భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని, కానుకలు, మొక్కుబడులు తీర్చుకున్నారు. ముఖ్యం గా అధిక సంఖ్య లో మహిళలు తమ చిన్నారులతో ఆలయాలకు విచ్చేసి కుంకుమ పూజలు జరిపించుకున్నారు. ఆలయాలను మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలతో కమిటీ నిర్వాహకులు, కార్యనిర్వహణాధికారులు కార్యక్రమాల్ని పర్యవేక్షించారు.



## ఉండి మసీదులో ఘనంగా నిర్వహించిన 27వ ఇఫ్తార్ విందు

ఉండి, (మనసులో మాట).మార్చి 18 : స్థానిక ఉండి మెయిన్ సెంటర్ లో ఉన్న మసీదు నందు రంజాన్ మాసం పురస్కరించుకొని ఇఫ్తార్ విందు మసీదు ఇమామ్ అర్షద్ అహ్మద్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు, గ్రామస్తులు, చుట్టుపక్కల వ్యాపారస్తులు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు, అనంతరం రంజాన్ మాసం యొక్క విశిష్టత గురించి వచ్చిన వారందరికీ వివరించారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసాలు ఉంటారనీ, ఇది ఇస్లాం మతంలోని ఐదు స్తంభాలలో ఒకటి. ఈ మాసంలో ముస్లింలు పగటిపూట ఆహారం, పానీయాలు తీసుకోరు, రాత్రిపూట నమాజ్ చేస్తారు. రంజాన్ యొక్క ప్రత్యేకతలు ఖురాన్ అవతరణ.రంజాన్ మాసంలోనే ఖురాన్ అవతరించింది.
నమాజ్ రంజాన్ మాసంలో నమాజ్ చేయడం చాలా ప్రతిఫలదాయకం.
దానధర్మాలు రంజాన్ మాసంలో దానధర్మాలు చేయడం చాలా ప్రశస్తం. ఇస్తిగ్ఫార్ రంజాన్ మాసంలో ఇస్తిగ్ఫార్ (క్షమాపణ) చేయడం చాలా ముఖ్యం. మరిన్ని రంజాన్ విశిష్టతల గురించి తెలిపారు ఈ కార్యక్రమంలో మసీద్ పెద్దలు. జామియా అజహర్ మస్జిద్, మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయం పై అవగాహన కలిగి ఉండాలి



**మండపేట (మనసులో మాట ) మార్చి 18..** ఆధునిక వ్యవసాయం పై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ అన్నారు. మండపేట మండలం వ్యవసాయ శాఖ అధికారి ప్రభాకర్ నేతృత్వంలో మండలంలో రైతన్న మీకోసం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ హాజరయ్యారు. ఈ వారోత్సవంలో భాగంగా ఇప్పనపాడు,పాలతోడు, వెలగతోడు గ్రామలలో రైతులకు అవగాహన సదస్సు లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలగతోడు సొసైటీ అధ్యక్షులు వల్లూరి సత్యనారాయణ , మాజీ అధ్యక్షులు లాజర్ , వైస్ సర్పంచ్ బోల్లి తారక రామారావు , నీటి సంఘం సభ్యులు బొబ్బిలి నాగేశ్వరరావు , గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

### వల్లూరు ఆదర్శ పాఠశాల లో

## ఉగాది పండుగ వేడుకలు



**కపిలేశ్వరపురం (మనసులో మాట ) మార్చి 18..** వల్లూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సంబరాలు బుధవారం వైభవంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయులు చిట్టూరి వెంకట శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థినీ, విద్యార్థులు తెలుగుతనం ఉట్టిపడేలా చీరకట్టు, పంచెకట్టు లతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, గ్రామ పెద్దలకు, పాఠశాలతల్లిదండ్రుల కమిటీ సభ్యులకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియచేసారు. మరుగున పడుతున్న సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాల వారికి కూడా తెలియ చేస్తున్నందులకు అభినందించారు. స్వచ్ఛమైన తెలుగు సంప్రదాయంలో ఈ పండుగ సంబరాలను గ్రామస్తులంతా పాఠశాలకు వచ్చి చేసుకోవడం నిజంగా చాలా ఆనందంగా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు చేసిన కృషి నీ అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో తల్లిదండ్రులు, గ్రామస్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, రామ తులసి, భవాని పాల్గొన్నారు.

### టేకి మసీదు లో పేద ముస్లిమ్ లకు

## నిత్యావసర సరుకులు పంపిణీ



**కపిలేశ్వరపురం (మనసులో మాట) మార్చి 18..** కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామంలో గల ఆహిలేసున్నతుల్ మసీదు నందు పేద ముస్లిమ్ లకు మాజీ డి సి సి బి చైర్మన్ రెడ్డి ప్రసాద్ చేతులు మీదుగా రంజాన్ తోఫా పంపిణీ చేశారు.చైర్మన్ షేక్ కరీం సాహెబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీక్ మసీదు చైర్మన్ సాహెబ్ ఆర్థిక సౌజన్యం తో నిత్యావసర సరుకులు కిట్లు పేదల కు అందించారు. అనంతరం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.టేకి మసీదు చైర్మన్ పదవి బాధ్యతలు అప్పగించిన మండపేట నియోజక వర్గ శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వర రావు కు కరీం సాహెబ్ కృతజ్ఞతలు తెలిపారు.టీడీపీ సీనియర్ నాయకులు అల్లూరి రామ కృష్ణ చౌదరి, ముత్యాల వెంకట్రావు,మేడిశెట్టి శ్రీను వాస్, ఇబ్రహీం,సిలార్, ఆదామ్, యాకోబు, బాబుల్, టేకి మసీదు సభ్యులు పాల్గొన్నారు.



# నేడు విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠంలో 'ఉగాది మహా సభ'

పిఠాపురం, (మనసులో మాట) మార్చి 18 : స్థానిక శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో మార్చి 19, గురువారం ఉదయం 9 గంటలకు పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా స్వామి అధ్యక్షతన 'ఉగాది మహా సభ' నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆస్థాన కళాకారుల సంకీర్తనలు, తాత్విక బాల వికాస్ పిల్లల ఆధ్యాత్మిక ప్రసంగాలు, అష్టావధాని శ్రీ యర్రంశెట్టి ఉమా మహేశ్వరరావు చే పంచాంగ శ్రవణం ఉంటాయి.

సుమారు 5 వేల మంది భక్తులు పాల్గొనే ఈ సభలో అందరికీ ఉగాది పచ్చడి పంపిణీ, ఉచిత భోజన సౌకర్యం కల్పించనున్నారు. ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలతో పాటు, ఆసక్తి గల వారికి స్వామి వారిచే 'మహా మంత్రోపదేశం' ఉంటుందని పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

# "పరాభవ" నామ సంవత్సర తెలుగు ఉగాదికి స్వాగతం ! సుస్వాగతం !!

**(19-3-2026, గురువారం "ఉగాది" పండుగ సందర్భంగా శుభాకాంక్షలతో..)**

కవిత రచన : కోట రామ ప్రసాద్

నిన్నటి "విశ్వావసు" కు వీడ్కోలు !
నేటి "పరాభవ" కు స్వాగతం ! సుస్వాగతం !!
"యుగాది" నుండి వస్తోంది "ఉగాది"
ఎన్నో వింతలూ, విడ్డూరాలు తెస్తోంది
అరవై తెలుగు సంవత్సరాల కాలచక్ర భ్రమణంలో
పాత "ఉగాది" వెళ్లిపోగా
క్రొత్త "ఉగాది" వచ్చింది
ముప్పై తొమ్మిదో సంవత్సరం "విశ్వావసు" వచ్చింది, వెళ్ళింది
ఖేదాలు, భేదాలు, మోదాలు ఎన్నో తెచ్చింది
ఇప్పుడు నలభయవ సంవత్సరం "పరాభవ" వచ్చింది
ప్రమోదాలు తెస్తుందో ! ప్రమాదాలు కొని తెస్తుందో !!
పరాభవాలు మిగులుస్తుందో !
ఏమి చేస్తుందో మరి !!

ఉగాది అంటే సంవత్సర కాలం
చైత్రం నుండి ఫాల్గుణం వరకు
పన్నెండు నెలల కాలం
తిరుగును కాల చక్రం
జరుగును జీవన సమరం
ప్రతీ హృదయం ప్రతీ ఉదయం
ఆహ్లాదంగా ఉండాలని కోరుకుంటుంది !
బ్రతుకు బండి బయలుదేరదేస్తుంది !!
ఆ బండి గమ్యం చేరునో !
మధ్యలో ఆగునో ! ఎవరికెరుక ?
ప్రయత్నం నీది, నాది
నిర్ణయం ఆ దేవునిది !

ఉగాది పచ్చడికీ, జీవితానికీ ముడి పడి ఉంది
ఉగాది పచ్చడి అంటే
షడ్రుచుల సమ్మేళనం
తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు ఎలాగో
అలాగే కష్ట సుఖాలు, సుఖ దుఃఖాలు
ఖేదాలు, ప్రమోదాలు
వచ్చేవే, పోయేవే
కష్ట సుఖాలు కావడి కుండలు
కష్టాలు కలకాలం ఉండిపోవు
సుఖాలతో జీవితాలు నిండిపోవు !!
కష్ట సుఖాలు వెలుగు నీడలై నడచును
పృథివిపైన మంచి చెడులలో మంచి నిలుచును
పెదవిపై పలుకు మాటలలో మంచి మాటలు మధురమౌను !!



**కోట రామ ప్రసాద్**
రిటైర్డ్ ఆంగ్ల భాష అధ్యాపకులు,
టీవీ & సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్, గేయ రచయిత,
పాలంగి గ్రామం – 534 216, తణుకు పట్టణం వద్ద,
ఉండ్రాజవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా

# దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వ అంకితభావంతో పనిచేస్తుంది

**- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ - దివ్యాంగ శక్తి" పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే నెహ్రూ**



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 18..** జగ్గంపేట ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు ఉచిత బస్సు కార్యక్రమం "దివ్యాంగ శక్తి" పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, నియోజవర్గంలోని నాలుగు మండలాల ఎంపీడీవోలు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఏలేశ్వరం డిపో మేనేజర్ జివి సత్యనారాయణ దివ్యాంగ శక్తి ఉచితబస్సు ఏర్పాటు చేశారు. జిల్లా టిడిపి విభిన్న ప్రతిభవంతుల అధ్యక్షుడు మండపాక అప్పన్న దొర ఆధ్వర్యంలో వందలాది మంది దివ్యాంగులు హాజరయ్యారు. దివ్యాంగులు అందరితో కలిసి ఉచిత బస్సుకి జెండా ఊపి ప్రారంభించి ఇర్రిపాక శివ కేశవుల ఆలయం వద్ద కు చేరుకున్న విభిన్న ప్రతిభవంతులకు భోజనం ఏర్పాటు చేసి దగ్గరుండి వడ్డించిన ఎమ్మెల్యే నెహ్రూ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దివ్యాంగులకు సౌకర్యవంతమైన జీవన విధానం కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దూరదృష్టితో ఈ అద్భుతమైన పథకాన్ని రూపకల్పన చేశారని తెలిపారు. దివ్యాంగులు సమాజంలో గౌరవంగా జీవించేందుకు, వారికి అవసరమైన సదుపాయాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. దివ్యాంగుల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ వారికి అండగా నిలుస్తోందని తెలిపారు.

ఈ పథకం ద్వారా వేలాది మంది దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, వివిధ రాయితీలు కల్పించడం ద్వారా వారి దైనందిన జీవితంలో సౌలభ్యం కలుగుతుందని చెప్పారు. ఐదు రకాల బస్సులు 40 శాతం వికలాంగత్వం దాటిన ప్రతి దివ్యాంగుడికి రాష్ట్రమంతా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరిగింది అని అన్నారు. దివ్యాంగులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, రాష్ట్ర డైరెక్టర్ లు పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, గెద్దాడ సత్యవేణి, ఎంపీపీ నాగబాబు, జిల్లా టిడిపి దివ్యాంగుల అధ్యక్షుడు మండపాక అప్పన్న దొర, గోకవరం మండలం దివ్యాంగుల అధ్యక్షుడు అడబాల సింగరయ్య, ఎండిఓ లు చంద్రశేఖర్, హరికృష్ణ, గోవిందు, హరికృష్ణ, సత్య రెడ్డి హరికృష్ణ, ఉప్పలపాటి బుల్లిబ్బులు, ఎర్రబాబు, రామకుర్తి నరసింహ, కుంచే తాతాజీ, అప్పన్న పెద్దకాపు, గుమ్మల అనంతలక్ష్మి, చెక్కా మరియా, అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

# దివ్యాంగశక్తి పథకాన్ని ప్రారంభించిన యనమల రాజేష్



**కోటనందూరు(మనసులో మాట) మార్చి 18..** సూపర్ సిక్స్ పథకాలతో దూసుకు పోతున్న కూటమి ప్రభుత్వం తాజాగా దివ్యాంగులకు ఉగాది కానుక అందించింది. ఉచిత బస్సులో చోటిచ్చింది. దివ్యాంగులకు సహాయ కుడిగా వచ్చే ప్రయాణికుడికి బస్ ఛార్జీలో యాభై శాతం రాయితీ ప్రకటించింది. దివ్యాంగుల శక్తి పథకాన్ని కొత్తగా లాంచ్ చేసిన కూటమి ప్రభుత్వం ఇవాళ్టి నుంచి ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది. తుని డిపో మేనేజర్ జీజీవీ రమణ అధ్యక్షతన కాకినాడ జిల్లా, తుని నియోజకవర్గంలో తేటగుంట క్యాంప్ కార్యాలయం వద్ద దివ్యాంగ శక్తి బస్ ప్రయాణ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. దివ్యాంగ శక్తి బస్సుకు సీనియర్ నేత యనమల రాజేష్ పచ్చజెండా ఊపారు. అనంతరం దివ్యాంగులకు జీరో టిక్కెట్ ను యనమల రాజేష్ అందించారు. ఈ సందర్భంగా యనమల రాజేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దివ్యాంగ శక్తి పథకం ద్వారా 11.16 లక్షల మంది దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం జరిగింది అలాగే సహాయకులకు కూడా 50% రాయితీ కల్పించబడుతుందని 40 శాతం వైకల్యం దాటిన దివ్యాంగులకు ఈ పథకం వర్తిస్తుందని దీనివలన ప్రభుత్వానికి ఏడాదికి 207 కోట్లు అదనపు భారం పడుతుందని తెలియజేశారు. అనంతరం చింతంనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంకంరెడ్డి రమేష్, సొసైటీ అధ్యక్షుడు పోలిశెట్టి రామలింగేశ్వర రావు, జనసేన కోఆర్డినేటర్ చోడిశెట్టి గణేష్, అరిగెల నర్సింహ మూర్తి వికలాంగులతో కలిసి బస్ లో ప్రయాణించారు. మండల కూటమి నాయకులు తమరాన సత్యనారాయణ, తమరాన రామకృష్ణ, చిటికెల శ్రీనివాసరావు, సుర్ల బోడయ్య, జక్కాన లోవరాజు, పోతల రాంబాబు ఎర్రకొనేరు గ్రామానికి చెందిన కొల్లు వెంకటేష్ , పప్పు వీరబాబు, టి వెంకటాపురం గ్రామానికి చెందిన కలగా శ్రీను, పప్పు నవీన్ ,బంధం బుజ్జి, హెచ్ కొత్తూరు గ్రామానికి చెందిన ములికి సూరిబాబు, తిమ్మాపురం గ్రామానికి చెందిన కాపారపు అబ్బులు ,అత్తి అచ్చుతారావు పోల్నాటి కృష్ణ, తేటగుంట కు చెందిన గజ్జి అప్పలరాజు, గజ్జి రాంబాబు ,కొల్లు సత్యనారాయణ, కాపారపు ప్రకాష్, గవరపేట కు చెందిన ములికి శ్రీను, పొలమరశెట్టి చంటిబాబుతో పాటు విజువలీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యుడు సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది కానుకగా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

**- దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం**



**కాకినాడ (మనసులో మాట) మార్చి 18..** ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ప్రత్యేకంగా దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద 40 శాతం పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, వారితో పాటు వచ్చే సహాయకులకు 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం కాకినాడ లోని జగన్నాథపురం ప్రాంతంలో ఘనంగా నిర్వహించబడింది.

రూరల్ ఎంపీపీ కర్రీ అనంతలక్ష్మి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీసుకున్న ఈ నిర్ణయం దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. ఉగాది పండుగ కానుకగా ఈ పథకం అమలు చేయడం గొప్ప విషయం అని అన్నారు. దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఎప్పుడూ అందుబాటులో ఉండి దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను గుర్తించి తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని తెలిపారు.

ఇంకా గోపాల్ మాట్లాడుతూ, దివ్యాంగుల సమస్యలను స్వయంగా వినిపించుకుని పరిష్కారానికి హామీ ఇచ్చిన నాయకుడు చంద్రబాబు నాయుడేనని అన్నారు. విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో దివ్యాంగులకు అవకాశాలు కల్పించడం పట్ల ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధిని కొనియాడారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గతంతో పోలిస్తే ఈసారి పథకంలో కీలక మార్పులు చేశామని తెలిపారు. ముందుగా కొన్ని వర్గాలకే పరిమితమైన సదుపాయాలను, ఇప్పుడు 21 రకాల అంగవైకల్యాలున్న వారందరికీ విస్తరించినట్లు చెప్పారు. 40 శాతం పైగా వైకల్యం ఉన్న ప్రతి దివ్యాంగుడికి ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంటుందని వివరించారు. పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్ బస్సుల్లో పూర్తిగా ఉచిత ప్రయాణం, ఏసీ, డీలక్స్ బస్సుల్లో 50 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు.

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ, ఈ పథకం దివ్యాంగులకు ఎంతో ఉపయోగపడుతుందని, ఉద్యోగాలు, వైద్యం, కుటుంబ అవసరాల కోసం ప్రయాణాలు సులభం అవుతాయని అన్నారు.

సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ, దివ్యాంగులకు పెన్షన్ పెంపు, ఉచిత బస్సు ప్రయాణం వంటి చర్యలు ప్రభుత్వ సంకల్పాన్ని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు కూడా దివ్యాంగులకు బస్సుల్లో కేటాయించిన సీట్లను గౌరవించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో డిపిటివో శ్రీనివాసరావు, డిపో మేనేజర్ మనోహర్, పిఆర్వో వెంకటరాజు,దివ్యాంగుల శాఖ జిల్లా ఎడి. వై.శ్రీనివాస్,దివ్యాంగుల పాఠశాలల నుంచి వచ్చిన దివ్యాంగ విద్యార్థులు, సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం కొంతమంది దివ్యాంగులతో కలిసి ప్రజాప్రతినిధులు బస్సులో ప్రయాణించి, వారికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భోజన వసతి కల్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు.

# ప్రమాద బీమా పదిలక్షల రూపాయల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 18..** భారత ప్రభుత్వం తపాలా శాఖ అనుబంధ సంస్థ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ కాకినాడ బ్రాంచ్ లోని ఖాతాదారుడు సోమవారం గ్రామానికి చెందిన బత్తిన భద్రం తాపీ పని చేసుకుని జీవనం గడిపేవాడు తాపీ పని సంఘం మేస్త్రి బొందల నాగేశ్వరావు సంఘం తరఫున ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ప్రమాద బీమా పాలసీని స్థానిక సోమవరం గ్రామ తపాలా కార్యాలయంలో చేయించడం జరిగింది . ఇటీవల నవంబర్ మాసంలో తాపీ పని కొరకు పనిపురమయించుకొనుచుండగా సోమవారం బస్టాండ్ సెంటర్లో కారు ప్రమాదం జరిగి అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు పోస్ట్ ఆఫీస్ లో తీసుకున్న ప్రమాద బీమా పాలసీ కొరకు తగిన డాక్యుమెంట్లు పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో అందించగా సదరు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ బ్రాంచ్ వారు బీమా సంస్థ ద్వారా 10 లక్షల బీమాను క్లైమ్ చేయించి చేయించారు ఈ బీమా స్థానిక రావులమ్మ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో జగ్గంపేట శాసనసభ్యుడు జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా కాకినాడ డివిజన్ తపాలా శాఖ అధికారి కె కృష్ణ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ రీజనల్ అధికారి విపి సురేష్ కాకినాడ బ్రాంచ్ మేనేజర్ కలపాల రాజ్ కుమార్ పెద్దాపురం సబ్ డివిజన్ అధికారి బ్రహ్మం నాయక్ జగ్గంపేట మాస్టర్ అజయ్ సోమవరం గ్రామం బ్రాంచ్ తపాలా పోస్ట్మాస్టర్ పేపకాయల వీర్రాజు తదితరులు కార్యకర్తలు సమక్షంలో చెక్కు అందజేయడం జరిగింది. జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ తక్కువ ప్రీమియంతో ఇన్సూరెన్స్ అందిస్తున్న పోస్టల్ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఆటో యూనియన్ సభ్యులందరికీ ఈ పాలసీని చేయించేందుకు హామీ ఇచ్చారు. టిడిపి కార్యకర్తలు కూడా 50- 50 భాగస్వామ్యం తో హెల్త్ పాలసీలు చేయిస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, పాండ్రంగి రాంబాబు, బోదిరెడ్ల సుబ్బారావు, రాయి సాయి, వైభోగుల కొండబాబు యాదవ్, గల్లా రాము, మంచి కంటి శ్రీను, యడలి రాంబాబు, నాలుగు మండలాల ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- మంత్రి కందుల**

**నిడదవోలు( మనసులో మాట) మార్చి 18..** నిడదవోలు నియోజకవర్గం, పెరవలి మండలం కాపవరం గ్రామంలో నిర్వహించిన "రైతన్నా మీకోసం" కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రైతుల ఇంటింటికీ వెళ్లి వారితో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. పంటల పరిస్థితి, సాగు సమస్యలు, నీటి వనరులు, ఎరువుల అందుబాటు వంటి అంశాలపై రైతుల అభిప్రాయాలను విన్నారు. అలాగే రైతుల కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి వివరించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి సమస్యకు ప్రాధాన్యతనిస్తూ పరిష్కారం చూపిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ



**తణుకు( మనసులో మాట)మార్చి 18..** తణుకు నియోజకవర్గం తణుకు పట్టణంలోని 4వ. వార్డులో రంజాన్ మాసం సందర్భంగా నూర్జహాన్ మసీద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో తణుకు నియోజకవర్గ శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసపు ఆధ్యాత్మికత, ఉపవాసం ప్రాముఖ్యత గురించి చర్చిస్తూ, మన సమాజంలో సౌహృదయం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షిచారు. గడిచిన అయిదేళ్ల వైసీపీ కాలంలో రంజాన్ తోఫాను ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదర,సోదరీమణులకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు.

# అత్యంత ప్రతిభవంతులకు ట్రై సైకిళ్లు పంపిణీ

**- ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు**



**ముమ్మిడివరం( మనసులో మాట) మార్చి 18.** అత్యంత ప్రతిభావంతులైన వారికి అవసరమైన పరికరాలు ప్రభుత్వ విప్,ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు .బుధవారం ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ యార్డు నందు ఆల్ మైకో సంస్థ ద్వారా సరఫరా కాబడిన వికలాంగుల పరికరములు గతములో రెండు పర్యాయాలు పంపిణీ అనంతరం ఇంకనూ అర్హులైన లబ్ధిదారులకు శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు చేతుల మీదుగా ట్రై సైకిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఓగూరి భాగ్యశ్రీ , మండల పరిషత్ అధ్యక్షులు కోలా గంగ భవాని బాబ్జి ,ముమ్మిడివరం నియోజకవర్గం సర్పంచులు, ఎంపీటీసీ లు సభ్యులు, అందరూ కూటమి నాయకులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జే ఎల్ ఎన్ దీక్షితులు , మండల తహసిల్దార్ టి.సుభాష్ , ముమ్మిడివరం నియోజకవర్గం లబ్ధిదారులందరూ పాల్గొన్నారు, నియోజకవర్గం వెల్ఫే అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

# భవిత కేంద్రాన్ని సందర్శించిన ఎంఈఓ రామశేఖర్




**కోటనందూరు మనసులో మాట మార్చ్ 18..** భవిత కేంద్రం కోటనందూరు మండలం నందు ఫిజియోథెరపీ అవసరం అయిన పిల్లలకు క్యాంప్ నిర్వహించడం జరిగింది. వారి అవసరాలకు అనుగుణంగా పలు రకాల వ్యాయామాలు చేయించడం జరిగింది. భవిత కేంద్రము నందు జరుగుతున్న ఫీజియోథెరపీ క్యాంప్ ను మండల విద్యాశాఖాధికారి ఎం.వి.రామశేఖర్ పరిశీలించారు. ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహణ మరియు ఫీజియోథెరపీ చేయడం వలన ఉపయోగాలు గురించి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా నిర్వహిస్తున్న ఈ ఫిజియోథెరపీ క్యాంప్ ను మండలంలోని ఫిజియోథెరపీ అవసరం గల పిల్లందరూ వినియోగించుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో సి ఆర్ పి వై.శేఖర్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ టీఎన్ఎస్ సోమేశ్వరరావు, ఐ ఈ ఆర్ పి లు ఎం.నాగ గోవిందు, ఆర్ నారాయణ రావు, ఆయా లోవలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక




## ధన్వంతరి సహస్రాయు పీఠం (గాదరాడ) ఆధ్వర్యంలో పూజలమ్మ (వనదేవత) జాతర మహోత్సవం

### 18,19,20 తేదీలలో ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ రవివర్మ సారధ్యంలో

జగ్గంపేట (మనసులో మాట) మార్చి 18.. గోవిందపురం, భూపతిపాలెం మధ్యలో పూజలమ్మ మెట్టపై వెలసిన శ్రీ పూజలమ్మ (వనదేవత) జాతర ధన్వంతరి అఖండయాగంతో ఘనంగా ప్రారంభమైనది.మొదటిరోజు గణపతి పూజ, పుణ్యాహవాచనం,పరివత్రాయాచిత్తం, పంచగవ్యప్రాసనం, రక్షాబంధన,ఋత్విగ్వరణ,దీక్షాధారణ,యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, ఆశీర్వచనం అనంతరం శ్రీ గోవిందం గోశాల ప్రారంభమైనది.మధ్యాహ్నం కోలాటం అనంతరం పూజలు, మండపారాధనలు అనంతరం హోమం ప్రారంభించారు.సాయంత్రం అమ్మవారి గరగలు, తప్పేటగుళ్ళు, తాడిపేద్దు, జానపద కళాకారులచే బుర్రకథ ఏర్పాటు చేయడం జరిగింది.రెండవరోజు ఉగాది పర్వదినం పురస్కరించుకొని పంచాంగ శ్రవణం అనంతరం ఉగాది పచ్చడి వితరణ, వసంత నవరాత్రులు ప్రారంభమౌతాయి.సాయంత్రం పూజలమ్మ ఆయుర్ వనం ప్రారంభం ఉంటుంది ఏపీ మెడిసినల్ ఏరోమేటిక్ ప్లాంట్ బోర్డ్ మరియు ధన్వంతరి సహస్రాయుపీఠం గదరాడ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఔషద మొక్కల సాగు, మార్కెటింగ్,మరియు సదుపాయాలపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ధన్వంతరి సహస్రాయుపీఠం ఆధ్వర్యంలో అమ్మవారి జాతర ఘనంగా జరుపబడును.ఆఖరి రోజు ధన్వంతరి అఖండ యాగం పూర్ణహుతి, అన్నసమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది.

## నవోదయ పరీక్ష ఫలితాలలో విక్టరీ స్టడీ సర్కిల్ ర్యాంకుల ప్రభంజనం




కోటనందూరు (మనసులో మాట)మార్చి 18.. జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష -2026 ఫలితాల్లో మొదటి లిస్టులోనే ఏకంగా 14 సీట్లు సాధించి విజయ దుందుభి మ్రోగించారు. ప్రత్తిపాడు మండలం, చింతలూరు గ్రామానికి చెందిన టి. రిషి 96.25 మార్కులతో తూర్పుగోదావరి జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించాడు. కొయ్యూరు మండలం, కొండగోకిరి గ్రామానికి చెందిన ఎం.అన్మిష 96.25 మార్కులతో విశాఖపట్నం జిల్లాలో 15వ ర్యాంక్ సాధించింది. తుని పట్టణానికి చెందిన ఎస్ మురళి శ్రీ 93.75 మార్కులతో తూర్పుగోదావరి జిల్లాలో నాలుగో ర్యాంక్ సాధించాడు. కోటనందూరు మండలం పి.కొట్టం గ్రామంకు చెందిన ఎస్ చరణ్ 92.50 మార్కులతో తూర్పుగోదావరి జిల్లాలో ఏడవ ర్యాంకు సాధించాడు సీట్లు సాధించిన విక్టరీ విద్యార్థులు టి.రిషి (96.25), ఎం.అన్మిష (96.25), ఎస్. మురళి శ్రీ 93.75, ఎస్ చరణ్ 92.50, కె.ధనుష్ కుమార్ 91.25, ఎస్.జాయ్ కార్తీక్ 91.25, ఎల్.నిత్య శ్రీ 90, ఎస్.వాత్సల్య 88.75,ఎం.ఆశ్రిత 87.50, బి.యుగంధర్ 87.50, యు.రష్మితశ్రీ 86.25, సిహెచ్ అనురూప్ 86.25, ఎం.లతిక్ రాజ్ 85, కె.దీపిక 82.50. కోచింగ్ తీసుకున్న ప్రతి ఆరుగురి విద్యార్థులలో ఒకరికి సీట్ రావడంతో పాటు జిల్లా ఉత్తమ ర్యాంకులను సాధించినందుకు గాను విక్టరీ డైరెక్టర్ పి.చిన్ని మరియు విక్టరీ ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించి, ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సీట్లతో ఇప్పటివరకు నవోదయకు 100 మంది విద్యార్థులను పంపడం చాలా ఆనందంగా ఉందనిఅలాగే ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో సీట్లు సాధించడం వెనుక విక్టరీ ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని డైరెక్టర్ చిన్ని తెలియజేశారు .

# ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎం ఫోటో పరిమాణం పై మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ అసంతృప్తి

- రెవెన్యూ స్టాంప్ సైజులో ఫోటో ఉండటంపై కాకినాడ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు
- ప్రొటోకాల్ ప్రకారం ఫోటో సైజును నిర్దేశిస్తూ అధికారులకు మెమో ఇవ్వాలని వినతి
- సానుకూలంగా స్పందించి, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తామన్న జిల్లా కలెక్టర్



కాకినాడ (మనసులో మాట) మార్చి 18.. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోటోల ఏర్పాటు విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ శాసనసభ్యులు ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఈరోజు (మార్చి 18న) కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ని వారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ మాట్లాడుతూ అధికారులు పని ఒత్తిడి వల్లనో లేదా మతి మరుపు తోనో ముఖ్యమంత్రి గారి ఫోటోను కేవలం ఒక రెవెన్యూ స్టాంప్ పరిమాణంలో ఏర్పాటు చేయడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. 40 ఏళ్లకు పైగా సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి, సూపర్ సిక్స్ వంటి ఎన్నో అద్భుతమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పట్ల ఈ విధమైన నిర్లక్ష్యం తగదన్నారు. వేదికల మీద అంత చిన్న సైజులో సీఎం ఫోటోను చూడటం నాయకులుగా తమను తీవ్ర మనస్తాపానికి గురిచేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి ఫోటో ఏ సైజులో ఉండాలనే దానిపై స్పష్టమైన ప్రమాణాలను నిర్దేశిస్తూ, అధికారులందరికీ ఒక మెమో జారీ చేయాలని ఆయన కలెక్టర్ గారిని కోరారు. ఈ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వెంటనే అధికారులకు ఈ విషయంపై తగిన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

# తెలుగు భాష ఔన్నత్యాన్ని గుర్తించాలి

- తెలుగు భాషాభిమానులు సంఘం ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం



అనపర్తి మనసులో మాట) మార్చి 18: నేటి ఆధునిక నాగరిక ప్రపంచంలో పర భాషలో ప్రావీణ్యం తప్పనిసరి అని, ఐతే వాటి వ్యామోహంలో పడి ప్రాచీన తెలుగు భాషను నిర్లక్ష్యం చేయడం తగదని , ప్రతి ఒక్కరూ తెలుగు భాష ఔన్నత్యాన్ని గుర్తించి భాషను భావితరాలకు సజీవంగా అందించాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, పరమేశు బయోటెక్ అధినేత తేతల ఉపేంద్రరెడ్డి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పరిషత్ పాఠశాలలో తెలుగు భాషాభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు వైబిఎస్.ఆచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పులగం వెంకటరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్య సాధన దిశగా పయనించాలని అన్నారు. తమ పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రస్తుతం అంతర్జాతీయంగా వివిధ రంగాల్లో రాణిస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. మరొక విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రముఖ మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ తాడి రామ గుర్రెడ్డి మాట్లాడుతూ, జీవితంలో ఎంత ఉన్నత స్థానానికి ఎదిగిన మన మాతృ భాషను మర్చిపోరాదని, తెలుగు భాష గొప్పతనాన్ని చాటుతూ , భాషా అభివృద్ధికి సంఘం ప్రతినిధులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వైబిఎస్. ఆచార్యులు మాట్లాడుతూ, తెలుగు భాష మీద మక్కువతో , తెలుగును సజీవంగా కాపాడుకోవాలనే తపనతో 13 ఏళ్ళ క్రితం సంఘాన్ని స్థాపించి , వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ, పాఠశాల స్థాయి నుండి విద్యార్థులకు తెలుగు భాష పట్ల ఆసక్తి కలిగేలా వివిధ ప్రతిభ పోటీలని నిర్వహిస్తున్నామని తెలిపారు, అంతకు ముందుగా తెలుగుతల్లి, భారతమాత చిత్రపటాలకు పూలమాలలు వేసి ఉగాది వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఉగాది పర్వదినం పురస్కరించుకుని అనపర్తిలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు పలు అంశాలు పై ప్రతిభ పోటీలు నిర్వహించి ముఖ్య అతిధుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేశారు. తెలుగు భాషాభిమానుల సంఘం ఫౌండర్ ఛైర్మెన్ అంగర వంశీ కృష్ణ, సంఘం కార్యదర్శి కిషోర్ కుమార్, ప్రతినిధులు సీనియర్ పాత్రికేయులు కర్రి శ్రీనివాసరెడ్డి, కళాకారులు చేవలి శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్, ప్రముఖ యూట్యూబర్ నల్లమిల్లి వినురెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు మానేపల్లి నాగార్జున, విజయ మోహన్ పాల్గొన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన తెలుగు పండితులు తెలుగు ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# జిజిహెచ్ లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్ గుండెపోటుతో మరణం





కాకినాడ (మనసులో మాట) మార్చి 18.. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ సెక్యూరిటీ గార్డ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘ సభ్యురాలు మాదాల జ్యోతి భవాని బుధవారం గుండెపోటుతో మరణించారు. జగన్నాధపురంలో అద్దెకుంటున్న ఆమె ఇంటి వద్ద ఇంటి పనులు పూర్తి చేసుకుని, క్యారేజ్ రెడీ చేసుకుని డ్యూటీ కి వచ్చే సమయంలో గుండెల్లో నొప్పి రాగా ఇంటి వద్దే గుండె పోటుతో మృతి చెందారు. జ్యోతి భవాని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి జి జి హెచ్ లో సెక్యూరిటీ గార్డ్ గా పనిచేస్తుంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు ప్రభుత్వ సామాన్య ఆస్పత్రిలో పనిచేస్తున్న తోటి సెక్యూరిటీ గార్డ్స్ అందరూ వెళ్లి ఆమె భౌతికాయాన్ని సందర్శించారు. సమాచారం తెలుసుకున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ఆమెకు ఘన నివాళు లర్పించారు. జోహార్ మాదాల జ్యోతి భవాని జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేశారు. ఆమె అకాల మృతి కి చింతిస్తు వారి కుటుంబానికి ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ సెక్యూరిటీ గార్డ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘంగా కాకినాడ కమిటీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని ఆయన అన్నారు. నిన్నటి వరకు తోటి వర్కర్లతో పాటు పనిచేసిన భవాని కోల్పోవడం బాధాకరంగా ఉందని కార్మికులందరూ విచారణ వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందిన మాదాల జ్యోతి భవానీని ప్రజాప్రతినిధులు, శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ కాంట్రాక్టర్ వారు ఆదుకోవాలని, ఆమెకు రావలసిన రాయితీలు పూర్తిస్థాయిలో అందచేయాలని, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కోసం కల్పించాలని, ప్రభుత్వ సామాన్య హాస్పిటల్ లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్(జి జి హెచ్) రంగరాయ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ కు (ఆర్ ఎం సి ) సాధారణ మరణం కానీ, యాక్సిడెంట్ గానీ వారికి ఏ ప్రమాదాలు సంభవించిన శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ కాంట్రాక్టర్ వారు ఆదుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే.వీ రామయ్య, ఎన్ అనిల్ కుమార్, రాజేంద్ర,శ్రీవల్లి, మధు, అవల లోవకుమారి,పి. రమణ, మీరాభి, ఎం ఎన్ ఓ రాజు,కే రాజు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో గిరిజన చట్టాల ఉల్లంఘన సహించబోం

- ఆర్కా రిసార్ట్స్ అక్రమ లీజును వెంటనే రద్దు చేయాలి...
- ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్




రంపచోడవరం (మనసులో మాట) మార్చి 18.. ఏజెన్సీ ప్రాంతమైన రంపచోడవరం కేంద్రంగా నిర్వహిస్తున్న ఆర్కా రిసార్ట్స్ వ్యవహారంలో గిరిజన చట్టాలను తుంగలో తొక్కడం పై ఆదివాసి గిరిజన సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఒక గిరిజన మహిళ పేరుతో ఉన్న ఆస్తులను లేదా ప్రభుత్వ లీజులను గిరిజనేతరులు అగ్రిమెంట్ల రూపంలో చేజిక్కించుకోవడం రాజ్యాంగ విరుద్ధం అనీ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా.తారామారావు అన్నారు.

1/70 చట్టం అమలు ఏజెన్సీ ప్రాంతంలో భూమి బదిలీ నియంత్రణ చట్టం (1/70) ప్రకారం గిరిజన భూమి గిరిజనేతరులకు బదిలీ కాకూడదు. లీజు లేదా సబ్-లీజు పేరుతో గిరిజనేతరులు రిసార్ట్స్‌ను నిర్వహించడం ఈ చట్టాన్ని ప్రత్యక్షంగా ఉల్లంఘించడమే. పీసా (పిసా ) చట్టం గ్రామ సభల అనుమతి లేకుండా, స్థానిక గిరిజనుల ప్రయోజనాలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ ఒప్పందాలను పీసా చట్టం ప్రకారం చెల్లనివిగా ప్రకటించాలనీ ఆయన డిమాండ్ చేశారు.

అక్రమ నిర్మాణాలు వెంటనే నిలిపివేత చేయాలి..

టూరిజం బిల్డింగ్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అధికారులు తక్షణమే నిలిపివేయాలనీ, గిరిజన చట్టాలను ధిక్కరించి, బినామీ పేర్లతో లేదా అక్రమ అగ్రిమెంట్లతో వ్యాపారం సాగిస్తున్న గిరిజనేతరులపై వారికి సహకరిస్తున్న వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలనీ,గిరిజన ప్రాంతం గిరిజనులది. ఇక్కడ చట్టాలను అతిక్రమించి వ్యాపార సామ్రాజ్యాలు నిర్మిస్తామంటే ఆదివాసీ సమాజం చూస్తూ ఊరుకోదనీ ఆర్కా రిసార్ట్స్ లీజును వెంటనే రద్దు చేయలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్,ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి (పి ఓ ) ఈ విషయంలో తక్షణమే స్పందించి విచారణ చేపట్టాలనీ, గిరిజనుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉందనీ, నిర్లక్ష్యం వహిస్తే ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఉధృతమైన పోరాటాలు చేస్తామని అధికారులను ఆయన హెచ్చరించారు.



## ఎన్నికల హామీలను నెరవేరుస్తున్న ఏకైక నేత చంద్రబాబు

- ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట (మనసులో మాట) మార్చి 18; ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయ చినరాజప్ప అన్నారు. బుధవారం సామర్లకోట మండలం కాపవరంలో మండల వ్యవసాయ అధికారి మురళీధర్ రావు అధ్యక్షతన నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొని ప్రసంగించారు. రైతుల కోసం అన్నదాత సుఖీభవ, యాంత్రికరణ వంటి పథకాలను చంద్రబాబు అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రైతు సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ సేవలను రైతులు సద్వినియోగం చేసుకొని మంచి అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే చినరాజప్ప కోరారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సేవలు అందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి మురళీధర్ రావు వివరించారు. ప్రతి రైతుకు ప్రభుత్వ అండగా ఉంటుందని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మకాయల రంగనాగు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల కుమారస్వామి, నిమ్మకాయల కిరణ్, కంటే జగదీష్ మోహన్, కాపవరం నేతలు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలను పరిశీలించిన అడ్డతీగల ఎంపీడీవో



రంపచోడవరం మనసులో మాట మార్చి 18.. అడ్డతీగల మండలం అడ్డతీగల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను అడ్డతీగల ఎంపీడీవో ఏ వి వి కుమార్ తనిఖీ చేశారు. బుధవారం జరిగిన హిందీ పరీక్షకు మొత్తం విద్యార్థులు 127 మంది కాగా 127 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరు అయ్యారని వీరిలోబాలురు 68 మంది బాలికలు 59 పరీక్షకు హాజరయ్యారని పరీక్షలు ప్రశాంతంగా జరుగు చున్నవని నాతో పాటు శ్రీ సి. హెచ్.శ్రీనివాసరావు మండల విద్యా శాఖ అధికారి నాతో పాటు పడుకున్నారని ఆడదే, ఎంపీడీవో ఏవివి కుమార్ తెలిపారు.

## దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం

- పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



పెద్దాపురం (మనసులో మాట) మార్చి 18; దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. బుధవారం పెద్దాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దివ్యాంగుల ఉచిత బస్సు సర్వీస్ పథకాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప లాంచనంగా ప్రారంభించారు. దివ్యాంగులకు పూర్తి ఉచితంగాను, దివ్యాంగుల వెంట వచ్చే సహాయకులకు 50% రాయితీతో బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దివ్యాంగుల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల రాజప్ప వివరించారు. ముందుగా దివ్యాంగులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన బస్ సర్వీస్ పథకాన్ని ప్రారంభించారు. పెద్దాపురం ఎంపీడీవో సూర్యనారాయణ, సామర్లకోట ఎంపీడీవో హిమామహేశ్వరి, రాజా సూరిబాబురాజు, రంది సత్యనారాయణ, బడుగు శ్రీకాంత్ అడబాల కుమారస్వామి తదితర నేతలు పాల్గొన్నారు

## మద్రాసు వర్సెటీ "ఉగాది వేడుకల్లో బాల కవి " దొండపాటి తన్మయ సాహిత్య" తండ్రి సత్యమూర్తి తల్లి రత్నకుమారి కవితా పఠనం



అనపర్తి (మనసులో మాట) మార్చి 18: మద్రాసు తెలుగు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో, పరాభవ ఉగాది వేడుకలు బుధవారం చెన్నై మేరీనా ఆవరణలో గల రజోత్సవ ప్రాంగణం వేదికగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని రాష్ట్రాల్లో ఉన్న తెలుగు కవులతో నిర్వహించిన కవి సమ్మేళనంలో, తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి కి చెందిన 5వ తరగతి చదువుతున్న దొండపాటి తన్మయ సాహిత్య బాల కవిగా ప్రత్యేక ఆహ్వానంతో పాల్గొంది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా న్యూ ఢిల్లీ సర్వోన్నత న్యాయ స్థానానికి చెందిన న్యాయవాది డాక్టర్ అద్దేపల్లి పురుషోత్తం విచ్చేసారు. ప్రత్యేక అతిధులుగా డాక్టర్ ఏ వి.శివకుమారి, మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకట రమణ, మద్రాసు తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు, డాక్టర్ పాండురంగ కాళియప్ప, ప్రముఖ సాహితీవేత్తలు పాల్గొన్నారు. కవి సమ్మేళనం లో అత్యంత పిన్న వయస్కురాలిగా విశేష ప్రతిభ కనబరిచిన చిన్నారి తన్మయ సాహిత్యను అందరూ ప్రశంసించారు. తమ జిల్లా నుండి ఇంతటి విశిష్ట కార్యక్రమంలో పాల్గొనే అరుదైన అవకాశాన్ని పొందిన తన్మయను స్థానిక సాహితీవేత్తలు ,పుర ప్రముఖులు, శ్రీ లావణ్య పబ్లిక్ స్కూల్ యాజమాన్యం ,పలువురు ప్రశంసించారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక




## నవోదయ, సైనిక స్కూల్ ప్రవేశ పరీక్షల్లో భవిష్య స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 17..** 2026-2027 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన నవోదయ మరియు సైనిక స్కూల్ ప్రవేశ పరీక్షల్లో భవిష్య స్కూల్ ప్రభంజనం.విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో సీట్లు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం మరియు అధ్యాపక బృందం గర్వంగా ప్రకటించింది. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి పాఠశాల కీర్తిని చాటిన మా విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు. విజయం సాధించిన ఆణిముత్యాలుఅకాసపు నిఖిల్ సిద్ధార్థ నవోదయ విద్యాలయంలో సీటు సాధించారు.దండు హరి నాగ చాతుర్య నవోదయ మరియు సైనిక స్కూల్ రెండింటిలోనూ ప్రవేశానికి అర్హత సాధించారు.ఈ సందర్భంగా యాజమాన్యం స్పందిస్తూ ఈ విజయం విద్యార్థుల కఠోర శ్రమకు మరియు మా ఉపాధ్యాయ బృందం అందించిన అంకితభావంతో కూడిన శిక్షణకు నిదర్శనం. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారు జాతీయ స్థాయిలో రాణించేలా పునాది వేయడమే భవిష్య స్కూల్ లక్ష్యం. నిఖిల్ సిద్ధార్థ మరియు నాగ చాతుర్యలకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నామని తెలియజేశారు

## ఉగాది పండుగ సందర్భంగా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు

**రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు**



**కాకినాడ (మనసులో మాట) మార్చి 18..** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కాకినాడ జిల్లా ప్రజలందరికీ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు సంవత్సరాది అయిన ఉగాది కొత్త ఆరంభాలకు, ఆశలకు, ఆనందాలకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఐశ్వర్యం, ఆరోగ్యం నిండాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఉగాది మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతిబింబమని, పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి వంటి ఆచారాలు మన జీవితంలో సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించే తత్వాన్ని నేర్పిస్తాయని అన్నారు. కొత్త సంవత్సరంలో ప్రజలు సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. దేశం మరియు రాష్ట్రం , కాకినాడ జిల్లా అభివృద్ధి దిశగా మరింత వేగంగా పయనించాలని, రైతులు, యువత, మహిళలు అన్ని వర్గాల ప్రజలు అభ్యున్నతిని సాధించాలని కోరుకున్నారు. ముఖ్యంగా యువత తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని కష్టపడి పనిచేస్తే విజయం సాధించగలరని ప్రోత్సహించారు.ప్రజలందరూ సఖ్యత, ఐక్యతతో కలిసి జీవిస్తూ సమాజంలో శాంతి, సామరస్యాన్ని పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రకృతి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ ఉగాది కొత్త ఆశలు, కొత్త అవకాశాలతో నిండిన సంవత్సరంగా మారాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ మరోసారి ప్రజలందరికీ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్స్ పటిష్ట భద్రత ఏర్పాట్లను పరిశీలించిన...

### - కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్



**కాకినాడ (మనసులో మాట) మార్చి 18..** ఈవీఎం, వీవీపాట్స్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) లకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఈవీఎం గోదామును రెవిన్యూ, ఎన్నికలు అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులు, జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పరిశీలించారు. ఈవీఎం గోదాములో నియోజకవర్గాల వారీగా భద్రపరిచిన ఈవీఎం బాక్సులను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి ఈవీఎంలు, వీవీ పాట్స్ భద్రతకు చేపడుతున్న వివరాలను తనిఖీ చేసి వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీపాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఎన్నికల, అగ్ని మాపక శాఖల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఈవీఎంల గోదామును పరిశీలించి నివేదిక పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గోదామును పరిశీలించడం జరుగుతుందని జేసీ వెల్లడించారు. ఈ పరిశీలనలో జిల్లా జాయింట్ కలెక్టర్ వెంట కాకినాడ అర్బన్ తహసీల్దార్ వీ.జితేంద్ర, రాజకీయ పార్టీల ప్రతినిధులు టీవీ.సాంచి (ఆప్), ఎస్.అప్పారావు సీహెచ్.రమేష్ బాబు (భాజపా), (బీఎస్పీ), పీ. శ్రీను(కాంగ్రెస్), ఎం.లోవరాజు (తెదేపా), ఆర్.వెంకటేశ్వరరావు (వైఎస్సార్సీపీ), పలివెల వీరబాబు( సీపీఎం), ఎ. సత్యకుమార్ (జనసేన) ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అమలాపురంలో 'జాదూగర్ సికిందర్' ఇంద్రజాల విన్యాసాల



**అమలాపురం (మనసులోమాట) మార్చి 18 :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలకు అద్భుతమైన వినోదాన్ని అందించేందుకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెజీషియన్ సూపర్ స్టార్ జాదూగర్ సికిందర్ అమలాపురం చేరుకున్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వేదికగా నేటి నుండి ఈ మ్యాజిక్ షోలు ప్రారంభం కానున్నాయి. రాబోయే 20 రోజుల పాటు ప్రతిరోజూ రెండు ప్రదర్శనలు ఉంటాయని నిర్వహకులు తెలిపారు. మొదటి షో: సాయంత్రం 5:00 గంటల నుండి 7:00 వరకు. రెండవ షో: రాత్రి 7:00 గంటల నుండి 9:00 వరకు. షోలు ఏర్పాటు చేశామని వారు తెలిపారు.గతంలో ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ వంటి మహానగరాల్లో 10 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసిన సికిందర్ బృందం, ఇప్పుడు అమలాపురం ప్రేక్షకులను అలరించనుంది. ఈ షోలో ప్రత్యేకంగా 'డైనోసార్ భ్రమ రహస్యాలతో కూడిన 'బెర్ముడా ట్రయాంగిల్' ప్రభావం , గగుర్పాటు కలిగించే వినూత్న ఇంద్రజాల విన్యాసాలు ప్రదర్శించనున్నారు. వీటితో పాటు కడుపుబ్బ నవ్వించే 'కామెడీ మ్యాజిక్' కూడా ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని ఇవ్వనుంది. ఈ ప్రదర్శనలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆర్గనైజర్ ఏ.కే. బాబు మాట్లాడుతూ.. కొత్త శైలి,సరికొత్త అనుభవంతో ప్రతిరోజూ రెండు షోలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కోనసీమ జిల్లా ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనను తిలకించాలని ఆయన కోరారు. ఇప్పటికే ఈ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి కావడంతో అమలాపురంలో మ్యాజిక్ సందడి మొదలైంది. ప్రదర్శన సమయాలు, టిక్కెట్ల వివరాల కోసం నేరుగా అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద సంప్రదించవచ్చు వారు తెలిపారు.

## జెడ్. భావారంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



**కాకినాడ (మనసులో మాట) మార్చి 18:** కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం జెడ్. భావారంలో సిమెంటు (సీసీ) రోడ్డు నిర్మాణానికి బుధవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని కూటమి నాయకులు కలిసి నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చొరవతో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం కొనసాగుతున్నందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాకినాడ రూరల్ శాసన సభ్యులు పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) జెడ్ భావారం గ్రామానికి ఆరు సీసీ రోడ్లను మంజూరు చేయించారని, కరప మండలంలో 11 కోట్లతో 94 సిసి రోడ్లు మంజూరు చేసినట్లు నాయకులు తెలిపారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. భావారం గ్రామ శివారుపేటలో నిర్మించబోయే నూతన సీసీ రోడ్డుకు శాస్త్రోక్తంగా కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. జనసేన భావారం గ్రామ అధ్యక్షులు గుణ్ణం ఉదయ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన కరప మండల అధ్యక్షులు బండారు మురళి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్, సీనియర్ నాయకులు పబ్బినీడి మూర్తి, కోసెటి తిరుమలరావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు పాలిక సూరిబాబు, గుబ్బల భాస్కరరావు, పితాని రామారావు, చిట్టూరి సత్యనారాయణ, శ్రీను, పాలిక శ్రీను, గుబ్బల శ్రీను తదితర కూటమి నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### పార్కుల్లో పనిచేస్తున్న పనిచేస్తున్న స్వీపర్స్ కి

## బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలి

### - ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్



**కాకినాడ( మనసులో మాట) మార్చి18..** ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ సంఘలో భాగంగా పార్క్ స్వీ పర్స్, సెక్యూరిటీ గార్డ్స్, తోటమాలిని యొక్క సమస్యలు తెలుసుకునేందుకు ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ బుధవారం ఉదయం గాంధీనగర్ పార్క్ సందర్శించడం జరిగింది. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ పరిధిలో కుళాయి చెరువు పార్క్, గాంధీ నగర్ పార్క్ ప్రధానమైనవి అని, వీటికి రోజు వందలాదిమంది వాకర్స్, షటిల్ బ్యాట్స్, యోగ, ఎక్సైజ్ వంటి ఆరోగ్యానికి ఆహ్లాదకరమైన ఆసనాలు చేసే వారు వస్తూ ఉంటారని, ఇటువంటి వారికి ఆటంకాలు కలగకుండా ప్రతిరోజు పార్కులను సుబ్రపరిచే విధంగా పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం టెండర్లకు పిలిచిందని, ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టర్ సంవత్సరం పూర్తవుతుందని, కార్మికులకు రెండు నెలల బకాయి జీతాలు చెల్లించాలని ఆయన అన్నారు, సకాలంలో కార్మికులకు జీతాలు చెల్లించ లేనందున ఆర్థిక ఇబ్బందులతో అప్పులతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీతాల విషయంపై కాంట్రాక్టర్ నిలదీగా కార్పొరేషన్ వారు బిల్లులు మంజూరు చేయడం లేదని వారు బదులు చెప్తున్నారని ఆయన అన్నారు. కార్మికుల జీతాలు మంజూరుకు కార్పొరేషన్ అధికారులు బిల్లులు మంజూరు చేయాలని ఆయన అన్నారు. కాంట్రాక్టు పరిధి పూర్తయితే వారి జీవితాలకు భరోసా ఎవరిని, ఏ కొత్త కాంట్రాక్టర్ పార్కుల టెండర్ విధానం తీసుకున్న కార్మికులకు పి.ఎఫ్, ఈఎస్ఐ తప్పనిసరిగా వర్తింప చేయాలని, ప్రస్తుతం ఇస్తున్న జీతాలు కన్నా నిత్యవసర అధిక ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, లెస్ దెన్ టెండర్ విధానం వేసి కార్మికులను ఇబ్బందులు పెడితే చూస్తూ ఊరుకోమని ఆయన అన్నారు. పార్కుల్లో పనిచేస్తున్న కార్మికుల బ్రతుకులకు భద్రత కరువైందని, విషపూరితమైన పాములు పురుగులు కుట్టిన కనీసం వారికి ఈఎస్ఐ ద్వారా వైద్య సదుపాయం అందడం లేదని ఆయన అన్నారు. తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా ఆయన వారికి జీతాలు మంజూరు చేయాలని ఆయన అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే సంఘటితం కావాలని, సంఘంగా ఉంటేనే ఏ సమస్య అయినా పరిష్కారం చేసుకోవచ్చని అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్క్ యూనియన్ మెంబర్లు అందరూ పాల్గొన్నారు.



### పూజాలమ్మ ఆయుర్వనం ప్రారంభించి

## రైతులకు అవగాహన సదస్సు

### శ్రీశ్రీశ్రీ పూజాలమ్మ (వనదేవత) జాతర మహోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 18..** జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామ శివారులో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ పూజలమ్మ (వనదేవత) జాతర మహోత్సవాల్లో బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే , టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాల సేకరించారు. అనంతరం ధన్వంతరి అఖండయాగంలో పాల్గొన్నారు. ధన్వంతరి సహస్రాయు పీఠం పకృతి వైద్యుడు డాక్టర్ గొట్టిముక్కల రవి వర్మ, నాని రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పూజలమ్మ ఆయుర్వనం ప్రారంభించారు. ఔషధ మొక్కలు నాటి వాటి యొక్క విశిష్టతను డాక్టర్ రవి వర్మ ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి ఔషధ మొక్కల సాగు రైతుల అవగాహన కార్యక్రమం పాల్గొని ఔషధ మొక్కల సాగు మార్కెటింగ్ మరియు సదుపాయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ధన్వంతరి గోశాలను సందర్శించి అక్కడ ఉన్న 600 గోవులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, అన్నవరం రిటైర్డ్ పిఆర్ఓ తులా రాము, వేములకొండ జోగారావు, రాయి సాయి, గోవిందపురం సర్పంచ్ కమ్మిల వెంకటేశ్వరరావు, గొట్టిముక్కల నాని రాజు, బోదిరెడ్ల సుబ్బారావు, వైబోగుల కొండబాబు యాదవ్, కొల్లు రామకృష్ణ, హనుమంతు పద్మనాభం, తదితరులు పాల్గొన్నారు.ద

## పి .తిమ్మాపురంలో 'రైతన్న మీకోసం'

- సహజ వ్యవసాయానికి అనుకూలంగా పీఎండిఎస్ విత్తనాల పంపిణీ
- మెళకువలపై రైతులకు అవగాహన..
- వెదజల్లే పద్ధతిలో నీటి వినియోగం రైతులకు మరింత మేలు



**పిఠాపురం (మనసులో మాట) మార్చి 18:** మండలంలోని పి .తిమ్మాపురం గ్రామంలో బుధవారం 'రైతన్న మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ.. ఎలినోన్ ప్రభావంతో ఎండలు తీవ్రంగా ఉంటాయని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించేలా రైతులు వెదజల్లే పద్ధతిని అనుసరించాలన్నారు. సాగు యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రాయవరం గ్రామంలో 'పొలంబడి' కార్యక్రమాన్ని నిర్వహించి పంటల సాగుపై అవగాహన కల్పించారు. సహజ వ్యవసాయానికి అనుకూలంగా భూమిని సారవంతం చేసేందుకు రైతులకు పి ఎం డి ఎస్ విత్తనాలను పంపిణీ చేశారు. సహాయ సంచాలకులు స్వాతి, పశువైద్యాధికారి రంజిత్ సింగ్, మండల వ్యవసాయ అధికారి గంగాధర్, మాజీ జడ్పీటీసీ బర్ల అప్పారావు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## గోగులమ్మ తల్లి ఉగాది వేడుకలకు భారీ ఏర్పాట్లు




**పెదపూడి (మనసులో మాట) మార్చి 18;** పెదపూడి మండలం గొల్లల మామిడాడ శివారు లక్ష్మీనరసాపురంలోని ప్రసిద్ధ గోగులమ్మ తల్లి ఉగాది ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేపట్టినట్లు కమిటీ నేతలు కర్రీ వీర్రెడ్డి, భీమేష్ రెడ్డి, యూత్ సభ్యులు తెలిపారు. ఉగాది ఉత్సవాల నిమిత్తం అమ్మవారి ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. ఈ ఏడాది 5 లక్షల రూపాయల చిల్లర నాణాలతో అమ్మవారి సన్నిధిని అలంకరిస్తున్నట్లు తెలిపారు. భక్తజన వరప్రదాయినిగా, కోరిన కోర్కెలు నెరవేర్చే మహిమాన్విత శక్తి ప్రదాతగా గోగులమ్మ తల్లి ప్రసిద్ధి చెందింది. ఉగాది ఉత్సవాల నిమిత్తం తరలివచ్చే భక్తులకు అన్నప్రసాదాన్ని కూడా అందిస్తామన్నారు. సుమారు 15 వేల మంది భక్తుల కోసం షడ్రుచులతో కూడిన ఆహార పదార్థాలను సిద్ధం చేస్తున్నట్లు ఉప సర్పంచ్ తాతారెడ్డి, భీమేశ్ రెడ్డి, యూత్ సభ్యులు వివరించారు. అమ్మవారి దర్శనానికి, ఉగాది ఉత్సవాలకు భక్తులు తరలి రావాలని యూత్ సభ్యులు కోరారు.

## ప్రశాంతంగా పదవ తరగతి హిందీ పరీక్ష

### - డీఈవో పి. రమేష్

**కాకినాడ (మనసులో మాట) మార్చి 18..** కాకినాడ జిల్లాలో పదవతరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారం హిందీ పేపర్ పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి రమేష్ బుధవారం సాయంత్రం వెల్లడించారు. జిల్లా పరిశీలకులు 5 పరీక్షా కేంద్రాలును, జిల్లా విద్యాశాఖాధికారి 6 పరీక్షా కేంద్రాలను, అసిస్టెంట్ కమీషనర్ 6 పరీక్షా కేంద్రాలును మరియు తనిఖీ అధికార్లు 40 పరీక్షా కేంద్రాలును తనిఖీ చేయడం జరిగినది. మొత్తం 28316 విద్యార్థులకు గాను హిందీ పేపర్ పరీక్షకు 27987 మంది విద్యార్థులు హాజరయినారు, 329 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరు అయినారు. హిందీ పేపర్ పరీక్ష అన్ని పరీక్షా కేంద్రాలలోను ప్రశాంతంగా జరిగినదని. ఓపెన్ స్కూల్ పదవ తరగతి పరీక్షలు బుధవారం ఇంగ్లీష్ పరీక్ష జరిగినది. మొత్తం 2137 విద్యార్థులకు గాను తెలుగు పేపర్ పరీక్షకు 1452 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు, 685 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరు అయినారు. తనిఖీ అధికార్లు 10 పరీక్షా కేంద్రాలును తనిఖీ చేయడం జరిగినది. ఇంగ్లీష్ పరీక్ష అన్ని పరీక్షా కేంద్రాలలోను ప్రశాంతంగా జరిగిందని డీఈఓ పి.రమేష్ తెలియచేశారు.

## జ్యోతిష్య శికామణి సత్యనారాయణకు నేడు సత్కారం



**కాకినాడ, (మనసులో మాట) మార్చి 18:** జ్యోతిష్య శికామణి, సిద్దాంతి, ప్రతిభా రత్న అవార్డు గ్రహీత ఆకేటి సత్యనారాయణను గురువారం ఘనంగా సత్కరించనున్నారు. కాకినాడ రమణయ్యపేటలో ఉదయం 11 గంటలకు అడబాల రత్న ప్రసాద్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే ఉగాది మహోత్సవ వేడుకలలో సత్యనారాయణ ను సత్కరించనున్నారు. విశ్రాంత బ్యాంకు ఉద్యోగి అయిన సత్యనారాయణ కవిగా, రచయితగా, ఆధ్యాత్మికవేత్తగా సేవలు అందించి కామదేను అవార్డును గతంలో అందుకున్నారు. అంతేకాకుండా అనేకమందికి జ్యోతిష్యం వాస్తు సేవలను ఉచితంగా అందించినందుకుగాను ఈ సత్కార కార్యక్రమానికి ఎంపిక చేశారు.





# "కొవ్వూరులో దివ్యాంగ శక్తి పథకం" ప్రారంభం

**- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు**

**కొవ్వూరు (రాజమహేంద్రవరం), మనసులో మాట, మార్చి 18:** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా అమలు చేస్తున్న "దివ్యాంగ శక్తి పథకం" కార్యక్రమంలో భాగంగా కొవ్వూరు ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో 40 శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన దివ్యాంగులతో కలసి బస్సులో ప్రయాణించి, స్వయంగా బస్సును నడిపారు. అనంతరం కొవ్వూరు ఎంపీడీఓ కార్యాలయంలో దివ్యాంగులతో కలసి భోజనంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, సౌకర్యాల మెరుగుదల కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ పథకం ద్వారా దివ్యాంగులకు మరింత సౌకర్యవంతమైన, సులభమైన రవాణా సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. దివ్యాంగులకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, ఆళ్ల హరిబాబు, నాదేళ్ల శ్రీరామ్, టీవీ రామరావు, సూరపని చిన్ని, దాయన రామకృష్ణ, భావన రత్నకుమారి, చావా శ్రీను, దొంగ రామకృష్ణ, కాకర్ల సత్యేంద్ర, జొన్నా బాలకృష్ణ, బొల్లిన నాగేంద్ర, బొడ్డు కేశవ, సుంకర సత్తిబాబు, ఉప్పులూరి చిరంజీవి, మునుకోటి శ్రీనివాస్, గురజాల సురేష్, వట్టికూటి వెంకటేశ్వరరావు, వేల్పూరి శ్రీనివాస్, వరిగేటి కాంతరాజు, కొక్కిరిపాటి వెంకటేష్, కడదారి నవ్య, బొబ్బిలి పెరరాజు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 33 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం




**యానాం, (మనసులో మాట) మార్చి 18:** యానాం లోని పలు ప్రాంతాలలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా విక్రయించేందుకు నిల్వచేసిన 34 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు యానాం ఎస్పి వరదరాజన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఈ నెల 13వ తేది రాత్రి స్థానిక బోటు స్ట్రీట్ లో 7.65 లీటర్ల అక్రమ మద్యాన్ని విక్రయిస్తుంటే పట్టుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా 16వ తేదీ రాత్రి స్థానిక బైపాస్ రహదారిలో 14.5 లీ. మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే 17వ తేదీన స్థానిక న్యూ బస్టాండ్ ప్రాంతంలో 12 లీటర్ల మద్యశీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 18 వేలు ఉంటుందని ఎస్పీ వరదరాజన్ తెలియజేశారు.

# ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

**ఎమ్మెల్యే వేగుళ్ళ...**



**మండపేట (మనసులో మాట ) మార్చి 18..** రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మండపేట నియోజకవర్గ ప్రజలకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రతీ ఒక్కరూ గణనీయమైన ప్రగతి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. శ్రీ పరాభవ నామ సంవత్సరం అందరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలని, సకల విజయాలను చేకూర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# జిల్లాలో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం

**- దివ్యాంగ శక్తి పథకం ద్వారా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం**
**- ఆర్టీసీ బస్ స్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు దివ్యాంగులతో కలిసి అధికారులు, నేతల ప్రయాణం**





**కాకినాడ (మనసులో మాట) మార్చి 18..** ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ప్రత్యేకంగా దివ్యాంగ శక్తి పథకాన్ని బుధవారం ప్రారంభించిందని ఈ పథకం కింద 40 శాతం పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, వారితో పాటు వచ్చే సహాయకులకు 50 శాతం రాయితీ కల్పిస్తుందని ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నేటి నుంచి అమలు చేస్తున్న దివ్యాంగ శక్తి పథకం దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం కాకినాడ ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ పట్టణం ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, కాకినాడ రూరల్ ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేటి నుంచి రాష్ట్రంలో మరో మంచి పథకం ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. గతంతో పోలిస్తే ఈసారి పథకంలో కొని కీలక మార్పులు చేయడం జరిగిందని తెలిపారు. ముందుగా కొన్ని వర్గాలకే పరిమితమైన ఈ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాలను, ఇప్పుడు 21 రకాల అంగవైకల్యాలున్న వారందరికీ విస్తరించినట్లు చెప్పారు. 40 శాతం పైగా వైకల్యం ఉన్న ప్రతి దివ్యాంగుడికి ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంటుందని వివరించారు. స్త్రీ శక్తి పథకానికి ఉపయోగించే ఐదు రకాల బస్సులకు పూర్తి ఉచితంగాను ఏసీ, డీలక్స్ బస్సుల్లో 50 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. కాకినాడ జిల్లాలో ఇప్పటివరకు 2,600 మంది దివ్యాంగులకు మాత్రమే బస్సు ప్రయాణం చేసేందుకు ఉచితపాసులు ఉండేవని ఈ పథకం ప్రారంభం కావడంతో ఈ సంఖ్య 20 వేలు వరకు పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. స్త్రీ శక్తి పథకానికి ఉపయోగించే ఐదు రకాల బస్సులకు సంబంధించి కాకినాడ జిల్లాలో 155 బస్సులను ఈ పథకానికి వినియోగించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దివ్యాంగుల పట్ల గొప్ప నిర్ణయం తీసుకున్నారన్నారు. 2024 లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు పెన్షన్ పెంపు, ఉచిత బస్సు ప్రయాణం వంటి చర్యలు ప్రభుత్వ సంకల్పాన్ని తెలియజేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలు కూడా దివ్యాంగులకు బస్సుల్లో కేటాయించిన సీట్లలతో గౌరవించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తన దృష్టికి వచ్చిన దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు తెలిపారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ దివ్యాంగ శక్తి పథకం దివ్యాంగులకు ఎంతో ఉపయోగపడుతుందనిఉద్యోగాలు, వైద్యం, కుటుంబ అవసరాల కోసం ప్రయాణాలు సులభం అవుతాయని అన్నారు. దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఎప్పుడూ అందుబాటులో ఉండి దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను గుర్తించి తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని తెలిపారు. అనంతరం కాకినాడ ఆర్టీసీ బస్టాండ్ లో దివ్యాంగ శక్తి పథకానికి సంబంధించిన బస్సులను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కొండబాబు ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి బస్సును ప్రారంభించారు. అక్కడ నుంచి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే కొండబాబు, కాకినాడ రూరల్ ఎంపీపీ అనంతలక్ష్మి, రూరల్ ఎంపీడీవో సతీష్ కుమార్ మూడు వేరువేరు బస్సులలో దివ్యాంగులతో కలిసి బస్సు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మతో కలిసి దివ్యాంగులతో బస్సులలో ప్రయాణించారు. ఈ బస్సు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి భానుగుడి, నాగమల్లి తోట మీదుగా సర్పవరం వరకు, తిరిగి అదే దారిలో భానుగుడి బ్రిడ్జి మీదుగా బస్సు కలెక్టరేట్ కు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బస్సులో ప్రయాణిస్తున్న దివ్యాంగుల చిన్నారులు, మహిళలు, విద్యార్థులతో ముచ్చటించారు. ప్రభుత్వం నేటి నుంచి ప్రారంభించిన దివ్యంగ శక్తి ఉచిత బస్సు ప్రయాణం, దివ్యాంగులు వసతి గృహాల్లో అందుతున్న సదుపాయాలు, చదువు, కుటుంబ నేపథ్యం, వారి అవసరతలను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అడిగి తెలుసు కున్నారు.

**దివ్యాంగులతో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దివ్యాంగ శక్తి పథకం దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వివేకానంద హాలులో దివ్యాంగులు వారి సంరక్షకులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్, మాజీ ఎమ్మెల్యే వర్మ దివ్యాంగులతో కలిసి ముచ్చటిస్తూ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవణాధికారి ఎం.శ్రీనివాసు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడి ఏవై. శ్రీనివాసు, ఉమా మనోవికాస కేంద్రం ఈడీ ఎస్పీ.రెడ్డి, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన దివ్యాంగ విద్యార్థులు, దివ్యాంగుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవములు

**- ఎంపీ సుజనాచౌదరి అల్లుడు కూతురు ప్రత్యేక పూజలు**



**కోటనందూరు (మనసులో మాట) మార్చి 18..** కోటనందూరు గ్రామ దేవత శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవములు ఘనంగా జరిగినవి. గత వారం రోజులుగా అమ్మవారి గరగలను గ్రామంలో ప్రదర్శించగా భక్తులు గరగలకు మొక్కుబడులు సమర్పించేవారు. అమావాస్య రోజున అమ్మవారి ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మ్రొక్కు లు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ కు చెందిన ఎంపీ సుజనా చౌదరి అల్లుడు, కూతురు కృష్ణ కాంత్,సత్య సుజనా అమ్మవారిని దర్శించుకోవడానికి విచ్చేశారు. వీరిని ఆలయ మర్యాదలతో ఆలయ కమిటీ స్వాగతం పలికారు. అనంతరము ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి జ్ఞాపికను అందించారు. అనంతరము కృష్ణకాంత్ మాట్లాడుతూ ఈ గ్రామంలో అమ్మవారి మహత్యం తెలుసుకొని హైదరాబాద్ నుండి ఇక్కడికి వచ్చి దర్శించుకున్నామని తెలియజేస్తూ ఆదరించిన ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త వెలగా వెంకటకృష్ణాజి , కొరుప్రోలు కృష్ణ, లక్కాకుల బాబ్జి, సంబారు సత్యనారాయణ, ఉల్లూరి శ్రీను, కెల్లా జగదీష్, మళ్ల రవి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జటాద్రి కొండ త్రవ్వి దోచుకుంటున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

**- కర్నాకుల డిమాండ్**



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 18..** కాకినాడ జిల్లా జగ్గంపేట పరిధి జటాద్రి కొండగా పిలవబడే కొండను బడా వ్యాపారవేత్త రైతుల పేరుతో త్రవ్వి కబ్జా చేయడానికి చూస్తున్నారని తెలిసి ఈరోజు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు,జిల్లా సహాయ కార్యదర్శి కే సతీష్ అక్కడికి వెళ్లి పరిశీలించి, పనులను ఆపి చేయడం జరిగింది. ఈ సందర్భంగా కర్ణాకుల మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలు జగ్గంపేటలో చాలామంది ఉన్నారని వారు ఒక సెంటు భూమి చూసుకొని పూరి గుడిసెలు వేసుకుంటే తీసివేస్తున్న ఈ ప్రభుత్వ అధికారులు రాజకీయ ఆర్థిక అండదండలతో జగ్గంపేటకు చెందిన ఒక బడా వ్యాపారవేత్త గతవారం రోజుల నుంచి తవ్వేస్తుంటే మండల తహసిల్దార్ ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయం కలెక్టర్, ఆర్ డి ఓ కి ఫోన్ ద్వారా తెలియజేయడం జరిగింది. వీఆర్వోను అక్కడకు పంపించి పరిశీలించడం జరిగింది. వెంటనే ఆ ప్రొక్లైన్ ను సీజ్ చేసి కొండను తవ్వేస్తున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షాన పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

# వాసవి క్లబ్ సేవా స్ఫూర్తి ఆదర్శనీయం



**అనపర్తి (మనసులో మాట)మార్చి 18:** సమాజంలో ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో అనపర్తి వాసవి ఆదర్శ క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవ కార్యక్రమాలు అందరికి స్ఫూర్తిదాయకమని, సమాజ హితానికి చేపట్టే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ నార్కెడుమల్లి సుబ్బారావు అన్నారు. అనపర్తి సమీపంలో గల మల్లంపూడి లో సాయి బాబా వృద్ధాశ్రమం లో అనపర్తి వాసవి ఆదర్శ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు మన్యం పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిజియన్ సందర్శనలో భాగంగా చైర్మన్ నార్కెడమిల్లి సుబ్బారావు సతి సమేతంగా విచ్చేసి కార్యక్రమం లో పాల్గొన్నారు. ఆశ్రమంలో గల 100 మంది వృద్ధులకు సుబ్బారావు దంపతుల చేతుల మీద అన్న వితరణ , బిస్కెట్ పాకెట్స్ ఫ్రూట్, లుంగీలు , టవల్స్, చీరలు అందజేశారు. అంతకు ముందుగా వాసవి ఆదర్శ క్లబ్ సంస్థ ద్వారా వృద్ధులకు సంతోష పరిచే విధంగా గేమ్స్, డాన్స్, గానలహరి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో ఆదర్శ క్లబ్ ప్రెసిడెంట్ మన్యం పద్మ , సెక్రటరీ చక్కా గౌరీ, ట్రెసరీ చక్కా సునీత , సి ఎమ్ ఆర్ ఇంచార్జీ వెచ్చ రత్న కుమారి, మెగా ఈవెంట్ ఇంచార్జి గ్రంధి సుజాత , కుమారి, వాసవీయన్స్ పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతాం

**- ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి**

**పిఠాపురం (మనసులో మాట) మార్చి18:** ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి బుధవారం గొల్లప్రోలు మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో కృతజ్ఞతా పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులపై అధికారుల ఒత్తిడి తగ్గించాలని, బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే 12వ పీఆర్సీ కమిటీని వేసి 29% ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను, రూ. 30 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని కోరారు.
సీపిఎస్ రద్దు, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ అమలు, కాంట్రాక్ట్ టీచర్ల రెగ్యులరైజేషన్ వంటి అంశాలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సూరిబాబు, సీతారామరాజు, పద్మనాభం, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి లో మూడు రోజుల అవగాహన ప్రాయోగిన శిక్షణా కార్యక్రమం నిర్వహణ




**గండేపల్లి (మనసులో మాట) గండేపల్లిమార్చి 18,** మండలం సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల వారి ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లాలోని గ్రామీణ పాఠశాలల విద్యార్థుల కోసం మూడు రోజుల అభివృద్ధి చెందుతున్న సాంకేతికత అనే అంశంపై అవగాహన సదస్సు ప్రాయోగిక శిక్షణ కార్యక్రమంవిజయవంతంగా నిర్వహించామని కళాశాల చైర్మన్ డా పరుచూరి కృష్ణారావు తెలియజేసారు. ఈ కార్యక్రమం భారత ప్రభుత్వ విజ్ఞాన సాంకేతికశాఖ (డీఎస్టీ) ఆధ్వర్యంలో చిల్డ్రన్ సెంట్రిక్ ఔట్ రీచ్ ప్రోగ్రాం ద్వారా ప్రాయోజితమైనదని ఈ కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన 347 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఈ సందర్భంగా ఆయన తెలియజేసారు. ఈకార్యక్రమానికి డైరెక్టర్ మేనేజ్మెంట్ ఎంవి హరినాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్, కె సత్యనారాయణ, ఎం రాధికామణి, వై జయబాబు, వివిధ విభాగాధిపతులు,సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

# హైవే పక్కన హోటల్స్ పై విజిలెన్స్ దాడులు



**గండేపల్లి (మనసులో మాట) మార్చి 18..** గండేపల్లి మండలం లో విజిలెన్స్ అధికారులు,సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్న హోటల్స్ పై బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డొమెస్టిక్ సిలండర్లను స్వాధీన పరచుకుని వారిపై 6ఏ కేసు నమోదు చేయడం జరిగినదన్నారు. సిలిండర్లు స్వాధీనం చేసుకున్న హోటల్ లు తాళ్లూరు లో శ్రీ సాయి బాలాజీ రెస్టారెంట్ లో రెండు ఇండియన్ గ్యాస్ సిలిండర్ లు,మురారి లో బాబాయ్ హోటల్ లో రెండు హెచ్ పి సిలిండర్లు, గండేపల్లి లో శ్రీ లక్ష్మీ హోటల్ లో 5 డొమెస్టిక్ సిలిండర్ లు మొత్తం తొమ్మిది సిలిండర్ల ను హైవే పక్కన ఉన్న హోటల్ దగ్గర స్వాధీన పరచుకుని గ్యాస్ ఏజెన్సీకి అప్పగించి వారిపై సిక్స్ ఏ కేసు నమోదు చేయడం జరిగినదన్నారు. విజిలెన్స్ డిఎస్పి తాతారావు, విజిలెన్స్ తహ సిల్దారు,కే విజయ్ కుమార్, ఎమ్మెస్ఓ జి ఎంఎం కృష్ణ ఈ దాడుల్లో పాల్గొన్నారు.

# పిఠాపురంలో 'దివ్యాంగ శక్తి' ప్రారంభం



**పిఠాపురం, (మనసులో మాట) మార్చి 18:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో 'దివ్యాంగ శక్తి' కార్యక్రమం ఘనంగా బుధవారం నిర్వహించబడింది. ఈ సందర్భంగా పిఠాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి రెండు నూతన బస్సు సర్వీసులను నాయకులు, అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అభివృద్ధి మరియు సంక్షేమాలను రెండు కళ్లుగా భావిస్తూ ప్రజా రంజక పాలన అందిస్తోందని కొనియాడారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.
బిజెపి నాయకులు ఓలేటి మురళీధర్ రావు మాట్లాడుతూ.. బస్సుల్లో దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో వారినే కూర్చునే విధంగా బస్సు డ్రైవర్లు, కండక్టర్లు సహకరించాలని కోరారు. దివ్యాంగులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు సిబ్బంది వారికి తగిన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

**బస్సు సర్వీసుల పునరుద్ధరణకు విజ్ఞప్తి**

తెలుగుదేశం పార్టీ నాయకులు అల్లవరపు నగేష్, జనపరెడ్డి రాంబాబు లు మాట్లాడుతూ.. గతంలో పిఠాపురం నుండి రాజమండ్రికి నడిచే బస్సులను పునరుద్ధరించాలని అధికారులను కోరారు. అలాగే, స్థానిక బైపాస్ రోడ్డు పాదగయ జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన బస్ స్టాప్‌లో విశాఖపట్నం వెళ్లే బస్సుల కోసం ప్రత్యేక టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, ప్రతి బస్సు ఇక్కడ ఆగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
తమకు అన్ని విధాలా అవకాశం కల్పించినందుకు దివ్యాంగులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిన కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. స్వయం ఉపాధి కోసం ప్రైవేట్ రంగాలలో కూడా తమకు తగిన ప్రోత్సాహం లభించేలా కృషి చేయాలని నాయకులు ద్వారా ప్రభుత్వానికి తమ మనవి తెలియపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాడా ఏపీడీ వసంత మాధవి, ఎంపీడీవో స్వప్న, మాజీ ఎమ్మెల్యే పెండం దొరబాబు, పిఠాపురం నియోజకవర్గ ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు ఓదురి కిషోర్, పట్టణ జనసేన అధ్యక్షురాలు డాక్టర్ వరలక్ష్మి, తెదేపా పట్టణ అధ్యక్షులు బొజ్జా సతీష్, బిజెపి నేతలు ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## దివ్యాంగులకు భరోసా
# దివ్యాంగ శక్తి

### - బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** రాష్ట్రంలో ఉన్న దివ్యాంగులకు 'దివ్యాంగ శక్తి' పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని రాష్ట్రంలో ఉన్న బీజేపీ, టీడీపీ, జేఎస్పీల ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. బుధవారం ఆయన ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం కింద 40 శాతానికి పైగా అంగవైకల్యం ఉన్నవారు రాష్ట్రంలో ఎక్కడికైనా ఏపీఎస్ ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ఉచితంగా సదరం సర్టిఫికెట్ చూపించి ప్రయాణించవచ్చు అన్నారు. గతంలో ఉన్న 50 శాతం రాయితీ ఇప్పుడు ఉచితం చేశారని తెలిపారు. సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో ఏపీఎస్ ఆర్టీసీ బస్ పాస్ కౌంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని, మొబైల్ యాప్ లేదా వాట్సాప్ (మనమిత్ర) ద్వారా డిజిటల్ పాస్ పొందే సౌకర్యం ఉందన్నారు. 69 శాతానికి పైగా వైకల్యం ఉన్నవారికి, 100 శాతం దృష్టి లోపం ఉన్నవారికి సహాయకుడికి 50 శాతం టికెట్ రాయితీ లభిస్తుందని చెప్పారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 12.76 లక్షల మంది దివ్యాంగులకు లబ్ధి చేకూరనుందని, దివ్యాంగులకు ఈ పథకం కొండంత భరోసాగా నిలుస్తుందని నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కి రాష్ట్ర ప్రజలందరి తరఫున పిక్కి నాగేంద్ర కృతజ్ఞతలు తెలియజేశారు.

## బెల్లంకొండ మండలంలో ఉద్యమి సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

**పల్నాడు, మార్చి 18, (మనసులో మాట):** జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన కనిపిస్తుందని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్ జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి. శివ పార్వతి అన్నారు. బెల్లంకొండ మండలంలో పగడాల శ్రీనివాసరావు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఉద్యమి సభ్యత్వాన్ని ఒక ఛాలెంజ్ గా తీసుకొని, మొదట బెల్లంకొండలోని ఆంజనేయస్వామి దేవస్థానం ఎదురుగా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి టెంటు వేసి పార్టీ సిద్ధాంతాలను మండల ప్రజలకు తెలియజేస్తూ అవగాహన కల్పిస్తూ మరింత ఉత్సాహంతో కనివిని ఎరగని రీతిలో ఎండను సైతం లెక్కచేయకుండా స్థానికంగా అవాంతరాలు ఎదురవుతున్న లెక్కచేయకుండా జన సైనికులు గ్రామ గ్రామాన తిరుగుతూ ఉద్యమి సభ్యత్వం 800 లు చేసిన పగడాల శ్రీనివాసరావును, టీం సభ్యులను ఆమె అభినందించారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం పొందిన వారికి పార్టీ తరపున లభించే భరోసా బీమా సౌకర్యాల గురించి కూడా ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బేదంపూడి కిషోర్ కుమారుడు వైద్య ఖర్చులకు కంబాల మూడు వేలు సాయం



**గోకవరం (మనసులో మాట), మార్చి 18 :** మండల కేంద్రం గోకవరం పంచాయతీ పరిధిలోని న్యూ అంబేద్కర్ కాలనీకి చెందిన చర్చ్ పాస్టర్, దళిత నాయకుడు బేదంపూడి కిషోర్ కుమారుడి వైద్య ఖర్చులకోసం విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు మూడు వేలు రూపాయలు ఆర్ధిక సహాయం అందజేశారు. బేదంపూడి కిషోర్ కుమారుడికి కాలుకు ఇన్ఫెక్షన్ వచ్చిందని. వైద్య ఖర్చుల కోసం సహాయం చేయాలని, దళిత బీజేపీ నాయకుడు కందికట్ల మూర్తి, ఆధ్వర్యంలో సీఎండీ కార్యాలయానికి వచ్చి కంబాల శ్రీనివాసరావు ని కలిసి కోరగా, స్పందించిన ఆయన మూడు వేలు రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

## సమాజంలో దివ్యాంగులు సమాన హక్కులతో జీవించేలా
# కుటమి ప్రభుత్వం కృషి చేస్తుంది

### - శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు




**ఉండి, (మనసులో మాట) మార్చి 18 :** దివ్యాంగుల సౌలభ్యం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సేవలను బుధవారం ఉండి బస్టాండ్ వద్ద రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు బస్సులను ప్రారంభించి, దివ్యాంగులతో కలిసి ఉండి బస్టాండ్ నుండి కాళ్ల మండలం పెదమిరంలో ఉన్న ఉపసభాపతి క్యాంపు కార్యాలయం వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. సమాజంలో దివ్యాంగులు సమాన హక్కులతో జీవించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి కోసం అవసరమైన మౌలిక సదుపాయాలు మరియు సంక్షేమ పథకాల అమలులో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఈ ఉచిత బస్సు సేవల ద్వారా దివ్యాంగుల జీవితాల్లో సానుకూల మార్పులు వస్తాయని, వారు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "దివ్యాంగ శక్తి" పథకం ఉగాది కానుకగా ప్రారంభించడం సంతోషకరమని తెలిపారు. ఈ పథకం ద్వారా ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబడిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన టికెట్ యంత్రం ద్వారా ఉచిత టిక్కెట్లు స్వయంగా జారీచేసి దివ్యాంగులకు అందజేశారు. దివ్యాంగులతో ఆప్యాయంగా మట్లాడి, వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకొని, పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించారు. అనంతరం ఉపసభాపతి, జాయింట్ కలెక్టర్ దివ్యాంగులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి డా. కె.సి.హెచ్. అప్పారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జుత్తిగ నాగరాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను
# ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి

### - ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు



**ఉండి, (మనసులో మాట) మార్చి 18 :** వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి పరచడానికి రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు పిలుపునిచ్చారు. బుధవారం ఉండి మండలం పెద్దపులేరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతన్న మీ కోసం" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ, రైతులు సంప్రదాయ పద్ధతులపై మాత్రమే ఆధారపడకుండా నూతన వ్యవసాయ పద్ధతులను అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో దిగుబడులు పెరగడమే కాకుండా ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపారు. మట్టి నాణ్యత పరీక్షలు, డ్రోన్‌ల ద్వారా ఎరువులు మరియు పురుగుమందుల పిచికారీ వంటి ఆధునిక విధానాలను రైతులు అలవరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఆయన కోరారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమం మరియు వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు. అందులో భాగంగానే "రైతన్న మీ కోసం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న సలహాలు, సూచనలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక సాంకేతికత వినియోగం వ్యవసాయ రంగంలో అత్యంత కీలకమని, అదే సమయంలో రసాయన ఎరువులు, కృత్రిమ పదార్థాల వినియోగాన్ని తగ్గించి సహజ పద్ధతుల ద్వారా సాగు చేయడం ద్వారా రైతులకు అధిక లాభాలు చేకూరుతాయని పేర్కొన్నారు. సహజ వ్యవసాయం రైతులకు ఆర్థికంగా మరియు ఆరోగ్యపరంగా మేలు చేస్తుందని తెలిపారు. పెద్దపులేరు గ్రామంలో రైతులు 100 శాతం డ్రోన్ సాంకేతికత వినియోగించడం శుభపరిణామమని, ఇది మంచి ఫలితాలకు దారి తీస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.ప్రతాప్ జీవన్, మండల వ్యవసాయ అధికారి ఎన్.శ్రీనివాసరావు, తహసీల్దార్ నాగార్జున, మార్కెట్ యార్డ్ చైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, వైస్ చైర్మన్ ఎడ్లవల్లి వెంకటేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, అధికారులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సాహితీ వేత్త నల్లా నరసింహమూర్తికి
# రాష్ట్ర ప్రభుత్వ ఉగాది సాహితీ పురస్కారం



**అమలాపురం( మనసులోమాట) మార్చి 18..** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముఖ్య కేంద్రమైన అమలాపురానికి చెందిన సాహితీ వేత్త, కవి ,కళాకారుడు,నాటక రచయిత,సీనియర్ తెలుగు లెక్చరర్ శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు, కోనసీమ రచయితల సంఘం కార్యదర్శి "నడక కవి" నల్లా నరసింహమూర్తి కి శ్రీ పరాభవ నామ సంవత్సర రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం లభించింది. విజయవాడలో మార్చి 19 తేదీ ఉగాది రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పురస్కారంతో పాటు సన్మానం అందుకోనున్నారు. నిరంతరం కవిత్వం రాసే కవిగా నరసింహమూర్తి గుర్తింపు పొందారు. సామాజిక అంశాలకు అక్షర రూపం ఇచ్చి హృదయాలను ఆకట్టు కోవడం ఆయన కవిత్వంలో కల్పిస్తుంది. నరసింహ మూర్తి కి రాష్ట్ర ప్రభుత్వ అవార్డు రావడం కవులకు ఆనందదాయకమైన విషయం. మూడున్నర దశాబ్దాలుగా కవిత్వాన్ని ప్రేమిస్తూ అక్షరాలతో నడుస్తున్న కవి, కవితా శ్రామికుడు నరసింహమూర్తి సాహితీ సేవలకు గుర్తింపు లభించింది. ఈ గౌరవం తెలుగు వారందరిది. 1971 నుండి సమతా రచయితల సంఘం కార్యవర్గ సభ్యుడిగా, 1982 నుండి సాహితీ మిత్ర మండలి కార్యదర్శిగా, ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా, 2016 నుండి అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులుగా, కోనసీమ రచయితల సంఘం కార్యదర్శిగా సాహితీ సేవలు నిర్వహిస్తున్నారు. తెలుగు సాహిత్యంలో నిర్వి రామ కృషివలుడు గా పేరుపొంది ఆధునిక తెలుగు సాహిత్యంలో నానీల ప్రక్రియలో నడక అంశంపై 117 పుస్తకాల రచించి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు పొందారు. అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ తల్లి జీవితంపై"సీతాయణం వచన కావ్యం రచించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్ర నేపథ్యంలో నడక విజేత నానీల పుస్తకం రచించారు. చీకటి బొమ్మ, పాటకు మరణం లేదు, నిప్పురవ్వలు, పువ్వు నవ్వు, వసంతం వచ్చింది , పర్యావరణం, యోగ వంటి కవితా సంపుటాలు రచించారు. తెలుగు సాహిత్యంలో గాలిపటాలు, నీడలు, లక్కపిడతలు, చినుకులు నాలుగు ప్రక్రియలు రూపొందించారు. అవార్డు లభించినందుకు అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తి మండ ప్రతాప్, కులపతి గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ,కిమ్స్ ఫౌండర్, చైర్మన్ కే. వి .వి .సత్యనారాయణ రాజు చైతన్య రాజు, బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి, కమాండెంట్ ఎస్పీ ప్రత్యేక రక్షణ దళం రాజమహేంద్రవరం శంఖారావం వరల్డ్ ఫేమస్ "కళా రత్న" కొండా నరసింహారావు", శిల్ప కళారత్న" దేవికారాణి ఉదయార్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య ఎన్. గోపి కవి నల్లాను అభినందించారు.

# గోకవరం సామాన్య ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



**గోకవరం (మనసులో మాట), మార్చి 18 :** ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైనవైద్య సేవలతో పాటు, నాణ్యమైన ప్రమాణాలు, పరిశుభ్రత పాటించే ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమం లో భాగంగా మండల కేంద్రం గోకవరం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిని కాయకల్ప (నేషనల్ క్వాలిటీ ఎస్యురెన్స్ సర్టిఫైడ్) బృందం సందర్శించింది. మంగళవారం కేంద్ర బృందం డాక్టర్ కృష్ణ చైతన్య, శ్రీనివాసరావు, నవీనా ఆధ్వర్యంలో ఆస్పత్రిలో అందిస్తున్న సేవలను సమీక్షించారు. ఓపి విభాగం , పేర్ల నమోదు, పరీక్షలు చేసే (కేంద్రం) యంత్రాలు, శస్త్ర చికిత్స , గది , పరికరాలు, ఎక్స్ రే, ఫార్మసీ విభాగాలు , జనరల్ వార్డులు, మహిళా వార్డులు, అత్యవసర వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందిస్తున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరా, పారిశుధ్యం, పచ్చదనం వంటి అంశాల పై కేంద్రం కమిటీ సమీక్షించడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో గుర్తించిన అంశాలను నమోదు చేసుకున్నారు. ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు, విద్యుత్ ప్రమాదాలు సంభవించినప్పుడు అత్యవసరమైన చర్యలు, సిబ్బంది దుస్తులు, సమయపాలన పై వివరాలు నమోదు చేసుకున్నారు. రోగులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించి గోకవరం ఆస్పత్రిలో అందించే సేవలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోకవరం ప్రభుత్వ ప్రధాన వైద్యురాలు డా రామలక్ష్మి, డా ఝాన్సీ రాణి, డా భాగ్యశ్రీ,, డా మధు, డా వైశాలి, హెడ్ నర్స్ విమల, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు



# దివ్యాంగులు ఆత్మగౌరవంతో నిలబడాలి

### దివ్యాంగులకు వారి నివాసంలో భోజనం వడ్డించిన ఎమ్మెల్యే అంజిబాబు

**భీమవరం, (మనసులో మాట) మార్చి 18 :** సమాజంలో దివ్యాంగులు ఆత్మగౌరవంతో నిలబడే విధంగా సహాయ సహకారాలు అందించడంలో కూటమి ప్రభుత్వం మానవీయ కోణంలో పని చేస్తుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని ఎమ్మెల్యే అంజిబాబు నివాసం వద్ద 170 మంది దివ్యాంగులకు ఎమ్మెల్యే అంజిబాబు స్వయంగా భోజనం వడ్డించారు. వారితో కలిసి భోజనం చేశారు. దివ్యాంగులు కుటుంబానికి భారమవుతున్నామని ఆత్మన్యూనతతో ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని ఎమ్మెల్యే అంజిబాబు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వబిలిశెట్టి రామకృష్ణ, యర్రంశెట్టి శివకృష్ణ, యర్రంశెట్టి లక్ష్మణ్, కఠారి ప్రభాకర్, పాలకోడేటి కార్తీక్, కారుమూరి సత్యనారాయణ మూర్తి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఇంజరం పరదేశమ్మ అమ్మవారి
# తీర్థ మహోత్సవం



**తాళ్ళరేవు మనసులో మాట మార్చి 18:** ఇంజరం గ్రామదేవత పరదేశమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి పెద్దజాతరను గరగృత్యాలు, డప్పుల వాయిద్యాలతో ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, స్థానిక సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు చింతలపాటి శ్రీనివాసరాజు, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ అకెళ్ళ నాగేశ్వరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా చింతలపాటి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. అదేవిధంగా ఈ తీర్థ మహోత్సవానికి సాగి బాబ్జిరాజు ఆర్థిక సహాయంతో విద్యుత్ దీపాలంకరణలను ఏర్పాటు చేశారు. అలాగే అకెళ్ళ నాగేశ్వరావు ఆర్థిక సహాయంతో మజ్జిగ పాకెట్స్ పంపిణీ చేశారు. డిసీ చైర్మన్ వేగేసిన భాస్కరరాజు, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్ కుమారి, చంటి ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మావుళ్లమ్మ అమ్మవారికి శాకంబరి అలంకారం

### - ఘనంగా తలుపులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం



**తాళ్లరేవు (మనసులో మాట) మార్చి 18:** పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామదేవత శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాల సందర్భంగా బుధవారం అమ్మవారి తాడిని వివిధ రకాల కాయగూరలు, పండ్లతో శాకంబరిగా అలంకరించి పూజలు చేసారు. ఈ సందర్బంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. పటవల తలుపులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా నీలపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో కొత్త అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది. తదితర గ్రామాలలో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

## గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌లో ఘనంగా జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు




**అనపర్తి (మనసులో మాట) మార్చి 18:** జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని, తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలోని గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రాంగణంలో, భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించబడింది. ముఖ్య అతిథుల ప్రసంగం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డి.సి.ఐ.ఎఫ్ కె. కృష్ణమూర్తి, ప్లాంట్ హెడ్ శ్రీ శ్రీధర నరసింహ శాస్త్రితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కె. కృష్ణమూర్తి సుమారు 300 మందికి పైగా హాజరైన కార్మికులు, ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, భద్రత అనేది కేవలం పని ప్రదేశానికే పరిమితం కాకూడదని, నిత్య జీవితంలోనూ భాగం కావాలని పేర్కొన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబాలు ఎదుర్కొనే ఇబ్బందులను వివరిస్తూ, "డ్యూటీ ముగించుకుని క్షేమంగా ఇంటికి చేరుకోవడం" ఎంత ముఖ్యమో వివరించారు. ప్లాంట్ హెడ్ శ్రీ శ్రీధర నరసింహ శాస్త్రి గారు మాట్లాడుతూ.. పరిశ్రమలో 'భద్రతా సంస్కృతి' అలవరచుకోవాలని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ ప్రమాద రహిత పని వాతావరణాన్ని సృష్టించాలని కోరారు.



పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా

## జిల్లాలో 3 ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు

- భారీ మొత్తంలో నగదు, అక్రమ మద్యం, అనుమానాస్పద వస్తువులు లేదా ఆయుధాలు
- కదలికలను పర్యవేక్షించడానికి చెక్ పోస్టుల వద్ద నిఘా బృందాలు...
- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ (మనసులో మాట) మార్చి 18..** పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మార్చి 18 తేది నుండి ఏప్రిల్ 9 వ తేదీ పోలింగ్ జరిగే వరకు 24 గంటలూ రొటేషన్ పద్ధతిలో, వారి అధికార పరిధిలో అక్రమ మద్యం, అనుమానాస్పద వస్తువులు లేదా ఆయుధాలను స్వాధీనం చేసుకోవడానికి, నిష్పక్షపాత ఎన్నికలను నిర్వహించడానికి పెద్ద మొత్తంలో నగదు కదలికలను పర్యవేక్షించడానికి, స్వేచ్ఛాయుతమైన తనిఖీలు సజావుగా జరిగేలా చూసేందుకు చెక్ పోస్టుల వద్ద నిఘా బృందాలను ఏర్పాటు చేస్తూ కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రెవెన్యూ,ఎక్సైజ్, కమర్షియల్ టాక్స్ అధికారులను మల్లవరం, నీలపల్లి , సుంకరపాలెం వద్ద ఏర్పాటు వేసిన చెక్ పోస్టులు వద్ద నియమించడమైనది.ఇరవై నాలుగు గంటల ప్రాతిపదికన పై అధికారులు చెక్ పోస్టుల విధులకు హాజరు కావాలని ఆదేశించారు.

షిఫ్ట్ ప్రాతిపదిక

పైన పేర్కొన్న ప్రదేశాలలో చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలనీ జిల్లా ఎస్పీ వారిని కోరారు. చెక్ పోస్ట్ వద్ద టెంట్లు, కుర్చీలు, లైట్లు, నీరు మొదలైన ప్రాథమిక సౌకర్యాలను కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఏర్పాటు చేయాలనీ ఆదేశించారు.

సంబంధిత అధికారులు చెక్ పోస్ట్ నిర్వహణ కార్యకలాపాలను పర్యవేక్షించాలని మరియు అన్ని సంబంధిత శాఖలతో సమర్ధవంతమైన సమన్వయాన్ని నిర్ధారించాలని కాజులూరు, తాళ్లరేవు తహసీల్దార్ల ను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సమయంలో జరిగే అవకతవకలను నివారించడానికి చెక్ పోస్టుల వద్ద అత్యంత అప్రమత్తతతో కట్టుదిట్టమైన నిఘా ఉంచాలన్నారు. సంబంధిత అధికారులందరూ తమ విధులను నిర్వర్తించాలని ఉత్తర్వులు లో పేర్కొన్నారు.ఉత్తర్వులు విడుదల నాటి నుండి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ,నిర్వహణలో నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణించి, క్రమశిక్షణా చర్యలు తీసుకోబడతాయన్నారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయి. ఏవైనా అవసరమైనప్పుడు పోస్ట్ బృందాలను తనిఖీ చేయడానికి వారి అవసరమైన సహకారం అందించాలన్నారు.

## లింగంపర్తి గ్రామ దేవత నూకాలమ్మని దర్శించుకొని పూజ

చేసిన ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా




**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 18..** ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామంలో వెలసిన శ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవమునకు విచ్చేసి ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యులు వరుపుల సత్య ప్రభ రాజా అమ్మవారినీ పూజించి నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన కూటమీ నాయకులు పాల్గొన్నారు.

# గౌతమీ సూపర్ బజార్ అక్రమ కట్టడాలను కూల్చివేయాలి

- ముడుపులు తీసుకుంది నువ్వా..నేనా.. ప్రజలకు తెలిసిపోయింది..
- మాజీ ఎంపీ మార్గాని భరత్, డాక్టర్ గూడూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గౌతమీ సూజార్ వద్ద నిరసన
- హై కోర్టు ఆదేశాలు అమలు చేసి, అక్రమ కట్టడాలను కూల్చివేయాలని మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేసిన భరత్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 18:** రాజమహేంద్రవరం నగరంలోని దేవి చౌక్ పశువుల ఆసుపత్రి వద్ద గల గౌతమి సూపర్ బజార్ అక్రమ కట్టడాలను హై కోర్టు ఆదేశాలు అమలుపరిచి కూల్చి వేయాలని డిమాండు చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్ సీపీ జాతీయ అధికార ప్రతినిధి, రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్, రాజమహేంద్రవరం పార్లమెంట్ సమన్వయ కర్త డాక్టర్ గూడూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ భరత్ మాట్లాడుతూ.. "గత ఎన్నికల సమయంలో గౌతమి సూపర్ బజార్ విషయంలో నేను ఐదు కోట్లు ముడుపులు తీసుకున్నానని వేల కరపత్రాలు సిటీ అంతా వెదజల్లిన ప్రస్తుత ఈవీఎం ఎమ్మెల్యే ఘనత, నీచ రాజకీయాలకు తెరలేపిన ప్రబుద్ధుడు"..అని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "నిజంగా అప్పట్లో నేను తీసుకున్నానేమో అని ప్రజలు నమ్మారో లేదో తెలియదు కానీ.. అందుకు ఇప్పుడు హై కోర్టు లో పిటిషన్ వేసి కూల్చివేయాలని ఆదేశాలు తెచ్చుకుని నా నిజాయితీ, సచ్ఛీలత నిరూపించుకున్నాను.. ఇప్పుడు ముడుపులు తీసుకున్నది ఎవరో స్పష్టంగా ప్రజలకు తెలిసిపోయింది అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు కనీసం సెల్లార్ పార్కింగ్ లేదు, తూర్పు వైపు 13 అడుగులు, ఉత్తరం వైపు 19 అడుగులు వదలకుండా, పొజిషన్ సర్టిఫికెట్ లేకుండా షాపులను అద్దెకు ఇచ్చేసి ఇంత అప్రజాస్వామ్యముగా చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే మాట్లాడడన్నారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ ప్లానింగ్ అధికారులను కోరేది ఏమిటంటే అనుమతులను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోండి, అక్రమ కట్టడాలను కూల్చివేయండి, కోర్టు ఆదేశాలు గౌరవించండి.. తక్షణమే చర్యలు తీసుకోండి..అని భరత్ డిమాండు చేశారు. లేని పక్షంలో నిరసన ఉధృతం చేసి న్యాయం జరిగే వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆపదని భరత్ ఘాటుగా హెచ్చరించారు.

"చట్టం అంటే గౌరవం లేదు, ప్రజల కష్టాలు పట్టవు, అభివృద్ధి శూన్యం, ముడుపులకు అగ్ర తాంబూలం ఇదే మన సిటీ ఎమ్మెల్యే తీరు" అని భరత్ విమర్శించారు. నిరసన కార్యక్రమం అనంతరం పార్టీ శ్రేణులతో కలసి మున్సిపల్ కార్యాలయంలో హై కోర్టు ఆదేశాలు అమలు పరిచి గౌతమి సూపర్ బజార్ అక్రమ కట్టడాలను కూల్చివేయాలని వినతి పత్రాన్ని భరత్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, వార్డు ఇంచార్జ్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు సముచిత స్థానం దివ్యాంగ శక్తి పథకం

- 40% పైగా వికలాంగత ఉన్న వారికి బస్సుల్లో ఉచిత ప్రయాణం
- దివ్యాంగులు మొత్తం ఐదు రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం
- భీమవరం ఆర్టీసీ బస్టాండ్ లో దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు, కలెక్టర్ నాగరాణి



భీమవరం, (మనసులో మాట) మార్చి 18 : దివ్యాంగులకు సముచిత స్థానం దివ్యాంగ శక్తి పథకమని, 40% పైగా వికలాంగత ఉన్న వారికి బస్సుల్లో ఉచిత ప్రయాణమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ఆర్టీసీ బస్టాండ్ లో బుధవారం దివ్యాంగ శక్తి పథకాన్ని కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ దివ్యాంగ శక్తి పథకం ద్వారా 40% పైగా వికలాంగత ఉన్న వారికి ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించబడుతుందని, ఈ పథకం ఖర్చులను ప్రభుత్వం భరిస్తూ సక్రమ అమలు కోసం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ఈ పథకం ద్వారా దివ్యాంగులు మొత్తం 5 రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉందన్నారు. ఇందులో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సులు ఉన్నాయని, లగ్జరీ సుదూర ప్రాంతాలకు వెళ్లే నాన్ స్టాఫ్, సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, అంతర్రాష్ట్ర బస్సుల్లో మాత్రం గతంలో ఉన్నట్లే 50 శాతం రాయితీ కొనసాగుతుందన్నారు. దివ్యాంగులను చిన్నచూపు చూడకూడదని, వారిని ఆదరించి గౌరవించాలన్నారు. వారికి కూడా సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు.

జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న సుమారు 12 లక్షల మంది దివ్యాంగులలో 2 లక్షల మంది మాత్రమే ఆర్టీసీ పాస్ లను ఉపయోగిస్తుండగా ఈ కొత్త నిర్ణయంతో మిగిలిన వారందరికీ భారీ ఆర్థిక ఊరట లభించనుందన్నారు. మన జిల్లాల్లో సుమారు 200 లకు పైగా బస్సులో ఈ పథకం వర్తిస్తుందన్నారు. దివ్యాంగులు అన్ని రంగాల్లోనూ ముందుండాలని, దివ్యాంగులపై చిన్నచూపు ఉండకూడదన్నారు. 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు అందరికీ స్త్రీశక్తి పథకం వర్తించే అన్ని బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తుందని, వారితోపాటు వచ్చే సహాయకులకు ఈ బస్సుల్లో 50 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఇప్పటి వరకు కేవలం 4 వర్గాల దివ్యాంగులకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండేదని, ఇకపై 21 వర్గాల దివ్యాంగులకు ప్రభుత్వం ఈ సౌకర్యాన్ని కల్పిస్తుందని, శారీరక మానసిక దివ్యాంగులు, ఆటిజం, నాడీ సంబంధ వ్యాధులు, తలసేమియా, హీమోఫిలియా, సికిల్ సెల్ వంటి వ్యాధిగ్రస్తులకు ఈ పథకంతో భరోసా కలుగుతుందన్నారు. రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ పీతల సుజాత, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, ఏపీఐఐసీ డైరెక్టర్ చెనమల్ల చంద్రశేఖర్, ఎఎంసి చైర్మన్ కలిదిండి సుజాత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, మహిళల కోసం స్త్రీ శక్తి పథకం, ఇప్పుడు దివ్యాంగుల కోసం దివ్యాంగ శక్తి పథకం అమలు చేస్తున్నామన్నారు. అనంతరం దివ్యంగులతో కలిసి కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు బస్సులో ప్రయాణం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మెంటే పార్ధసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, ఎఎంసీ వైస్ చైర్మన్ బండి రమేష్, షబీనా బేగం, ఆర్టీసీ అధికారులు గిరిధర్ కుమార్, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.



## హిందూ ముస్లిం భాయ్ భాయ్ - తోట నరసింహం

ముస్లిం సోదరులకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు ఇఫ్తార్ విందు

**గోకవరం (మనసులో మాట), మార్చి 18 :** మండల కేంద్రం గోకవరం పాత బస్టాండ్ వద్ద ఉన్న జుమ్మి మసీదు లో ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గోకవరం మండల పరిషత్ అధ్యక్షురాలు సుంకర శ్రీవల్లి వీరబాబు ఆధ్వర్యంలో సుమారు 70 మందికి బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం, ఉభయగోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీలు ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని హిందూ ముస్లిం భాయ్ భాయ్ అంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతసామరస్యానికి చిహ్నమైన రంజాన్ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, నియోజకవర్గ, గోకవరం మండల ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి చినబాబు, సుంకర వెంకటరమణ, గుల్లా ఏడుకొండలు, సమ్మెట మోహన్, నరాలశెట్టి నరసయ్య, వీర్రాజు, రామకృష్ణ, మడికి మైనర్ బాబు, బత్తుల శ్రీనివాస్, తోలేటి రాంప్రసాద్, బిజ్జి రాజు, బాడితబోయిన చిన్న, మురళి, బొర్రా శేఖర్, నందూరి బుజ్జి, రాయి జోగరావు, నాగూర్ వల్లీ, సూర్యారావు, రాజశేఖర్, గంధ్రేడ్డి నాని, తుమ్మల రామారావు, నాగేందుడు, అబ్బిరెడ్డి చిన్ని, యేసు, ధనుంజయ, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు

## దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చర్యలు

"దివ్యాంగశక్తి" పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ప్రారంభం నియోజక వర్గ ప్రత్యేక అధికారి ప్రేమ్ కుమార్




**అనపర్తి (మనసులో మాట) మార్చి 18:** బుధవారం "దివ్యాంగశక్తి" పథకం కింద దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అనపర్తి దేవి చౌక్ వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, గెయిల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎమ్.ఆర్.ఆర్. ప్రేమ్ కుమార్ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక దేవీ చౌక్ సెంటర్ నుండి బిక్కవోలు ఎంపిడివో కార్యాలయం వరకు దివ్యాంగులతో కలిసి ప్రత్యేక బస్సులో ప్రయాణించారు. అనంతరం బిక్కవోలు ఎంపిడివో కార్యాలయం ప్రాంగణంలో దివ్యాంగులతో కలిసి సహ పంక్తి భోజనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు మేరకు, స్థానిక శాసన సభ్యులు సూచనలు మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాలను అనుసరించి అనపర్తి నియోజకవర్గం పరిధిలో "దివ్యాంగశక్తి " ఉచిత బస్సు ప్రయాణం సందర్భంగా దివ్యాంగులతో ప్రత్యక్షంగా మమేకమై రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు, వాటి అమలులో ఉన్న సాధకబాధకాలను తెలుసుకున్నామన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారికి స్వేచ్ఛగా ప్రయాణించే అవకాశాన్ని పెంపొందించడం, సామాజిక కార్యక్రమాలలో భాగస్వామ్యం కల్పించడం, ఉపాధివిద్యా అవకాశాలకు సులభ ప్రాప్యత కలిగించడం సాధ్యం అవుతుందని తెలియ చేశారు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ప్రజా ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో అనపర్తి ఎంపీడీవో ఎం. రామకృష్ణ రెడ్డి, తహసిల్దార్ అనిల్ కుమార్, ఏఎంసీ చైర్‌పర్సన్ జె. సూర్యకుమారి, ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. సుధాకర్ రెడ్డి, అనపర్తి ప్యాక్ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ దత్తుడు శ్రీను, బిక్కవోలు ఎంపీపీ, బిక్కవోలు ఎంపీడీవో, తహసిల్దార్ తదితర అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాక ఇవ్వని హామీలు కూడా

## కూటమి ప్రభుత్వం అమలు చేస్తుంది

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల



**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 18..** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దివ్యాంగ శక్తి పథకాన్ని ఈరోజు ఏలేశ్వరం ఆర్టీసీ బస్ స్టేషన్ లో ప్రారంభించిన శాసనసభ్యులు వరుపుల సత్య ప్రభ రాజా. ఈ సందర్భం గా మీడియా తో మాట్లాడుతూ "ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు కూడా మా కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని,ఇంతకుముందే మహిళలకు ఉచిత బస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు.ఈ పథకంపై దివ్యంగులు వారి అభిప్రాయం కోరగా దివ్యంగులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడమే కాకుండా తోడుగా వచ్చే సహాయకులకు 50 శాతం రాయితీ ఇస్తున్నందుకు మేమంతా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని హార్షం వ్యక్తం చేస్తున్నట్లు శాసన సభ్యులు వరుపుల సత్య ప్రభ రాజా తెలిపారు.

# దివ్యాంగులకు వరం ఉచిత బస్సు ప్రయాణం

**- ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం. థామస్**

**గంగాధరనెల్లూరు, మార్చి 18 (మనసులో మాట):** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్, గంగాధరనెల్లూరు శాసనసభ్యులు డాక్టర్ వి.ఎం. థామస్ అన్నారు. బుధవారం గంగాధరనెల్లూరు



కేంద్రంలో దివ్యాంగుల కోసం ఉద్దేశించిన ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని ఆయన జిల్లా ఆర్టీసీ పీఓ షాజహాన్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... 40 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న ప్రతి దివ్యాంగుడికి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తోందన్నారు. బస్సును ప్రారంభించిన అనంతరం, ఎమ్మెల్యే స్వయంగా దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించి వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం అనంతరం విచ్చేసిన దివ్యాంగులకు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం. థామస్ స్వయంగా భోజనాలు వడ్డించి తన ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక

రాయలసీమ

కర్నూలు | అనంతపురం | చిత్తూరు | కడప

గురువారం 19 మార్చి 2026






## మాజీ సీఎం జగన్ ను కలిసిన వైసీపీ నేత పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులు

**నెల్లూరు బ్యూరో, (మనసులో మాట) మార్చి 18:** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మెహన్ రెడ్డిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం తాడేపల్లి లోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి,మాజీ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ పేర్నాటి హేమ సుస్మిత,పేర్నాటి నేచురల్స్ డైరెక్టర్ పేర్నాటి బిందు ఐశ్వర్య లు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు మాజీ సీఎం జగన్ కు శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ పేర్నాటి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పేర్నాటి కుటుంబ సభ్యులకు జగన్ సూచించారు.

### దివ్యాంగులకు ఉగాది కానుకగా

# దివ్యాంగ శక్తి

**- 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి**



**ప్రొద్దుటూరు (మనసులో మాట) మార్చి 18:** ప్రొద్దుటూరు నియోజకవర్గం =జ బస్టాండ్ నందు దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించి దివ్యాంగులతో కలిసి బస్సులో రాజుపాలెం వరకు ప్రయాణించి దివ్యాంగులకు స్వయంగా భోజనాన్ని వడ్డించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి. దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక ముందడుగు వేసింది.దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే ' దివ్యాంగ శక్తి' పథకాన్ని ఉగాది కానుకగా ప్రభుత్వం నేటి నుండి అమలులోకి తెచ్చింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులను అన్ని రంగాల్లో సమానంగా ప్రోత్సహించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.ప్రతి దివ్యాంగుడు ఆత్మవిశ్వాసం తో, గౌరవంగా జీవించేలా చేయడమే చంద్రబాబు నాయుడు గారి సంకల్పం అని స్పష్టం చేశారు.ఈ అవకాశాన్ని దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి ,కడప జిల్లా పరిషత్ జ.జు.ా & ప్రొద్దుటూరు ప్రత్యేక అధికారి ఓబులమ్మ, రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం ముక్తియార్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్ అహమ్మద్,రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు,రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంక్షేమ డైరెక్టర్ శ్రీనివాసాచారి గారు,ఋణు రామాంజనేయులు ,ఐవీ గంగాధర్ గారు,వీణు సూర్యనారాయణ రెడ్డి , కడప జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వై.యస్ జబీవుల్లా గారు,ఋణు పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రా రెడ్డి, ఇవి సుధాకర్ రెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ మాజీ చైర్మన్ కామిశెట్టి బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామి రెడ్డి, వద్ది బాలుడు, బచ్చల ప్రతాప్, దీపూ పట్టణ అధ్యక్షుడు నరేంద్ర, జనసేన సుంకర మురళీ, ప్రసాద్ గారు,జిలాన్ ,మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు ఉగాది కానుక

# దివ్యాంగ శక్తి పథకం

**కడపలో ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి**



**కడప, (మనసులో మాట) మార్చి 18:** దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక ముందడుగు వేసింది. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ఉగాది కానుకగా ప్రభుత్వం నేటి నుండి అమలులోకి తెచ్చింది. ఈ కార్యక్రమంలో భాగంగా, కడప ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డెప్పగారి మాధవి రెడ్డి గారు మరియు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి గారు పాల్గొని, జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...దివ్యాంగులను అన్ని రంగాల్లో సమానంగా ప్రోత్సహించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం వారి ఆర్థిక స్వతంత్రతకు, సామాజిక ఎదుగుదలకు పెద్ద ఊతమిస్తుంది. ప్రతి దివ్యాంగుడు ఆత్మవిశ్వాసంతో, గౌరవంగా జీవించేలా చేయడమే చంద్రబాబు నాయుడు గారి సంకల్పం అని స్పష్టం చేశారు. ఈ అద్భుతమైన అవకాశాన్ని దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో జేసీ గారు, ఆర్టీసీ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఐసిడిఎస్‌లో సీసీటీవీ టెండర్

# అక్రమాలపై ఆరోపణలు

**పీడీ ప్రమీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**ధర్మవరం, మార్చి 18 (మనసులో మాట)..** శ్రీ సత్యసాయి జిల్లాలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖలో సీసీటీవీ టెండర్ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఈ విషయంపై బహుజన సమాజ్ పార్టీ ధర్మవరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాచెర్ల నారాయణస్వామి తీవ్ర ఆరోపణలు చేశారు.టెండర్ నిబంధనలు పాటించకుండా సాయి వర్షిక ట్రేడర్స్‌కు పనులు అప్పగించారని, ఓపెన్ టెండర్ లేదా ఈ-ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియను అనుసరించలేదని ఆయన ఆరోపించారు. ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.అదేవిధంగా బేటీ బచావో బేటీ పఢావో, మిషన్ శక్తి, సక్షం అంగన్వాడి వంటి పథకాల నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, సుమారు 29 లక్షల వ్యయంలో నాణ్యత లోపాలు ఉన్నాయని తెలిపారు.అంగన్వాడి కార్యకర్తలపై అదనపు భారం మోపడం కూడా గమనార్హమని అన్నారు.పీడీ ప్రమీలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఫిర్యాదు చేస్తున్న వారిపైనే ఒత్తిడి, వేధింపులు జరుగుతున్నాయని ఆరోపించారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం కూడా సక్రమంగా జరగలేదని విమర్శించారు.ఈ వ్యవహారంపై తక్షణ విచారణ జరిపి, సీసీటీవీ పనులను నిలిపివేసి పారదర్శక టెండర్ విధానంలో మళ్లీ నిర్వహించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే పీడీ ప్రమీలను సస్పెండ్ చేయాలని కోరారు.

## రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కేంద్రమంత్రి కిఎంపీ వేమిరెడ్డి వినతి



**నెల్లూరు బ్యూరో, (మనసులో మాట)మార్చి 18:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలనుపరిష్కరించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్రవినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలోని కేంద్రమంత్రి కార్యాలయంలో కలిసి ఆయనను కలిసి ఆంధ్రప్రదేశ్ చౌక ధరల దుకాణ దారుల సంక్షేమ సమాఖ్య, ఆల్ ఇండియా ఫేర్ ప్రైజ్ షాప్ ఫెడరేషన్ తరఫున వినతిపత్రం అందజేశారు. ఇటీవల రేషన్ డీలర్లు వివిధ సమస్యలపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన ఢిల్లీలో కేంద్రమంత్రితో భేటీ అయి సమస్యలను విన్నవించారు. చౌక ధరల దుకాణాల డీలర్లకు ప్రస్తుతం సగటు కమీషన్ నెలకు రూ.6000 నుంచి రూ.8000/- మధ్య ఉంటోందని, ఇది జీవనోపాధికి సరిపోవడం లేదన్నారు. రేషన్ షాపు అద్దె, క్లర్క్ జీతం, విద్యుత్ బిల్లు, దివ్యాంగులకు మరియు వృద్ధులకు ఇంటింటికీ డెలివరీ చేయడం వంటి నిర్వహణ ఖర్చులు భారంగా మారాయన్నారు. చౌక ధరల దుకాణాల డీలర్లకు ప్రభుత్వం నెలకు రూ. 35,000/- ఆదాయాన్ని అందించాలని విన్నవించారు. అలాగే దుకాణాల డీలర్లకు కుటుంబ ఆరోగ్య కార్డులను అందించేలా చూడాలని కోరారు. డీలర్ మరణించిన పక్షంలో, వారి కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు . 25 లక్షల ఎక్స్-గ్రేషియా ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావలసిన అన్ని బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి.. రేషన్ డీలర్ల సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చౌక ధరల దుకాణ దారుల సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు గిరిజారావు తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం రైతులు సద్వినియోగం చేసుకోండి

**- వ్యవసాయ మండల అధికారి రమేష్ రెడ్డి**



**సిద్ధవటం (మనసులో మాట) మార్చి 18:** ప్రభుత్వ పథకాలు రైతులు పొందాలంటే ప్రతి రైతు ఫార్మ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా నమోదు చేయించాలని రైతులను ఉద్దేశించి తెలిపారు మండలంలోని క డ పాయపల్లె గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే పథకాలను రైతులు పొందాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ, ఫార్మ రిజిస్ట్రేషన్ చేయించాలని రైతులు తక్కువ కాల పరిమితిలో పండే పంటలు పై ఆసక్తి చూపి రైతు దిగుబడి పొందాలని రైతన్న నీకోసం వారోత్సవాలు మార్చి 16 నుండి, 24 వరకు జరుగుతాయని తెలిపారు ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలోఏ ఈవో ప్రభాకర్ రెడ్డి రైతులు, రైతు సేవ సిబ్బంది పాల్గొన్నారు.

# అందరి ఆనందమే కూటమి ధ్యేయం

**- దివ్యాంగ శక్తి కార్యక్రమాన్ని నాయకులతో కలసి ప్రారంభించిన అధికారులు**

**- ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు**



**పలమనేరు మార్చి 18 ( మనసులో మాట):** రాష్ట్రంలోని ప్రజలందరి ఆనందమే ప్రభుత్వ ధ్యేయంగా కూటమి పని చేస్తున్నదని పలమనేరు ఆర్డీవో భవాని పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దివ్యాంగ శక్తి కార్యక్రమంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణాన్ని కూటమి నాయకులతో కలిసి అధికారులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కొరకు ఎన్నో కార్యక్రమాలను చేపడుతోందని అందులో భాగంగా గతంలో వికలాంగులకు 50 శాతం రాయితీతో ఆర్టీసీ బస్సులో ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. అయితే ప్రస్తుతం దివ్యాంగ శక్తి కార్యక్రమంతో పూర్తి ఉచితంగా వికలాంగులు బస్సులలో ప్రయాణించేందుకు అవకాశం కల్పించిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు మరిన్ని కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుండడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ అవకాశాన్ని వికలాంగుల అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు చెప్పిన హామీలతో పాటు చెప్పని కార్యక్రమాలను నెరవేరుస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని, అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని ఆదరించాలని పిలుపునిచ్చారు. దివ్యాంగ శక్తితో పాటు రంజాన్ సందర్భంగా ఇమామ్ లు మోజోన్లకు ఆరు నెలల గౌరవ వేతనాన్ని ఒకే దఫా అందించడం ఆనందదాయకమన్నా రు. అనంతరం డిపో మేనేజర్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గిరిబాబు తదితరులు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్, సీఐ మోహన్ రెడ్డి, కమిషనర్ రమణారెడ్డి, పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, నాయకులు కుట్టి, సుబ్రహ్మణ్యం గౌడు,పల్లె రుచులు అమరనాథ రెడ్డి, దీపికా కృష్ణమూర్తి, నాగరాజు, శ్రీధర్, మదన్, బి. ఆర్.సి కుమార్,కిరణ్ కుమార్, సుధాకర్, సురేష్, భాస్కర్ యాదవ్, కోటి, వెంకటరమణ, మండల నాయకులు నాగరాజు రెడ్డి, పెద్దబ్బ, వెంకటముని రెడ్డి, గిరి, గంగవరం నాయకులు గిరిధర్ గోపాల్, మురళీ, వీరప్ప, పర్వీన్, తదితరులు పాల్గొన్నారు.

## జక్కన్న కు ఉగాది సందర్భంగా శిల్ప కళా రత్నా పురస్కారం




**పలమనేరు మార్చి 18 ( మనసులో మాట) :**చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం లోని నేల పల్లెకు చెందినతొండవాని పురుషోత్తమాచార్య మరియు జక్కన్న కు ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం శిల్పకళా రంగంలో కళారత్న పురస్కారం 2026 ప్రకటించారు. వారు ప్రస్తుతం వి కోట మండలంలోని రాఘవపల్లి యందు నివాసం ఉంటున్నారు. కవి,శిల్పి జక్కన్న కు ఈ సందర్భంగా పలమనేరు రచయితల సంఘం, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వారు అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలిపారు.



నంద్యాల జిల్లాలోని శ్రీశైలం పర్యటన నిమిత్తం విచ్చేసిన జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ కిషోర్ రహత్కర్‌ని నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథి గృహం నందు పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు.

---

## గ్రంథాలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలి

**- జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కమ్మన**



ధర్మవరం మార్చి 18 (మనసులో మాట) గ్రంథాలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని, అప్పుడే మంచి గుర్తింపు వచ్చే అవకాశం ఉందని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కమ్మన తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల గ్రంథాలయమును ఆకస్మికంగా తనిఖీ చేశారు. తదుపరి పలు రికార్డులను పరిశీలించారు. తదుపరి తీరుబజారులో ఉన్న రీడింగ్ రూములు కూడా వారు పరిశీలించారు. అనంతరం గ్రంథాలయ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠకులతో సమావేశాన్ని నిర్వహించి, గ్రంథాలయం యొక్క ప్రాధాన్యతను గుర్తిస్తూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. గ్రంథాలయంలో పాఠకుల ద్వారా ఎటువంటి ఫిర్యాదులు అందకుండా పాఠకులకు కావలసిన అన్ని పుస్తకాలను దాతల ద్వారా గాని, కార్యాలయం ద్వారా గాని తెప్పించుకోవాలని తెలిపారు. సమన్వయంతో అందరూ పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి, రాము, శివమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం, నాటు సారా అక్రమంగా విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు

**- ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య**



**ధర్మవరం మార్చి 18 (మనసులో మాట)..** కర్ణాటక మద్యం, నాటు సారా అక్రమంగా విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు అని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు ధర్మవరం ఎక్సైజ్ దేశంలో తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కర్ణాటక మద్యం కానీ నాటు సారా కానీ విక్రయించరాదని తెలిపారు.

ఈ తనిఖీ లో భాగంగా స్టేషన్ రికార్డ్స్ ను పరిశీలించారు. ఎక్సైజ్ ఏపీ సురక్ష యాప్ ద్వారా ప్రతి షాపులో ప్రతి బాటిల్ ను స్కాన్ చేసి అమ్మకాలు జరపాలి అని,అదేవిధంగా తరచుగా బెల్ట్ షాపులు పై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలి అని తెలిపారు. ఎక్సైజ్ నేరములు చేసే వ్యక్తులను, పాత నేరస్థులను బైండోవర్ కేసులు నమోదు చేయాలి అన్నారు. అదేవిధంగా ప్రతి షాప్ లో ఎమ్మార్పీ రేట్లను అమలు చెయ్యాలి అని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎక్సైజ్ సీఐ చంద్రమణి, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం

## గురుకులాలు, హాస్టళ్లలో వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి - సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



**మనసులో మాట సర్వేపల్లి నియోజకవర్గం** విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలం మండలం అనికేపల్లి పంచాయతీ గొలగమూడిలో అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల నిర్వహించారు. రూ.57 లక్షలతో బాలికల గురుకులంలో నిర్మించనున్న వాష్ రూమ్ లకు శంకుస్థాపన. రూ.13 లక్షలతో నిర్మించిన రెండు సిమెంట్ రోడ్లకు ప్రారంభోత్సవం. రూ.5 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంకుకు నిర్మించిన నిచ్చెన ఓపెనింగ్ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూకూటమి ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంద న్నారు. నారా లోకేష్ మంత్రిగా విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నారు ప్రభుత్వ స్కూళ్లలో చదివే ప్రతి బిడ్డ జీవితాన్ని ఉజ్వలంగా తీర్చిదిద్దేందుకు బాటలు వేస్తున్నా అన్నారు. బాలికల గురుకుల పాఠశాలలో 500 మంది చిన్నారులున్నారు. వారి అవసరాలకు సరిపడా మరుగుదొడ్లు లేవు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లగానే మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.57 లక్షలు మంజూరు చేశారు. కోరిన వెంటనే బాలికల గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేసేందుకు మంత్రి సవితమ్మ చర్యలు చేపట్టారు వచ్చే విద్యాసంవత్సరం నుంచే గొలగమూడి గురుకులంలో జూనియర్ కళాశాల అందుబాటులోకి రానుంది. గిరిజన సంక్షేమ స్కూలుకు ప్రహరీ నిర్మించడంతో పాటు అవసరమైన వసతులు కల్పిస్తాం. వైసీపీ పాలనలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు గొలగమూడిలో ఓవర్ హెడ్ ట్యాంకుకు కనీసం మెట్లు ఏర్పాటు చేయించలేకపోయారు. ఇప్పుడు మెట్ల ఏర్పాటు తర్వాత ట్యాంకు శుభ్రం చేయడానికి దిగితే 3 అడుగుల మేర మట్టిపేరుకు పోయి ంది. ట్యాంకును ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు నిర్దేశిత సమయంలో క్లోరినేషన్ చేయాలని అధికారులకు సూచించా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నా మ న్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం మండలం టిడిపి నాయకులు కార్యకర్తలు ఎంపీడీవో కల్పన సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# వృద్ధాశ్రమంలో అన్నదానం



**నెల్లూరు/గూడూరు (మనసులో మాట) మార్చి 18:** నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో బుధవారం గోపిక సహస్ర 11 వ పుట్టినరోజు సందర్భంగా కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు, పిల్లలకు, వికలాంగులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు ఈ అన్నదాన కార్యక్రమానికి ముఖ్య దాతలుగా ముచ్చకాల విజయకుమార్, కల్పన దంపతుల పుత్రిక గోపిక సహస్ర 11 వ పుట్టినరోజు సందర్భంగా పేదవాళ్ళకి అన్నదానం చేయాలని సంకల్పంతో ఎక్కడో వేరే దేశంలో ఉన్న కానీ వాళ్ల పాప పుట్టినరోజు న వృద్ధులకు వికలాంగులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు.ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు మాట్లాడుతూగత రెండేళ్లుగా కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అందులో భాగంగా ఈ రోజున ముచ్చకాల విజయకుమార్, కల్పన దంపతుల పుత్రిక గోపిక సహస్ర 11 వ పుట్టినరోజు సందర్భంగా వారి దాతృత్వంతో నిరాశ్రయులైన వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. తమ ట్రస్ట్ ద్వారా రానున్న కాలంలో దాతలు సహకరిస్తే వారంలో రెండు కార్యక్రమాలు నిరుపేదలకు ఉపయోగపడేలా సేవ చేయాలని ఆలోచనతో ఉన్నామని కాబట్టి దాతలు ముందుకు వచ్చి తమ సహాయ సహకారాలు అందించి ముందుకు తీసుకుపోవాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్,కన్వీనర్ పర్వతాల రమేష,సభ్యులు. చవల సురేంద్ర, పేయ్యల రమణయ్య, ఎస్. కె మూజిఫ్ రమణయ్య వృద్ధాశ్రమం నిర్వహణాలు కళ్యాణి పాల్గొన్నారు.

# పులివెందులలో దివ్యాంగ శక్తి“ పథకాన్ని ప్రారంభించిన కూటమి నాయకులు



**కడప, (మనసులో మాట) మార్చి 18:**పులివెందుల నియోజకవర్గంలో దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి నాయకులు “దివ్యాంగ శక్తి“ పథకాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి మరియు వేంపల్లె టీడీపీ ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని పథకాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మారెడ్డి లతా రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా ఆత్మగౌరవంతో జీవించాలనే సంకల్పంతో ఈ పథకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. మారెడ్డి జోగిరెడ్డి మాట్లాడుతూ, పులివెందుల గడ్డపై ప్రతి ఒక్క దివ్యాంగుడికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని, వారి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. అజ్జుగుట్టు రఘునాథరెడ్డి మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు కేవలం ఆర్థిక సహాయమే కాకుండా, స్వయం ఉపాధి కోసం ప్రత్యేక నైపుణ్య శిక్షణ కూడా అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో దివ్యాంగులకు అవసరమైన సహాయక ఉపకరణాలను పంపిణీ చేయడం తో పాటు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది కూటమి నాయకులు తూగుట్ల మధుసూదన్ రెడ్డి, నల్లాగారి భాస్కర్ రెడ్డి, ,పులివెందుల మండల వైస్ ఎంపీపీ విశ్వనాథ రెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష, పుష్పగిరి స్కూల్ కరస్పాండెంట్, ఓబుల్ రెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా షేక్ జమాలుల్లా ఎంపిక

## గూడూరులో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి - సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి



**నెల్లూరు/గూడూరు (మనసులో మాట) మార్చి 18:** సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా షేక్ జమాలుల్లా ఎంపికయ్యారు. బుధవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమితి ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి నూతనంగా నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా ఎంపికైన జమాలుల్లాకు బ్యాడ్జి ఇచ్చి, ఎన్నో ప్రజా ఉద్యమాలకు జమాలుల నాయకత్వం వహించారని , ఆయన సేవలో గూడూరు నియోజకవర్గంలోని పార్టీకి కూడా పూర్తిగా కొనసాగించాలని . ఆయనను అభినందించారు. నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా ఎంపికైన షేక్ జమాలుల్లా మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో సీపీఐ బలోతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సీనియర్ల సమన్వయంతో జిల్లా, రాష్ట్ర పార్టీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి జీ. శశి కుమార్, చిల్లకూరు మండల కార్యదర్శి గుండాల రమేష్, పట్టణ కన్వీనర్ వై. సునీల్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కే. నారాయణ, బీకేఎంయూ నియోజకవర్గ కార్యదర్శి ఎన్. శ్రీనివాసమూర్తి, మున్సిపల్ యూనియన్ రాఘవయ్య, ముఠా వర్కర్స్ యూనియన్ పెంచలయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మీరా, గౌస్ భాయ్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ క్లాస్ పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులకు మజ్జిగ పంపిణి



ప్రత్తిపాడు ప్రతినిధి : నియోజకవర్గ పరిధిలోని పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న ఎనిమిది పరీక్షా కేంద్రాలలో పరీక్షలు వ్రాయుచున్న విద్యార్థులకు ఉచితంగా శ్రీ ఉప్పుటూరి చిన రాములు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు, ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖధికారుల ట్రస్ట్ చైర్మన్ ఉప్పుటూరి చిన రాములు గారిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. గత కాలములో కూడా ఉప్పుటూరి చిన రాములు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పదవ తరగతి పరీక్షలు వ్రాసే విద్యార్థులకు ప్యాడులు పెన్నులతో కూడిన ఎడ్యుకేషన్ కిట్టులు అందించటమే కాకుండా ఇంకా అనేక ప్రజా ప్రయోజన కార్యక్రమములు అనేకం చేశారు, వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా హెల్మెట్ లను ఉచితంగా అందించటం, పేదవారి బిడ్డలకు చదుకోవాలని ఆసక్తి వున్నవారికి విద్యాబుద్ధులు చెప్పించటం, రంజాన్, క్రిస్మస్ మాసాల్లో ఆయా మతగురువులకు నూతన వస్త్రాలు, ప్రేమవిందులు పేరిట భోజనాలు ఏర్పాటు చేయటం, అనారోగ్యంతో వున్నవారికి ఆర్థికంగా సహాయ పడటం ఇలా ఎన్నో సామజిక కార్యక్రమములు ట్రస్ట్ ద్వారా చేస్తున్నారు,



ఈ రోజు (18-03-2026) శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథి గృహంలో జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ కిషోర్ రహత్కర్‌కి పూలమొక్కతో స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజారెడ్డి - శ్రీశైలం (మనసులో మాట)

---

# డ్రగ్స్,గంజాయి వద్దు,ఆరోగ్యం ముద్దు




యువత డ్రగ్స్ గంజాయి బారిన పడకుండా విలువైన ఉజ్వల భవిష్యత్తు కాపాడుకోవాలని డ్రగ్స్,గంజాయి వద్దు ఆరోగ్యం ముద్దు అని ఎర్రగుంట్ల సిఐ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. ణ్ఖీ× ఆధ్వర్యంలో డ్రగ్స్,గంజాయి నీ అరికట్టాలని కోరుతూ జనచైతన్య జీపు జాత ఎర్రగుంట్ల కు చేరిందని సెంటర్లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐ విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్,గంజాయి జీవితాలనే కాదని కుటుంబాల్ని నాశనం చేస్తుందని అన్నారు.యువత అటువైపు వెళ్లకుండా మంచి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు.ప్రభుత్వాలు,చట్టాలు కఠినంగా ఉన్నాయని చెడు వ్యసనాల వైపు వెళితే జైలు పాలు తప్పవని అన్నారు.మంచి సమాజం కోసం సమాజంలో మార్పు కోసం యాత్ర చేస్తున్న ణ్ఖీ× నాయకత్వానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియన్ చిన్ని వీరనాల శివకుమార్ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్ జిల్లా కమిటీ సభ్యుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్వల భవిష్యత్తుకు ఊరి బడిలో చేరండి

**-యుటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు పిలుపు**



యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఊరి బడిలో పిల్లలను చేర్పిద్దాం కార్యక్రమంలో భాగంగా ఒంటిమిట్ట మండలం నరసన్న గారి పల్లె గ్రామంలో ఇంటింటికీ తిరిగి బడి ఈడు పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పించాలని యుటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెన్న పేరూరు ప్రధానోపాధ్యాయులు నరసయ్య కోరారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, విద్యా కానుక, డిజిటల్ విద్యా సౌకర్యాలు వంటి పథకాల గురించి వివరించారు. పాఠశాలకు రాని విద్యార్థులను గుర్తించి వారిని తిరిగి బడికి చేర్పించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్య ద్వారానే పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపాలని కోరారు. విద్యార్థుల నమోదు పెంపు,విద్యపై చైతన్యం కల్పించడమే బడిబాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. ఈ సందర్భంగా 6వ తరగతిలో ముగ్గురు విద్యార్థులు,9వ తరగతిలో ఒక విద్యార్థిని పాఠశాలలో చేరడానికి ఆసక్తిని కనబరిచారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డయ్య, శ్రీధర్ బాబు, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం తయారీ, రవాణాపై

# కఠిన చర్యలు



శ్రీశైలంలో ఉగాది బ్రహ్మోత్సవాల సందర్భంగా నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ, అసిస్టెంట్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.రాముడు ఆధ్వర్యంలో ఈరోజు శ్రీశైలం దేవస్థానం పరిసర ప్రాంతాలు అయిన కొత్తపేట, మేకలబండ, మాణిక్యమ్మసేల పరిసర ప్రాంతాలలో జరిపిన దాడులు వివరాలు.. ఈరోజు నిర్వహించిన తనిఖీలలో భాగంగా, అక్రమ మద్యం తయారీ మరియు రవాణాపై కఠిన చర్యలు చేపట్టడం జరిగింది. మొత్తం మూడు కేసులు నమోదు చేసి, ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన (60) మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం తయారీ, రవాణా మరియు విక్రయాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని అధికారులు హెచ్చరించారు. ఇలాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలపై నిరంతర తనిఖీలు కొనసాగిస్తామని, ప్రజలు కూడా సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ దాడులలో ఆత్మకూరు ఎక్సైజ్ స్టేషన్ సిఐ మోహన్ రెడ్డి, ఆళ్లగడ్డ ఎక్సైజ్ విజయ్ కుమార్, నంద్యాల జూుఖీ సిఐ లక్ష్మణదాస్, కోయిలకుంట్ల ఎస్.ఐ సందీప్, కర్నూలు ఎన్ఫోర్స్మెంట్ సీఐ కిషోర్ కుమార్ మరియు వారి సిబ్బంది, నందికొట్కూరు ఎక్సైజ్ సి.ఐ రామాంజనేయులు ఎస్ఐలు రమేష్, డోన్ ఎస్.ఐ సోమశేఖర్, కర్నూల్ ఎస్.ఐ మధుసూదన్ రెడ్డి వీరాస్వామి పాల్గొనడం జరిగింది.



# సిలిండర్ మంటల్లో ఇద్దరికీ తీవ్ర గాయాలు

**పలమనేరు మార్చి 18( మనసులో మాట):** పాతపేటలోని ఒక నివాసంలో గ్యాస్ మంటలు వ్యాప్తించడంతో అందులో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయాన్ని అగ్నిమాపక అధికారులకు తెలపడంతో వారు వెంటనే స్పందించి గ్యాస్ మంటలు వ్యాప్తించిన నివాసం వద్దకు వచ్చి గ్యాస్ మంటలను బయటకు తీసుకువచ్చి ఆర్పి వేయడం జరిగిందని అగ్నిమాపక అధికారి హరికృష్ణ హెడ్ కానిస్టేబుల్ సుమన్, ఫైర్ మాన్ మణి తెలిపారు. గ్యాస్ మంటల్లో ప్రమాదానికి గురైన లేట్ నరసింహులు భార్య ముని లక్ష్మిని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు.

# 26 నుండి 5 వరకు అంగరంగ వైభవంగా శ్రీ సీతారామ కల్యాణం



**నెల్లూరు జిల్లా...** ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వారి దేవాలయంలో ఈ నెల 26 నుండి 5 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్న శ్రీ సీతారామ కల్యాణం మరియు కల్యాణ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని, నేడు తాడేపల్లిలోని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నివాసంలో ఆహ్వాన పత్రిక అందిచడం జరిగింది. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంవారి ప్రతినిధులు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి, శ్రీ సీతారాముల వారి కల్యాణ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆహ్వాన పత్రిక స్వీకరించి, ఈ మహోత్సవాలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శివ ప్రసాద్, ఏఈవో బాలరాజు, టీటీడీ దేవస్థానం వెంకటాయిపాలెం సూపరింటెండెంట్ మల్లి ఖార్జున, ఆలయ వేద పండితులు మరియు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.



# ధాన్యానికి మద్దతు ధర కల్పించాల్సిందే

## - మాజీమంత్రి కాకాణి



మనసులో మాట సర్వేపల్లి నియోజకవర్గం రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించాల్సిందేననిమాజీ మంత్రి వర్యులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు "డా" కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సర్వేపల్లి నియోజకవర్గం, మనుబోలు మండల కేంద్రంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

కూటమిపాలనలో రైతులు మద్దతు ధర లేక విలవిలలాడుతున్నారు

- జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మూడు వేల కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తే, కూటమి ప్రభుత్వం కేవలం మొక్కుబడిగా 500 కోట్ల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశారు
- జగన్మోహన్ రెడ్డి పాలనలో రైతులు సంతోషంగా ఉంటే, కూటమిపాలనలో దుఃఖం వెళ్లబుచ్చుతున్నారు
- రైతులకు మద్దతు ధర కల్పించకపోతే రైతుల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తాం
- ఇటీవల మృతి చెందిన సులోచనమ్మ, జనార్ధన్ నాయుడు కుటుంబ సభ్యులను, కాలు దెబ్బ తగిలి విశ్రాంతి తీసుకుంటున్న వెంకట కృష్ణా రెడ్డి ని పరామర్శించిన కాకాణి- ప్రభుత్వం నిర్ణయించినటువంటి గిట్టుబాటు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటా 2,389 రూపాయల చొప్పున, పుట్టి ధాన్యం 20,306 రూపాయలు రైతులకు చెల్లించాల్సి ఉంది
- బిపీటీలు 17,000 రూపాయలకే వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద ఎంతైనా దాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లో డబ్బులు రైతుల అకౌంట్ లల్లో జమ చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు మిన్నకుండిపోయారు
- అధికారులను ఫోన్ ద్వారా సంప్రదిస్తే ప్రభుత్వం మాకు ఒక టార్గెట్ ఇచ్చిందని వాళ్లు ఇచ్చిన టార్గెట్ ప్రకారమే కొనుగోలు చేస్తున్నామని, అంతకుమించి ధాన్యం కొనుగోలు చేయమని చెబుతున్నారు
- నేను మళ్ళీ అధికారులకు ఫోన్ చేస్తే ఫోన్ ఎత్తి సమాధానం చెప్పలేక తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు
- కూటమి ప్రభుత్వం రైతులకు కనీసం మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు, ఆ మాట నిలబెట్టుకోవాలి
- ఇప్పటికే కూటమి పాలనలో రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారు
- రైతులు అనేక రకాల కారణాలతో ప్రతినిత్యం మా వద్దకు వచ్చి వారి సమస్యలు చెప్పుకుని గోడు వెళ్లబుచ్చుకుంటున్నారు
- అధికారులు తమకు సహకరించడం లేదని, అన్నదాత సుఖీభవ రావడంలేదని, అడిగితే ఇతర కారణాలు చెప్పి కాలయాపన చేస్తున్నారని రైతులు గొల్లు మంటున్నారు
- కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రైతులను అనేక విధాలుగా మోసం చేస్తుంది
- తుఫాన్ సమయంలో రైతులకు కాలం చెల్లిన విత్తనాలు అందజేశారు, నష్టపరిహారం విషయంలో మోసం చేశారు, ఒక సంవత్సరం అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం ఇవ్వకుండా ఎగనామం పెట్టారు,
- జగన్మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అన్ని విధాల మమ్మల్ని ఆదుకున్నాడని రైతులు చెబుతున్నారు
- జగన్మోహన్ రెడ్డి గారు మూడు వేల కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాం
- సోమిరెడ్డి రైతులను పట్టించుకున్న దాఖలాలు లేవు
- సోమిరెడ్డి మిల్లర్లతో కుమ్మక్కై వారి వద్ద ముడుపులు తీసుకుని రైతులను నడ్డి విరుస్తున్నాడు
- సోమిరెడ్డి(సుబ్బయ్య) కి రైతుల పట్ల చిత్త శుద్ధి ఉంటే వారికి అండగా నిలిచి ఆదుకోవాలి
- సుబ్బయ్య వేషం వేసిన సోమిరెడ్డికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే, వారికి అండగా నిలిచి ఆదుకోవాలి
- సుబ్బయ్య వేషంలో సోమిరెడ్డి ఆకుపచ్చ కండువా వేసుకుని, అచ్చం రైతులాగా వేషధారణతో అదరగొట్టానంటూ తనను తానే శభాష్ అనిపించుకొని సుబ్బయ్య వేషానికి మోసం చేస్తున్నాడు
- చంద్రమోహన్ ని వ్యక్తిగా ఎవరు నమ్మకపోయినా తాను రైతు వేషం వేసిన సుబ్బయ్య పాత్రకైనా న్యాయం చేసి, రైతులకు అన్యాయం చేయవద్దని కోరుతున్నా
- సోమిరెడ్డి (సుబ్బయ్య) మిల్లర్లతో రహస్య ఒప్పందం చేసుకోకుండా రైతులకు న్యాయం చేయాలి
- కూటమి ప్రభుత్వం మొక్కుబడిగా 500 కోట్ల రూపాయల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి "మమా" అనిపించి రైతుల నడ్డి విరుస్తున్నారు
- కూటమి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కన్నా 16 శాతం ధరలు పడిపోయాయి
- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడి రైతులకు అన్ని విధాల అండగా నిలుస్తాం
- చంద్రమోహన్ రెడ్డి ని డిమాండ్ చేస్తున్నాం,మీరు ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారు, ఎంతమంది ఉద్యోగాల్లో చేరారు, ఎక్కడెక్కడ పనిచేస్తున్నారో జాబితా ఇవ్వగలరా
- చంద్రమోహన్ రెడ్డి ఉద్యోగస్తుల జాబితా ఇస్తే మేము వెళ్లి విచారిస్తాం
- మొక్కుబడిగా జాబు మేళాలు నిర్వహించి బోగస్ ఉద్యోగాలు ఇస్తున్నారు
- చంద్రమోహన్ రెడ్డికి బండే పల్లి కాలువ పనులకు సంబంధించి మట్టి పనులకు బిల్లులు చెల్లిస్తే, మేము మట్టి పనులకు ఒక్క రూపాయి చెల్లించకుండా భూమి సేకరించిన రైతులకు డబ్బులు చెల్లించాం
- చంద్రమోహన్ రెడ్డి రైతులకు డబ్బులు చెల్లించకుండా, మట్టి పనులు చేసిన కాంట్రాక్టర్ దగ్గర ముడుపులు తీసుకొని వారికి డబ్బులు చెల్లించాడు
- సోమిరెడ్డి చేస్తున్న అవినీతి, అక్రమాలపై సమగ్రంగా మాట్లాడుతాం
- సోమిరెడ్డి ఇప్పటికైనా మిల్లర్ల దగ్గర ముడుపులు తీసుకోకుండా రైతుల పక్షాన నిలబడి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేలా చూడాలి
- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన నిలబడి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, సంబంధిత అధికారులను కలుస్తాం, కూటమి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొస్తాం
- అధికారులు, కూటమి ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన నిలబడి పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నా మన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట మనుబోలు మండల వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# కూటమి ప్రభుత్వం రాగానే రూ.3వేలు పింఛన్ పెంచాం..

## - ఇప్పుడు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



**ధర్మవరం మార్చి 18 (మనసులో మాట)..** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివ్యాంగులకు 3వేల రూపాయలు పింఛన్ పెంచిందని.. ఇప్పుడు అదే దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగిన దివ్యాంగ శక్తి పథకం ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ధర్మవరం ఆర్టీసీ డిపో ఆవరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ఆర్టీసీ అధికారులు, దివ్యాంగులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. జెండా ఊపి దివ్యాంగులు ప్రయాణించే బస్సును ఎమ్మెల్యే సునీత ప్రారభించారు. అనంతరం వారితో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. జీరో ఫేర్ టికెట్ ను వారికి అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు ఎందులోనూ తక్కువ కాదు.. వారు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వారికి ప్రభుత్వ సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. దివ్యాంగులను మొదటి నుంచి ప్రోత్సహిస్తున్నది ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రమేనన్నారు. కూటమి ప్రభుత్వం రాక ముందు అందరికీ ఇస్తున్నట్టుగానే దివ్యాంగులకు కూడా 3వేల రూపాయలు మాత్రమే పెన్షన్ ఇచ్చేవారన్నారు. కానీ ప్రభుత్వం రాగానే దివ్యాంగుల స్థితిగతుల్లో మార్పు తేవాలని.. వారికి ఆర్థిక చేయూతనందిచాలని పింఛన్ ను 6వేలు చేశారన్నారు. గతంలో 50శాతం మాత్రమే ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఉండేదన్నారు. ఇప్పుడు దివ్యాంగులకు పూర్తిగా ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించారన్నారు. 100శాతం వికలత్వం ఉన్న వారికి సహాయంగా వచ్చే వారికి కూడా టికెట్ లో 50శాతం రాయితీ ఇస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో 11లక్షల మందికి దీని ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. దివ్యాంగులకు ద్విచక్రవాహనాలు కూడా అందిస్తున్నామని చెప్పారు. అవసరమైన వారు దరఖాస్తు చేసుకుంటే ప్రధాన్యత వారిగా దీనిని అందిస్తారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేటప్పుడు వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులకు సీట్లు ఇచ్చి తోటి ప్రయాణీకులు కూడా సహకరించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ జాతీయ నాయకులు అంబటి సతీష్, టిడిపి నాయకులు సంధ రాఘవ, కమతం కాటమయ్య, పురుషోత్తం గౌడ్, పారిశే సుధాకర్, బేబీ, కిరోసిన్ పోతులయ్య, హరికుమార్, వికలాంగుల పట్టణ అధ్యక్షుడు స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతే ఆరోగ్యానికి మొదటి మెట్టు హరీష్ బాబు

## - చెత్త నిర్వహణలో ప్రజలు ముందుకు రావాలి హరీష్ బాబు - ప్రతి గ్రామం స్వచ్ఛ గ్రామంగా మారాలి స్వచ్ఛ రథం ప్రారంభోత్సవంలో హరీష్ బాబు పిలుపు




**తాడిమర్రి, మార్చి 18 (మనసులో మాట)..** ధర్మవరం నియోజకవర్గ ప్రజలు, గ్రామాలు మరియు పట్టణాలలో పరిశుభ్రతను కాపాడుకోవాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు పిలుపునిచ్చారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని బుధవారం తాడిమర్రి మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం(ఎంపీడీఓ) వద్ద ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో హరీష్ బాబు స్వచ్ఛ రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాలు మరియు పట్టణాలలో పరిశుభ్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు పరిశుభ్రతే మొదటి అడుగు అని, మన పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. స్వచ్ఛ రథం కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించడం, ముఖ్యంగా డ్రై వేస్ట్‌ను వేరు చేసి తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలోనే తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. చెత్తను సరైన విధంగా నిర్వహించడం ద్వారా గ్రామాలు మరింత అందంగా మారడమే కాకుండా, వ్యాధుల నివారణకు కూడా ఇది ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమం ప్రత్యేకతగా, చెత్తను అందజేసే ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువులను ప్రోత్సాహకంగా అందించే విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని చెప్పారు. దీని ద్వారా ప్రజల్లో శుభ్రతపై అవగాహన పెరగడంతో పాటు, వారు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి మరియు పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ స్వచ్ఛ రథం కార్యక్రమం గ్రామాల రూపురేఖలను మార్చే దిశగా ఒక కీలక అడుగు అని హరీష్ బాబు అన్నారు. ప్రతి గ్రామం స్వచ్ఛ గ్రామం గా మారాలని, అందుకు ప్రజల సహకారం అత్యవసరమని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఏ.వీ. రంగారావు, డిప్యూటీ ఎంపీడీఓ విరశేఖర్ నాయుడు, మండల అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



# తిరుపతి అభివృద్ధిలో మరో మైలురాయి ఉప్పరపల్లి

## మహిళా వర్సిటీ రోడ్డు విస్తరణ పనులకు భూమి పూజ

**తిరుపతి (మనసులో మాట):** ఆధ్యాత్మిక నగరం తిరుపతిని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా మరో కీలక అడుగు పడింది. తిరుపతి పట్టణ అభివృద్ధి సంస్థ (తుడా) ఆధ్వర్యంలో ఉప్పరపల్లి చెక్ పోస్ట్ నుండి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు బుధవారం శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్, టీటీడీ ఎక్స్ అఫిషియో మెంబర్ మరియు టీడీపీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథులుగా పాల్గొని పనులను ప్రారంభించారు.

**యుద్ధ ప్రాతిపదికన పనులు: డాలర్స్ దివాకర్ రెడ్డి**

ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తిరుపతి పరిసర ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. "ఉప్పరపల్లి నుండి మహిళా వర్సిటీ వరకు ఉన్న ఈ మార్గం అత్యంత కీలకమైనది. ఈ రోడ్డు విస్తరణ ద్వారా వేలమంది విద్యార్థులకు, స్థానిక ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తప్పుతాయి. తుడా నిధులతో ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం," అని ఆయన పేర్కొన్నారు.

**నియోజకవర్గ అభివృద్ధియే లక్ష్యం: ఎమ్మెల్యే పులివర్తి నాని**

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రహదారులను గుర్తించి, ప్రస్తుతం ప్రాధాన్యత క్రమంలో వాటిని బాగు చేస్తున్నామని ఆయన తెలిపారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో తుడా ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పంచాయతీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాయింట్ ఎల్ పి ఎం ఎస్ పై గ్రామ సభ నిర్వహించిన జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



**ధర్మవరం మార్చి 18 (మనసులో మాట)..** మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో రైతుల యొక్క జాయింట్ ఎల్ పి ఎం ఎస్ పైన గ్రామ సభను జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతుల యొక్క సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ ఏప్రిల్ నాలుగవ తేదీన 1958 మందికి పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని, దీని ద్వారా రైతులకు ఎంతో ఉపయోగ ఉంటుందని తెలిపారు. తదుపరి లబ్ధిదారులతో చర్చలు కూడా నిర్వహించి, వారి సమస్యలను విని, పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. తదుపరి పట్టణంలోని నిత్యావసర వస్తువుల గోడౌన్ తనిఖీ చేశారు. అక్కడ ఉన్న పలు రికార్డులను వారు పరిశీలిస్తూ, చౌక ధాన్యపు డీలర్లకు కొలత సక్రమంగా ఉండే విధంగా పంపిణీ చేయాలని వారు సూచించారు. ఎక్కడ అవకతవకలకు తావు ఇవ్వరాదని తెలిపారు. తదుపరి పట్టణంలోని లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ గ్యాస్ గోడౌన్ ను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్నటువంటి రికార్డులను పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు రికార్డులను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. తదుపరి వారి నిర్వహణ పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గ్యాస్ లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సకాలంలో సిలిండర్లను పంపిణీ చేయాలని సూచించారు. తదుపరి రేగాటిపల్లి హైవే రోడ్లో 2024లో పెట్రోల్ బంక్ అనుమతి కొరకు పెట్టుకున్న స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రామ సుబ్బయ్య, తాసిల్దార్ సురేష్ బాబు, జిఎస్టి రమణబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలి

## - సాకేనరేష్ డిమాండ్




**ధర్మవరం మార్చి 18 (మనసులో మాట)..** బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ధర్మవరం లో సత్యసాయి జిల్లా కార్యవర్గ సమావేశం ధర్మవరంలోని పెన్షనర్స్ భవన్ లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాకేనరేష్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావొస్తున్న బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయిందని, బీసీ కార్పొరేషన్లను పూర్తిగా నిర్వీర్యం చేసిందని బీసీల రక్షణ చట్టం అమలు చేయలేదని, బీసీ కులాలకు ఫెడరేషన్లు ఏర్పాటు చేసి పవర్స్ లేని పదవులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యోగులకు ప్రమోషన్లు, రిజర్వేషన్లు కల్పించాలని, జనగననతో పాటు బీసీల కులగనన చేయాలని డిమాండ్ చేశారు, కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేష్, ట్రెజరర్ కిషోర్, జిల్లా అధ్యక్షుడు మేకల రామాంజినేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, మురళి, గంగాద్రి, నారాయణస్వామి, వెంకటేశు, రంగస్వామి, కామన్న, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
గురువారం 19 మార్చి 2026


# మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై సిట్ దర్యాప్తు

## సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 18 (మనసులో మాట)

మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ కేసులో తమ ప్రమేయం ఏమీ లేదని ఆయన చెప్పారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిబంధనల ప్రకారమే స్టేషన్ బెయిల్ ఇచ్చారని వివరించారు. దీనిలో మా ప్రమేయం ఏమీ లేదని తెలిపారు. ఈ వ్యవహారంపై లోతైన దర్యాప్తు చేసేందుకు సిట్ వేశామని చెప్పారు. తెలంగాణలో 2029లోనే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని సీఎం అన్నారు. 2028లో ఎన్నికలు రావని చెప్పారు. మహిళా రిజర్వేషన్లు ముందుగా అమలులోకి వస్తే మంచిదేనని అభిప్రాయపడ్డారు. అంతకుముందు పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను రేవంత్ రెడ్డి కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి వెళ్లి వారితో సమావేశమయ్యారు.

ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని రాహుల్, ప్రియాంకలకు



రేవంత్ పరిచయం చేశారు. పార్లమెంట్‌లో వైఎస్ఆర్ సీపీ నేత, మాజీ మంత్రి రోజా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారిరువురు ఒకరినొకరు పలకరించుకున్నారు.

# యూరియా యాప్‌తో రైతులకు తిప్పలు

## అసెంబ్లీలో వేముల ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం

## యాప్ వినియోగం తెలియక 75 శాతం మందికి ఇబ్బందులు

## ఐదు బస్తాల పరిమితిని ఎత్తేయాలని ప్రభుత్వానికి డిమాండ్

హైదరాబాద్, మార్చి 18 (మనసులో మాట)

కాంగ్రెస్ సర్కారు యూరియా యాప్ పేరుతో రైతులను వేధిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో మాట్లాడిన ఆయన యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. రాష్ట్రంలో 50 శాతం మంది రైతుల దగ్గర స్మార్ట్‌ఫోన్‌లు లేవని, ఇక స్మార్ట్ ఫోన్‌లు ఉన్న 50 శాతం మందిలో కూడా 50 శాతం మందికి యాప్‌ను ఎలా ఉపయోగించాలో తెలియదని అన్నారు. ఇలా మొత్తంగా 75 శాతం మంది రైతులు యూరియా యాప్‌తో ఇబ్బందులు పడుతున్నారని వేముల ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. వారంతా మీ సేవా కేంద్రాలకు పోయి యూరియా బుక్ చేయించుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఆ తర్వాత మరో రోజు వెళ్లి యూరియా తెచ్చుకోవాల్సి వస్తుందని అన్నారు. ఇలా రెండు రోజులు సమయం రైతుకు వృథా అవుతోందని చెప్పారు.



### కేంద్రాల సంఖ్య పెంచాలని డిమాండ్

ఇక ఒక దఫాలో 5 బస్తాల కంటే ఎక్కువ యూరియా ఇవ్వడం లేదని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. దాంతో మూడు నాలుగు ఎకరాల్లో మక్క పంట వేసిన రైతు మూడు దఫాల్లో రెండేసి రోజుల చొప్పున మొత్తం ఆరు రోజులు యూరియా కోసం తిరగాల్సి వస్తోందని చెప్పారు. మండలానికి ఒక్క కేంద్రంలో మాత్రమే యూరియా ఇస్తుండటంతో చాలా గ్రామాల రైతులు ఎక్కువ దూరం వెళ్లాల్సి వస్తోందని అన్నారు. కాబట్టి మండలానికి ఒక్కచోట మాత్రమే కాకుండా ఎక్కువ చోట్ల యూరియా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. దఫాకు 5 బస్తాల పరిమితిని ఎత్తేసి, రైతు వేసిన పంటకు ఎంత యూరియా అవసరమో అంతా ఒకేసారి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# బీసీల సంక్షేమానికి బడ్జెట్‌లో 20 వేల కోట్లు కేటాయించాలి

## మాజీ మంత్రి తలసాని

హైదరాబాద్, మార్చి 18 (మనసులో మాట)

జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం బీసీల సంక్షేమానికి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయించాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పటికే రెండు బడ్జెట్‌లు అయిపోయాయని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ. 10 వేల కోట్ల వరకు ఉన్నాయని, వెంటనే వాటిని ప్రభుత్వం చెల్లించాలని కోరారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల కారణంగా అనేకమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే బీసీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు జ్యోతిరావు పూలే ఓవర్సీస్ కార్యక్రమాన్ని కేసీఆర్ తీసుకొచ్చారని, ఆ పథకం కింద అర్హులైన విద్యార్థులకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బీసీ వర్గాలను చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీలో బిల్లు పెడితే చట్టబద్ధత రాదని, కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్ లో చేరిస్తేనే చట్టబద్ధత వస్తుందన్న విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తే పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ హాజరుకాకపోవడం బీసీల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. బీసీ సమస్యలపై కాంగ్రెస్ పార్టీలోని బీసీ వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.



# గవర్నర్ ప్రసంగం భవిష్యత్ విజన్

## సీఎం రేవంత్ రెడ్డి

- కేసీఆర్ అహంకార ధోరణి వీడాలి
- సభకు వచ్చి సూచనలు ఇవ్వాలని విన్నపం

హైదరాబాద్, మార్చి 18 (మనసులో మాట)

గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలు వివరించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఎలా ముందుకు పోవాలో.. పోతున్నదో ఇందులో స్పష్టంగా చెప్పామన్నారు. రాష్ట్ర విజన్‌ను గవర్నర్ ఆవిష్కరించారని పేర్కొన్నారు. గవర్నర్‌తో చర్చించిన తర్వాతే ప్రసంగాన్ని సిద్ధం చేశామని తెలిపారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో సీఎం మాట్లాడారు. రాజులు పోయినా.. రాజ్యాలు పోయినా కొందరిలో రాచరికపు పోకడలు పోలేదని విమర్శించారు. కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకారం.. లేనప్పుడూ అదే ధోరణి అని ప్రతిపక్షంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులని పేర్కొన్నారు.

### కేసీఆర్ తీరుపై నిప్పులు

కొత్త గవర్నర్‌ను కలిసేందుకు ప్రతిపక్ష నేత వస్తారని భావించామని సీఎం అన్నారు. ప్రధాన ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతుందని అనుకున్నామన్నారు. ప్రసంగంపై సూచనలు.. సలహాలు వస్తాయని ఆశించామని.. కానీ వారి నుంచి కనీస స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ సభకు రావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఆయన సభలో పాల్గొని సూచనలు ఇవ్వాలన్నారు. రాష్ట్రానికి కొత్త గవర్నర్ వచ్చినా కనీసం శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న కేసీఆర్ రాకపోవడంపై మండిపడ్డారు. సభకు రావాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను ఓడించి ప్రజలే తప్పు చేసినట్లుగా ఆయన వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారం పోయినా ఇంకా అదే అహంకారంతో ఉన్నారని విమర్శించారు.

### విపక్షంపై విమర్శలు

కేసీఆర్ ఇప్పటికైనా సభకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఆయనకు ఉన్న అనుభవంతో ప్రభుత్వానికి సలహాలు ఇస్తే స్వీకరిస్తామని తెలిపారు. నాలుగు కోట్ల ప్రజలను నిరాశ పరిచేలా ప్రతిపక్షాల తీరు ఉందని.. తమ ప్రభుత్వం భవిష్యత్ ప్రణాళికలతో ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగం చారిత్రాత్మకమని.. అది తెలంగాణ అభివృద్ధికి విశిష్ట ప్రణాళిక అని పేర్కొన్నారు. ప్రతిపక్షం హుందాగా వ్యవహరిస్తుందని ఆశించామని.. కానీ వారు అహంకారం ప్రదర్శించారని ఆరోపించారు. ఆరోపణలు.. ప్రత్యారోపణలతో సభను పక్కదారి పట్టించారని మండిపడ్డారు. సభ సంప్రదాయాలను విపక్ష నేత గౌరవించకపోవడం రాష్ట్రానికి మాయని మచ్చ అని వ్యాఖ్యానించారు.

### నిధులు - విధులపై ప్రశ్న

ప్రతిపక్ష నాయకుడు ఇప్పటిదాకా కోటి ఆరు లక్షలకు పైగా జీతభత్యాలు పొందారని సీఎం గుర్తు



చేశారు. కేసీఆర్ ఇప్పటికైనా సభకు రావాలని కోరారు. ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటయ్యేందుకు మాజీ ప్రధాని పీవీ విధానాలే కారణమన్నారు. పీవీ నరసింహారావు.. నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి తొలిసారి హైటెక్ సిటీకి పునాది వేశారని తెలిపారు. అనంతరం చంద్రబాబు.. వాజ్‌పేయీ దానిని పూర్తి చేశారని చెప్పారు. ప్రస్తుతం ఏఐ ద్వారా లక్షలాది ఉద్యోగాలు పోయి నిరుద్యోగ సమస్య తలెత్తే పరిస్థితి ఉందని.. ఈ పరిస్థితుల్లో భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉందని వివరించారు. సవాళ్లను ఎదుర్కోవడంపై విజన్ డాక్యుమెంట్‌ను సభలో ప్రవేశపెట్టామన్నారు. గవర్నర్ ప్రసంగం కేవలం ప్రభుత్వ కార్యక్రమాల జాబితా కాకుండా.. భవిష్యత్తు తెలంగాణకు ఒక విజన్ డాక్యుమెంట్‌గా నిలిచిందని పేర్కొన్నారు.

### ఆర్థిక లక్ష్యాల ఆవిష్కరణ

రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వ సంకల్పాన్ని గవర్నర్ ప్రసంగం చూపిందని సీఎం చెప్పారు. తెలంగాణ ప్రజల ఆశయాలను ఇది ప్రతిబింబించిందన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా.. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం ఎదగడానికి ఇది ఒక విశిష్ట ప్రణాళిక అని తెలిపారు. ఇలాంటి గొప్ప సంకల్పాన్ని సభలో ఉంచిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకి రేవంత్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్న సందర్భంగా కేసీఆర్ వస్తారని అనుకున్నామన్నారు. ప్రజలు బుద్ధి చెప్పి ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా బీఆర్ఎస్ నేతల తీరు మారలేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ తన విధులకు హాజరు కాకుండా జీతభత్యాలు తీసుకోవడంపై ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు.

### నవశకానికి నాంది

గత చరిత్రను అనుభవాలుగా మార్చుకుంటూ ముందుకు సాగాలని సీఎం అన్నారు. నెహ్రూ తీసుకున్న ప్రణాళికలతోనే ఇవాళ దేశం ఈ స్థితిలో ఉందని గుర్తు చేశారు. పీవీ నరసింహారావు నుంచి మన్మోహన్ సింగ్ వరకు అనేక సంస్కరణలు తెచ్చారని ప్రస్తావించారు. భవిష్యత్తులో ఏఐ సునామీ రాబోతోందని.. దానిని ఎదుర్కొనే పాలసీ డాక్యుమెంట్‌ను గవర్నర్ వివరించారని చెప్పారు. ప్రతిపక్ష నేతలు తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను కనీసం చదివారా అని ప్రశ్నించారు. భవిష్యత్తు ప్రణాళికలు లేకపోతే తర్వాత తరాలు క్షమించవని హితవు పలికారు. అన్ని రంగాల మేధావులతో కలిసి ఈ డాక్యుమెంట్ రూపొందించామని.. తెలంగాణను క్యూర్.. ప్యూర్.. రేర్‌గా విభజించుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.

# మూసీ ప్రక్షాళన పేరిట లక్షన్నర కోట్ల దోపిడీ

- అసెంబ్లీలో కేటీఆర్ నిప్పులు
- ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్
- డీపీఆర్ లేకుండా ఇళ్ల కూల్చివేతలపై నిలదీత

హైదరాబాద్, మార్చి 18 (మనసులో మాట)

మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని.. అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభ నుంచి బయటకు వెళ్లారు. అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం దాటవేసే ధోరణిలో సమాధానం ఇవ్వడంపై కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవని.. ప్రణాళికలు లేవని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదని.. కేవలం లక్షన్నర కోట్ల దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు.



### ప్రణాళిక లేని ప్రాజెక్టు

మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు కోసం రుణం మంజూరైందని గతంలో మంత్రి చెప్పారని.. కానీ డీపీఆర్ కూడా సబ్‌మిట్ చేయలేదని అప్పుడు ఏడీబీ చెప్పిందని పేర్కొన్నారు. రుణం మంజూరు కాలేదని ఈ నెల 11వ తేదీన ఏడీబీ లేఖ ఇచ్చిందని తెలిపారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంలో ప్రభుత్వం చెప్పిందని.. మరి రెండు నెలల్లో డీపీఆర్ ఎలా సిద్ధమైందని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టు మొదటి ఫేజ్ తర్వాత ఎన్ని దశలు ఉంటాయో స్పష్టం చేయాలని అడిగారు. కేవలం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశం ఏమిటో నిలదీశారు.

### పేదల ఇళ్లపై గృహమేధ యాగం

మూసీ ప్రాజెక్టులో బఫర్ జోన్ ఎంత అనే విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఈ ప్రాజెక్టుతో వేలాది మంది నష్టపోతున్నారని.. రేవంత్ సర్కార్ గృహ మేధ యాగం చేస్తోందని మండిపడ్డారు. బ్లాక్ లిస్ట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్టు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండా హడావిడిగా ఇళ్లు ఎందుకు కూలుస్తున్నారని అడిగారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన ప్రభుత్వం.. దాటవేసే ధోరణిలో వ్యవహరించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసి తమ నిరసనను తెలిపారు. డీపీఆర్ తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు విషయంలో ప్రభుత్వం చేస్తున్న విరుద్ధ ప్రకటనలను కేటీఆర్ ఎత్తిచూపారు.

### బఫర్ జోన్ నిర్ణయంలోనూ అస్పష్టత

ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుండగా.. సభలో మాత్రం నాలుగు, ఐదు వేల కోట్లు అని చెప్పడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు.. ఎంత భూసేకరణ జరుగుతుంది.. ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని.. 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. బఫర్ జోన్‌ను విస్తరించామని స్థానిక అధికారులు చెబుతున్నారని.. అసలు ఎంత వరకు పెంచారో.. దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు.

### ప్రభుత్వ వైఖరిపై నిరసన

మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ అంగీకరించబోదని.. పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉందా లేదా అన్న విషయానికే స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డీపీఆర్ లేదని చెబుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఫైవ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు చేయకుండా.. బాధితులతో ప్రజల మధ్య ప్రజెంటేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసీ నదిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని.. ఇప్పుడు భారీ ప్రాజెక్ట్ పేరుతో అవినీతి చేయాలని చూస్తోందని ఆరోపించారు.

### అనుమానాస్పద డీపీఆర్ తయారీ

50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి.. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్‌కు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ అస్పష్టతకు నిదర్శనమని విమర్శించారు. మొదట 1,400 ఇళ్లు కూల్చివేస్తామని చెప్పి.. ప్రస్తుతం 10,000 ఇళ్లకు పైగా నోటీసులు ఇవ్వడం ఎలా జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్లు కూల్చివేస్తున్నా ఉప ముఖ్యమంత్రికి సమాచారం లేదని పేర్కొన్నారు. డీపీఆర్ తయారీని 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి అప్పగించారని.. ఈ కంపెనీని సింగపూర్, పాకిస్తాన్ సహా అనేక సంస్థలు బ్యాన్ చేశాయని తెలిపారు. ఏడీబీ రుణం విషయంలో మంత్రి శ్రీధర్ బాబు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# సర్కార్‌ను ఆడిస్తున్న అధికారులు

**కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు**

**అధికారుల తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తీవ్ర ఆగ్రహం**

**57 వేల కోట్ల రుణాల నిరూపణపై సవాల్ విసిరిన మాజీ మంత్రి**

**హైదరాబాద్, మార్చి 18 (మనసులో మాట)**



ప్రభుత్వ అధికారులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని సర్కస్‌లా నడిపిస్తున్నారని.. అధికారులు రింగ్ మాస్టర్లుగా తయారయ్యారని అన్నారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ అధికారి ఐఏఎస్ నర్సింహారెడ్డి.. కాంగ్రెస్ లీడర్‌లా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మూసీ ప్రాజెక్ట్‌ను ఆరు నూరైనా పూర్తి చేసి తీరుతామని అనడానికి నువ్వెవరివి?' అని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులు ఒళ్లు దగ్గరపెట్టుకోవాలని హెచ్చరించారు. అధికారులు రిటైర్ అయినా వారిని వదిలిపెట్టేది లేదన్నారు. ప్రభుత్వాన్ని తప్పుడు పనులకు ప్రేరేపిస్తున్నారని విమర్శించారు. 'కుక్క తోకను ఊపట్లేదు.. తోకే కుక్కను ఊపుతున్నట్లుంది అధికారులు మంత్రుల తీరు' అంటూ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**భట్టి విక్రమార్కపై నిప్పులు**

ఇంకా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై విరుచుకుపడ్డారు. 57 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని భట్టి సభలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. 'అది నిజమని నిరూపిస్తే రాజీనామా చేస్తాను.. నేను ఇప్పటికీ ఆ మాటకు కట్టుబడి ఉన్నాను' అని కేటీఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్‌పై సభలో మంత్రి పచ్చి అబద్ధాలు మాట్లాడారని మండిపడ్డారు. మూసీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డీపీఆర్‌ను అసెంబ్లీలో పెట్టాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు.

# తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు పదవీకాలం పొడిగింపు

**మరో మూడు నెలల పాటు సర్వీసులో కొనసాగనున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

**రాష్ట్ర విన్నపానికి సానుకూలంగా స్పందిస్తూ కేంద్రం కీలక నిర్ణయం**

**హైదరాబాద్, మార్చి 18 (మనసులో మాట)**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పదవీ కాలం పొడిగింపుపై గత కొద్దిరోజులుగా సాగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఆయన సర్వీసును మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వ పర్సనల్ శిక్షణ విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక ఉత్తర్వులు అందాయి. తాజా పొడిగింపుతో రామకృష్ణారావు జూన్ నెలాఖరు వరకు తెలంగాణ సీఎస్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. వాస్తవానికి రామకృష్ణారావు గతేడాది ఆగస్టు 31వ తేదీనే పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో పాలనాపరమైన అవసరాలు, కీలక ప్రాజెక్టుల అమలు దృష్ట్యా ఆయన సేవలు మరికొంత కాలం అవసరమని భావించిన ప్రభుత్వం గతంలోనే ఏడు నెలల పొడిగింపు కోరింది. ఆ గడువు ఈ ఏడాది మార్చి 31వ తేదీతో ముగియనుంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కేంద్రానికి విన్నవించగా సానుకూల స్పందన లభించింది.

# ఆర్టీసీ ఉద్యోగులకు భారీ షాక్

**కుటుంబ నియంత్రణ ఇంక్రిమెంట్ రద్దు**

**సంస్థ బోర్డు తీర్మానం మేరకు ప్రోత్సాహకాలు నిలిపివేత**

**కేవలం ప్రత్యేక సాధారణ సెలవులకే పరిమితం చేసిన యాజమాన్యం**

**హైదరాబాద్, మార్చి 18 (మనసులో మాట)**

ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పెద్ద షాక్ ఇచ్చింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద ఇచ్చే స్పెషల్ ఇంక్రిమెంట్‌ను రద్దు చేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ బోర్డు తీర్మానం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇకపై ఉద్యోగులు, వారి జీవిత భాగస్వామి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నా ఈ ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వబోమని యాజమాన్యం స్పష్టం చేసింది.

**కార్మిక సంఘాల తీవ్ర నిరసన**

ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ సర్క్యులర్ జారీ చేసింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద స్పెషల్ క్యాజువల్ లీవ్ మాత్రమే కొనసాగుతుందని తెలిపింది. ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. గతంలో ఈ పథకం ద్వారా కుటుంబ నియంత్రణను ప్రోత్సహించే వారని నేతలు గుర్తు చేశారు.

# అకాల వర్షం బీభత్సం

**తెలంగాణలో పంటలకు భారీ నష్టం**

**కరీంనగర్, మార్చి 18 (మనసులో మాట)**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గత అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షానికి పలుచోట్ల పెద్ద ఎత్తున పంట నష్టం తలెత్తింది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి, మంగపేటల్లో తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న పంట నేలకూలింది. కరీంనగర్ జిల్లా వీణవంకలోనూ అపార పంట నష్టం జరిగింది. నర్సింగాపూర్‌లోనూ మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతింది. కొన్ని చోట్ల మామిడి పిందెలు రాలిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వడగండ్ల వానతో కుదేలు**

నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో గత రాత్రి కురిసిన వడగండ్ల వానకు చేతికొచ్చిన పంట నేలరాలింది. భారీగా పంట నష్టం సంభవించడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరుతున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. అకాల వర్షానికి మిర్చి రైతులు విలవిలలాడారు. మిర్చి కుప్పలపై టార్పాలిన్లు కప్పి పంటను కాపాడుకుంటున్నారు రైతులు.

# మక్కల కొనుగోలుపై బీఆర్ఎస్ సమరం

- గన్ పార్క్ వద్ద హరీశ్ రావు, కేటీఆర్ ఆందోళన
- రూ. 2400 మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్
- అసెంబ్లీ ముట్టడిలో ఉద్రిక్తత.. మార్షల్స్‌తో తోపులాటలో హరీశ్ రావుకు గాయం



**హైదరాబాద్, మార్చి 18 (మనసులో మాట)**

రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిలదీస్తూ రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్ పార్క్ నుండి అసెంబ్లీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ శ్రవణ్ సహా పలువురు నేతలు ఆందోళనకు దిగారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. మార్కెట్లకు పోటెత్తిన మక్కలను కొనుగోలు చేయకపోవడంతో రైతన్నకు తిప్పలు తప్పడం లేదంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. మొక్కజొన్న కంకులతో గన్ పార్క్ లో నినాదాలు చేసిన గులాబీ పార్టీ నేతలు అక్కడి నుంచి కాలినడకన అసెంబ్లీకి బయలుదేరి వెళ్లారు.

**ప్రభుత్వ తీరుపై హరీశ్ రావు ధ్వజం**

ఈ సందర్భంగా గన్ పార్క్ వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. వరి వేయొద్దని, పంట మార్పిడి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పదేపదే చెబితే ఆ మాటలు నమ్మి రాష్ట్రంలో రైతులు సుమారు 8 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని తెలిపారు. తీరా పంట చేతికి వచ్చాక ఆ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచుతోందని విమర్శించారు. మొక్కజొన్న మార్కెట్లకు రావడం మొదలై ఇప్పటికే 15 రోజులు అవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం దారుణమన్నారు.

**దళారుల పాలవుతున్న పంట**

మొక్కజొన్నకు మద్దతు ధర రూ. 2400 ఉంటే కొనుగోలు కేంద్రాలు లేక రైతులు బయట మార్కెట్లో దళారులకు రూ. 1600 నుంచి 1700 లకే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పదిహేను రోజులుగా కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం చూస్తుంటే ప్రభుత్వ ఆంతర్యం ఏమిటో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. పంట అంతా దళారుల పాలైన తర్వాత ఆ దళారుల దగ్గర ఎక్కువ ధరకు కొని వాళ్లకు మేలు చేయాలని ప్రభుత్వం చూస్తోందా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుందా? దళారులకు మేలు చేస్తుందా? అనేది స్పష్టం చేయాలన్నారు. అకాల వర్షాలకు మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన మొక్కజొన్న తడిచిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వాలి**

గత రెండు రోజులుగా కురిసిన వడగండ్ల వానలకు మొక్కజొన్న, మామిడి సహా ఇతర పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని పేర్కొన్నారు. బడ్జెట్ లో పంటల బీమా గురించి గొప్పగా ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని చెప్పారు. ఈ ప్రభుత్వం అటు పంటల బీమా అమలు చేయదు, ఇటు ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వదని మండిపడ్డారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర రైతాంగానికి ఇన్ పుట్ సబ్సిడీ అందడం లేదని తెలిపారు. అకాల వర్షాలు, వడగండ్ల వానల వల్ల జరిగిన నష్టంపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వెంటనే నివేదికలు తెప్పించుకోవాలని సూచించారు. తక్షణమే ఎన్యూమరేషన్ చేసి నష్టపోయిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

**అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత**

మొక్కజొన్న రైతులను కాంగ్రెస్ సర్కార్ ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో మార్షల్స్ దురుసుగా ప్రవర్తించారు. అసెంబ్లీ ఎంట్రన్స్ వద్ద ఎమ్మెల్యేల నుంచి మక్కలు, కందులు లాక్కున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు చేతికి గాయమై రక్తం వచ్చింది. మరోవైపు అసెంబ్లీ ఎంట్రన్స్ వద్ద పాడి కౌశిక్ రెడ్డి చేతిలో నుంచి చీఫ్ మార్షల్ కరుణాకర్ మక్కలు లాక్కొని కిందపడబోశారు. మార్షల్స్ తీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అసెంబ్లీ ఎంట్రన్స్ వద్ద కూర్చొని నిరసన తెలిపారు. మార్షల్స్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# లాంగ్ వీకెండ్‌లో ప్రైవేట్ బాదుడు

**బస్సు ఛార్జీలకు రెక్కలు**

**వరుస సెలవులను అదునుగా చేసుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలు**

**సాధారణం కంటే మూడు నుంచి నాలుగు రెట్లు పెరిగిన టికెట్ ధరలు**




**హైదరాబాద్, మార్చి 18 (మనసులో మాట)**

సామాన్యుడికి సొంతూరి ప్రయాణం భారంగా మారుతోంది. వరుస సెలవులు రావడంతో నగరాల్లో నివసించే ఉద్యోగులు, విద్యార్థులు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు దీనిని అదునుగా చేసుకుని ఛార్జీలను అడ్డగోలుగా పెంచేస్తున్నాయి. మార్చి 19న ఉగాది, 21న రంజాన్, 22న ఆదివారం కావడంతో మధ్యలో ఉన్న శుక్రవారం ఒక్క రోజు సెలవు పెడితే వరుసగా నాలుగు రోజులు పండుగను కుటుంబంతో గడపవచ్చని చాలామంది ప్రణాళికలు వేసుకున్నారు. అయితే ఆర్టీసీ బస్సులు, రైళ్లలో రిజర్వేషన్లు ఎప్పుడో నిండిపోవడంతో ప్రయాణికులకు ప్రైవేట్ ట్రావెల్స్ మాత్రమే ప్రత్యామ్నాయంగా మిగిలాయి. దీనిని ఆసరాగా చేసుకున్న కొన్ని సంస్థలు సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నాయి.

**విమాన ప్రయాణంతో పోటీ**

సాధారణ రోజుల్లో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ బస్సు ఛార్జీ సుమారు రూ. 1,500 నుంచి రూ. 2,000 మధ్య ఉంటుంది. కానీ ఈ లాంగ్ వీకెండ్ దృష్ట్యా కొన్ని ట్రావెల్స్ ధరలను ఏకంగా 3 నుంచి 4 రెట్లు పెంచేశాయి. నాన్ ఏసీ స్లీపర్ సీట్లకు కొన్ని ప్రముఖ ట్రావెల్స్ సంస్థలు ఒక వ్యక్తికి ఏకంగా రూ. 4,999 నుంచి రూ. 5,700 వరకు వసూలు చేస్తున్నాయి. ఏసీ స్లీపర్‌కు కొత్తగా అందుబాటులోకి వచ్చిన సర్వీసుల్లో కూడా టికెట్ ధర రూ. 5,300 దాటిపోయింది. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే బస్సుల ఛార్జీలు కూడా గణనీయంగా పెరిగాయి. పండుగ రద్దీని బట్టి సాధారణ ధర కంటే రూ. 1,000 నుంచి రూ. 1,500 అదనంగా వసూలు చేస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణ కరువు**

పెంచిన ధరలకు సంబంధించిన స్క్రీన్ షాట్లను ప్రయాణికులు సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. విమాన ప్రయాణం కంటే బస్సు టికెట్ ధరలే ఎక్కువగా ఉన్నాయని, ఇలాగైతే ఇంటికి వెళ్లడం కంటే నగరంలోనే ఉండిపోవడం మేలు అని నెటిజన్లు వాపోతున్నారు. సాధారణంగా దసరా, సంక్రాంతి వంటి పెద్ద పండుగల సమయంలో రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి, అధిక ధరలు వసూలు చేసే ట్రావెల్స్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తుంటారు. కానీ ఇలాంటి లాంగ్ వీకెండ్స్ సమయంలో ప్రైవేట్ దోపిడీని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

# నగరంలో కల్తీ పన్నీర్ తయారీ

**దాడులు చేసి పట్టుకున్న అధికారులు**

**హైదరాబాద్, మార్చి 18 (మనసులో మాట)**

కారం, చాయపత్తా, పన్నీర్ వంటి పలు రకాల ఆహార పదార్థాల్లో రసాయనాలు కలిపి కల్తీ చేస్తూ కొందరు కేటుగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఈజీగా మనీ సంపాదించేందుకు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తాజాగా సికింద్రాబాద్ మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో వేల కిలోల కల్తీ పన్నీర్ బయటపడటంతో అధికారులతో సహా అంతా షాక్ అయ్యారు. కల్తీ పన్నీర్ తయారీ కేంద్రంపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తో పాటు ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. రెండు వేల కిలోలకు పైగా కల్తీ పన్నీర్ ను ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. శ్రీ బాలాజీ డైరీ ప్రొడక్ట్స్, విజయ్ మిల్క్, కర్డ్ షాపుతో సహా ఆరు షాపులపై దాడులు చేశారు. శ్రీ బాలాజీ డైరీ ప్రొడక్ట్స్ లో 1600 కిలోల పన్నీర్, విజయ్ మిల్క్ అండ్ కర్డ్ షాప్ లో 1000 కిలోల కల్తీ పన్నీర్ సీజ్ చేశారు. నిర్వాహకులు నగరంలోని పలు ప్రాంతాల్లో కల్తీ పన్నీరును అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు.

# అక్కను హత్య చేసిన తమ్ముడు

**బాటసింగారంలో దారుణం**

**హైదరాబాద్, మార్చి 18 (మనసులో మాట)**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో ఒక ఘోరకలి చోటుచేసుకుంది. అక్క ప్రవర్తన సరిగా లేదనే ఆగ్రహంతో ఆమెను సొంత తమ్ముడే హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలు చేసి చెరువులో పడేశాడు. కొన్నాళ్ల క్రితం భర్త మరణించడంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. ఆ తర్వాత ఆమె ప్రవర్తనలో మార్పును గమనించిన తమ్ముడు పప్పు రామ్ ఎ ల ం వ ా ం ్ల హెచ్చరించాడు. తీరు మార్చుకోవాలని చెప్పినా వినకపోవడంతో ఆమెను అంతం చేశాడు. హత్య అనంతరం మృతదేహాన్ని రెండు ముక్కలుగా చేసి మజీద్‌పూర్ చెరువులో పడేశాడు. గత నెల 28న బాటసింగారంలోని కిరాణా దుకాణానికి వెళ్లి ఆమె అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసి తమ్ముడు నాటకమాడాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి తమదైన శైలిలో దర్యాప్తు చేపట్టడంతో ఈ హత్య వ్యవహారం బయటపడింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.




# ఎస్ఐ భార్య ఆత్మహత్య

**గన్నేరు పప్పు తిని ప్రాణాలు తీసుకున్న దివ్య**

**కరీంనగర్, మార్చి 18 (మనసులో మాట)**

కరీంనగర్ జిల్లాలో ఒక విషాద ఘటన చోటు చేసుకుంది. కరీంనగర్ టూ టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడింది. విషపూరితమైన గన్నేరు పప్పు తినడంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే దివ్యను కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూసింది. చంద్రశేఖర్, దివ్య దంపతులకు ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. ఆమె ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో పోలీస్ క్వార్టర్స్ లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# తండ్రీ కూతుళ్లను చంపిన అల్లుడు

**పెట్రోల్ పోసి నిప్పు పెట్టినట్లు పోలీసుల నిర్ధారణ**

**హన్మకొండ, మార్చి 18 (మనసులో మాట)**

హనుమకొండ జిల్లాలో ఒక భయంకరమైన ఘటన జరిగింది. తండ్రి, కుమార్తె అనుమానాస్పద రీతిలో సజీవ దహనమై కనిపించారు. కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్పలో బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు ఈ దారుణం చోటుచేసుకుంది. మృతులను రాజశేఖర్ (54), రాజశ్రీ (24)గా పోలీసులు గుర్తించారు. రాజశ్రీకి 2023లో ప్రవీణ్ అనే యువకుడితో వివాహం కాగా వారికి ఒక పాప, బాబు ఉన్నారు. కుటుంబ తగాదాల కారణంగా ప్రవీణ్ వారిద్దరి ఒంటిపై డీజిల్ పోసి నిప్పు పెట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అతను నేరం ఒప్పుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# ఎన్నికల హామీలు విస్మరించిన సర్కార్

- తాజా మాజీ కార్పొరేటర్ల ఆగ్రహం
- ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యంపై ఆర్డీఓకు వినతిపత్రం అందజేత
- డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్

**ఎల్బీనగర్, మార్చి 18 (మనసులో మాట)**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కాలేదని ఆరోపిస్తూ హయత్ నగర్, మన్సూరాబాద్ డివిజన్ ల తాజా మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహా రెడ్డి లు ఆర్డీఓ అనంత రెడ్డి, ఎమ్మార్వో జానకి లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు విషయంలో స్పష్టత లేకపోవడం వల్ల ప్రజల్లో ఆగ్రహం పెరుగుతోందని పేర్కొన్నారు.

### ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి

ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రభుత్వం మీద ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నాయని, కానీ ఇప్పటికీ వారికి సరైన లబ్ధి అందకపోవడం బాధాకరమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు ఇచ్చి వాటిని అమలు చేయటంలో మరిచారని ఎద్దేవా చేశారు. హయత్ నగర్ తో పాటు వివిధ ప్రాంతాల్లో అర్ధాంతరంగా నిలిచిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి, అర్హులైన నిరుపేదలకు త్వరితగతిన అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

### నిరసనలకు సిద్ధం

ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్ నగర్, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, హరీష్, సీనియర్ నాయకులు జంజ్య నాయక్, ఇట్టబోయిన నర్సింహా, జంగా రెడ్డి, నక్క రాజేష్, మొగులయ్య, కొండల్ రెడ్డి, షకీల్ మీర్జా, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై బీజేపీ నిరసన




- ఆరు గ్యారంటీలు, పెన్షన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై మాజీ కార్పొరేటర్ల ఆగ్రహం
- హయత్ నగర్ జోనల్ కమిషనర్ కార్యాలయం ముట్టడి.. వినతిపత్రం అందజేత

**ఎల్బీనగర్, మార్చి 18 (మనసులో మాట)**

రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో హయత్ నగర్, బీఎన్ రెడ్డి డివిజన్ల తాజా మాజీ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, మొద్దు లచ్చి రెడ్డి కలిసి జోనల్ కమీషనర్ కార్యాలయం వద్ద భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా పెన్షన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనతో పాటు ఎంతో ప్రచారం చేసిన ఆరు గ్యారంటీల అమలులో స్పష్టత లేకపోవడం ప్రజలను మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం

పెన్షన్ లబ్ధిదారులు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పేదల కోసం నిర్మించాల్సిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఆలస్యం అవుతున్నాయని వారు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని, ఆరు గ్యారంటీలు కేవలం ప్రచార హామీలుగానే మిగిలిపోయాయని అన్నారు. హయత్ నగర్ పరిధిలో రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, ప్రాథమిక సదుపాయాల లోపం వంటి ఇబ్బందులు రోజు రోజుకూ పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఆందోళనలు ఉద్ధృతం చేస్తాం

ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జోనల్ కమీషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బీజేపీ తరఫున మరింత ఉద్ధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, బీజేపీ హయత్ నగర్, వనస్థలిపురం, బీఎన్ రెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ల అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, కటకం క్రాంతి, హరీష్, విష్ణు, నాయకులు, కార్యకర్తలు, మోర్చాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి కొండంత బలం

- కళ్లెం నవజీవన్ రెడ్డి
- బూత్ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని పిలుపు
- శిక్షణా తరగతులకు కార్యకర్తలు సిద్ధం కావాలని దిశానిర్దేశం

**రంగారెడ్డి జిల్లా, మార్చి 18 (మనసులో మాట)**

హయత్ నగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్స్ లో బీజేపీ విస్తృత బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈ నెల 20, 21, 22 తేదీల్లో మంగళపల్లిలోని కేఎంఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించనున్న పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ శిక్షణా తరగతుల గురించి ఆయన కార్యకర్తలకు వివరించారు. ప్రతి బూత్ నుండి కనీసం ఇద్దరు సభ్యులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ఈ శిక్షణ ద్వారా పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత బలం, ప్రజలతో అనుసంధానం మరింత మెరుగుపడుతుందని తెలిపారు.



### కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కళ్లెం నవజీవన్ రెడ్డి సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సామాన్య ప్రజలకు చేరవేసే విధంగా నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ విజయానికి కార్యకర్తలే అసలైన బలమని, అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని వివరించారు. బూత్ స్థాయి బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్ పాల్గొన్నారు. వీరితో పాటు హయత్ నగర్ ప్రభారీ కొత్త రవీందర్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, డివిజన్ కార్యదర్శి గోవింద చారి, సీనియర్ నాయకులు సంఘీ అశోక్, జంజ్య నాయక్ హాజరయ్యారు. మహిళా నాయకులు పార్వతి, మహిళా అధ్యక్షురాలు గీత, సుజాత, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మాజీ సింగిల్ విండో చైర్మన్ ఆత్మహత్య

**నాగర్ కర్నూల్ జిల్లా వనపట్ల గ్రామంలో విషాదం**

**కంకర క్రషర్ వద్ద ఉరివేసుకున్న శ్రీనివాస్ రెడ్డి**

**నాగర్ కర్నూల్, మార్చి 18 (మనసులో మాట)**

మండలంలోని వనపట్ల గ్రామానికి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి (60) ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం భార్య, కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో తన కంకర క్రషర్ వద్ద ఉరివేసుకున్నారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన భార్య గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించగా ఆయన అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ రెడ్డి గతంలో నాగర్ కర్నూల్ వైస్ ఎంపీపీగా పనిచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగిల్ విండో బాధ్యతలు చేపట్టిన ఆయన పదవీ కాలం ముగిసే వరకు కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. ఆయన ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

# వైష్ణవి హత్య కేసు.. నిందితుడు రిమాండ్

**అదనపు కట్నం కోసమే హత్య చేసినట్లు అంగీకారం**

**కుటుంబ సభ్యుల ప్రమేయంపై పోలీసుల లోతైన విచారణ**

**జగిత్యాల, మార్చి 18 (మనసులో మాట)**

జగిత్యాల జిల్లాలో సంచలనం సృష్టించిన యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో తాజా పరిణామాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే యువతి అదనపు కట్నం వేధింపులకు బలి కావడం విచారకరం. ఈ కేసులో పోలీసులు వేగంగా స్పందించి నిందితుడిని పట్టుకున్నారు. అదనపు కట్నం కోసమే వైష్ణవిని హత్య చేసినట్లు నిందితుడు హరిబాబు విచారణలో అంగీకరించాడు. పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ హత్య హరిబాబు ఒక్కడే చేశాడా లేక కుటుంబ సభ్యుల ప్రోద్బలం ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, ఫోరెన్సిక్ క్లూస్ నిందితుడికి శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించనున్నాయి. వరకట్న వేధింపుల కేసుల్లో కఠినమైన శిక్షలు పడితేనే ఇటువంటి అకృత్యాలను అరికట్టవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# కొడంగల్ రోడ్డు విస్తరణ తగ్గించాలి

**మున్సిపల్ చైర్మన్ కు వినతి**

**60 ఫీట్ల నుండి 30 ఫీట్ల వరకు మార్పు చేయాలని దరఖాస్తు**

**రెండో వార్డు కౌన్సిలర్ వాణిశ్రీ మధుసుధన్ యాదవ్ విన్నపం**



**కొడంగల్ మున్సిపల్, మార్చి 18 (మనసులో మాట)**

కొడంగల్ మున్సిపాలిటీ మొదటి జనరల్ బాడీ సమావేశం సందర్భంగా చైర్మన్ నందారం ప్రశాంత్ తో పాటు మున్సిపల్ కమిషనర్ కు రెండో వార్డు కౌన్సిలర్ ఆర్. వాణిశ్రీ మధు సుధన్ యాదవ్ వినతిపత్రం అందజేశారు. పట్టణంలో చేపట్టిన రోడ్డు వెడల్పు పనులను 60 ఫీట్ల నుండి 30 ఫీట్లకు తగ్గించాలని వారు కోరారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్పులు చేయాలని విన్నవించారు. ముఖ్యంగా వినాయక చౌరస్తా నుండి గౌరారం రోడ్డు వరకు జరిగే విస్తరణలో ప్రస్తుతం ఉన్న 30 బై 30 ఫీట్ల నిడివిని 15 బై 15 ఫీట్ల వరకు పరిమితం చేయాలని చైర్మన్, కమిషనర్ బలరాం నాయక్ కు దరఖాస్తు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ ఆర్. వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ తో పాటు మాజీ కౌన్సిలర్ ఆర్. మధుసూదన్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# గవర్నర్ ప్రసంగం అబద్ధాల మయం

**బీజేపీ నేత ఏలేటి**

**హామీల ఎగవేత ప్రకటనలా ఉందని విమర్శ**

**ఆర్థిక వ్యవస్థపై భ్రమలు కల్పిస్తున్నారని ధ్వజం**



**హైదరాబాద్, మార్చి 18 (మనసులో మాట)**

రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ ప్రసంగంలో అబద్ధాలు చెప్పించిందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. గవర్నర్ ప్రసంగం హామీల ఎగవేత ప్రకటనలా ఉందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తన సొంత డబ్బా కొట్టుకుంది తప్పితే అభివృద్ధికి సంబంధించిన దిశా దశ ఏమీ లేదని ఎద్దేవా చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు.

### ఆర్థిక భ్రమలు - వాస్తవాలు

రాష్ట్రం అప్పుల కుప్పలా ఉంటే మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందని భ్రమలు కల్పిస్తున్నారని ఏలేటి మండిపడ్డారు. ఇది ఎలా సాధ్యమో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు 5 శాతం పడిపోయాయని గుర్తు చేశారు. ఆర్థిక క్రమశిక్షణ లేని అప్పుల జాతర రాష్ట్రంలో నడుస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన రైతుల పట్ల యమపాశంగా మారిందని ఆయన ధ్వజమెత్తారు. ఉత్తర తెలంగాణలో జరిగిన పంట నష్టానికి పరిహారం ఇంతవరకు ఇవ్వలేదని ఏలేటి ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

**పట్నం మహేందర్ రెడ్డి**

**పరాభవ నామ సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్ష**

**పాడి పంటలతో రైతులు తులదూగాలని కోరిన ప్రభుత్వ చీఫ్ విప్**

తాండూరు, మార్చి 18 (మనసులో మాట)



తెలంగాణ రాష్ట్రం, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వికారాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలోని ముఖ్యంగా తాండూరు ప్రాంత ప్రజలకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో, అష్ట ఐశ్వర్యాలతో అభివృద్ధిని సాధించాలని ఆయన పేర్కొన్నారు. రైతులకు సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో తులదూగాలని, కార్మికులు, ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు విజయాలు సాధించాలని డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ నూతన సంవత్సరం అందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని ఆయన కోరారు.

# మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో వాదోపవాదాలు





**బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందంటూ మండిపడ్డ భట్టి**

**డీపీఆర్ సిద్ధం చేశామన్న మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్, మార్చి 18 (మనసులో మాట)

తెలంగాణ అసెంబ్లీ వేదికగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. మూసీ ప్రాజెక్టుపై శాసనసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. మూడో రోజు సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలు చేపట్టారు. మూసీ ప్రాజెక్టుపై ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్ తదితరులు మాట్లాడారు. మూసీ ప్రక్షాళనను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**ప్రాజెక్టుపై బీఆర్ఎస్ వైఖరి ఏంటి?**

ఈ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ తన స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని భట్టి డిమాండ్ చేశారు. నదీ పరివాహక ప్రాంతంలోని పేదల జీవితాలను మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే, ప్రతిపక్షం మాత్రం రాజకీయ లబ్ది కోసం అడ్డుపడుతోందని ఆయన ఆరోపించారు. మూసీ నిర్వాసితుల పునరావాసంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బాధితులకు అదే ప్రాంతంలో అత్యాధునిక అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. నిరుపేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, కానీ నిర్వాసితులు మురికి కూపంలోనే మగ్గిపోవాలని బీఆర్ఎస్ కోరుకుంటోందని ఆయన మండిపడ్డారు.

**నగర రూపురేఖలు మారుస్తాం**

ఈ ప్రాజెక్టు కేవలం నదిని శుభ్రం చేయడం మాత్రమే కాకుండా, హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చేలా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని ఆయన ప్రతిపక్షానికి సూచించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మొదటి దశ డీపీఆర్ తయారైందని చెప్పారు. అంచనా వ్యయం రూ.6,500 కోట్ల నుంచి రూ.7000 కోట్లుగా చెప్పారు. ఈ ప్రాజెక్టుతో 1,435 నిర్మాణాలు ప్రభావితమయ్యే అవకాశముందన్నారు. తుది ఎన్యుమరేషన్ కొనసాగుతోందని చెప్పారు. బఫర్ జోన్‌లో ఉన్నవారికి టీడీఆర్ ఇస్తామని, 2013 చట్టం ప్రకారం అవసరమైన భూసేకరణ, సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపడతామని మంత్రి వివరించారు.

**సంతృప్తిగా లేని మంత్రి సమాధానం**

అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు సమాధానం సంతృప్తిగా లేదన్నారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని జనవరిలో చెప్పారు. పాకిస్థాన్‌లో నిషేధించిన కంపెనీకి అవకాశం ఇచ్చారు. డీపీఆర్‌ను సభ ముందు పెట్టాలి. రుణానికి ఏడీబీ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు గతంలో సభలో మంత్రి తెలిపారు. కానీ డీపీఆర్ ఇవ్వలేదని, రుణం మంజూరు చేయలేదని ఏడీబీ స్పష్టం చేసింది. సభను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారా అని కేటీఆర్ నిలదీశారు.

**రూ.16 వేల కోట్ల ప్రాజెక్టు రూ.లక్షన్నర కోట్లా?**

రూ.16వేల కోట్లతో అయ్యే ప్రాజెక్టుకు సీఎం రేవంత్ రూ.లక్షన్నర కోట్లు అని చెప్పారు. మొదటి దశ రూ.7వేల కోట్లు అంటున్నారు, ఇంకా ఎన్ని దశలు ఉంటాయి? ఎన్ని నివాసాలు కూలుస్తారు? మంత్రి 1,435 నిర్మాణాలు అన్నారు, గెజిట్‌లో 10వేల నిర్మాణాలు అని పేర్కొన్నారు. వీటిలో ఏది కరెక్ట్? మూసీ ప్రాజెక్టుకు మేం వ్యతిరేకం కాదు, అందులో జరుగుతున్న దోపిడీకి మాత్రమే వ్యతిరేకం అని కేటీఆర్ ప్రశ్నించారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. మూసీ ప్రాజెక్టుపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వం దగ్గర నిధులు లేవు, ప్రణాళికలు లేవు. ఏడీబీ రుణం ఇవ్వలేదు. రూ.లక్షన్నర కోట్ల దోపిడీకి మేం వ్యతిరేకం. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వాకౌట్ చేస్తున్నాం అని ఆయన పేర్కొన్నారు.

# దాహార్తిని తీర్చే చలివేంద్రం




- తల్లిదండ్రుల స్మృత్యర్థం సాయి కుమార్ సేవ
- వేసవి ఎండల్లో బాటసారులకు ఊరటనిచ్చే అద్భుత కార్యక్రమం
- యువత సేవా దృక్పథం పట్ల అతిథుల ప్రశంసలు

మేడ్చల్ జిల్లా, మార్చి 18 (మనసులో మాట)

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 10వ డివిజన్ పీర్జాదిగూడలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో కొల్తూరు సాయి కుమార్ తన తల్లిదండ్రులు అనసూయ, యాదయ్యల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఈ రోజు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్వీ ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, చేరుకు మహేష్ గౌడ్ అతిథులుగా పాల్గొన్నారు.

**యువతకు స్ఫూర్తిప్రదాయకం**

ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో సాయి కుమార్ ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. సమాజంలో తోటి వారికి సాయం చేయాలనే ఆలోచన గొప్పదని, వేసవి కాలంలో దాహంతో ఉన్న వారికి మంచినీరు అందించడం అన్నిటికంటే మిన్న అని పేర్కొన్నారు. సాయి కుమార్ లాంటి యువకులు ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. ఈ చలివేంద్రం ద్వారా వేసవి కాలం ముగిసే వరకు నిరంతరం శుభ్రమైన మంచినీరు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమేష్ రెడ్డి, రాజు గౌడ్, సాయి రెడ్డి, సందీప్, చింటు, బంటీ, జంగయ్య, ఇర్ఫాన్, నవీన్, మహేందర్, సందీప్ రెడ్డి, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్ స్థలం వివాదం

- సర్పంచ్ పెద్దికి నోటీసులు
- దానమిచ్చిన భూమిపై ఇప్పుడు హక్కులు కోరడం సరికాదని ఆగ్రహం
- ప్రజల సౌకర్యార్థం సులభ్ కాంప్లెక్స్ నిర్మించి తీరుతామని వెల్లడి



జనగామ జిల్లా, దేవరుప్పుల మార్చి 18 (మనసులో మాట)

దేవరుప్పుల గ్రామానికి సుమారు 50 సంవత్సరాల క్రితం గోలి మల్లారెడ్డి ఈ స్థలాన్ని ఆర్టీసీ బస్టాండ్ కోసం దానం చేశారు. అయితే ఆ భూమి ఇప్పుడు తమదేనంటూ, దానికి సంబంధించిన డాక్యుమెంట్లు ఉన్నాయంటూ మల్లారెడ్డి కుమార్తె రేణుక లాయర్ ద్వారా కోర్టు నోటీసులు పంపారు. ఈ నోటీసులను దేవరుప్పుల సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ కు అందజేశారు. తండ్రి దానం ఇచ్చిన భూమిని ఇప్పుడు పత్రాలు చూపిస్తూ తమది అనడం ఏమిటని సర్పంచ్ ప్రశ్నించారు.

**కుట్రలను తిప్పికొడతాం**

ఇప్పటికే బస్టాండ్ కోసం, సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం అధికారులు మూడుసార్లు తీర్మానాలు చేశారని సర్పంచ్ గుర్తుచేశారు. ఆ నిర్ణయాలను బేఖాతరు చేస్తూ తనకు నోటీసులు పంపడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించడం ఇష్టం లేని కొంతమంది రాజకీయ నాయకులు ఆడుతున్న నాటకమే ఇదని ఆయన మండిపడ్డారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆ స్థలంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని ఇచ్చిన హామీని కోర్టు ద్వారా అయినా నెరవేర్చుకుంటామని పెద్ది స్పష్టం చేశారు.

**ప్రజా ప్రయోజనాలే ముఖ్యం**

ఈ విషయంలో దేవరుప్పుల గ్రామస్తులతో పాటు మండల ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. నిత్యం బ్యాంకు పనులు, మార్కెట్ అవసరాల నిమిత్తం మండలానికి వచ్చే ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారుల ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈ రకంగా కొంతమంది రాజకీయ నాయకులు విషం చిమ్మడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ప్రజలకు తప్పకుండా న్యాయం చేస్తామని సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ వెల్లడించారు.

# విపంచి ఫౌండేషన్ ఉగాది పురస్కారాల ప్రకటన

**గ్రహీతల ఎంపిక పూర్తి**

**రవీంద్రభారతిలో ఈ నెల 23న అవార్డుల ప్రధానోత్సవ వేడుక**

**వివిధ రంగాల ప్రముఖులను ఎంపిక చేసిన జూరీ కమిటీ**

ఎల్బీనగర్, మార్చి 18 (మనసులో మాట)

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి గాను శ్రీ పరాభవ నామ ఉగాది పురస్కార గ్రహీతలను ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్, జూరీ కమిటీ అధ్యక్షుడు అందోజు నాగభూషణం, సభ్యులు గడ్డం సత్యనారాయణ, నరసింహ చారి, వెంకట చారి తెలిపారు.

**పురస్కార గ్రహీతల వివరాలు**



హైదరాబాద్ కు చెందిన ఆచార్య ఏ ఏ ఎన్ రాజుకు జీవన సాఫల్య పురస్కారం – 2025 దక్కింది. కవి, రచయిత, రమ్య భారతి త్రైమాసిక పత్రిక ఎడిటర్, ఆంధ్ర ప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సామాజిక పాత్రికేయులు తొర్ర రమేష్, హైదరాబాద్ కు చెందిన రాయపోలు అనంతనారాయణ, సూర్యాపేట జిల్లా గ్రామీణ గ్రంథాలయ నిర్వాహకులు దాయం ఝాన్సీ రెడ్డి, తూర్పుగోదావరి జిల్లా కళాకారుడు దేవిన శ్రీనివాస్ పురస్కారాలకు ఎంపికయ్యారు.

**రవీంద్రభారతిలో..**

హైదరాబాదు లోని రవీంద్ర భారతి మొదటి అంతస్తు సమావేశ మందిరంలో ఈ నెల 23వ తేదీ సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఈ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతుందని అనుముల శ్రీనివాస్ వెల్లడించారు.

# ధాన్యం కొనుగోలుకు పక్కా ప్రణాళిక

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి, మార్చి-18 (మనసులో మాట)



నాణ్యమైన ధాన్యం కొనుగోలుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పౌర సరఫరాల శాఖ పని తీరుపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. యాసంగి 2025-26 సీజన్ కు సంబంధించి దాదాపు 4 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 334 కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కోటి 12 లక్షల 59 వేల గన్నీ సంచులు అవసరమవుతాయని, కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పన చర్యలు తీసుకోవాలని సూచించారు. 2024-25 వానాకాలంకు సంబంధించి 100 శాతము, యాసంగికి సంబంధించి 93 శాతము, 2025-26 వానాకాలము సంబంధించి 28 శాతము సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) పూర్తయిందని తెలిపారు. 2014-15 నుండి 2023-24 వరకు బకాయి పడిన 48 రైసు మిల్లులను గుర్తించి, గత పది రోజులలో రూ. 2 కోట్ల 18 లక్షలు డిఫాల్ట్ మిల్లర్ల నుండి వసూలు చేసినట్లు వెల్లడించారు. పెండింగ్ బకాయిలు త్వరితగతిన చెల్లించాలని, లేనియెడల డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 5 రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రెవెన్యూ రికవరీ చట్టం అమలు చేశామని, మిగిలిన మిల్లులపై కూడా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కే. శ్రీనాథ్, సంస్థ మేనేజర్ ఎం. శ్రీకాంత్ పాల్గొన్నారు.

# నర్మెట్ట ఫ్యాక్టరీ ప్రారంభానికి ముస్తాబు

**22న ఫ్యాక్టరీని ప్రారంభించనున్న సీఎం**

హైదరాబాద్, మార్చి 18 (మనసులో మాట)

రాష్ట్ర సిగలో మరో మణిహారంగా నిలిచే నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఈ నెల 22న ఘనంగా ప్రారంభం కానుంది. ఈ కర్మాగారం వద్ద నేటి సాయంత్రం నాలుగు గంటలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ప్రదర్శనశాలలను ప్రారంభించి రైతు ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. వ్యవసాయ, పశుసంవర్ధక అనుబంధ రంగాలకు చెందిన నూట యాభై స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉత్సవాలు ఇరవై రెండవ తేదీ వరకు కొనసాగుతాయి. ఇక్కడ రైతులు శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చించే వేదికను అధికారులు ఏర్పాటు చేశారు.

**సీఎం చేతుల మీదుగా ప్రారంభం**

ఈ నెల 22న సాయంత్రం నాలుగు గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఫ్యాక్టరీని జాతికి అంకితం చేస్తారు. అదే రోజు ఎనభై కోట్లతో నిర్మించే రిఫైనరీ యూనిట్‌కు శంకుస్థాపన చేయడంతో పాటు రైతు భరోసా నిధులను విడుదల చేస్తారు. ఈ కర్మాగారంతో ఆయిల్ పామ్ రైతుల రవాణా ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామితో కలిసి నిర్వహించిన సమావేశంలో మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. గత ఖరీఫ్ లో లాగానే ఈ యాసంగిలో కూడా మొక్కజొన్న కొనుగోళ్లకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# దూసుకెళ్తున్న దేశీయ సూచీలు

## లాభాల 'హ్యాట్రిక్'తో మదుపరుల్లో హర్షాతిరేకాలు!

- సెన్సెక్స్ 633, నిఫ్టీ 196 పాయింట్ల భారీ జంప్
- ఐటీ, రియాల్టీ షేర్లకు పోటెత్తిన కొనుగోళ్లు
- వరుసగా మూడో రోజూ లాభాల పరంపర కొనసాగింపు
- గ్లోబల్ మార్కెట్ల సానుకూల సంకేతాలతో దేశీయ మార్కెట్లకు దన్ను




**బిజినెస్ డెస్క్-మనసులో మాట**

దేశీయ స్టాక్ మార్కెట్లలో బుల్ జోరు కొనసాగుతోంది. గత రెండు మూడు రోజులుగా నష్టాల ఊసే లేకుండా సూచీలు లాభాల బాటలో పయనిస్తున్నాయి. బుధవారం నాటి ట్రేడింగ్ సెషన్ కూడా మదుపరులకు కాసుల వర్షం కురిపించింది. వరుసగా మూడో రోజు మార్కెట్లు భారీ లాభాలతో ముగిశాయి. ఆరంభం నుంచే కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు ఆకాశమే హద్దుగా దూసుకెళ్లాయి.

### మార్కెట్ గమనమిదీ..

మార్చి 18 ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 633.29 పాయింట్లు ఎగబాకి 76,704.13 వద్ద బలంగా స్థిరపడింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా అదే ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ 196.65 పాయింట్ల లాభంతో 23,777.80 వద్ద ముగిసింది. ఉదయం లాభాలతో ప్రారంభమైన మార్కెట్లు రోజంతా అదే సానుకూల ధోరణిని కొనసాగించాయి. ఎక్కడా పెద్దగా అమ్మకాల ఒత్తిడి కనిపించకపోవడం గమనార్హం.

### లాభాలకు ప్రధాన కారణాలు..

తాజా ర్యాలీకి దేశీయ, అంతర్జాతీయ అంశాలు సానుకూలంగా మారడమే ప్రధాన కారణమని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు దిగిరావడం మన ఆర్థిక వ్యవస్థకు, మదుపరుల సెంటిమెంట్ కు పెద్ద ఊరటనిచ్చింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయంపై పెట్టుబడిదారుల్లో ఆశావహ దృక్పథం నెలకొంది. దానికి తోడు ఆసియా, ఐరోపా మార్కెట్ల నుంచి వచ్చిన బలమైన సానుకూల సంకేతాలు మన సూచీలకు మరింత బలాన్ని చేకూర్చాయి.

### రంగాల వారీగా చూస్తే..

మార్కెట్ భారీ లాభాల్లో ఐటీ, రియాల్టీ రంగాలు కీలక పాత్ర పోషించాయి. ఈ రంగాల షేర్లలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు సహా రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా కొనుగోళ్లకు దిగారు. ఆటోమొబైల్ రంగం కూడా చెప్పుకోదగ్గ లాభాలను నమోదు చేసింది. అయితే మార్కెట్ ఇంత సానుకూలంగా ఉన్నప్పటికీ మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాలు మాత్రం అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొని నష్టాల్లో ముగిశాయి. ఇన్వెస్టర్లు కొన్ని రంగాల్లో లాభాల స్వీకరణకు మొగ్గుచూపడమే ఇందుకు కారణం.

### ముందున్న దారి..

ప్రస్తుతం మార్కెట్ సెంటిమెంట్ చాలా బలంగా కనిపిస్తోంది. టెక్నికల్ గా చూస్తే నిఫ్టీ కీలకమైన నిరోధక స్థాయిలను దాటి పైకి వెళ్లడం శుభపరిణామం. అయితే అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడ్ తీసుకోబోయే వడ్డీ రేట్ల నిర్ణయం కోసం ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రోజు రాత్రికి అక్కడ వెలువడే నిర్ణయాన్ని బట్టి రేపటి మార్కెట్ గమనం ఆధారపడి ఉంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అప్పటి వరకు అప్రమత్తంగా ఉంటూనే సరైన షేర్లను ఎంచుకోవాలని సూచిస్తున్నారు.




# పాన్ కార్డు నిబంధనల్లో కీలక మార్పులు

## ఏప్రిల్ ఒకటి నుంచి కఠినం

**బిజినెస్ డెస్క్ - మనసులో మాట**

కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పాన్ కార్డు జారీకి సంబంధించిన నియమ నిబంధనలను కేంద్రం మరింత కఠినతరం చేస్తోంది. దరఖాస్తు ప్రక్రియలో ఏప్రిల్ 1 వ తేదీ నుంచి పలు కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇకపై కేవలం ఆధార్ కార్డు ఆధారంగా పాన్ కార్డును మంజూరు చేయరు. కేవలం ఆధార్ తోనే దరఖాస్తు చేసుకోవాలనుకునే వారికి ఈ నెలాఖరు అంటే మార్చి 31 వ తేదీ వరకే అవకాశం ఉంది.

ఆర్థిక, బ్యాంకు లావాదేవీల్లో అత్యంత కీలకమైన ఈ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారు ఇకపై ఆధార్ తో పాటు పుట్టిన తేదీని నిర్ధారించే కచ్చితమైన ఆధారాలను అదనంగా సమర్పించక తప్పదు. దరఖాస్తుదారులు జనన ధ్రువీకరణ పత్రం, ఓటరు గుర్తింపు కార్డు, పదో తరగతి మార్కుల మెమో, డ్రైవింగ్ లైసెన్స్, అధికారిక అఫిడవిట్, పాస్ పోర్ట్ తదితర పత్రాల్లో ఏదో ఒకదానిని కచ్చితంగా జత చేయాల్సిందే.

ఈ కొత్త నిబంధనలు అమలులోకి రాగానే దరఖాస్తు ఫారాల ఆకృతి కూడా పూర్తిగా మారిపోనుందని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కామన్ సర్వీస్ సెంటర్ 'ఎక్స్' సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించింది. ఆన్ లైన్ విధానంలో కొత్త పాన్ కావాలనుకునే వారు 'ప్రోటీన్', 'యూటీఐటీఎస్ఎల్' వెబ్ సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. అత్యవసరంగా ఈ-పాన్ పొందాలనుకునే వారు ఆదాయపు పన్ను శాఖ అధికారిక ఈ-ఫైలింగ్ పోర్టల్ ను ఆశ్రయించవచ్చు.

# నీతా అంబానీకి గౌరవ డాక్టరేట్

## కిట్ వర్సిటీ అరుదైన పురస్కారం

### విద్య, క్రీడా రంగాల్లో సేవలకు గుర్తింపుగా కిస్ హ్యుమానిటేరియన్ అవార్డు ప్రదానం

**భువనేశ్వర్, మార్చి 18 (మనసులో మాట)**

రిలయన్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు నీతా అంబానీకి అరుదైన సన్మానం దక్కింది. ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఉన్న కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కిట్) విశ్వవిద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. చదువు, క్రీడలు, వైద్యం వంటి విభాగాల్లో ఆమె అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ గౌరవం కల్పించారు. అదే విధంగా ప్రతిష్టాత్మక కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (కిస్) హ్యుమానిటేరియన్ అవార్డు 2025ను కూడా నీతా అంబానీ అందుకున్నారు. ఈ వేడుకకు సుమారు 40 వేల మంది గిరిజన విద్యార్థులు తరలివచ్చారు. తమ ఆచార నృత్యాలు, కళారూపాలతో ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు.



# క్లాడ్ ఏఐ సరికొత్త విప్లవం

- బీసీల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుంది
- తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్




**ఇంటర్నెట్ డెస్క్, మార్చి 18 (మనసులో మాట)**

ప్రముఖ ఏఐ సంస్థ ఆంత్రోపిక్ తన అసిస్టెంట్ 'క్లాడ్'లో ఒక అద్భుతమైన ఫీచర్ ను ప్రవేశపెట్టింది. దీని సాయంతో వినియోగదారులు తమ పీసీ దగ్గర లేకపోయినా స్మార్ట్ ఫోన్ ద్వారా పనులు చేయించుకోవచ్చు. 'క్లాడ్ డిస్పాచ్' పేరుతో వచ్చిన ఈ సదుపాయం ద్వారా ప్రపంచంలో ఎక్కడ ఉన్నా మీ డెస్క్ టాప్ ను రిమోట్ గా ఆపరేట్ చేసే వీలు కలుగుతుంది.

### ట్రాఫిక్ లో ఉన్నా రిపోర్టులు సిద్ధం

ఉదాహరణకు మీరు ఆఫీసు నుంచి బయటకు వెళ్లినప్పుడు ఏదైనా అత్యవసర రిపోర్టు తయారు చేయాల్సి వస్తే ఫోన్ నుంచే ఆదేశాలు ఇవ్వవచ్చు. పీసీలో ఉన్న నిర్దిష్ట ఫోల్డర్ల లోని సమాచారాన్ని విశ్లేషించి ప్రజంటేషన్లు సిద్ధం చేయమని క్లాడ్ ను కోరవచ్చు. మీరు కార్యాలయానికి చేరుకునే లోపే ఆ పని పూర్తవుతుంది. దీనివల్ల సమయం ఆదా అవ్వడంతో పాటు పని ఒత్తిడి తగ్గుతుంది.

### వినియోగం ఇలా..

ఆంత్రోపిక్ సాంకేతిక నిపుణుడు ఫెలిక్స్ రీసెబర్గ్ ఈ కొత్త ఫీచర్ కు సంబంధించిన వీడియోను ఎక్స్ లో పంచుకున్నారు. దీనిని ఉపయోగించాలంటే క్లాడ్ డెస్క్ టాప్ యాప్ ను ఫోన్ తో అనుసంధానం చేయాలి. మొబైల్ నుంచి ఆదేశాలు ఇచ్చే సమయంలో కంప్యూటర్ ఆన్ లో ఉండి ఇంటర్నెట్ సౌకర్యం కలిగి ఉండాలి. ప్రస్తుతం క్లాడ్ మ్యాక్స్ చందాదారులకు మాత్రమే ఇది అందుబాటులో ఉండగా త్వరలోనే ప్రో సభ్యులకు కూడా అందించనున్నారు.

# ఐఆర్‌సీటీసీ పుణ్యక్షేత్ర యాత్ర. అయోధ్య, కాశీ, వైద్యనాథ్ ధామ్ సందర్శన

- 9 రాత్రులు, 10 పగళ్ల ప్రత్యేక ప్యాకేజీ.. ఏప్రిల్ 28న సికింద్రాబాద్ నుంచి ప్రారంభం
- టికెట్ ధరలు రూ. 16,700 నుండి ప్రారంభం

**సికింద్రాబాద్, మార్చి 18 (మనసులో మాట)**

అయోధ్య, కాశీ వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలనుకునే భక్తుల కోసం ఐఆర్‌సీటీసీ 'అయోధ్య-కాశీ పుణ్యక్షేత్ర యాత్ర వైద్యనాథ్ ధామ్' పేరిట ఒక ప్రత్యేక టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చింది. మూడు రాష్ట్రాల్లోని విశిష్ట ఆలయాలను సందర్శించేలా రూపొందించిన ఈ యాత్ర మొత్తం 9 రాత్రులు, 10 పగళ్ల పాటు సాగుతుంది. ఏప్రిల్ 28న ప్రారంభమయ్యే ఈ పర్యటన కోసం టూటైర్ ఏసీ, త్రీటైర్ ఏసీ, స్లీపర్ క్లాసుల్లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. ప్రారంభ ధర రూ.16,700గా నిర్ణయించారు. ఒడిశాలోని పూరీ జగన్నాథ క్షేత్రం, కోణార్క్ సూర్య దేవాలయం, ఝార్ఖండ్‌లోని వైద్యనాథ్ జ్యోతిర్లింగం, ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ క్షేత్రాలను ఈ యాత్రలో చూడొచ్చు. భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం మీదుగా నడుస్తుంది. ప్రయాణికులు తమకు వీలైన స్టేషన్లలో రైలు ఎక్కే లేదా దిగే సదుపాయం కల్పించారు.

### రోజువారీ ప్రయాణ వివరాలు

సికింద్రాబాద్ నుంచి ఏప్రిల్ 28న ఉదయం 11 గంటలకు టూరిస్టు రైలు ప్రయాణం మొదలవుతుంది. రెండో రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఒడిశాలోని మాలతీపట్పూర్ చేరుకున్నాక రోడ్డు మార్గంలో పూరీకి వెళ్లి జగన్నాథ స్వామిని దర్శించుకుంటారు. ఆ రాత్రికి పూరీలోనే బస ఉంటుంది. మూడో రోజు ఉదయం అల్పాహారం ముగించుకుని కోణార్క్ సూర్య దేవాలయాన్ని సందర్శించి తిరిగి మాలతీపట్పూర్ రైల్వేస్టేషన్ ద్వారా ఝార్ఖండ్‌కు పయనమవుతారు. నాలుగో రోజు ఉదయం 6 గంటలకు జస్‌దిహ్ చేరుకుని బాబా వైద్యానాథ్ జ్యోతిర్లింగ ఆలయాన్ని దర్శిస్తారు. అనంతరం జస్‌దిహ్ నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌కు బయలుదేరి ఐదో రోజు ఉదయం 9 గంటలకు బనారస్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. ఆ రోజు సార్‌నాథ్‌లో బస ఉంటుంది. ఆరో రోజు కాశీ విశ్వనాథ్, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణాదేవి ఆలయాల దర్శనం చేసుకుంటారు. సాయంత్రం గంగా హారతి కార్యక్రమంలో పాల్గొని రాత్రికి అయోధ్యకు బయలుదేరుతారు. ఏడో రోజు మధ్యాహ్నం 12 గంటలకు అయోధ్య చేరుకుని రామజన్మభూమి, హనుమాన్ ఆలయాలను సందర్శించి రాత్రి భోజనం తర్వాత ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తారు. ఎనిమిదో రోజు ఉదయం 5 గంటలకు ప్రయాగ్ సంగమం చేరుకుని త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు, పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు సికింద్రాబాద్‌కు తిరుగు ప్రయాణం మొదలై తొమ్మిదో రోజు ప్రయాణం సాగుతుంది. పదో రోజు ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది.



### ప్యాకేజీ ధరలు - వసతులు

ఎకానమీ విభాగంలో స్లీపర్ క్లాస్ టికెట్ ధర పెద్దలకు రూ.16,700, 5-11 ఏళ్ల చిన్నారులకు రూ.15,600గా ఉంది. వీరికి నాన్ ఏసీ గదులు, నాన్ ఏసీ వాహనాలు కేటాయిస్తారు. స్టాండర్డ్ విభాగంలో త్రీ ఏసీ టికెట్ ధర పెద్దలకు రూ.26,100, చిన్నారులకు రూ.24,800 కాగా ఏసీ గదులు ఇస్తారు. కంఫర్ట్ విభాగంలో టూ ఏసీ ధర పెద్దలకు రూ.34,100, చిన్నారులకు రూ.32,500గా నిర్ణయించారు. ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి శాకాహార భోజన బాధ్యతలను రైల్వే సిబ్బందే చూసుకుంటారు. ప్యాకేజీని బట్టి ప్రయాణానికి వాహనాలు, ట్రావెల్ ఇన్సూరెన్స్, టూర్ మేనేజర్ల సాయం అందుబాటులో ఉంటాయి. రైలు ప్రయాణంలో పూర్తి భద్రత కల్పిస్తారు. పర్యాటక ప్రాంతాల్లో ఎక్కడైనా ప్రవేశ రుసుములు ఉంటే యాత్రికులే చెల్లించుకోవాలి. కేటాయించిన గదులకు అదనపు సదుపాయాలు కావాలంటే ఆ ఛార్జీలను యాత్రికులే భరించాల్సి ఉంటుంది.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక





# ఉగాదికి సుస్వాగతం

ఉగాది అంటే పచ్చడి

ఉగాది అంటే పంచాంగం

ఉగాది అంటే బూరెలు


ఉగాది అంటే జాతకం

ఉగాది అంటే మామిడి కాయలు.. తోరణాలు

ఉగాది అంటే జంధ్యాలు ధరించడం

ఉగాది అంటే 'అచ్చ తెలుగు వారి పండుగ'

మామిడిచెట్టు కొమ్మలో చేరి లేలేత మామిడి పూతను నిండుగా మెక్కిన గండు కోయిలమ్మ స్వాగత గీతాన్ని పాడుతోంది.! ప్రకృతి కాంత పరవశంతో పచ్చదన పరిమళాన్ని పంచుతోంది.! వేపచెట్టు కొమ్మ కొమ్మలో, పూతను పూసి.. స్వాగత పుష్పాలను విరజల్లుతోంది.! ఓ నవయుగాది వత్సరమా నీకు స్వాగతం.!





గడపగడపనా నీకై మామిడి తోరణాలు ఎదురు చూస్తున్నాయి.! గుండెగుండెలో నీవు తెచ్చే వైభవ సంతోషాలకై.. ఆరాటపడే మాపల్లెకు.. నీ చల్లని చూపును ప్రసరించి.. ఆనందింపజేయవమ్మా.!!



ఆధునికత ముసుగులో ఆకాశమే అవధిగా ఆనందాలను కోరుకునే నేటి యువతరం.. ఆశల పల్లకీలో ఆ నవతరం ప్రయాణిస్తూ.. అలుపెరుగని పోరాటం చేస్తుంది.! కోర్కెల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నది.! నీరాకతో ఆశలు కొత్త చిగుళ్ళు తొడుగుతున్నాయి.! ఆచారాలు సంప్రదాయాల.. పండుగలు..పంచాంగ శ్రవణాలు తిరిగి పురుడు పోసుకుంటున్నాయి.!! అందరికీ ఆనందాలను అందిస్తూ.. మాఇంటికి రావమ్మా ఉగాది లక్ష్మి.!





ఎన్నెన్నో ఆరోగ్య సూత్రాలు, మరెన్నో ఆచార సంప్రదాయాలు.. పారమార్థిక విషయాలు.. అంతరార్థంలో దాగి ఉన్నా పండుగ పారమార్థం తెలియని నేటి యువతకు.. పండుగంటే పరమాన్నాలేకాదు, పదిమందికీ పంచిపెట్టే.. పరమ పుణ్య కార్యం.! పదిమందిలో నవ్వుతూ.. నవ్విస్తూ తిరిగేదని తెలిసేలా.. చెప్పుకోవచ్చు 'పరాభవ నామ' ఉగాది శుభాకాంక్షలు అని.!!



## ఇది కాలచక్రపు పండుగ

తెలుగు నెలలు 60.. ఇవి అమాసతో మొదలైతయా.? పాడ్యమితో మొదలైతయా.? అనేదానికి జవాబులు రెండుతీర్లు.సగటు ప్రజలకు నెల మొదలయ్యేది అమాసతోనే.! అందుకనే, అమాసకు అమాసకు లెక్కగట్టుకుంటరు.ఒక్క తెలంగాణలనే కాదు..బయటి ప్రాంతాలు కూడా అమాస విషయంల దాదాపుగ ఇదే పద్ధతిల నడుస్తయి. 'ఉగాది' ముందట వచ్చేఅమాసని కొత్త అమాస అని పిలిచి..పోచమ్మకు..ఇతర ఊరి 'గ్రామ దేవత'లకు మొక్కులు చెల్లిస్తరు.!

## విశ్వకర్మలకు పెద్ద పండుగ



విశ్వకర్మ కుటుంబపు పంచదాయిాలకు 'ఉగాది పెద్ద సంబురం'. వీరబ్రహ్మంగారి వారసత్వాన్ని,.. పోచమ్మ.. పోలేరమ్మ మాతృదేవతను.. మహంకాళి..గాయత్రి.. మహామాయి.. సరసన కులవృత్తి ఇసిరెలను పెట్టి పూజించుట, మూడురోజులు ఉత్సవంగా జరుపుట నడవడి. ఉగాదికి ముందట వీళ్లు తప్పకుంట పోచమ్మకు మొక్కు తీరుస్తరు.అమాస ప్రతినెలలో మొదటిరోజు కనుక ఆరోజు ఏ ఇసిరె ముట్టరు.పొద్దున్నే వృత్తివాకిలికి ఇసిరెలకు శుభ్రంగ అలుకుపూతలు చేస్తరు.

**ఊర్లల్ల ఈ కట్టడి నూటికి నూరుపాళ్లు పెద్దల పద్ధతిల నడుస్తుంటది.విశ్వకర్మలతో పాటు..ఇతర వృత్తులూ.. వ్యవసాయదారులు సైతం, ఉగాదిని కులవృత్తికి ముడిపెట్టుకుని గొడ్డుగోదతో జరుపుకుంటరు.ఏడాది ఏడాది ఇండ్లు వర్తనలు మార్చుకునేది ఉగాది అమాసతోనే చాకలి, మంగలి,వడ్ల,కమ్మరి,కుమ్మరి, మేదరి ఈరోజునే మారుతరు. కొత్త జీతగాళ్లను కుదుర్చుకుని బయానలు ఖాయంజేసేదీ ఈ రోజే.ఈ కట్టడి మల్లచ్చే కొత్త అమాస దాక మాట పొల్లువోకుంట చెల్లుతది. అందుకే ఇది.. కాలచక్రపు పండుగ, కాలంవెంట వృత్తి చక్రపు పండుగ !!**

## పంచ దాయిాలకు..

గిప్పుడైతే అన్ని పండుగల లెక్కనె మోక తగ్గింది గని.. నాటి కాలంల ఒగాది పండుగంటే వారం రోజుల ముందే సందడి షురువయ్యేది. ఇంటికి సున్నమేసుడు మొదలు ఇసిరెలన్నీ కడుగుడు..దోర్నాలు కుచ్చుడు.. పిల్లగండ్ల నుంచి పెద్దోల్ల దాక సంబురమే సంబురం. విశ్వకర్మలకు ఈ పండుగకు సంబంధమెక్కడిదో సరిగా తెల్వది గానీ ఈ ఇండ్లల్ల ఇది మూడొద్దుల పండుగ.

## ఆనాటి.. 'ఒగాది'యాడవాయె.?

ఒకప్పుడు.. ఉగాదికి పల్లెటూరు సున్నాలతో సింగారించుకునేది.! ఇప్పుడు.. ఉగాదికి సెల్ఫులు ఊడ్చుకుని నీట్ గా సర్దుకుంటున్నారు. ఒకప్పుడు.. ఉగాది పండగంటే.. అదో సంబరం..అదో కొత్తదనం. ఇంటికి.. ఉడకవెట్టిన సున్నాన్ని ఇంటి సాకలోల్లతో..చీపుర్లతో వేయించేవారు. తలుపులకు.. గూళ్లకు..కిటికీలకు నీలిరంగు పెయింట్ వేసుకునేవారు. గడపలకు పసుపురంగు.. ఎరుపురంగు తో ముగ్గులు.. షాపత్ రౌతు మీద అందమైన ముగ్గులు డిజైన్లు వేసుకుని మురిసిపోయేవారు.తెల్లటి సున్నం వేసిన గోడలకు కింద తీనెలకు ఎర్రటిబాడర్ పెయింట్ వేసి తీగ ముగ్గువేసుకునే వారు. అదే..మధ్యతరగతి వాళ్లు గానీ.. దిగువ పేదవారైతే..సున్నం వేసుకుని..పుట్టమన్నుతో అలికేవాళు ..ఇంటి ముంగట టేకుగుంజలు పాతి.. తాటికమ్మలు కప్పి పందిరి వేసుకునేవారు. పందిరికి నులకతాడు మామిడి తోరణాలు కట్టేవారు. మాదిగోల్లతో మంచాలకు కొత్త నులకను నేయించేవారు. బర్లు-ఎడ్లకు కొత్త తణుగులు.. కొత్త ఈతకమ్మ చీపుర్లు.. వడ్లొల్ల దగ్గర కొత్తకచ్రం.. మేదరొల్ల దగ్గర కంక బద్దల పొన్కె..దడికీ..గుడిసెకు తడకలను చేయించేవారు. స్నానాల గదికి.. అప్పటి కిచెన్ రూంకు ఎరుకలోల్ల దగ్గర ఈత బర్గెలతో తడుకలు తెచ్చుకునేవారు.చల్లటి నీళ్లకోసం కుమ్మరోల్ల దగ్గర కొత్తకుండలు తెచ్చుకునేవారు.ఉగాదికి.. కొత్త మిరపకాయలు.. ఉల్లిగడ్డలు..ఎల్లిగడ్డలు.. పసుపుకొమ్ములు.. చింతపండు.. అమ్మొచ్చినోళ్ల దగ్గర కుంచెడు ఉప్పు..తూమెడు పల్లికాయతో మంచినూనె.. నువ్వులు.. కుండెడు తేనే..అల్లం.. బెల్లం..అన్ని రకాల పప్పులను ఇంటి నిండా కుండల్లో..కాగులు.. బానల్లో నింపి పెట్టుకునేవారు. గుమ్ములనిండా వడ్లు.. కొట్టాలనిండా గడ్డివాములు ఏడాదికి సరిపడా గాసం బెట్టుకునెటోల్లు.కొత్త మామిడికాయ.. కొత్త ఉసిరికాయ..గర్గాయ.. నిమ్మకాయ..ఇతరత్ర తొక్కులూ..వక్కలతో 'ఏడాది గాసం' పెట్టుకుని తిరమైటోళ్లు.. ఉగాది పండగంటే అంతటి సంబరం..

## ఎటు చూసినా అంతా కొత్తగా.. పచ్చగా..కళకళలాడేది!

మరి.. ఇప్పుడూ.. ఇంట్లోని అన్ని రూముల్లో సెల్ఫులు సర్దుకుని.. ఊడ్చి.. న్యూస్ పేపర్లు పరిచి నీట్ చేసుకుని..రెడీమేడ్ సూపర్ మార్కెట్లోంచి కొనుక్కున్న వస్తువుల్తో అంతా 'కన్ఫ్యూజన్'. ఆనందాల్ని పంచే ఆనాటి ఒగాది పండగ ఖతమైందనే చెప్పుకోవచ్చు.!





# అమ్మకానికి ఆర్సీబీ

**16 వేల కోట్లకు పోటీ.. స్వీడన్ సంస్థ ఈక్విటీ భారీ బిడ్**

**రాజస్థాన్ రాయల్స్‌పై కూడా.. మార్చి 31 నాటికి తేలనున్న**

**ఐపీఎల్ ఫ్రాంచైజీల అమ్మకాలు**

**బెంగళూరు:** ఐపీఎల్లో 2025 చాంపియన్‌గా నిలిచిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ అమ్మకం ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. స్వీడన్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ఈక్యూటీ భారీ బిడ్ పెట్టినట్లు సమాచారం. మరోవైపు మణిపాల్ హాస్పిటల్స్ అధినేత రంజన్‌పై, అమెరికా సంస్థ కేకేఆర్, సింగపూర్ ఇన్వెస్ట్మెంట్ గ్రూప్ టెమాసెక్ కలసిన కన్సార్టియం కూడా పోటీలో ఉంది. మొత్తం డీల్ విలువ సుమారు 2 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని అంచనా. ప్రారంభంలో మాంచెస్టర్ యునైటెడ్ సహ యజమానులు గ్లేజర్స్, అదార్ పూనావాలా కూడా ఆసక్తి చూపినప్పటికీ చివరికి రేసు నుంచి తప్పుకున్నారు. గ్లేజర్స్ సుమారు 1.8 బిలియన్ డాలర్ల నాన్ బైండింగ్ ఆఫర్ ఇచ్చినట్లు, అయితే 6 ఈక్యూటీ దాన్ని దాటేలా బిడ్ పెంచినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ డీల్ సూటిగా బిడ్డింగ్ పోరుగా మారింది. డయాజియో గ్రూప్ మార్చి 31ని గడువుగా పెట్టి ఈ అమ్మకాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఇదే సమయంలో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీకి కూడా భారీ ఆసక్తి కనిపిస్తోంది. మూడు సంస్థలు బైండింగ్ బిడ్లు సమర్పించినట్లు తెలుస్తోంది. ఆదిత్య బిర్లా గ్రూప్ ఫేవరెట్‌గా నిలుస్తోంది. మొదట మెజారిటీ వాటా అమ్మాలని భావించిన రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం ఇప్పుడు పూర్తి విక్రయానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

# ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్‌గా ఇషాన్

- కమిన్స్ వచ్చే వరకు బాధ్యతలు..
- సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు కెప్టెన్ మార్పు..



**ఢిల్లీ:** ఐపీఎల్-2026 సీజన్ రణరంగం మొదలవ్వకముందే సన్‌రైజర్స్ హైదరాబాద్ శిబిరంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. జట్టును విజయపథంలో నడిపిస్తాడనుకున్న స్టార్ ప్లేయర్, రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్‌కు వెన్నునొప్పి గాయంతో ఆయన ఈ సీజన్ ఆరంభ మ్యాచులకు దూరం కానున్నారు. ఈ క్లిష్ట సమయంలో జట్టు పగ్గాలను ఎవరికి అప్పగించాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించిన మేనేజ్‌మెంట్, చివరకు యువ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ వైపు మొగ్గు చూపింది.

**ఆరెంజ్ ఆర్మీకి కొత్త బాస్..**

మెగా వేలంలో భారీ ధరకు దక్కించుకున్న ఇషాన్ కిషన్‌పై ఉన్న నమ్మకంతో యాజమాన్యం అతడిని తాత్కాలిక కెప్టెన్‌గా ప్రకటించింది. కిషన్ దూకుడైన బ్యాటింగ్ శైలికి తోడు, వికెట్ల వెనుక ఉండి గేమ్ ప్లాన్ చేయగల సామర్థ్యం అతడికి ప్లస్ పాయింట్ కానుంది. కమిన్స్ పూర్తిగా కోలుకుని ఫిట్‌నెస్ సాధించే వరకు ఇషాన్ కిషనే సన్‌రైజర్స్‌ను నడిపిస్తారు. కెప్టెన్సీ మార్పుతో పాటు వైస్ కెప్టెన్‌గా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మను నియమించడం మరో విశేషం. గత కొన్ని సీజన్లుగా ఎస్ఆర్‌హెచ్ తరపున అద్భుత ప్రదర్శన చేస్తున్న అభిషేక్, ఇషాన్ కిషన్‌కు చేదోడు వాదోడుగా ఉండనున్నారు. ఇద్దరు యువ ఆటగాళ్లకు కీలక బాధ్యతలు ఇవ్వడం ద్వారా జట్టులో కొత్త ఉత్సాహం నింపాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

**కమిన్స్ పరిస్థితి ఏమిటి..?**

ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న పాట్ కమిన్స్, అక్కడ వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. గాయం తీవ్రత దృష్ట్యా అతను విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. కోలుకున్న వెంటనే అతను భారత్‌కు చేరుకుని జట్టులో చేరతారని.. అప్పటివరకు కోచ్ డేనియల్ వెట్టోరి ఆధ్వర్యంలో ఇషాన్ బృందం వ్యూహాలకు పదును పెడుతుందని సమాచారం. ఈ నెల 28న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగే హై-వోల్టేజ్ మ్యాచ్‌తో సన్‌రైజర్స్ తన ప్రస్థానాన్ని ప్రారంభించనుంది. ఇషాన్ కిషన్ నాయకత్వంలో ఆరెంజ్ ఆర్మీ ఏ మేరకు రాణిస్తుందో, తన కెప్టెన్సీ మార్కును ఎలా చూపిస్తాడో అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అనుభవజ్ఞుడైన కమిన్స్ లేకపోవడం జట్టుకు లోటే అయినప్పటికీ, యువ జోడీ ఏ రకమైన మ్యాజిక్ చేస్తుందో వేచి చూడాలి.

# ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్



## టీమిండియా టాప్ షో..

- టాప్-5లో ముగ్గురు భారత బ్యాటర్లు!
- రెండో స్థానంలో విరాట్ కోహ్లీ.. రోహిత్, గిల్‌కు చోటు
- మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన అగ్రస్థానం

**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు మరోసారి తమ సత్తా చాటారు. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగంలో టాప్-5లో ముగ్గురు భారత ఆటగాళ్లు చోటు సంపాదించడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా వివిధ జట్లు ఆడుతున్న సిరీస్‌ల ఆధారంగా ఈ ర్యాంకింగ్స్‌ను ఐసీసీ ఖరారు చేసింది.

**బ్యాటింగ్ విభాగం: కోహ్లీ జోరు**

వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా, భారత రన్ మెషిన్ విరాట్ కోహ్లీ రెండో స్థానంలో నిలిచారు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఇబ్రాహీం జద్రాన్ మూడో స్థానంలో ఉండగా.. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగో స్థానాన్ని, యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ఐదో స్థానాన్ని దక్కించుకున్నారు. టాప్-5లో ముగ్గురు భారతీయులే ఉండటం అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించింది.

**బౌలింగ్ అండ్‌ఆల్‌రౌండర్లు: ఆఫ్ఘన్ హవా**

బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ నంబర్ 1 స్థానంలో నిలిచారు. జోఫ్రా ఆర్చర్ (ఇంగ్లాండ్), కేశవ్ మహారాజ్ (దక్షిణాఫ్రికా), బెర్నార్డ్ స్కోల్ట్జ్ (నమీబియా), ఆదిల్ రషీద్ (ఇంగ్లాండ్) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలోనూ ఆఫ్ఘన్ ప్లేయర్ల హవా కొనసాగింది. అజ్మతుల్లా ఒమర్జాయ్ అగ్రస్థానంలో నిలవగా, సికందర్ రజా (జింబాబ్వే), మహ్మద్ నబీ (ఆఫ్ఘన్), మెహిదీ హసన్ మిరాజ్ (బంగ్లాదేశ్), రషీద్ ఖాన్ (ఆఫ్ఘన్) టాప్-5లో నిలిచారు.

**మహిళల విభాగం: స్మృతి మంధాన నంబర్ 1**

మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నారు. నాట్ స్కివర్-బ్రంట్ (ఇంగ్లాండ్), బెత్ మూనీ (ఆస్ట్రేలియా), లారా వోల్వార్ట్ (దక్షిణాఫ్రికా) తర్వాతి స్థానాల్లో ఉండగా.. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఐదో స్థానంలో నిలిచారు. మొత్తంగా పురుషుల, మహిళల విభాగాల్లో భారత ఆటగాళ్లు నిలకడైన ప్రదర్శనతో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తమ ముద్ర వేస్తున్నారు.

# జడేజా కాళ్లు మొక్కిన స్టార్ స్పిన్నర్ కుల్దీప్

**లక్నోలో ఘనంగా వెడ్డింగ్ రిసెప్షన్!**

**వింటేజ్ 'రోల్స్ రాయిస్' కార్లో నూతన వధూవరుల గ్రాండ్ ఎంట్రీ**

**హాజరైన సీఎం యోగి, అఖిలేష్ యాదవ్, గౌతమ్ గంభీర్, రిషబ్ పంత్**

**లక్నో, మార్చి 18:** భారత స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ వైవాహిక జీవితంలో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించారు. తన చిన్ననాటి స్నేహితురాలు వంశిక చద్దాతో గత వారం ముస్సోరీలో వివాహం చేసుకున్న కుల్దీప్, మంగళవారం రాత్రి లక్నోలోని 'ది సెంట్రమ్' హోటల్‌లో అత్యంత వైభవంగా వెడ్డింగ్ రిసెప్షన్‌ను ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు క్రీడా, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు భారీగా తరలివచ్చారు.

**గురువుకు తగ్గ శిష్యుడు: వైరల్ వీడియో**

ఈ వేడుకలో ఒక అద్భుతమైన దృశ్యం క్రికెట్ అభిమానుల మనసు గెలుచుకుంది. టీమిండియా సీనియర్ ఆల్రౌండర్ రవీంద్ర జడేజా తన భార్య రివాబాతో కలిసి ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ క్రమంలో కుల్దీప్-వంశిక జంట జడేజా దంపతుల కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. మైదానంలో స్పిన్ ద్వయంగా ఆకట్టుకునే వీరు, బయట కూడా సీనియర్ల పట్ల కుల్దీప్ చూపిన గౌరవం నెట్టింట వైరల్ అవుతోంది. రివాబా ఎంతో ఆప్యాయంగా నూతన జంటను దీవించిన తీరు అందరినీ ఆకట్టుకుంది.

**తరలివచ్చిన దిగ్గజాలు:**

ఈ రిసెప్షన్ వేడుకకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరితో పాటు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, వికెట్ కీపర్ రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్, శిఖర్ ధావన్, బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, యూపీ అసెంబ్లీ స్పీకర్ సతీష్ మహానా తదితరులు పాల్గొని సందడి చేశారు.

**రాజసం ఉట్టిపడేలా ఎంట్రీ:**

రిసెప్షన్ వేదిక వద్దకు కుల్దీప్ దంపతులు వింటేజ్ 'రోల్స్ రాయిస్' కార్లో గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చారు. కుల్దీప్ నలుపు రంగు సూట్‌లో స్టైలిష్‌గా కనిపించగా, వంశిక క్రీమ్ కలర్ చీరలో మెరిసిపోయారు. 31 ఏళ్ల ఈ చైనామన్ స్పిన్నర్ తన వ్యక్తిగత జీవితంలో కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టిన సందర్భంగా సోషల్ మీడియా వేదికగా అభిమానులు, సహచర క్రికెటర్లు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు



- అగ్రస్థానం 'కింగ్'దే, టాప్-10లో అందరూ దిగ్గజాలే!
- బ్యాటర్లకు స్వర్గధామంగా ఐపీఎల్
- ప్రతి సీజన్‌లో భారీ స్కోర్లు, రికార్డుల వర్షం

**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) క్రికెట్‌లో బ్యాటర్లకు స్వర్గధామంగా భావించబడుతుంది. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా.. ప్రతి బ్యాటర్ విరుచుకుపడుతుంటాడు. ఈ క్రమంలో ప్రతి సీజన్‌లో భారీ స్కోర్లు, రికార్డుల వర్షం కురుస్తుంటాయి. మరికొన్ని రోజుల్లో ఐపీఎల్ 2026 ఆరంభం కానుంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాను ఓసారి చూద్దాం. ఇప్పటి వరకు జరిగిన సీజన్లను పరిశీలిస్తే.. టాప్-10లో నిలిచిన ఆటగాళ్లు అందరూ దిగ్గజాలే ఉన్నారు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా టీమిండియా స్టార్ బ్యాటర్, రికార్డుల కింగ్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో ఉన్నాడు. కింగ్ 267 మ్యాచ్‌ల్లో 8661 పరుగులు చేశాడు. రన్ మెషీన్‌గా పేరొందిన కోహ్లీ నిరంతర ప్రదర్శనతో ఈ రికార్డును నెలకొల్పాడు. రెండో స్థానంలో టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఉన్నాడు. హిట్‌మ్యాన్ 272 మ్యాచ్‌లలో 7046 పరుగులు చేశాడు. మూడో స్థానంలో భారత మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ నిలిచాడు. గబ్బర్ 222 మ్యాచ్‌ల్లో 6769 రన్స్ బాదాడు. ధావన్ తన స్థిరమైన ఆట శైలి ఐపీఎల్‌లో టాప్ బ్యాటర్లలో ఒకరిగా నిలబెట్టింది. నాలుగో స్థానంలో ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఉన్నాడు. 184 మ్యాచ్‌లలో 6565 పరుగులు చేశాడు. ఐదో స్థానంలో మిస్టర్ ఐపీఎల్ సురేష్ రైనా (205 మ్యాచ్‌ల్లో 5528) పరుగులతో నిలిచాడు. రైనా ఐపీఎల్‌లో అత్యంత స్థిరమైన బ్యాటర్లలో ఒకరిగా గుర్తింపు పొందాడు. ఆరవ స్థానంలో మోస్ట్ సక్సెస్ ఫుల్ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఉన్నాడు. మహీ 278 మ్యాచ్‌లలో 5383 పరుగులు చేశాడు. తన ఫినిషింగ్ స్టైల్‌తో మ్యాచ్‌లను మలుపుతిప్పే ధోనీ ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. ఏడో స్థానంలో దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ (5162) ఉన్నాడు. అతని వినూత్న షాట్లు అభిమానులను ఎప్పటికీ అలరిస్తాయి. కేఎల్ రాహుల్ (5054), క్రిస్ గేల్ (4965), రాబిన్ ఉతప్ప (4952)లు టాప్-10 జాబితాలో ఉన్నారు.



KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక



# సంతృప్తిగా ఉన్నా

## రాశీ ఖన్నా

"చిత్ర పరిశ్రమలో ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా, ఈ 13 ఏళ్ల ప్రయాణంలో వైవిధ్యమైన పాత్రలతో ఈ స్థాయికి చేరుకోవడం చాలా సంతోషంగా ఉంది" అని ప్రముఖ కథానాయిక రాశీ ఖన్నా అన్నారు. పవన్ కల్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం ఈ నెల 19న విడుదలవుతున్న సందర్భంగా ఆమె మీడియాతో ముచ్చటించారు. ఈ సినిమాలో తను 'శ్లోక' అనే మోడ్రన్ అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, ఇందులో ఒక మాస్ సాంగ్‌లో డ్యాన్స్ చేయడం చాలా ఎంజాయ్ చేశానని ఆమె తెలిపారు. ఉగాది కానుకగా వస్తున్న ఈ చిత్రం పూర్తి వినోదాత్మకంగా ఉంటుందని, కుటుంబమంతా కలిసి చూడొచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం తన చేతిలో ఉన్న ప్రాజెక్టుల గురించి చెబుతూ.. హిందీలో అక్షయ్ కుమార్‌తో ఒక సినిమా, పాపులర్ వెబ్ సిరీస్ 'ఫర్జీ 2' చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే అమెజాన్ సిరీస్‌లో పంజాబీ పోలీస్ క్యారెక్టర్‌లో కనిపిస్తానని, తమిళంలో 'రౌడీ అండ్ కో' చిత్రంతో పాటు తెలుగులో మరికొన్ని కొత్త కథలు వింటున్నట్లు రాశీ ఖన్నా వివరించారు. తన కెరీర్ గ్రాఫ్ చూసుకుంటే గర్వంగా ఉందని, ప్రేక్షకుల ఆదరణే తనను ఇక్కడి వరకు తీసుకువచ్చిందని ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



# ఒత్తిడికి చెక్ పెట్టాలంటే..

మూడు దశాబ్దాలుగా తన అందం, ఫిట్‌నెస్‌తో కుర్రకారును అలరిస్తున్న బాలీవుడ్ భామ శిల్పా శెట్టి, తన నిత్య యవ్వనానికి గల రహస్యాన్ని మరోసారి పంచుకున్నారు. నిరంతరం షూటింగ్‌లు, వృత్తిపరమైన ఒత్తిళ్లతో బిజీగా ఉండే తాను, పని మొదలుపెట్టే ముందు ప్రశాంతంగా ఉండటానికి 'ప్రాణాయామం' పాటిస్తానని ఆమె వెల్లడించారు. తాజాగా గోల్డ్ హాల్టర్-నెక్ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోతూ, ఆహ్లాదకరమైన వాతావరణంలో శ్వాస వ్యాయామం చేస్తున్న వీడియోను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మనసును ఏకాగ్రతతో ఉంచడానికి, ఒత్తిడిని దూరం చేయడానికి యోగా, ప్రాణాయామం మించిన మార్గం లేదని ఆమె పేర్కొన్నారు. 1993లో 'బాజీగర్' చిత్రంతో వెండితెర అరంగేట్రం చేసిన శిల్పా, నేటికీ అదే ఫిజిక్‌ను కాపాడుకుంటూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వారమంతా కఠినమైన ఆహార నియమాలు పాటించే ఆమె, ఆదివారం మాత్రం 'సండే బింజ్' పేరుతో తనకు ఇష్టమైన పదార్థాలను ఆస్వాదిస్తూ లైఫ్ అంటే బ్యాలెన్స్ అని నిరూపిస్తుంటారు. ప్రస్తుతం సినిమాలతో పాటు 'ఇండియాస్ గాట్ టాలెంట్' వంటి రియాలిటీ షోలకు జడ్జిగా వ్యవహరిస్తున్న శిల్పా.. కుటుంబ బాధ్యతలు, కెరీర్‌ను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఫిట్‌గా ఉండాలనుకునే వారు కనీసం ప్రాణాయామంతోనైనా తమ రోజును ప్రారంభించాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు.



# ఆ స్టార్ హీరో నన్ను రిజెక్ట్ చేశాడు

దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు తెరకెక్కించిన 'ఝుమ్మంది నాదం' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమై, ప్రస్తుతం బాలీవుడ్ టాప్ హీరోయిన్లలో ఒకరిగా రాణిస్తున్న తాప్సీ పన్ను సంచలన వ్యాఖ్యలు చేశారు. టాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా వెలిగి, ఆ తర్వాత హిందీ చిత్రసీమకు మకాం మార్చిన ఈమె, అక్కడ వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, తన కెరీర్ ప్రయాణంలో ఎదురైన కొన్ని చేదు అనుభవాలను తాప్సీ తాజాగా పంచుకున్నారు. హీరోయిన్లకు ఎక్కువ పేరు వచ్చే సినిమాల్లో నటించేందుకు చాలా మంది స్టార్ హీరోలు ఇష్టపడరని, ఆ కారణంతోనే ఒక స్టార్ హీరో తనను రిజెక్ట్ చేశాడని ఆమె బాంబు పేల్చారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, అమితాబ్ బచ్చన్‌తో 'పింక్', షారుఖ్ ఖాన్‌తో 'డంకీ' వంటి భారీ చిత్రాల్లో నటించిన తాప్సీ, బాలీవుడ్‌లో 'ఫైర్ బ్రాండ్'గా పేరు తెచ్చుకున్నారు. లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో నటిస్తున్నప్పుడు కొందరు హీరోలు తమ పాత్రల ప్రాధాన్యత తగ్గిపోతుందనే భయంతో హీరోయిన్లను మార్పించాలని చూస్తారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తెలుగులో వరుస హిట్లతో కెరీర్ ప్రారంభించిన తాప్సీ, ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పై కూడా సత్తా చాటుతూ వరుస ప్రాజెక్టులతో బిజీగా గడుపుతున్నారు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861